

ఆంధ్రజ్యోతి

శుక్రవారం | 22-3-2024 | రూ. 6.50

సార్.. ఇక్క మద్యన బార్‌ను మూయించండి!



మా ఆదేశాలనే ధిక్కరిస్తారా?

కేజ్రీవాల్ అరెస్ట్



మద్యం స్కాం కేసులో ఢిల్లీ సీఎంను అదుపులోకి తీసుకున్న ఈడీ



నిజనిర్ధారణపై స్టే

'పతంజలి' క్షమాపణలు

ఈసీల నియామకంపై స్టే ఇవ్వలేం

నంబర్లూ ఇచ్చేశాం!

రూ. 268 కోట్లు

రైలు టికెట్లకూ డబ్బుల్లేవ్

విశాఖలో కొకైన్ కలకలం





భగ్గుమన్న 'ఇండియా' కూటమి

ఇది నియంతృత్వ చర్య

మీడియా సంస్థలను స్వాధీనం చేసుకుని, ప్రతిపక్షాలను చీల్చడం, కంపెనీల నుంచి డబ్బును దోచడం, విపక్షాల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడం వంటి చర్యలతో.. దుష్టశక్తి(మోదీని ఉద్దేశించి)కి సంతృప్తి లేదు. ఇప్పుడు ఎన్నికైన సీఎంలను కూడా అరెస్టు చేయడం సాధారణంగా మారింది. భయకంపితుడైన ఓ నియంత ప్రజాస్వామ్యాన్ని వధించాలనుకుంటున్నారు. ఇండియా కూటమి దీనికి దీటుగా సమాధానమిస్తుంది.

- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత

విపక్ష నేతలను భయపెడుతున్నారు

కేజ్రీవాల్ అరెస్టు రాజ్యాంగ వ్యతిరేకం. రాజకీయాలను ఇంతగా దిగజార్చడం మోదీ సర్కారుకు తగదు. విపక్ష నేతలంతా ఏ రాత్రికి ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు జరుగుతాయో తెలియక భయపడుతున్నారు. ఒక సీఎం(హేమంత్ సోరెన్)ను జైలుపాలు చేశారు. ఇప్పుడు మరో ముఖ్యమంత్రి(కేజ్రీవాల్)ని అరెస్టు చేశారు. భారత చరిత్రలోనే ఇలాంటి సిగ్గుమాలిన చర్యలను ఏనాడూ చూడలేదన్నారు.

- ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి

ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

ఇండియా కూటమికి చెందిన రెండో సీఎంను అరెస్టు చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాలంటే ఎన్నికల్లో బీజేపీని ఓడించాల్సిందే.

- సీతారాం ఏచూరి, సీపీఎం నేత

బీజేపీది దిగజారుడుతనం

అధికారం కోసం బీజేపీ ఎంతకైనా దిగజారుతుందనడానికి ఈ అరెస్టు నిదర్శనం. ఈ రాజ్యాంగ వ్యతిరేక చర్యపై ఇండియా కూటమి ముక్తకంఠంతో నిరసిస్తుంది.

- శరద్‌పవార్, ఎన్సీపీ నేత

ఓటమి భయంతోనే కేజ్రీవాల్ అరెస్టు

పదేళ్ల పాలనలో వైఫల్యాలను ఎదుర్కొన్న ఫాసిస్టు బీజేపీ ఓటమి భయంతోనే కేజ్రీవాల్‌ను అరెస్టు చేసింది. ఈ చర్యతో బీజేపీ ప్రతిష్ఠ పాతాళానికి దిగజారిపోయింది. ప్రతిపక్ష నేతలను వేటాడడం బీజేపీ నిరాశానిస్పృహలకు సంకేతం. కేజ్రీవాల్ అరెస్టుతో ప్రజల ఆగ్రహం మరింత పెరుగుతుంది. ఆ ఆగ్రహ జ్వాలలు ఇండియా కూటమిని విజయం దిశగా తీసుకెళ్తాయి.

- ఎంకే స్టాలిన్, తమిళనాడు సీఎం

కోడ్ అమల్లో ఉండగా అరెస్టా?

ఎన్నికలకు కొద్ది రోజుల ముందు.. ఈసీ కోడ్ అమలులో ఉన్న సమయంలో సీఎంను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ముఖ్యమంత్రులు, విపక్ష నేతలు అరెస్టయితే.. దేశంలో స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు ఎలా జరుగుతాయి? సుప్రీంకోర్టు, ఈసీ కూడా రక్షణ కల్పించకుంటే.. బీజేపీ నియంతృత్వం నుంచి ప్రజలకు రక్షణ ఎలా?

- ఓబ్రెయిన్, టీఎంసీ ఎంపీ

ఇది రాజకీయ ప్రతీకారమే

విపక్షాలను అణచివేయడానికి ఈడీ, సీబీఐలను బీజేపీ ఆయుధాలుగా వాడుకుంటోంది. నిరాధారమైన ఆరోపణలు చేస్తూ.. విపక్ష నేతలను టార్గెట్‌గా చేసుకుంటున్నారు. ఇది బీజేపీ రాజకీయ ప్రతీకార చర్యకు నిదర్శనం. ఈ అరెస్టు చట్ట వ్యతిరేకం.

- కేటీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

కేజ్రీవాల్ అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

స్వాధీనపరుచుకున్నారు. అనంతరం రెండు గంటలపాటు 12 మంది అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఆయనను ఈడీ ఆఫీసుకు తరలించేందుకు ప్రయత్నించగా రావడానికి ఆయన నిరాకరించారు. ఇంట్లోనే ప్రశ్నించాలని ఈడీ అధికారులను ఆయన కోరారు. చివరికి, రాత్రి 9.45 గంటల సమయంలో కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం ప్రత్యేక కోర్టు ముందు శుక్రవారం ఆయనను హాజరు పరుస్తామని, ఆయన కస్టడీకి అనుమతి కోరతామని ఈడీ అధికారులు తెలిపారు. అరెస్టు చేసి తీసుకెళ్లిన తర్వాత గురువారం రాత్రి ఈడీ కార్యాలయంలోనే కేజ్రీవాల్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. అరెస్టు సమయంలో ఈడీ జాయింట్ డైరెక్టర్ కపిల్ రాజ్ అక్కడే ఉన్నారు. పీఎంఎల్ఏ చట్టంలోని సెక్షన్ 50 కింద కేజ్రీవాల్ వాంగ్మూలాన్ని నమోదు చేశారు. కాగా, అవినీతి ఆరోపణలతో ఇటీవల అరెస్టైన రెండో ముఖ్యమంత్రిగా కేజ్రీవాల్ నిలిచారు. కొద్ది రోజుల కిందట జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను ల్యాండ్ స్కాం కేసులో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అంతేనా.. ఒకప్పుడు అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమం చేసిన కేజ్రీవాల్‌ను ఇప్పుడు అవే అవినీతి ఆరోపణలతో అరెస్టు చేయడం విశేషం.



సీఎం కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఆందోళనకు దిగిన ఆప్ కార్యకర్తలు

ముందుగా ఊహించి కోర్టుకు వెళ్లినా..

తనను అరెస్టు చేసే అవకాశం ఉందని ముందుగానే ఊహించిన కేజ్రీవాల్ గురువారం ఉదయం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఢిల్లీ మద్యం స్కాంలో వరుసగా సమన్లు జారీ చేస్తున్న ఈడీ.. తనపై కఠిన చర్యలు తీసుకోకుండా మధ్యంతర రక్షణ కల్పించాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. కానీ, అక్కడ ఆయనకు చుక్కెదురైంది. ఆయన వినతిని హైకోర్టు తిరస్కరించింది. ప్రస్తుత దశలో ఎలాంటి రక్షణ కల్పించలేమని న్యాయమూర్తులు జస్టిస్ సురేష్ కుమార్ కైత్, జస్టిస్ మనోజ్ మిశ్రల ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 22కు వాయిదా వేసింది. కేజ్రీవాల్ అరెస్టును అడ్డుకోవడానికి ఢిల్లీ హైకోర్టు తిరస్కరించడంతో గంటల వ్యవధిలోనే ఈడీ రంగంలోకి దిగింది. సెర్చ్ వారంట్‌తో ఆయన నివాసానికి వెళ్లి అరెస్టు చేసింది. దాంతో, కేజ్రీవాల్ అరెస్టు రాజ్యాంగ వ్యతిరేకమంటూ ఆయన తరపు న్యాయవాదులు గురువారం రాత్రి సుప్రీం కోర్టు తలుపు తట్టారు. తక్షణమే ఆయనను విడుదల చేయాలంటూ ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అయితే, ఈ కేసును శుక్రవారం విచారిస్తామని సుప్రీం తెలిపింది.

కేజ్రీవాల్ నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్తత

కేజ్రీవాల్ ఇంటికి ఈడీ అధికారులు చేరుకోవడం, ఆయనను అరెస్టు చేసే అవకాశం ఉందనే ప్రచారం జరగడంతో ఆప్ కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున సీఎం నివాసం వద్దకు చేరుకున్నారు. పెద్దఎత్తున నిరసన తెలిపారు. అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దాంతో, పోలీసులు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్, సీఆర్పీఎఫ్ దళాలను కేజ్రీవాల్ నివాసం వద్ద మోహరించారు. ఈడీ కార్యాలయానికి వెళ్లే దారులను అష్ట దిగ్బంధనం చేసి పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్తర ఢిల్లీలో ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లే రహదారి అంతటా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలో సెక్షన్ 144ను విధించి జనం ప్రవేశించకుండా అడ్డుకున్నారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తే పెద్ద ఎత్తున ఆప్ కార్యకర్తలు పోగవుతారని ఊహించే భారీగా బలగాలను కోరామని ఒక పోలీసు అధికారి తెలిపారు. కాగా.. ఈ అరెస్టుకు కేజ్రీవాల్ భయపడే ప్రసక్తి లేదని, తమ ధైర్య సాహసాలు చెక్కు చెదరబోవని 'ఎక్స్' వేదికగా ఆప్ ప్రకటించింది.

ఆప్ ఎన్నికల ప్రచారానికి వంద కోట్లు!

ఢిల్లీ మద్యం కుంభకోణంలో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత వివిధ మార్గాల ద్వారా పంపించిన వంద కోట్ల రూపాయలను ఆప్ తన ఎన్నికల ప్రచారానికి వినియోగించినట్లు ఈడీ గతంలో పలు సందర్భాల్లో స్పష్టం చేసింది. ఢిల్లీ ప్రభుత్వ ముఖ్యులకు కవిత వంద కోట్ల ముడుపులు ఇచ్చినట్లు ఆధారాలు ఉన్నాయని తెలిపింది. ఇటీవల కవిత కస్టడీ రిపోర్టులోనూ ఈ వివరాలను పేర్కొంది. శరత్ చంద్రా రెడ్డి, మాగుంట రాఘవ, మాగుంట శ్రీనివాసులు రెడ్డి తదితరులతో సౌత్ లాబీకి ప్రాతినిధ్యం వహిస్తున్న కవిత.. ఆప్ అగ్ర నేతలతో కుమ్మక్కయ్యారని పేర్కొం ది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, అప్పటి ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాతో ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపింది. ఇదే కేసులో గత ఏడాది ఏప్రిల్‌లో తొమ్మిది గంటలపాటు కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు ప్రశ్నించిన విషయం తెలిసిందే. ఇదే కేసులో అప్పటి డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అరెస్టై దాదాపు ఏడాదిన్నరగా జైల్లో ఉన్నారు. ఇక, సౌత్ లాబీలోని మిగిలిన పాత్రధారుల్లో అత్యధికులు అప్రూవర్లుగా మారారు. ఇటీవల ప్రధాన కుట్రదారుగా పేర్కొంటున్న కవితను ఈడీ అరెస్టు చేసింది. ఇప్పుడు కవిత ఇచ్చిన సమాచారంతో కేజ్రీవాల్‌ను విచారించడం, ఇద్దరినీ ఎదురెదురుగా కూర్చోబెట్టి విచారించడం ద్వారా ఈ కేసును క్లైమాక్స్‌కు తీసుకొచ్చే ప్రయత్నాల్లో ఈడీ ఉందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.

కేజ్రీవాలే ముఖ్యమంత్రి: ఆతిషి

నిర్బంధం నుంచే కేజ్రీవాల్ పాలన కొనసాగిస్తారని, ముఖ్యమంత్రిగా ఆయనే కొనసాగుతారని ఆమ్ ఆద్మీ పార్టీ మంత్రి ఆతిషీ ప్రకటించారు. పదవికి ఆయన రాజీనామా చేయబోరని స్పష్టం చేశారు. జైలు నుంచి పాలన సాగించేందుకు ఏ నిబంధనా అడ్డుకోలేదని తెలిపారు. ఈ కేసులో రెండేళ్లుగా విచారణ చేస్తున్నా ఒక్క రూపాయి కూడా అవినీతి సొమ్మును ఈడీ కనిపెట్టలేకపోయిందని ఆమె అన్నారు. ఈ కేసులో ఈడీకి ఢిల్లీ హైకోర్టు నోటీసు ఇచ్చిందని, అయినా వేలాదిమంది పోలీసులు, పారా మిలటరీ దళాలను మోహరించి అరెస్టు చేయాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం లోక్‌సభ ఎన్నికల ముందు మోదీ చేస్తున్న భారీ కుట్రగా ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా ఆరోపించారు. కేజ్రీవాల్ కు కోట్లాది మంది ప్రజల ఆశీర్వాదాలు ఉన్నాయని, ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో ఆప్ ప్రభుత్వాలు అమలు చేస్తున్న అద్భుతమైన ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రపంచమంతా ప్రశంసిస్తోందని, ఆయనను అరెస్టు చేయవచ్చు కానీ ఆయన ఆశయాలను అడ్డుకోలేరని వ్యాఖ్యానించారు.



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	37.5	23.0
ఖమ్మం	35.0	24.0
రామగుండం	35.4	21.4
నిజామాబాద్	35.3	22.1
హనుమకొండ	35.0	19.5

ఉద్యోగుల నిరవధిక సమ్మె వాయిదా

» ప్రభుత్వం గడువు కోరడంతో అంగీకరించిన జేఎఫ్ఆర్ఓపీఎస్

న్యూఢిల్లీ, మార్చి 21: పాత పింఛన్ పథకం(ఓపీఎస్)ను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో ప్రభుత్వ, వివిధ ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు మే 1వ తేదీ నుంచి చేపడతామని ప్రకటించిన నిరవధిక సమ్మెను వాయిదా వేశారు. కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ, కేంద్ర ఆర్థికశాఖ కార్యదర్శి టీవీ సోమనాథన్ సహా ఉన్నతస్థాయి ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు జేఎఫ్ఆర్ఓపీఎస్(ది జాయింట్ ఫోరం ఫర్ రిస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్) గురువారం వెల్లడించింది. ఓపీఎస్ పునరుద్ధరణపై నిర్ణయం తీసుకునేందుకు మరింత సమయం కావాలని ప్రభుత్వం కోరిన నేపథ్యంలో సమ్మెను వాయిదా వేయాలని నిర్ణయించామని జేఎఫ్ఆర్ఓపీఎస్ కన్వీనర్ శివగోపాల్ మిశ్రా చెప్పారు. 'రాష్ట్రాలను, వివిధ విభాగాలను సంప్రదించడానికి మరింత సమయం కావాలని వారు మాకు చెప్పారు. దీనికి మేం అంగీకరించాం. అందుకే సమ్మెను వాయిదా వేయాలని నిర్ణయించాం' అన్నారు. కేంద్ర ప్రభుత్వం పింఛన్ వ్యవస్థపై సమీక్షించేందుకు సోమనాథన్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిటీ ఉద్యోగ సంఘాల నేతలతో చర్చలు కూడా జరిపింది. కమిటీ నివేదిక సమర్పించడంలో జాప్యం గురించి ఆర్థికశాఖ కార్యదర్శి వివరించారని, అయితే, ఈ అంశాన్ని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కమిటీ కృషి చేస్తోందని భరోసా ఇచ్చారని శివగోపాల్ మిశ్రా తెలిపారు.



కేజ్రీవాల్ ఇంటి బయట ఆందోళన చేస్తున్న ఆప్ ఎమ్మెల్యేలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

జైలు నుంచి విధులు.. సాధ్యమేనా?

న్యూఢిల్లీ, మార్చి 21: కేజ్రీవాల్ జైలు నుంచే ముఖ్యమంత్రిగా తన విధులు నిర్వర్తిస్తారని ఆప్ చెబుతోంది. ఈ విషయంలో ఆయనను అడ్డుకునే చట్టమేదీ లేదని ఆ పార్టీ పేర్కొంది. అయితే, సీఎంగా జైలు నుంచి పనిచేయడం ఎంతవరకు సాధ్యమనే అంశంపై చర్చ జరుగుతోంది. ఇది రాజ్యాంగ సంక్షోభానికి దారి తీస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దాణా కుంభకోణంలో లాలూ ప్రసాద్ యాదవ్ అరెస్టు అయినప్పుడు తన భార్య రబ్డీ దేవిని బిహార్ సీఎం పీఠంపై కూర్చోబెట్టి జైలుకెళ్లారు. ఈడీ భూ కుంభకోణం కేసులో జనవరిలో హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేసింది. దానికి ముందు ఆయన ఝార్ఖండ్ సీఎం పదవికి రాజీనామా చేశారు. కేజ్రీవాల్ రాజీనామా చేయకపోవడం ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందనే విషయాన్ని కేంద్ర హోం శాఖ పరిశీలిస్తోంది. ఆయన పబ్లిక్ సర్వెంట్ కాబట్టి.. కేంద్రం ఆయనను సస్పెండ్ చేయవచ్చని లేదా తొలగించవచ్చని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా అరెస్టు అయినప్పుడు ఇదే పద్ధతి అనుసరిస్తారని వారు గుర్తుచేస్తున్నారు. ఇంతకుముందు ఎవరూ జైలు నుంచి సీఎంగా పనిచేసిన ఉదంతం లేదని తిహాడ్ జైలు వర్గాలు చెబుతున్నాయి. జైలు మాన్యువల్ ప్రకారమే తాము వ్యవహరిస్తామని స్పష్టం చేస్తున్నాయి. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆప్ అగ్రనేతలంతా అరెస్టయ్యారు. ఇప్పటికే ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అరెస్టయిన సంగతి తెలిసిందే. కేజ్రీవాల్ గత ఏడాది నవంబరు నుంచి ఈ నెల 21 వరకు ఈడీ జారీ చేసిన 9 సమన్లను బేఖాతరు చేశారు. కేజ్రీవాల్ అరెస్టుపై ఆయన టీమ్ సుప్రీం కోర్టును ఆశ్రయించింది.

దశాబ్దం నుంచి ఆధిపత్య పోరు

» పదేళ్లుగా ఆమ్ ఆద్మీ పార్టీ వర్సెస్ బీజేపీ
» ప్రధాని మోదీని గట్టిగా ఢీకొన్న కేజ్రీవాల్
» పలు రాష్ట్రాల్లో కమలానికి కంట్లో నలుసు
» కేజ్రీవాల్ అరెస్టుతో తుది అంకానికి చేరిక



న్యూఢిల్లీ, మార్చి 21: దాదాపు పదేళ్లుగా కేంద్రంలో మోదీ.. ఢిల్లీలో కేజ్రీవాల్ అధికారంలో ఉన్నారు..! ఈ వ్యవధిలో మోదీకి ఎందరో తలొంచారు.. మరికొందరు ఎందుకొచ్చిన గొడవని సర్దుకున్నారు..! కానీ, కేజ్రీ మాత్రం గట్టిగా ఢీకొట్టారు. తన ఆమ్ ఆద్మీ పార్టీని పంజాబ్, గుజరాత్, గోవా వంటి రాష్ట్రాలకు విస్తరించి జాతీయ పార్టీ స్థాయికి ఎదగడమే కాక, మోదీ విధానాలను ఎండగడుతూ బీజేపీకి కంట్లో నలుసుగా మారారు. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ వినహా మోదీకి ఈ స్థాయిలో ఎదురునిలిచింది కేజ్రీవాలే కావడం గమనార్హం. తాజాగా ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఆయన అరెస్టు ద్వారా ఇరు పార్టీల వైరం పతాక స్థాయికి చేరినట్లైంది. మోదీ నాయకత్వంలో బీజేపీ 2014 ఎన్నికల్లో కేంద్రంలో కొలువుదీరింది. ఆ తర్వాత కొద్ది నెలలకే 2015లో జరిగిన ఎన్నికల్లో ఢిల్లీలోని 70 సీట్లకు గాను 67 నెగ్గి కేజ్రీవాల్ చారిత్రక విజయం నమోదు చేశారు. దీనికిముందే 2013లో ఆయన స్వల్పకాలం సీఎంగా పనిచేశారు. తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో వారాణసీలో మోదీపై పోటీకి దిగి వార్తల్లో నిలిచారు. 2019లో మోదీ మరోసారి విజయం సాధించగా, 2020లో అసెంబ్లీ ఎన్నికల్లో కేజ్రీ గెలుపొందారు. ఇన్నేళ్లలో ప్రభుత్వ కార్యక్రమాలు, రాజకీయ అభిప్రాయ భేదాలతో వీరి వైరం పెరుగుతూనే పోయింది. ఒక్కో ఎమ్మెల్యేను రూ.25 కోట్లకు కొనుగోలు చేయాలని చూసిందని, పార్టీని చీల్చే కుట్రలకు పాల్పడిందని, కేజ్రీని జైలుకు పంపి ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నం చేసిందనేది బీజేపీపై ఆప్ ఆరోపణలు కాగా, ఆప్, కేజ్రీ అవినీతిని బీజేపీ ఎత్తిచూపేది.

అలా మొదలైంది..

ఇక అధికారుల బదిలీలు, పోలీస్, భూమి విషయాల్లో లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ)కు అధికారం కట్టబెడుతూ 2015లో కేంద్ర హోం శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ కేంద్రం, ఆప్ సర్కారు మధ్య మొదలైన తొలి ఘర్షణగా చెబుతారు. ఇది హైకోర్టు, సుప్రీంకోర్టులో సుదీర్ఘ న్యాయ పోరాటానికి దారితీసింది. నిరుడు మే 11న సీనియర్ అధికారుల బదిలీ, పోస్టింగ్‌పై ఢిల్లీ ప్రభుత్వానికి అనుకూలంగా సుప్రీం తీర్పునిచ్చింది. ఆ కొద్ది రోజులకే ఎల్జీ-ప్రభుత్వం మధ్య అధికార సమతుల్యతను పాటిస్తూ కేంద్రం ఆర్డినెన్స్‌ను తెచ్చింది. నిరుడు ఆగస్టులో నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ గవర్నమెంట్ (సవరణ) చట్టం ద్వారా ఎల్జీకి కేంద్రం అధికారాలను కట్టబెట్టాలని చూసింది.

ఎల్జీలతో లడాయి..

కేంద్ర ప్రభుత్వం నియమించే లెఫ్టినెంట్ గవర్నర్ల (ఎల్జీ)తో ఆప్ సర్కారుకు తొలి నుంచి పొసగలేదు. నజీబ్ జంగ్ ఎల్జీగా ఉన్న సమయంలో.. చీఫ్ సెక్రటరీ నియామకం, అవినీతి నిరోధక శాఖపై నియంత్రణ, సీనియర్ అధికారుల బదిలీ, పోస్టింగ్‌లు, ఫైల్స్‌పై సంతకాల విషయంలో ఆప్ గట్టిగానే నిలదీసింది. దీంతో 400 ఫైల్స్ పరిశీలనకు మాజీ కాగ్ షుంగ్లూ సహా ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. జంగ్ వెళ్లిపోయారు అనుకుంటే, ఆయన స్థానంలో వచ్చిన అనిల్ బైజాల్‌తో కేజ్రీ సర్కారు ఇంకా గట్టిగా తలపడాల్సి వచ్చింది. బైజాల్ కారణంగా అధికారులు తమ మాట వినడం లేదంటూ కేజ్రీ మంత్రులతో కలిసి రాజ్ నివాస్ ఎదుటనే ధర్నాకు దిగే స్థాయికి చేరింది. సీఏఏ వ్యతిరేక అల్లర్లపై స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం, ప్రభుత్వ నిధుల వ్యయం ఇలా చాలా అంశాల్లో బైజాల్-ఆప్ సర్కారు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. 2022 మేలో ఎల్జీగా వచ్చిన వీకే సక్సేనా మొత్తం వ్యవహారాన్ని మలుపుతిప్పారు. బాధ్యతలు చేపట్టిన 2 నెలల్లోనే.. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీలోని అవకతవకలపై సీబీఐ విచారణకు ఆదేశించారు. తర్వాత మనీ ల్యాండరింగ్‌పై ఈడీ రంగంలోకి దిగి ఆప్ మంత్రి మనీశ్ సిసోడియా, ఎంపీ సంజయ్‌సింగ్‌లను అరెస్టు చేసింది. లిక్కర్ స్కాంతో పాటు ఢిల్లీ జల మండలి కేసులోనూ కేజ్రీకి పదేపదే సమన్లు జారీ చేసింది. గురువారం చివరకు కేజ్రీవాల్ అరెస్టు జరిగింది.

సుప్రీంకోర్టుకు 'పతంజలి' క్షమాపణలు

» తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇవ్వబోమని హామీ

న్యూఢిల్లీ, మార్చి 21: తమ సంస్థల ఉత్పత్తులు, మందుల సామర్థ్యంపై తప్పుదోవ ప్రకటనలు ఇవ్వబోమంటూ పతంజలి ఆయుర్వేద సంస్థ సుప్రీం కోర్టుకు క్షమాపణలు చెప్పింది. ఈమేరకు పతంజలి మేనేజింగ్ డైరెక్టర్ ఆచార్య బాలకృష్ణ, యోగా గురు బాబా రాందేవ్ అనుచరుడు ఒకరు బుధవారం అఫిడవిట్ సమర్పించారు. న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘించి పతంజలి ఉత్పత్తులపై ప్రకటనలు ఇచ్చినందుకు మంగళవారం సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బాబా రాందేవ్‌పాటు బాలకృష్ణ ఏప్రిల్ 2న కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాల ధర్మాసనం ఆదేశించింది. దీంతో మర్నాడే వివరణ ఇస్తూ అఫిడవిట్ సమర్పించింది. చట్టాలను గౌరవిస్తామని, కోర్టు ఆదేశాలను ఉల్లంఘించే ఉద్దేశంలేదని బేషరతుగా క్షమాపణలు చెప్పింది. ఇకపై తప్పుదోవపట్టించే ప్రకటనలు ఇవ్వబోమని పేర్కొంది. డ్రగ్స్ అండ్ మేజిక్ రెమిడీస్.. అభ్యంతరకర ప్రకటనల నిషేధ చట్టం కింద తమ ఉత్పత్తులను పేర్కొనడంపైనా వివరణ ఇచ్చింది. కరోనా సమయంలో ఆధునిక వైద్యం, వ్యాక్సిన్లను కించపరిచేలా బాబారాందేవ్ మాట్లాడారంటూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దావా వేసింది. ఆ కేసు విచారణలో భాగంగా ప్రస్తుతం సుప్రీంకు క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది.

'వికసిత్ భారత్' సందేశాలు ఆపండి: ఈసీ

న్యూఢిల్లీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ హయాంలో సాధించిన విజయాలను పేర్కొంటూ ప్రజలకు వాట్సా‌ప్‌లో పంపుతున్న 'వికసిత్ భారత్ సంపర్క్' బల్క్ సందేశాలను నిలిపేయాలంటూ కేంద్రాన్ని ఎన్నికల సంఘం (ఈసీ) ఆదేశించింది. ఈ మేరకు గురువారం కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖకు నోటీసులు జారీ చేసింది. దీనిపై తక్షణమే సమ్మతి నివేదికను పంపాలని కోరింది. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అందిన పలు ఫిర్యాదుల మేరకు ఈసీ ఈ చర్యలు తీసుకుంది. అయితే ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందే ఈనెల 15న ప్రధాని మోదీ లేఖతో సందేశాలు పంపినట్లు ఐటీ శాఖ ఈసీకి తెలిపింది. కొన్ని నెట్‌వర్క్ పరిమితులతో ఆలస్యంగా వెళ్తున్నాయని పేర్కొంది. ఈ వాట్సాప్ సందేశాలపై కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు అభ్యంతరం వ్యక్తం చేశాయి.

నంబర్లూ ఇచ్చేశాం!

» ఎన్నికల బాండ్ల పూర్తి సమాచారాన్ని ఈసీకి సమర్పించాం
» సుప్రీంలో ఎస్‌బీఐ చైర్మన్ అఫిడవిట్.. తాజా వివరాలను ప్రచురించిన ఈసీ

న్యూఢిల్లీ, మార్చి 21: యునిక్ నంబర్లతో సహా ఎన్నికల బాండ్లకు సంబంధించి అన్ని వివరాలూ ఎన్నికల కమిషన్‌కు అందజేశామని పేర్కొంటూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సుప్రీంకోర్టులో ప్రమాణ పత్రం దాఖలు చేసింది. ఎన్నికల బాండ్లను కొన్నవారు వాటిని ఏ పార్టీలకు ఇచ్చారో తెలిపే కీలక సమాచారం యునిక్ బాండ్ నంబర్. ఆ నంబర్ లేకుండా ఈసీకి బాండ్ల వివరాలు అందించడంపై సుప్రీంకోర్టు ఆగ్రహించిన నేపథ్యంలో.. ఆ వివరాలను కూడా సమర్పించినట్టు ఎస్‌బీఐ చైర్మన్ పేరిట దాఖలు చేసిన ఈ అఫిడవిట్‌లో వెల్లడించింది. అయితే.. బాండ్లను నగదుగా మార్చుకున్న రాజకీయ పార్టీల ఖాతా నంబర్లు, కేవైసీ తాలూకూ పూర్తి వివరాలను ఇస్తే వాటి భద్రతకు భంగం (అకౌంట్ నంబర్ ఆధారంగా సైబర్ క్రిమినల్స్ వాటిని టార్గెట్ చేసే ప్రమాదం ఉంది) కాబట్టి ఆ వివరాలను మాత్రం ఇవ్వలేదని పేర్కొంది. బాండ్లను కొనుగోలు చేసినవారి కేవైసీ వివరాలను కూడా ఇదే కారణాలతో సమర్పించలేదని వివరించింది. తాము ఇచ్చిన వివరాలతో ఏయే కంపెనీలు/ఎవరెవరు ఏయే పార్టీలకు బాండ్ల రూపంలో విరాళాలు సమర్పించిందీ తెలుస్తుందని.. ఆ వివరాలు తెలుసుకోవడానికి బ్యాంకు ఖాతాలు, కేవైసీ వివరాలు అక్కర్లేదని స్పష్టం చేసింది. ఎస్‌బీఐ సమర్పించిన ఈ వివరాలను భారత ఎన్నికల కమిషన్ తన వెబ్‌సైట్‌లో రెండు పీడీఎఫ్ ఫైళ్ల రూపంలో విడుదల చేసింది. ఒక పీడీఎఫ్‌లో బాండ్లను కొనుగోలు చేసినవారి/కంపెనీ పేరు, బాండు విలువ, బాండ్ నంబర్, ఆ బాండును ఎప్పుడు కొనుగోలు చేసింది?, దాని ఎక్స్‌పైరీ డేట్, అది నగదుగా మారిందీ లేనిదీ.. తదితర వివరాలు ఇచ్చింది. మరొక పీడీఎఫ్ ఫైల్‌లో.. బాండ్ నంబ ర్, దాన్ని నగదుగా మార్చుకున్న పార్టీ పేరు, ఏ తేదీన ఆ బాండ్‌ను ఆ పార్టీ సొమ్ము చేసుకుంది, ఏ ఖాతాలో డబ్బు జమ అయ్యిందీ (ఖాతానంబర్ చివరి నాలుగు అంకెలు మాత్రమే ఇచ్చారు) తదితర వివరాలు ఉన్నాయి.

ఇతర విరాళాల్లోనూ బీజేపీనే టాప్

న్యూఢిల్లీ, మార్చి 21: ఎన్నికల బాండ్ల రూపంలో కాకుండా.. దేశవ్యాప్తంగా వివిధ పార్టీలకు 2013-2023 నడుమ అందిన నిధులు రూ.7,726 కోట్లు. అందులో సింహభాగం.. దాదాపు రూ.5000 కోట్లు (ఇంచుమించుగా 64.7%) బీజేపీకే అందాయని ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా సమాచారం ఆధారంగా బిజినెస్‌లైన్ వార్తా సంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. దాని ప్రకారం.. 10.7% నిధులతో కాంగ్రెస్.. 3.3% నిధులతో బీఆర్ఎస్, 3.1% నిధులతో ఆప్ బీజేపీ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. మోదీ సర్కారు రూపొందించిన ఎలక్టోరల్ బాండ్ల పథకం 2018లో అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే.

నా మీద అరవొద్దు

» న్యాయవాది నెడుంపరపై సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ఆగ్రహం

న్యూఢిల్లీ, మార్చి 21: "నా మీద అరవొద్దు. ఇదేమీ బహిరంగ ప్రదేశం కాదు.. మీరు కోర్టులో ఉన్నారు" ..అంటూ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ సీనియర్ అడ్వొకేట్ జె.నెడుంపరపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల బాండ్లకు సంబంధించి.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసమగ్ర సమాచారం ఇవ్వడంపై దాఖలైన పిటిషన్లను సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం విచారించింది. ఆ విచారణ సందర్భంగా.. ఎన్నికల బాండ్లపై సుప్రీం కోర్టు తీర్పుతో నెడుంపర విభేదించారు. "ఇది ప్రభుత్వ విధానానికి సంబంధించిన అంశం. దీంట్లో కోర్టులు జోక్యం చేసుకోకూడదు." అంటూ నెడుంపర ధర్మాసనంతో వాగ్వాదానికి దిగారు. దీంతో సీజేఐ ఆయనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఈ అంశంపై మీరు ఏదైనా అప్లికేషన్ ఇవ్వాలనుకుంటే ఈమెయిల్ ద్వారా పంపండి. అది ఈ కోర్టు ప్రొటోకాల్" అని తేల్చిచెప్పారు. నిజానికి నెడుంపర న్యాయస్థానంతో ఘర్షణ పడడం ఇదే మొదటిసారి కాదు. సీనియర్ అడ్వొకేట్ల నియామకాల్లో న్యాయమూర్తుల పిల్లలకు ప్రాధాన్యం ఇస్తున్నారంటూ 2019లో ఆయన ఆరోపణలు చేయడాన్ని కోర్టు ధిక్కరణ చర్యగా సుప్రీంకోర్టు పరిగణించి, మూడు నెలల జైలు శిక్ష విధించింది. అప్పుడు ఆయన కోర్టును బతిమాలి.. బేషరతుగా క్షమాపణ చెప్పడంతో కోర్టు శిక్షను రద్దు చేసింది.

200 మంది సభ్యుల్లోంచి 2 గంటల్లోనే ఆరుగురిని షార్ట్‌లిస్ట్ ఎలా చేస్తారు?

కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సుప్రీం కోర్టు

ఈసీల నియామకంపై స్టే ఇవ్వలేమని స్పష్టం

న్యూఢిల్లీ, మార్చి 21: ఎన్నికల కమిషనర్ల (ఈసీ) నియామకం ఆదరాబాదరాగా జరిగిందంటూ సుప్రీంకోర్టు పరోక్షంగా ఆక్షేపించింది. 200మంది సభ్యుల్లోంచి కొన్ని గంటల్లోనే ఆరుగురిని షార్ట్‌లిస్ట్ ఎలా చేస్తారు? అని కేంద్ర ప్రభుత్వాన్ని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. మాజీ ఐఏఎస్ జ్ఞానేశ్‌కుమార్, సుఖ్బీర్ సింగ్ ఈసీలుగా నియమించిన నేపథ్యంలో సుప్రీం పైవిధంగా స్పందించింది. ఈసీల నియామకంపై 200మంది సభ్యుల పేర్లను పరిశీలించవచ్చు. అయితే ఇందుకు టైం ఎంత ఇచ్చారు? బహుశా రెండే రెండు గంటలుకావొచ్చు. ఈ విషయంలో మరింత పారదర్శకంగా వ్యవహరించాల్సి ఉండాల్సింది అంటూ కేంద్రాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించింది. లోక్‌సభ ఎన్నికల ముందు ఈసీల నియామకం చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈసీల నియామకం కోసం కొత్తగా తెచ్చిన చట్టాన్ని నిలిపివేయాలంటూ సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిని గురువారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తా సారథ్యంలోని ధర్మాసనం విచారణ చేసింది. ఈసీల నియామకం కోసం 200మంది సభ్యులోంచి గంటల వ్యవధిలో ఆరుగురితో షార్ట్‌లిస్ట్ వెలువరించడాన్ని సుప్రీంకోర్టు ఆక్షేపించినా ఈసీల నియామకంపై స్టే ఇవ్వడానికి నిరాకరించింది. ఈ సమయంలో ఈసీల నియామకంపై స్టే విధిస్తే తీవ్ర అనిశ్చితి, గందరగోళానికి దారితీస్తుందని పేర్కొంది. దీనిపై ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టంచేసింది. ఈసీల నియామకంపై కేంద్రం తెచ్చిన కొత్త చట్టం రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను పరిశీలిస్తామని, వీటిపై ఆరువారాల్లోగా స్పందన తెలపాలని కేంద్రాన్ని ఆదేశించింది.

సీఎం కావాలన్న ఆలోచన లేదు

పార్టీలో నేను చాలా జూనియర్‌ని.. బీజేపీలోకి టచ్‌లోకి వెళ్లానన్నది ప్రచారమే

- జలాశయాల్లో నీళ్లు లేకపోవడం గత సర్కారు తప్పిదమే..
- మాపై రాళ్లేయడం తగదు
- త్వరలో ధరణి అక్రమాలపై పూర్తి వివరాలు
- మాకు 14 సీట్లు ఖాయం: పొంగులేటి

హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): "ముఖ్యమంత్రి కావాలన్న ఆలోచనే లేదు. ఆ పదవిని ఊహించుకోవడానికి కూడా అర్హత లేదు. లోక్‌సభ ఎన్నికల తర్వాత నేనే సీఎం అనడం అంతా ఊహాజనితమే. సీఎం పదవి కట్టబెట్టాలంటే పార్టీ హైకమాండ్ ఈక్వేషన్స్ చూస్తుంది కదా.. పార్టీలో నేను చాలా జూనియర్‌ను" అని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. డబుల్ డిజిట్ ఎంపీ సీట్లు గెలవబోతున్నామని, 14 స్థానాలు గ్యారెంటీగా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో బీఆర్ఎస్ ఒకటి రెండు గెలిస్తే గొప్పేనని చెప్పారు. టూరిజం ప్లాజాలో గురువారం నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా వచ్చిన తర్వాత ఎవరెవరో ఏవేవో కామెంట్లు పెడుతున్నారని, వాటిని పట్టించుకోకూడదని అభిప్రాయపడ్డారు. పళ్లున్న చెట్టుకే రాళ్ల దెబ్బలు అంటూ తన దగ్గర పళ్లు ఉన్న మాట నిజమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నం.2 అంటూ వస్తున్న ప్రచారాన్ని విలేకరులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. రోజూ సీఎం రేవంత్ రెడ్డి వెంట ఉంటే నం.2 ఎలా అవుతానని ప్రశ్నించారు.



తాను ఎవరికీ టచ్‌లోకి వెళ్లలేదని, అదంతా ప్రచారం మాత్రమేనని అంటూ బీజేపీలోకి టచ్‌లోకి వెళ్లారన్న ఆరోపణలను కొట్టిపారేశారు. రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధి కోసం ప్రధాన మంత్రిని కలుస్తామని, అంత మాత్రాన ఆ పార్టీతో కలిసినట్లా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం తరహాలో తమ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌లు చేయదన్నారు. బీఆర్ఎస్‌పై కక్షపూరితంగా కేసులు పెడుతున్నామని అంటున్నారని, అవన్నీ గత ప్రభుత్వంలో వారు అధికార దుర్వినియోగంతో చేసిన తప్పులకు ప్రతిఫలమేనని వివరించారు. "జలాశయాల్లో నీరు లేకపోవడం, పంటలు ఎండిపోవడం వంటి ఫొటోలు, వీడియోలు పెట్టి కొన్ని మీడియా సంస్థలు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు వేసే యత్నం చేస్తున్నాయి. మా ప్రభుత్వం ఏర్పడింది డిసెంబరులో. అంతకు ముందే జలాశయాల్లో నీరు పూర్తిగా అడుగంటింది. రానున్న ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని జలాశయాల్లో నీటి నిల్వలు ఉంచాల్సిన బాధ్యత ఆ ప్రభుత్వానిదే. కానీ, నిల్వ చేయకుండా సముద్రం పాలు చేసింది. ఇప్పుడు మాపై రాళ్లేయడం తగదు" అని తప్పుబట్టారు. ఇతర పార్టీల నుంచి రావాలంటూ తాము ఎవరినీ అడగడం లేదని, వారే స్వచ్ఛందంగా వస్తున్నారని వివరించారు. "మేం మా పార్టీ గేట్లు పూర్తిగా ఎత్తలేదు. ఎత్తితే ఇతర పార్టీల నుంచి వచ్చే నాయకుల వరద ఆగదు" అని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ అవినీతి సొమ్మును కక్కిస్తామని, విదేశాల్లో పెట్టిన సొమ్మును తిరిగి రప్పిస్తామని అన్నారు. "ధరణిలో జరిగిన అవినీతిని బయటకు తీస్తున్నాం. ఎవరెవరు ఎన్నెన్ని అక్రమాలు చేశారు. ఎంత విలువ చేసే భూములు కొట్టేశారు.. అన్ని వివరాలూ బయటపెడతాం. అక్రమాలపై శ్వేతపత్రం కూడా విడుదల చేస్తాం" అని వివరించారు. రైతుల భూ సమస్యల పరిష్కారానికి సరళంగా, సులభంగా ఉపయోగపడే మాడ్యూల్స్‌ను ఉంచి మిగతా వాటిని తీసేస్తామని, ఎన్నికల తర్వాత భూమాత పోర్టల్‌ను తీసుకొస్తామని చెప్పారు. రిజిస్ట్రేషన్ శాఖను త్వరలోనే ప్రక్షాళన చేస్తామని చెప్పారు.

ఐదేళ్లలో దేశవ్యాప్తంగా కోటి మొక్కలు

- తొలి ఏడాది పది లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం
- ఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సుధారెడ్డి

హైదరాబాద్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మానవ జీవితంలో అంతర్భాగమైన ప్రకృతి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాలని ఎస్ఆర్ (సుధారెడ్డి) ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) డైరెక్టర్ సుధారెడ్డి తెలిపారు. వచ్చే ఐదేళ్లలో తెలంగాణ, ఏపీతో పాటు దేశంలోని జాతీయ రహదారులు, విద్యాసంస్థలు, ప్రార్థనా మందిరాలు, ఆస్పత్రులు, ఇతర ప్రాంతాల్లో కోటి మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో ఎంఈఐఎల్, ఎస్ఆర్ ఫౌండేషన్ సంయుక్తంగా చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం నుంచి మొక్కలు నాటడం వేగవంతం చేస్తామని తెలిపారు. తొలి ఏడాది వెయ్యి కిమీ. పరిధిలో 10లక్షల మొక్కలు నాటుతామని తెలిపారు. కాలుష్యాన్ని తగ్గించి, పర్యావరణాన్ని కాపాడడం, జీవ వైవిధ్యాన్ని పెంపొందించడంలో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. అత్యంత కాలుష్య దేశాల్లో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉండడం ఆందోళనకరన్నారు. ఈ పరిస్థితిని అధిగమించి, కాలుష్య రహిత దేశాల్లో భారత్ మూడో స్థానంలో ఉండేలా చూడాలని కోరారు. ఇంటికో మొక్క పెంచాలని, ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, ఇళ్లు నిర్మించేవారంతా కొంత స్థలాన్ని ఇందుకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.




మొక్క నాటేందుకు వెళ్తున్న సుధారెడ్డి

బ్యారేజీల డిజైన్లపై తలో మాట

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై ఎన్‌డీఎస్‌ఏ విచారణ.. ఐఎస్ కోడ్‌తో రూపొందినవే ఆమోదించాం: సీడీవో

- వైఫల్యానికి మేం బాధ్యులం కాదు: నిర్మాణ సంస్థలు



హైదరాబాద్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల డిజైన్లపై జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ ఎదుట సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీవో), ప్రాజెక్టు నిర్మాణ విభాగం, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం), నిర్మాణ సంస్థల అధికారులు గురువారం తలో మాట మాట్లాడారు. ఎన్‌డీఎస్‌ఏ కమిటీ జల సౌధలో ఉదయం 9:30 నుంచి రాత్రి దాకా విచారణ చేపట్టింది. "డిజైన్లకు ప్రామాణికత ఏమిటి? దేనిని ఆధారం చేసుకుని వాటిని రూపొందించారు? ఇందులో ఎవరి సహకారమైనా తీసుకున్నారా? బ్యారేజీల నిర్మాణం జరుగుతున్నప్పుడు క్షేత్రస్థాయికి వెళ్లారా? కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) మార్గదర్శకాలు పాటించారా?" అంటూ ప్రశ్నలతో ముంచెత్తింది. డిజైన్లకు సంబంధించి 9 అంశాలతో ప్రశ్నపత్రం ఇచ్చి వివరాలు సేకరించింది. కాగా, భారత ప్రమాణాల (ఐఎస్) కోడ్ ఆధారంగా డిజైన్లు రూపొందించారని, వాటినే ఆమోదించామని సీడీవో అధికారులు జవాబిచ్చారు. మూడు బ్యారేజీల అసలు డిజైన్లు అందించాలని ఎన్‌డీఎస్‌ఏ కోరగా.. వాటిని విజిలెన్స్ తీసుకెళ్లిందని చెప్పారు. మేడిగడ్డ డిజైన్లను నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీనే తయారుచేసిందని, వాటినీ ఐఎస్ ప్రకారం ఆమోదించామని తెలిపారు. మెయిల్ ద్వారా ఎల్‌అండ్‌టీ ప్రతినిధులు పంపిన డిజైన్లను ఎన్‌డీఎస్‌ఏ కమిటీకి అందించారు. నిర్మాణంలో కటాఫ్ పైల్స్‌కు బదులుగా సీకంట్ పైల్స్ ఎందుకు వాడారు? అని అడగ్గా, డిజైన్ల తయారీ వరకే తమ బాధ్యత అని, నిర్మాణం ఏ విధంగా జరుగుతోందని పరిశీలించే అధికారం లేదని, సమస్యలు వస్తే తప్ప క్షేత్రస్థాయికి వెళ్లబోమని సీడీవో అధికారులు బదులిచ్చారు. కాగా, మూడు బ్యారేజీలను సీడీవో అందించిన డిజైన్లు/డ్రాయింగ్ ఆధారంగానే కట్టామని నిర్మాణ సంస్థల ప్రతినిధులు ఎన్‌డీఎస్‌ఏకు వివరణ ఇచ్చారు. బ్యారేజీల వైఫల్యానికి తాము బాధ్యులం కాదని, ప్రభుత్వం ఏ విధంగా డిజైన్లు ఇచ్చిందో అలాగే నిర్మించామని స్పష్టం చేశారు.

వానలకు ముందు, తర్వాత తనిఖీ చేశారా?

డ్యామ్ భద్రతా చట్టం, ఐఎస్ కోడ్ ప్రకారం వర్షాకాలానికి ముందు, తర్వాత బ్యారేజీలను పరిశీలించారా? అని ఓఅండ్ఎం విభాగాన్ని ఎన్‌డీఎస్‌ఏ ప్రశ్నించింది. బ్యారేజీల నిర్మాణం 2019 జులైలో పూర్తయిందని, తర్వాత రెండేళ్ల పాటు డిఫెక్ట్ లయబులిటీ పీరియడ్‌లో ఉన్నాయని తెలిపారు. 2021 నుంచి 2024 దాకా బ్యారేజీల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ బాధ్యత నిర్మాణ సంస్థలదేనని నీటి పారుదల శాఖ ఓఅండ్ఎం అధికారులు గుర్తుచేశారు. అలాగైతే 2019 నుంచి ఓఅండ్ఎంతో ముడిపడిన నివేదికలు ఇవ్వాలని ఎన్‌డీఎస్‌ఏ కోరింది. కాగా, నిపుణుల కమిటీ పర్యటన శుక్రవారంతో ముగియనుంది. స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్(ఎస్‌డీఎస్‌వో) అధికారులతో సమావేశం అనంతరం తెలంగాణ రాష్ట్ర ఇంజనీరింగ్ ల్యాబొరేటరీ (టీఎస్ఈఆర్ఎల్)ని సందర్శించనుంది. రాష్ట్రంలో ఏ బ్యారేజీ/డ్యామ్ కట్టాలన్నా నమూనా డ్యామ్/బ్యారేజీలను కట్టి ఇక్కడే పరీక్షిస్తారు. అనంతరం ఎన్‌డీఎస్‌ఏ బృందం ఢిల్లీకి తిరిగివెళ్లనుంది.

నాణ్యత పరిశీలించాకే సంతకాలు పెట్టారా?

బ్యారేజీల నిర్మాణంలో నాణ్యత, పరీక్షల తర్వాతే సంతకాలు చేశారా? లేక ముందే చేశారా? అని క్వాలిటీ కంట్రోల్ అధికారులను ఎన్‌డీఎస్‌ఏ ప్రశ్నించింది. 2016లో నిర్మాణం ప్రారంభిస్తే మూడేళ్లలోనే పూర్తిచేశారని, ఆ పనుల్లో నాణ్యత పాటించారా? లేదా? అనేది ఎలా పరిశీలించారని కమిటీ నిలదీసింది. నాణ్యత పాటించారని.. పరీక్షల అనంతరమే సంతకాలు చేశామని క్వాలిటీ కంట్రోల్ అధికారులు బదులిచ్చారు.


'క్రాప్ బుకింగ్'తో నష్టం అంచనా

- యాప్‌లో వివరాల నమోదుకు వ్యవసాయ శాఖ ఆదేశాలు
- రైతులు, సర్వే నంబర్లు, విస్తీర్ణం ప్రకారం వివరాల సేకరణ

హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు, వడగళ్ల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన పంటనష్టంపై క్షేత్రస్థాయి సర్వే చేయించాలని నిర్ణయించింది. ఇందుకోసం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోని 'క్రాప్ బుకింగ్' యాప్‌ను ఉపయోగించుకుంటుంది. వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న క్రాప్ బుకింగ్ యాప్‌ను ప్రామాణికంగా తీసుకొని. రబీ పంట నష్టంపై సమగ్ర సర్వే చేపడుతున్నట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ధరణి పోర్టల్‌లో ఉన్న వ్యవసాయ భూముల వివరాలు, సర్వే నెంబర్లను ఆధారంగా చేసుకొని వ్యవసాయశాఖ క్రాప్ బుకింగ్ పోర్టల్ నిర్వహిస్తోంది. ఈ పోర్టల్‌లో రాష్ట్రస్థాయి సమాచారంతోపాటు జిల్లాలు, వ్యవసాయ డివిజన్లు, మండలాలు, క్లస్టర్ల వారీగా వివరాల నమోదు చేస్తున్నారు. ప్రతి 5 వేల ఎకరాలకు ఒకటి చొప్పున ఏర్పాటు చేసిన క్లస్టర్‌ను ఏఈవో(వ్యవసాయ విస్తరణాధికారి) పర్యవేక్షిస్తుంటారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉన్న సర్వే నెంబర్లలో.. రైతులు ఏ సర్వే నెంబరులో ఏ పంట సాగు చేశారు? ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు? వంటి వివరాలను ఏఈవోలు తమ ట్యాబ్‌ల ద్వారా ఈ పోర్టల్‌లో నమోదు చేస్తుంటారు. ఇప్పుడు అకాల వర్షాలు, వడగండ్లతో ఏ సర్వే నెంబరులో ఉన్న పంట దెబ్బతిన్నది? ఏ పంట దెబ్బతిన్నది? ఎంత విస్తీర్ణంలో దెబ్బతిన్నది? అనే వివరాలను సేకరించి నివేదికలో పొందుపరుస్తున్నారు. రైతు పేరు, క్లస్టర్, గ్రామం, మండలం, జిల్లా, పట్టాదారు పాస్ పుస్తకం ఖాతా నెంబరు, సర్వే నెంబర్లు, సాగుచేసిన విస్తీర్ణం, అందులో దెబ్బతిన్న పంట విస్తీర్ణం, పంట పేరు, రైతుల బ్యాంకు ఖాతాల వివరాలు, ఆధార్ నెంబర్ సహా అన్ని వివరాలను ఏఈవోలు, ఏవోలు సేకరిస్తున్నారు. దాంతో పాటు దెబ్బ తిన్న పంట ఫొటోను కూడా పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. క్రాప్ బుకింగ్ పోర్టల్‌లో నమోదు కానీ పంటలు ఇప్పుడు దెబ్బతిని ఉంటే వాటి వివరాలను నమోదు చేసే అవకాశం లేదు. కాగా, అకాల వర్షాలు, వడగళ్ల వల్ల నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ తదితర జిల్లాల్లోని పంటలు దెబ్బతిన్నాయి. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పంటనష్టం అంచనాపై వ్యవసాయ శాఖ చేస్తున్న సర్వే పూర్తి అయినా.. లోక్‌సభ ఎన్నికలు తర్వాతే రైతులకు పరిహారం అందే అవకాశం ఉంది.

పంట దెబ్బతిన్న ప్రతీ రైతుకు పరిహారం

- ఎకరాకు రూ.10 వేలు.. పెంచేందుకు కృషి చేస్తాం
- మంత్రి జూపల్లి వెల్లడి.. దెబ్బతిన్న పంటల పరిశీలన



అంతంపల్లిలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న జూపల్లి

భిక్కనూరు/నిజామాబాద్ అర్బన్, మార్చి 21: అకాల వర్షం, వడగండ్లకు పంట దెబ్బతిన్న ప్రతీ రైతుకు నష్టపరిహారం చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. గురువారం కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో ఆయన పర్యటించారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు, దోమకొండ మండలాల్లో, నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం కొండూరులో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఆయనతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జూపల్లి మాట్లాడుతూ పంట నష్టంపై సర్వే చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే వ్యవసాయాధికారులను ఆదేశించారన్నారు. సర్వే పూర్తికాగానే అధికారుల నివేదిక ప్రకారం ఎకరాకు రూ.10 వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అయితే ఇది సరిపోదని, వాస్తవానికి రూ.25 వేలు ఇవ్వాల్సి ఉండేదన్నారు. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోదని, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చడం వల్ల ప్రతీ నెలా రూ.60 వేల కోట్ల వడ్డీ చెల్లించాల్సి వస్తోందన్నారు. రైతులకు ఎంత ఇచ్చినా తక్కువనేనని, పరిహారాన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తామన్నారు.

త్వరలో బీఆర్ఎస్ ఖాళీ కావడం ఖాయం

తమ ప్రభుత్వానికి ఇతర పార్టీల ఎమ్మెల్యేలు స్వచ్ఛందంగా మద్దతిస్తున్నారని, తాము ఎవరినీ పార్టీలోకి ఆహ్వానించడం లేదని, వారే వస్తున్నారని మంత్రి జూపల్లి అన్నారు. గురువారం ఆయన నిజామాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. త్వరలో బీఆర్ఎస్ ఖాళీ కావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 3నెలలు కాకముందే బీజేపీ, బీఆర్ఎస్‌లు ఈ ప్రభుత్వాన్ని పడగొడతామని అంటున్నారని, కానీ ఆ పార్టీల ఎమ్మెల్యేలు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. వచ్చే వర్షాకాలం పంట నుంచి ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తుందన్నారు. ప్రతి ఎకరాకు 15 వేల రైతు భరోసా అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నేపాల్‌లో కొత్త రాజకీయం

మరో నాలుగైదురోజుల్లో నేపాల్ ఉపప్రధాని నారాయణ్ కాజీ శ్రేష్ట చైనా వెళ్ళి, బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బీఆర్ఐ) ప్రాజెక్టులకు సంబంధించిన ఒప్పందాలమీద సంతకాలు చేస్తారట. ఓ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు ఆయన ప్రయాణం కడుతున్నప్పటికీ, ఉభయదేశాల మధ్యా నాలుగేళ్ళుగా నలుగుతున్న బీఆర్ఐ వ్యవహారాన్ని కొలిక్కి తీసుకురావడమే ఆయన పర్యటన ప్రధాన లక్ష్యమని వార్తలు వస్తున్నాయి. నేపాలీ కాంగ్రెస్‌తో తెగ దెంపులు చేసుకొని, మళ్ళీ తన పాతశత్రువైన కేపీశర్మ ఓలి పార్టీతో ప్రధానమంత్రి పుష్పకుమార్ దహల్ అలియాస్ ప్రచండ ఇటీవల కూటమికట్టిన నేపథ్యంలో బీఆర్ఐ ప్రాజెక్టుల విషయంలో తిరిగి కదలిక వచ్చినట్టు కనిపిస్తోంది. చైనాకు కేపీశర్మ ఓలి సన్నిహితుడన్న విషయం తెలిసిందే. అసలే ప్రచండ, ఆ పైన ఓలీతో చేతులు కలపడం భారత దేశానికి ఓ కొత్త తలనొప్పి ఖాయంగా కనిపిస్తోంది.

బీఆర్ఐలో భాగంగా ఏడు ప్రాజెక్టులకు సంబంధించి ఏడేళ్ళక్రితం నేపాల్–చైనా మౌలికమైన అవగాహన కుదర్చుకున్నాయి. అయితే, పెట్టుబడి ఏ రూపంలో ఉండాలన్న విషయంలో చైనాతో అవగాహన కుదరక, అప్పుల ఊబిలోకి జారిపోతామన్న భయంవల్ల కూడా ఈ ప్రాజెక్టులు ముందుకు కదలలేదు. అయితే, తాను నిర్మించిన పొఖారా విమానాశ్రయాన్ని కూడా బీఆర్ఐలో భాగంగా చైనా అభివర్ణించడం, బీఆర్ఐ ప్రాజెక్టులను ఇంకా ఆరంభించనేలేదని మరోపక్క నేపాల్ అంటూండటం చూస్తూనే ఉన్నాం. గ్రాంట్లు, రుణాలు తదితర విషయాల్లో ఉభయదేశాల మధ్యా ఇటీవల ఒక అవగాహన కుదిరిందని, ముసాయిదా తయారైందని, సంతకాలు కాగానే ప్రాజెక్టులు పట్టాలెక్కుతాయని వార్తలు వస్తున్నాయి. భారతదేశ సరిహద్దులకు అత్యంత సమీపంలో ప్రత్యేక ఆర్థికమండళ్ళు, రోడ్లు, రైళ్ళు ఇత్యాది రవాణా మార్గాల వంటివి ఏర్పడబోతున్నాయని దీని అర్థం. భారీ ప్రాజెక్టుల కోసం తవ్వకాలు, సొరంగాల నిర్మాణం వంటివి జరుగుతూండటం కచ్చితంగా ఓ కంట కనిపెట్టవలసిన వ్యవహారమే. ప్రచండ అధికారంలోకి రాగానే బీఆర్ఐ విషయంలో చెప్పుకోదగ్గ కదలిక వచ్చింది. ఇప్పుడు కేపీశర్మ ఓలితో చేతులు కలిపిన నేపథ్యంలో ఆచరణ దిశగా అడుగులు వేగంగా పడుతున్నట్టు కనిపిస్తోంది.

వారం క్రితం ప్రచండ సభావిశ్వాసాన్ని చూరగొన్నప్పుడు బొటాబొటి మద్దతుతో బయటపడ్డారు. 2022 నవంబరు సార్వత్రిక ఎన్నికల అనంతరం ఆయన తన భాగస్వామ్యపక్షాలను మార్చడం ఇది మూడోసారి. సొంతబలం లేకున్నా మిత్రపక్షాలను తారుమారుచేస్తూ ప్రధానిగా కొనసాగగలుగుతున్నారు. ఆయన ప్రభుత్వానికి ఇప్పటివరకూ మద్దతు ఇస్తున్న నేపాలీ కాంగ్రెస్‌తో ప్రాంతీయస్థాయి ఎన్నికల నిర్వహణకు సంబంధించి విభేదాలు వచ్చాయని, అంతకంటే ముఖ్యంగా, ఆ పార్టీకి చెందిన దాదాపు సగంమంది సభ్యులు దేశాన్ని తిరిగి హిందూ రాజ్యంగా ప్రకటించాలంటూ ఇటీవల ఓ తీర్మానం చేయడం ఈ కొత్త పరిణామానికి కారణమని అంటారు. ఈ దిశగా ఇప్పటికే ఉద్యమం సాగుతున్న విషయం తెలిసిందే. అనేక పార్టీలూ, సంఘాలూ ఇందులో చేరుతూంటే, మాజీ రాజు జ్ఞానేంద్ర తన మద్దతు ప్రకటించారు కూడా. మార్చి 4న నేపాలీ కాంగ్రెస్‌తో తెగదెంపులు చేసుకొని, కేపీ శర్మ ఓలీ పార్టీతో చేతులు కలిపి, మార్చి 13న సభావిశ్వాసాన్ని చూరగొన్నప్పుడు 275 సంఖ్యాబలం ఉన్న సభలో ఈ ఏడుపార్టీల సంకీర్ణానికి 157 ఓట్లు వచ్చాయి. మూడు అవిశ్వాస తీర్మానాల్లోనూ అత్యంత తక్కువ మార్కులు పడ్డది ఇప్పుడే. ఈ కూటమి ఎంతకాలం నిలుస్తుందన్నది అటుంచితే, కేవలం ముప్పైరెండు స్థానాలున్న ప్రచండ 89 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించిన నేపాలీ కాంగ్రెస్‌తోనూ, 79 స్థానాలున్న ఓలీ పార్టీతోనూ పొత్తుల ఎత్తులు వేస్తూ అధికారంలో కొనసాగగలుగుతున్నారు. ఇప్పుడు నేపాల్‌లో రెండు కమ్యూనిస్టు పార్టీలు కూటమి కట్టి అధికారంలో ఉండటం చైనాకు సంతోషాన్ని కలిగించే పరిణామం. ఈ రెండుపార్టీలూ దగ్గరకావడానికి గతంలో విశేష కృషిచేసిన చైనాకు ఆ సంతోషం ఎక్కువకాలం నిలవలేదు. ఇప్పుడు అవి చేయీచేయీ కలిపి ఏడేళ్ళుగా పురోగతిలేని ప్రాజెక్టులను పరుగులుపెట్టించాలని నిర్ణయించడం చైనాకు మరింత ఉత్సాహాన్నిచ్చే విషయం. నడిరోడ్డుమీద బిచ్చమైనా ఎత్తుకుంటాను కానీ, ఓలీతో చేతులు కలిపేది లేదని ప్రచండ చేసిన ప్రతిజ్ఞ ఇప్పుడు చాలామందికి గుర్తుకు వస్తున్నది.

2024 : సమ ఉజ్జీల సమరమేనా?

సార్వత్రిక ఎన్నికలు ఒక పెద్ద పరుగు లాంటివి. 18వ లోక్‌సభ ఎన్నికలు రెండున్నర నెలల పాటు, ఏడు దశలలో అందునా చండ్రగాడ్పులు వీచే వేసవిలో జరగనున్నాయి. కనుకనే ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికలకు నగారా మోగించినా, ఈ ప్రజాస్వామ్య పోరుతో సాధారణంగా ముడివడి ఉండే కోలాహలం కొరవడింది. ఉత్సాహం లోపించడానికి మరింత సహేతుకమైన కారణం కూడా ఉన్నది: ఎన్నికల ఫలితాలు ముందుగానే నిశ్చయమై ఉన్నాయి! ఆ ఫలితాల అనివార్యతపై ఒక స్పష్టమైన ఏకాభిప్రాయమున్నది. విజేతలు ఎవరో, పరాజితులు ఎవరో ముందుగానే తేలిపోయినప్పుడు పోరుపై ఆసక్తి సన్నగిల్లి పోవడమూ సహజమే. ప్రధానమంత్రి నరేంద్ర మోదీయే మరోసారి ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టనున్నారన్నదే ఆ నిశ్చిత విషయం. స్వతంత్ర భారత ప్రథమ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ అంటే మోదీకి ఆరాధనా భావం ఏ మాత్రం లేకపోగా వ్యతిరేకత ఉన్నది. అయితే ఆయన మాదిరిగానే ఈయన కూడా వరుసగా మూడోసారి ప్రధానమంత్రి కానున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం తప్పక సంభవించే సంఘటన ఇదేనని అసంఖ్యాక ఓటర్లు విశ్వసిస్తున్నారు. ఫలితాలు ముందుగానే నిర్ధారణ అయినప్పటికీ ఒక ప్రశ్న వేయక తప్పదు: 'స్వేచ్ఛ'గా, 'నిష్పాక్షికం'గా జరగల్సిన ఈ ప్రజాస్వామ్య పోరులో పాల్గొనే రాజకీయ పక్షాలు అన్నిటికీ సమాన విజయావకాశాలు ఉన్నాయా?

ప్రతిపక్షాల పరిస్థితి గందరగోళంగా ఉందనడంలో సందేహం లేదు. ప్రతిపక్ష కూటమి 'ఇండియా' ఏక త్రాటిపై లేదు. ఎవరికి వారే యమునా తీరేగా పలు భాగస్వామ్య పక్షాలు వ్యవహరిస్తున్నాయి. అంతర్గత వైరుధ్యాలు 'ఇండియా'ను పీడిస్తున్నాయి. దాని కదనోత్సాహాన్ని బలహీనపరుస్తున్నాయి. మహారాష్ట్ర, తమిళనాడు మినహా మరే ప్రధాన రాష్ట్రంలోనూ 'ఇండియా' భాగస్వామ్య పక్షాలు కలసికట్టుగా లేవు. ఈ కూటమి ఆవిర్భావానికి ప్రధాన కారకుడు అయిన నితీశ్ కుమార్ రాజకీయ కసరత్తులలో మొనగాడినని మరోసారి నిరూపించుకున్నారు. 'ఇండియా' నుంచి వైదొలిగి ఎన్డీఏలో చేరారు! బిహార్ ముఖ్యమంత్రి పదవిని పదిలపరచుకున్నారు. మమత బెనర్జీ 'ఏక్లా చలో' (ఒంటరిగా సాగిపోవాలి) మంత్రాన్ని అనుష్ఠానిస్తున్నారు; తాత చరణ్ సింగ్‌కు 'భారతరత్న' పురస్కారంతో జయంత్ చౌదరి పరమానంద భరితుడై బీజేపీలో చేరారు; అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నారు. పంజాబ్‌లో ప్రతి లోక్‌సభా స్థానానికి ఆయన నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ చేస్తోంది; హిందూత్వ శక్తులను ఓడించడమే లక్ష్యం కావాలని ఘోషించే వామపక్షాలు వయనాడ్‌లో రాహుల్ గాంధీనే కాకుండా కేరళ వ్యాప్తంగా కాంగ్రెస్‌ను సవాల్ చేస్తున్నాయి. మార్గదర్శకత్వం లోపించిన ప్రతిపక్షానికి కాంగ్రెస్ పరిస్థితి అద్దం పడుతోంది. 'ఇండియా' కూటమిని సంఘటితం చేయాల్సిన సమయంలో రాహుల్ గాంధీనే మరోసారి భారత్ జోడో యాత్రలో నిమగ్నమయ్యారు.

ఇలా ఎంతగా అనైక్యంగా ఉన్నప్పటికీ ఎన్నికల రంగంలో సమాన విజయావకాశాల లబ్ధికి ప్రతిపక్ష కూటమి పూర్తిగా అర్హమైనది. ఎన్నికల సంఘాన్నే తీసుకోండి. ఎన్నికలను సక్రమంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన బాధ్యత ఈ రాజ్యాంగ సంస్థపై ఉన్నది. తటస్థ మధ్యవర్తిగా ఎన్నికల సంఘం ఏ ఒక్క రాజకీయ పక్షం వైపు మొగ్గకూడదు. మరి ఈ రాజ్యాంగ సంస్థ తన



'స్వేచ్ఛ'గా, 'నిష్పాక్షికంగా' జరగాల్సిన 2024 ప్రజాస్వామ్య పోరులో పాల్గొనే రాజకీయ పక్షాలు అన్నిటికీ సమాన విజయావకాశాలు ఉన్నాయా? గెలిచే జట్టు ఏదో నిశ్చితంగా చెప్పగల ఒక క్రీడా పోటీలో సైతం ఎదుటి జట్టుకూ సమాన అవకాశం ఉండి తీరాలి. ఈ సదవకాశానికి అది అన్ని విధాల అర్హమైనది. 2024 సార్వత్రిక ఎన్నికలలోనూ ప్రతిపక్షాలకు అటువంటి ప్రాథమిక సానుకూలతలను నిరాకరించడమంటే ప్రజాస్వామ్యానికి తీవ్ర హాని చేయడమే అవుతుంది.

బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తున్నదా? 2024 సార్వత్రిక ఎన్నికల నిర్వహణ దాని చిత్తశుద్ధికొక పరీక్ష. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగాలు ఎన్నికల నియమవళికి అనుగుణంగా ఉన్నాయని ఎన్నికల సంఘంలో వ్యక్తమైన మెజారిటీ అభిప్రాయంతో ఎన్నికల కమినర్లలో ఒకరైన అశోక్ లావాసా విభేదించారు. అయితే ఆ భిన్నాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకపోవడమే కాకుండా, అసలు ఆయన్ని ఆ రాజ్యాంగ సంస్థ నుంచి తొలగించారు. ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలో భారత ప్రధాన న్యాయమూర్తి కూడా భాగస్వామిగా ఉండి తీరాలన్న సుప్రీంకోర్టు ఆదేశాన్ని మోదీ సర్కార్ ఖాతర్ చేయలేదు. సీజేఐ ప్రమేయం లేకుండానే ఇటీవల ఇద్దరు కొత్త కమిషనర్లను నియమించింది. ఈసీ ప్రకటించిన ఎన్నికల షెడ్యూలు సైతం పలు ఇబ్బందికర ప్రశ్నలకు తావిస్తోంది. ఎన్నికల హింసాకాండ చరిత్ర లేని మహారాష్ట్రలో పోలింగ్‌ను ఐదు విడతల్లో ఎందుకు నిర్వహిస్తున్నారు? ప్రతి దశలోనూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో పర్యటించి ప్రచారం చేసేందుకు వెసులుబాటు కల్పించేందుకేనా?

ప్రధాని మోదీ హయాంలో రాజ్యాంగ సంస్థల స్వతంత్ర ప్రతిపత్తి నామమాత్రమై పోతోంది. ఎన్నికల సంఘం విశ్వసనీయత తగ్గిపోవడం కూడా ఇందులో భాగమేనని చెప్పక తప్పదు. గత ఏడాది వికసిత్ భారత్ యాత్ర సందర్భంగా మోదీ ప్రభుత్వ విజయాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించే బాధ్యతలను ఉన్నతాధికారులకు అప్పగించే ప్రయత్నాలు జరిగాయి. ప్రభుత్వ యంత్రాంగాన్ని ఇలా నిస్సిగ్గుగా రాజకీయాకరణ చేయడం చాలా వివాదాస్పదమయింది. అలాగే ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలని సైనికులను రక్షణ మంత్రిత్వ శాఖ ఆదేశించింది. దీనివల్ల అధికార పార్టీ, ప్రభుత్వం మధ్య విభజన రేఖ చెరిగిపోయింది. ఇదెలా రాజ్యాంగ విహితం?

కేంద్ర దర్యాప్తు సంస్థలను ముఖ్యంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారు. ప్రభుత్వంపై విమర్శలను ఎదుర్కొనేందుకై ప్రతిపక్షాలపై దర్యాప్తు సంస్థలను ఉసిగొలుపుతున్నారు. ఫలితంగా విపక్ష నేతలు సదా తమపై ఎటువంటి కేసులు నమోదు అవుతాయనే భయాందోళనలలో ఉంటున్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు పదే పదే సమన్లు జారీ చేసి అరెస్టు చేశారు. జల్ బోర్డ్ కేసుకు సంబంధించి కూడా ఆయనకు సమన్లు జారీ అయ్యాయి. ప్రజల దృష్టిలో నిజాయితీపరులు కాని నేతలుగా తమ ప్రత్యర్థులను అప్రదిష్టపాలు చేయడమే లక్ష్యంగా జాతీయ అధికార పక్షం వ్యవహరిస్తోంది. మద్యం కేసులోనే భారత రాష్ట్ర సమితి నాయకురాలు కవితను అరెస్ట్ చేశారు. ఎన్నికల తరుణంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు మరింత ముమ్మరం కానున్నాయనడంలో సందేహం లేదు.

దర్యాప్తు సంస్థల బలప్రయోగ చర్యలు, బాండ్ల రూపేణా విరాళాల మధ్య సహ సబంధమున్నదని ఇంత వరకు వెల్లడయిన ఎన్నికల బాండ్ల వివరాలు స్పష్టం చేస్తున్నాయి. దాతలు, నేతల మధ్య ఒక క్విడ్ ప్రో కో ఒప్పందం మేరకే ఆ బాండ్ల కొనుగోలు జరిగిందనేది వాస్తవం. భారీ విరాళాలు ఇచ్చిన 30 కంపెనీలలో 14, ఆ బాండ్లను కొనుగోలు చేసిన కాలంలో వివిధ ఆరోపణలపై దర్యాప్తు చర్యల నెదుర్కొంటున్నవే కావడం గమనార్హం. చట్టం భారినపడకుండా ఉండేందుకే ఆ కంపెనీలు ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసివుంటాయని పైన పేర్కొన్న వాస్తవం విస్పష్టంగా సూచిస్తోంది. సరే, ఈ బాండ్ల సొమ్ములో సగానికి పైగా బీజేపీకే దక్కడంలో ఆశ్చర్య పోవల్సిందేమీ లేదు. దేశవ్యాప్తంగా ప్రభావ ప్రాభవాలు అపరిమితంగా ఉన్న పార్టీ అది. అధికారాలూ ఆర్థిక వనరులూ అపారంగా దానికి అందుబాటులో ఉన్నాయి.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

మరి మిగతా పార్టీలు మొత్తంగా చేసే ఖర్చు కంటే కేవలం ఒకే ఒక్క పార్టీ చేస్తున్న వ్యయం అధిక మొత్తంలో ఉన్నప్పుడు ప్రజలను ఆకట్టుకునే ప్రచారార్భాటాలు ఆ ఒక్క పార్టీకే లబ్ధి చేకూర్చేవిగా ఉండవూ? మోదీ సర్కార్ నిర్వహిస్తున్న మల్టీ–మీడియా ప్రచార సమరాలను గమనిస్తే ఆ విషయం మరింతగా స్పష్టమవుతుంది.

ఆ ప్రచార ధోరణులూ, దృశ్యాలూ మన దృష్టిని మీడియా తీరుతెన్నుల వైపుకు తీసుకెళుతున్నాయి. పత్రికలు, టీవీ ఛానెళ్లలో అధిక భాగం తమ విద్యుక్త ధర్మాన్ని త్యజించాయి. ప్రజలకు పాలకులు జవాబుదారీలుగా ఉండేలా చేయడంలో మీడియాకు కీలక పాత్ర ఉన్నది. పాలకుల స్వార్థాల నుంచి ప్రజల ప్రయోజనాలను రక్షించడానికి ఒక కాపలా వ్యవస్థ (వాచ్ డాగ్)గా పని చేయాలి. మరి మీడియా అలా వ్యవహరిస్తుందా? దేశంలో ప్రధాన టీవీ వ్యూయర్‌షిప్ మానిటరింగ్ ఏజెన్సీ అయిన బ్రాడ్‌కాస్ట్ ఆడియన్స్ రీసెర్చ్ కౌన్సిల్ 2019 ఏప్రిల్‌లో నిర్వహించిన ఒక సర్వేలో టీవీ చానెల్స్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, ఆయన రాజకీయ ప్రత్యర్థుల కంటే మూడురెట్లు ఎక్కువ సమయాన్ని కేటాయిస్తున్నాయని వెల్లడయింది. మోదీ సంబంధిత వార్తాకథనాలు, ఇతర కార్యక్రమాలు మొదలైనవి మోదీని ప్రశంసలతో ముంచెత్తేవేనని మరి చెప్పనవసరం లేదు.

మీడియా మద్దతు అంతగా లేనిపక్షంలో మోదీ విజయం సాధించలేరన్నట్టుగా దీనిని అర్థం చేసుకోనవసరం లేదు. అలాగే రాజ్యవ్యవస్థను సంస్థాగతంగా కైవసం చేసుకుని ఉండకపోతే ఆయన ఓటమి పాలయ్యేవారు అనేందుకు కూడా ఆస్కారం లేదు. వాస్తవమేమిటంటే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అపరిమితంగా అధికారం చెలాయించే నాయకుడు. నిరంకుశంగా ప్రవర్తించడం ఆయన స్వతస్సిద్ధ స్వభావం. మరే నేతకు లేని ప్రజాదరణ ఆయనకు ఉన్నది.

జనాన్ని సమ్మోహపరచడంలో ఆయన అద్వితీయుడు. మోదీ వ్యక్తిత్వమూ, నాయకత్వమూ శక్తిమంతమైనవి. కనుకనే కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా సంఖ్యానేక ప్రజలు ఆయనతో మమేకమవుతున్నారు. కొంతమందికి ఆయన విశ్వగురు, ఇతరులకు ఒక హిందూ పూజారి, చేపట్టిన పనులను శీఘ్రగతిన, సమర్థంగా పూర్తి చేయగల పాలనా దక్షుడు. మూర్తీభవించిన జాతీయతావాది. ఈ కారణంగానే 'ఆయేగా తో మోదీ హి' (మోదీ మాత్రమే గెలుస్తారు) అన్న మంత్రం ఎల్లెడలా మారు మోగుతోంది. నిజానికి భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న గొంతులను పూర్తిగా నొక్కివేస్తున్న పాలనా వ్యవస్థకు అదొక సంకేతం. అయితే గెలిచే జట్టు ఏదో నిశ్చితంగా చెప్పగల ఒక క్రీడా పోటీలో సైతం ఎదుటి జట్టుకూ సమాన అవకాశం ఉండి తీరాలి. ఈ సదవకాశానికి అది అన్ని విధాల అర్హమైనది. 2024 సార్వత్రిక ఎన్నికలలోనూ ప్రతిపక్షాలకు అటువంటి ప్రాథమిక సానుకూలతలను నిరాకరించడమంటే ప్రజాస్వామ్యానికి తీవ్ర హాని చేయడమే అవుతుంది.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

శాంతియోధుడు రాందాస్

భారతదేశ రక్షణ శాఖకు మూడు మూలస్తంభాలలో ఒకటైన నౌకాదళానికి అత్యున్నత అధికారిగా (1990–93) పనిచేసిన 90 ఏళ్ళు పైబడిన అడ్మిరల్ రాందాస్ గారికి సైనిక వందనాల లాంఛనంతో మార్చి 16న హైదరాబాద్, తిరుమలగిరి స్వర్గపురిలో అంత్యక్రియలు జరిగాయి. అప్పుడు అక్కడ 'ఇన్‌క్విలాబ్ జిందాబాద్' నినాదం వినిపించడం అక్కడ హాజరైన వారికి కొంత ఆశ్చర్యం కలిగించింది. 'కామ్రేడ్ రాందాస్ అమర్ రహే', 'జోహార్ అడ్మిరల్ రాందాస్' అంటూ ఆయన రెండవ కూతురు సాగరితో సహా పిడికిళ్ళు ఎత్తి నినదించటం ఆయన ప్రత్యేకతను తెలిపింది.

నౌకాదళంలో 1953 నుంచి 1993 వరకు నలభై ఏళ్ళ సేవలో విశిష్ట, పరమ విశిష్ట, వీరచక్ర సేవా పతకాలు సాధించిన లక్ష్మీనారాయణ్ రాందాస్ చివరి మూడేళ్ళల్లో నౌకాదళ విభాగానికి అత్యున్నతాధికారిగా, అనగా అడ్మిరల్‌గా పని చేశారు. సర్వీసు చివరి నెలలో త్రిదళాధిపతిగా నియమితులైనారు. కొచ్చిన్‌లో నావల్ అకాడమీని ఏర్పాటు చేయడం, ప్రతిష్ఠాత్మకమైన బియాస్ (వ్యాస్) నౌకతో భారత నౌకాదళాన్ని పటిష్ఠపరచటం, బంగ్లాదేశ్ ఏర్పడిన సందర్భంగా 1971 ఘటనల్లో, బంగ్లాదేశ్‌లో చిక్కుబడిన 93,000 మంది పాకిస్థాన్ సైనికులను తరలించుకు వెళ్లడానికి పాకిస్థాన్ నౌకాదళం చేసిన ప్రయత్నాన్ని అడ్డుకోవడంలో రాందాస్ కీలకంగా వ్యవహరించారు. నౌకాదళంలోని ఒక అధికారిగా ఆనాడు అలాంటి పాత్రను ఆయన పోషించినా, తర్వాత కాలంలో ఉపఖండంలో, ప్రత్యేకించి భారత పాకిస్థాన్‌ల నడుమ యుద్ధాలు వద్దని ఆయన బలంగా విశ్వసించటమే గాక బహిరంగంగా శాంతి సామరస్యాలను ప్రబోధించారు. 1996 నుంచి 2003 దాకా శాంతి ప్రజాస్వామ్యాల కోసం భారత పాకిస్తాన్ ప్రజా వేదిక (PIPFPD) నిర్వాహకులలో ఒకరిగా ఉంటూ దాని భారత విభాగానికి గౌరవాధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వహించారు. ఆ కాలంలో కలకత్తాలో (1996), బెంగళూరులో (2000), కరాచీలో (2003) జరిగిన ఆ వేదిక ఉమ్మడి సభలలో పాల్గొనే అవకాశం నాకు కూడా దొరికింది. కరాచీలో రాందాస్ గారితో ప్రత్యక్షంగా కొద్దిసేపు మాట్లాడగలిగాను.

నివాళి



అడ్మిరల్ రాందాస్ పదవీ విరమణ అనంతరం వివిధ ప్రజా సేవా కార్యకలాపాలలో పాల్గొన్నారు. అందులో ముఖ్యంగా చెప్పుకోదగినది 'శాంతి ప్రజాస్వామ్యాల కోసం భారత పాకిస్థాన్ ప్రజా వేదిక'లో చురుకైన పాత్రను నిర్వహించడం. సమస్త జీవన రంగాలలో భారత పాకిస్థాన్ ప్రజల నడుమ రాకపోకలకు అవకాశాలు సులువుగా ఉండేట్లు చేసి స్నేహ సుహృద్భావాలు పెరిగేట్లు చేయటం.

1933 సెప్టెంబర్ 5న బొంబాయిలో మాతుంగ ప్రాంతంలో జన్మించిన రాందాస్, ఢిల్లీలో చదువుకుంటూ పదహారేళ్ళ వయసుకే డెహ్రాడూన్‌లో సైనిక శిక్షణశాలలో చేరి, 1953లో భారత నౌకాదళంలో కమిషన్డ్ ఆఫీసర్‌గా పదవిని స్వీకరించారు. 1958–62 సంవత్సరాల నడుమ తొలి భారతీయ అడ్మిరల్ అయిన కటారి రాందాస్ కుమార్తె లలితతో 1961లో లక్ష్మీనారాయణ్ రాందాస్ వివాహం జరిగింది. వారి కుమార్తెలు కవిత, సాగరి, మల్లికలు. అందరూ వివిధ స్థాయిలలో సామాజిక కార్యకలాపాలలో నేటికీ పాల్గొనేవారే కావటం విశేషం. ఆయన అల్లుళ్లు ముగ్గురూ వేరువేరు మతాలకు చెందిన వారు కావటం మరొక విశేషం. అల్లుడు జుల్ఫికర్ అహ్మద్ ప్రకారం అడ్మిరల్ రాందాస్ ఒక ఫెమినిస్టు.

1984లో ఇందిరాగాంధీ హత్యానంతరం ఢిల్లీ మహానగరంలో సిక్కులపై ఉన్మాద పూరితంగా దమన, దహనకాండ జరిగిన సందర్భంలో రాందాస్ జీవిత సహచరి లలిత, బాధితులను ఆదుకోవడంలో, శాంతి సామరస్యాలు నెలకొల్పే కృషిలో చురుకైన పాత్ర నిర్వహించారు. ఆయన నౌకాదళ అధికారిగా ఉంటున్న ఆ రోజుల్లో భార్య లలితతో పాటు, స్వామి అగ్నివేష్‌తో సహా వచ్చి రక్షణ శాఖ వారు కేటాయించిన ఇంటిలో సమావేశాలు నిర్వహించుకుంటున్న 'నాగరిక్ ఏక్తా మంచ్' వారి శాంతి బృందాలను ఆయన ఏ మాత్రం నిరుత్సాహపరచలేదు. తన ఉద్యోగ భద్రతకు, ప్రమోషన్లకు ఎటువంటి ఆటంకం కలుగుతుందోనని రాందాస్ చూసుకోలేదు. ఆశ్చర్యం గొలిపే విషయం ఏమిటంటే ఆనాటి బాధితుల పక్షాన సహాయకులుగా నిలిచిన వారిని ఖలిస్తానీ ఉగ్రవాదులకు మద్దతు అందిస్తున్న జాతి ద్రోహులు అని కూడా ఎవరూ నిందించలేదు. ఆయన నౌకాదళ ప్రధాన అధికారి కావటానికి కొద్దినెలల ముందు, అమెరికాలో జీవిస్తున్న కూతురు కవిత, జుల్ఫికర్ అహ్మద్ అనే పాకిస్తానీ యువకుడిని పెళ్ళిచేసుకోవటానికి వారి కుటుంబం ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు.

అడ్మిరల్ రాందాస్ పదవీ విరమణ అనంతరం వివిధ ప్రజా సేవా కార్యకలాపాలలో పాల్గొన్నారు. అందులో ముఖ్యంగా చెప్పుకోదగినది 'శాంతి ప్రజాస్వామ్యాల కోసం భారత పాకిస్థాన్ ప్రజా వేదిక'లో చురుకైన పాత్రను నిర్వహించడం. సమస్త జీవన రంగాలలో భారత పాకిస్థాన్ ప్రజల నడుమ రాకపోకలకు అవకాశాలు సులువుగా ఉండేట్లు చేసి స్నేహ సుహృద్భావాలు పెరిగేట్లు చేయటం. ఉభయ దేశాలు రక్షణ రంగ బడ్జెట్లను తగ్గించుకుని, దానిని పేద ప్రజల అభివృద్ధికి వెచ్చించమని కోరటం. కశ్మీరు సమస్యను ఉభయదేశాల సమస్యగా మాత్రమే కాక, కశ్మీరీ ప్రజల జీవన్మరణ సమస్యగా కూడా పరిగణించి ప్రజాస్వామిక పరిష్కారం సాధించాలి అని తీర్మానించటం!

అణ్వాయుధాలు, అణు యుద్ధాలు కూడదని, ప్రత్యేకంగా భారత పాకిస్థాన్‌ల నడుమ అలాంటి ప్రయత్నాలు వద్దని ఆయన వివిధ వేదికల ద్వారా బలంగా వ్యక్తం చేశారు. కూడంకుళం అణు విద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా అక్కడి ప్రజలు సాగిస్తున్న పోరాటానికి మద్దతుని అందించారు. ఆ సందర్భంగా ఆయనకు రామన్ మెగసెసే పురస్కారం లభించింది.

2017లో వివిధ రంగాల్లో ప్రముఖులైన 200 మంది భారత పాకిస్థాన్ ప్రజల నడుమ సంబంధాలు మెరుగు కావాలని ఢిల్లీలో సమావేశమై చేసిన ప్రకటనలో రాందాస్ కూడా ఉన్నారు. రెండేళ్ళ క్రితం, 90వ ఏట అడుగిడనుండగా 2022 ఆగస్టులో 'ఆజాది – అమృత కాల్ – అచ్ఛే దిన్' అంశంపై ఆయన రాసిన వ్యాసంలో... చిన్ననాడు తాము ఆశించిన, ఆనాటి పెద్దలు హామీలు ఇచ్చిన, భారత రాజ్యాంగం నిర్దేశించిన ఆకాంక్షలు, లక్ష్యాలు, ఆదర్శాలు పూర్తిగా వమ్మయిన కాలంలో జీవిస్తున్నందుకు ఆయన ఎంతో ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ ఆయన ప్రజల మీద, భారత రాజ్యాంగంలోని ప్రజాస్వామిక విలువలకై పౌర సమాజం సాగించే కృషి మీద ఎలాంటి నిరాశను వ్యక్తం చేయకుండా ఊపిరి ఉన్నంతదాకా భవిష్యత్తుపై సానుకూల విశ్వాసంతోనే జీవించారు. ఆయనదొక విశిష్టమైన వ్యక్తిత్వం. ఉన్నతాధికార శ్రేణులలో అత్యంత అరుదైన వ్యక్తి. ప్రజలకు, వారి ఆకాంక్షలకు చేరువగా ఉండాలని కోరుకున్న ధీరోదాత్తుడు.

■ దివికుమార్
జనసాహితి

'శాంతి కోసం నీరు'

ప్రతి ఏటా మార్చి 22న ప్రపంచ జల దినోత్సవం జరుపుకుంటాము. ఇది మంచినీటి వనరుల ప్రాముఖ్యతను, వాటిని సుస్థిరంగా నిర్వహించాల్సిన అవసరాన్ని ప్రపంచానికి గుర్తు చేసే అంతర్జాతీయ దినోత్సవం. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమం, ప్రతి సంవత్సరం నీటికి సంబంధించిన విభిన్న అంశాన్ని వెలుగులోకి తెస్తుంది.

నీరు అనేది జీవనానికి అత్యంత కీలకమైన వనరు. భూమిపై జీవకోటి మనుగడకు ఇది ఆధారం. ప్రపంచ జల దినోత్సవం 2024 యొక్క థీమ్ 'శాంతి కోసం నీరు'. ప్రపంచ వ్యాప్తంగా శాంతి, స్థిరత్వంలో నీరు పోషించే కీలక పాత్రను ఈ అంశం ప్రముఖంగా చాటి చెబుతుంది. నీటి కొరత, కాలుష్యం తీవ్రమైన సామాజిక ఒత్తిళ్లకు, కొన్నిసార్లు హింసాత్మక ఘర్షణలకు కూడా దారితీస్తాయి. ఈ థీమ్, నీటి సమర్థవంతమైన నిర్వహణ ద్వారా సహకారాన్ని, శాంతి పునాదులను బలోపేతం చేయడం యొక్క అవసరాన్ని నొక్కి చెబుతుంది.



నీటి కొరత, కాలుష్యం వంటి సవాళ్లు సామాజిక ఒత్తిళ్లు పెరగడానికి దారితీసి, కొన్నిసార్లు హింసాత్మక ఘర్షణలకు కూడా కారణమవుతాయి. ప్రత్యేకించి సరిహద్దులను దాటి ప్రవహించే నదీ జలాల విషయంలో తరచుగా వివాదాలు తలెత్తుతుంటాయి. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 3 బిలియన్లకు పైగా ప్రజలు తమ పొరుగు దేశాలతో పంచుకునే నీటి వనరులపైనే ఆధారపడి ఉన్నారు. అయితే అటువంటి సహజ వనరులను కలిసి వినియోగించుకునే విషయంలో కేవలం 24 దేశాలు మాత్రమే సహకార ఒప్పందాలు కలిగి ఉన్నాయి. ఈ నేపథ్యంలో, నీటి పంపిణీలో న్యాయం, సమానత్వం, అలాగే ట్రాన్స్‌బౌండరీ నీటి సహకార వ్యవస్థలను బలోపేతం చేయడం ద్వారా నీటి వల్ల ఘర్షణలు చెలరేగకుండా నివారించవచ్చు.

నీటిని సుస్థిరంగా నిర్వహించడం ద్వారా, సహజ వనరుల పంపిణీలో పారదర్శకత, సహకారం పెంపొందించడం ద్వారా శాంతికి బలమైన పునాదిని సృష్టించవచ్చు. ట్రాన్స్‌బౌండరీ వాటర్ సహకార ఒప్పందాలు, ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టులు, జలాశయాల సమన్వయ నిర్వహణ వంటి వాటి ద్వారా వివిధ దేశాల మధ్య విశ్వాసాన్ని, అవగాహనను పెంపొందించవచ్చు. ప్రపంచ జల దినోత్సవం 2024 మనకు నీటిని సంఘర్షణకు కారణంగా కాకుండా, శాంతి, సహకార చిహ్నంగా మార్చాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు, పౌర సమాజం, వ్యక్తులకు నీటి విషయంలో సమష్టి బాధ్యత ఉంది. నీటి సవాళ్లను పరిష్కరించడం కోసం సరికొత్త సాంకేతికతలు, ప్రకృతి ఆధారిత పరిష్కారాలు, సుస్థిర నీటి నిర్వహణా పద్ధతులను ప్రోత్సహించడం ఎంతో అవసరం. ప్రతి ఒక్కరూ నీటి వినియోగంలో బాధ్యతాయుతంగా వ్యవహరించడం, నీటి పరిరక్షణలో తమవంతు పాత్ర పోషించడం ద్వారా శాంతి మరియు సుస్థిర భవిష్యత్తుకు దోహదపడవచ్చు. శాంతి, సమృద్ధి అనేవి అభివృద్ధికి, సుస్థిర ప్రపంచానికి అవసరమైన కీలక అంశాలు. ఈ లక్ష్యాలను సాధించడంలో నీరు ఒక శక్తివంతమైన సాధనం. ప్రపంచ జల దినోత్సవం 2024 యొక్క 'శాంతి కోసం నీరు' అనే థీమ్ మనకు ఈ విషయాన్ని స్పష్టంగా గుర్తు చేస్తుంది. సుస్థిర నీటి నిర్వహణ పద్ధతులు, సహకారంతో కూడిన సరిహద్దుల–అతీత నీటి నిర్వహణ, సంఘాల మధ్య విశ్వాసాన్ని పెంపొందించగలవు. తద్వారా శాంతియుత, సమృద్ధితో కూడిన ప్రపంచాన్ని సృష్టించుకోవడానికి వీలుకలుగుతుంది

– శ్రీధర్ ఫిజిక్స్

భ్రమయుగంలో కల్వకుంట్ల కుటుంబం!

'ప్రజలు రొట్టెలు (ఆహారం) కూడా దొరక్క ఇబ్బంది పడుతున్నారు,' అని ఓ సేవకురాలు ఇచ్చిన సమాచారానికి 18వ శతాబ్దంలో ఫ్రెంచ్ రాణి మేరీ అంటోనియేట్ ఇచ్చిన సమాధానం 'జనం కేకులు తినొచ్చు కదా', అని. 1789 జులై 14న బాస్టిల్ కోట గోడలు కూలి ఫ్రెంచ్ విప్లవం పతాక స్థాయికి చేరడానికి దారితీసిన కామెంట్ ఇదే!

మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగి కాళేశ్వరం ప్రాజెక్టు అస్తిత్వమే ప్రశ్నార్థకమైందని యావత్ తెలంగాణ సమాజం లక్షకోట్ల నష్టంపై ఆగ్రహంతో రగిలిపోతున్నవేళ, 'ఆ రెండు పిల్లర్లు బాగుచేస్తే సరి' అంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తాజాగా సెలవిచ్చారు. పైకి చూసేందుకు ఈ రెండు వేర్వేరు విషయాల మధ్య అంశంలోను, కాలంలోను ఎంతో తేడా అనిపించవచ్చు. కానీ ఈ రెండు సందర్భాల్లోనూ నాయకులు ఇచ్చిన జవాబుల వెనక మూలకారణం ఒక్కటే! అధికారం శాశ్వతం అనుకున్న ఇద్దరి గుండె లోతుల్లోంచి పుట్టుకొచ్చిన అహంకారం. మేరీ ఆంటోనియేట్ అధికారం కోల్పోయేముందు ఈ మాటలు అంటే కేసీఆర్ అధికారం కోల్పోయాక అన్నారు. అదీ ఇందులో విశేషం.

అధికారం కోల్పోయినా ఆత్మశోధన, స్వీయ సమీక్ష లేకుండా 'జనం తప్పు చేశారు, అత్యాశకు పోయారు' అని రాజకీయ ఉద్దండుడు కేసీఆర్ స్వయంగా అంటుంటే, ఆయన పుత్రుడు కల్వకుంట్ల తారక రామారావు, అల్లుడు హరీష్ రావు నోటి వెంట బాధ్యతాయుతమైన జవాబులు ఎలా వస్తాయి? లిక్కర్ కేసులో కేసీఆర్ కుమార్తె కవిత అరెస్ట్ అయినప్పుడు వారి ప్రవర్తనే అందుకు ప్రత్యక్ష సాక్ష్యం. వారి మాటల్లో, చేతల్లో అడుగడుగునా దర్పం. వారి కదలికల్లో, హావభావాల్లో ఇంకా అధికారంలో ఉన్నామనే భ్రమ కనిపిస్తోంది. భ్రమయుగంలో వారు బతికితే వారికే నష్టం. కానీ మొత్తం తెలంగాణ సమాజం తప్పు చేసిందన్న భ్రమల్లోకి మిగతావారిని నెట్టి వేయడానికి వారు చేస్తున్న ప్రయత్నాలు చూస్తూ ఊరుకుంటే మాత్రం ప్రమాదకరం. వారి ప్రయత్నాన్ని గుర్తించి సరైన సమయంలో ఆపకుంటే పదేళ్లపాటు అభివృద్ధి మాటున చేసిన విధ్వంసం, భయానక పరిస్థితులు మళ్లీ భవిష్యత్తులో తెలంగాణ నెత్తిన తాండవం చేస్తాయి.

అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చి 100 రోజులు అయింది. ఈ 100 రోజుల్లో ఒక్కసారైనా బీఆర్ఎస్ అధినాయకత్వం నోట చేసిన తప్పులకు క్షమాపణ మాట కాదు కదా కనీసం స్వీయ సమీక్ష, ఆత్మశోధనల ప్రస్తావనే లేదు. తెలంగాణ ఏర్పాటుకు ముందు నుంచి దళితుడికి సీఎం అన్న వాగ్దానం నుంచి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు దాకా అమలు కాని హామీలు ఎన్నో ఎన్నెన్నో. వాటి గురించి ప్రజలకు గుర్తు రాకుండా, గుర్తు లేకుండా చేయడానికి అన్నట్టు అధికార మార్పిడి జరిగిన రెండు రోజుల నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ వాగ్దానాల అమలు గురించి మాట్లాడుతూ 'వెంటాడుతాం వేటాడుతాం' అన్న భాష ప్రయోగించడంలో తండ్రి, కొడుకు, అల్లుడు పోటీపడ్డారు. కల్వకుంట్ల కుటుంబం ఎంత తెలివిగా వ్యవహరించినా ప్రజలు అంతకంటే తెలివిగానే ఉన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చి 100 రోజులు అయింది. ఈ 100 రోజుల్లో ఒక్కసారైనా బీఆర్ఎస్ అధినాయకత్వం నోట చేసిన తప్పులకు క్షమాపణ మాట కాదు కదా కనీసం స్వీయ సమీక్ష, ఆత్మశోధనల ప్రస్తావనే లేదు. వారి మాటల్లో, చేతల్లో అడుగడుగునా దర్పం. వారి కదలికల్లో, హావభావాల్లో ఇంకా అధికారంలో ఉన్నామనే భ్రమ కనిపిస్తోంది.



చివరకు బీఆర్ఎస్ నాయకులు సైతం తమ నాయకత్వం తీరుతెన్నులపై ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఒకప్పుడు లిక్కర్ స్కామ్ విచారణ కోసం ఢిల్లీ వెళ్లిన కవిత వెంట బీఆర్ఎస్ నాయకులు ఎందరున్నారు? ఇప్పుడు హైదరాబాద్ వేదికగా సాగిన అరెస్ట్ సమయంలో ఎంతమంది నాయకులున్నారు?

ఇంక ఎంపీలు, ఎమ్మెల్సీలు సహా వివిధ పదవుల్లో సాగుతున్న బీఆర్ఎస్ నాయకులు ఆ పార్టీని వదిలి అధికార కాంగ్రెస్ లేదా బీజేపీతో కలిసిపోవడానికి ఎంతగా ఆరాటపడుతున్నారో కళ్ళముందే కనిపిస్తోంది. దీనికి కారణం బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం మాత్రమే అని కల్వకుంట్ల కుటుంబం అనుకోవచ్చు కానీ కారణాలు అంతకుమించి ఉన్నాయి. పదేళ్ల పాలనలో ప్రతిపక్షం, ప్రెస్, అధికారులు, ప్రజలు సహా సొంత పార్టీ నాయకులకు కూడా కనీస గౌరవం ఇచ్చిన సందర్భం లేదు. బీఆర్ఎస్‌లో ఉంటూ తమ ఆత్మాభిమానాన్ని కల్వకుంట్ల కుటుంబ అహంకార రథచక్రాల కింద నుజ్జు నుజ్జు చేసుకున్న నాయకులకు కాస్త ఆలస్యంగా జ్ఞానోదయం అయ్యింది. అందుకే ఆ ఊరికి ఈ ఊరు ఎంత దూరమో ఈ ఊరికి ఆ ఊరు అంతే దూరం అన్న సత్యాన్ని గ్రహించి మునిగిపోయే నావలోంచి బయటకి వస్తున్నారు. ఇక ప్రజలు కూడా పదేళ్ల పాలనలో అభివృద్ధి మాటున జరిగిన విధ్వంసం ఏంటో బయటకు పుంఖానుపుంఖాలుగా వస్తుంటే ఆశ్చర్యపోతున్నారు.

వీళ్లందరి కన్నా ముఖ్యులు తెలంగాణ ఉద్యమకారులు. కేసీఆర్ రాజకీయ జీవితానికి, టీఆర్ఎస్‌కు పునాదివేసి కల్వకుంట్ల కుటుంబాన్ని ఊహించని ఎత్తుల్లో నిలబెట్టింది వాళ్లే! ఉద్యమ ఆరంభ సమయంలో సమాజ ఆకాంక్షల్ని తమ జీవిత లక్ష్యంగా మార్చుకున్న ఎందరో కేసీఆర్‌ను తమ చోదకశక్తిగా భావించారు. ఆయన్ను అనుక్షణం కాపాడారు. ఓ నాయకుడిగా కేసీఆర్ నుంచి ఏమీ ఆశించకపోగా వాళ్లే ఆయన కోసం ఎంతో చేశారు. కేసీఆర్ కార్ పెట్రోల్ ఖర్చు నుంచి విమానం టికెట్ల దాకా, టీఆర్ఎస్ కార్యాలయ కరెంటు బిల్లుల దాకా పెట్టుకున్న మాలాంటి వాళ్ళెందరో కాలక్రమంలో వారికి దూరమయ్యారు. ఆ స్థాయిలో అవసరాలు తీర్చినవాళ్ళు అధికారం వచ్చాక కేసీఆర్‌కు కనబడకుండా పోయారు. వారికి ఏదో అవసరం వచ్చి ఫోన్ చేసినప్పుడు సాయం చేయకపోవడం మాట అటు ఉంచి ఆ కాల్ ఎత్తిన సందర్భాలు కూడా లేవు. ఇలాంటి ఉద్యమకారులు కాలక్రమంలో తమని అవమానించిన కేసీఆర్ మీద తీవ్ర వ్యతిరేకత పెంచుకున్నారు. ఆ వందల మంది భావజాలం క్రమంగా తెలంగాణ సమాజాన్ని ఆవహించడానికి వారు ఎంతో కృషి చేశారు. కేసీఆర్ ఓటమికి ప్రధాన కారణం అయ్యారు. వారి స్థానంలో రాజకీయ, వ్యాపార అవకాశాల కోసం కేసీఆర్ దగ్గర చేరినవాళ్లు ఇప్పుడు అవే అవసరాల కోసం తలో దారి చూసుకుంటున్నారు. ఇప్పుడు కేసీఆర్ కుటుంబం ఉద్యమకారుల అండ కోసం చూస్తుంటే వాళ్లు ఛీ పొమ్మంటున్నారు. ఇదే కాల మహిమ!

కల్వకుంట్ల కుటుంబానికి స్వేచ్ఛ స్వాతంత్రం అన్న మాట అంటే ఏవగింపు అందుకు ఫోన్ ట్యాపింగ్ తిరుగులేని ఉదాహరణ. ప్రతిపక్ష పార్టీల నాయకులు, వ్యాపారులు, అధికారులు ఇలా అందరి వ్యక్తిత్వ జీవితాల్లోకి దూరేలా ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్నది పోలీస్ కస్టడీలో ఉన్న ప్రణీత్ రావు నోట వస్తున్న చేదు నిజాలు. ఇలా ప్రత్యర్థుల రహస్యాలు పూర్తిగా తెలుసుకొని అంగబలం దండిగా మెండుగా వాడినా బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారాన్ని కోల్పోయింది. అంటే ప్రజల్లో వారి పట్ల, వారి పాలన పట్ల ఎంత వ్యతిరేకత గూడుకట్టుకొని ఉందో అర్థమవుతుంది. ఈ ఫోన్ ట్యాపింగ్, ఆర్థిక బలం, అంగ బలం, అధికార బలం, లేకుంటే బీఆర్ఎస్‌కు కనీస గౌరవం కూడా దక్కేది కాదన్నది తిరుగులేని వాస్తవం.

ప్రజల్లో ఉదార స్వభావం ఏ కొద్దిమంది నాయకులకో లభించే వరం. కానీ ఆ ఉదారతను అమాయకత్వంగా తీసుకున్న కల్వకుంట్ల కుటుంబం ప్రతి అడుగు అధికార మత్తులో అహంకారపు ధోరణితో వేసింది. అధికారం శాశ్వతం అనే భ్రమల్లో బతుకుతూ ప్రజల్ని శాశ్వతంగా అమాయకత్వంలో ముంచేయగలమని నమ్మింది. కొంత మందిని కొన్నిసార్లు మోసం చేయగలం కానీ అందర్నీ అన్ని వేళలా మోసం చేయలేం అన్న నిజాన్ని వారు గ్రహిస్తే మంచిది. అది గుర్తుంచుకోకుండా ఇంకా భ్రమయుగంలో బతికేద్దాం అనుకుంటే అది కల్వకుంట్ల కుటుంబ ఇష్టం. ఈ ఆధునిక యుగంలోనూ భయం అనే ఆయుధంతో చరిత్రను పునరావృతం కాకుండా ఆపాలనుకునే వారికి చరిత్రే లేకుండా పోతుంది. చరిత్రపుటల్లో వారి పేజీ చిరిగిపోతుంది. ఇదే చరిత్ర చెప్పిన చేదునిజం, తిరుగులేని వాస్తవం. దీన్ని కల్వకుంట్ల కుటుంబం అర్థం చేసుకోలేకపోవడం నిజంగా ఆశ్చర్యకరం!

• యెన్నం శ్రీనివాస్ రెడ్డి
శాసనసభ్యులు, మహబూబ్‌నగర్

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.6 కనిష్ఠం 22.4

లైసెన్స్‌డ్ ఆయుధాలను స్వాధీనం చేయండి

హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో లైసెన్స్‌డ్ ఆయుధాలను కలిగి ఉన్న వారు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లలో వాటిని స్వాధీనం చేయాలని హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికలు ముగిసే వరకు కొత్త ఆయుధ లైసెన్స్‌ల జారీని నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ భూమిలో ప్రైవేటు రోడ్డు

- కలెక్టర్ అనుమతి లేకుండానే పనులు
- అక్రమమని తెలిసినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు



ప్రభుత్వ భూమిలో వెలిసిన రోడ్డు

నిజాంపేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వస్థలాలను పరిరక్షించాల్సిన వారు.. నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండడంతో అవి కబ్జాపరం అవుతున్నాయి. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో ఓ వ్యక్తి ప్రభుత్వభూమిని ఆక్రమించుకుని రోడ్డు వేయడమే అందుకు నిదర్శనం. నిజాంపేట్ కార్పొరేషన్, నిజాంపేట్ గ్రామంలోని సర్వే నంబరు 109లో 7.36 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. కొంతమంది స్థానిక నాయకులు ఆ భూమిపై తమకు సర్వ హక్కులున్నాయంటూ 25 ఏళ్ల క్రితం ప్లాట్లు చేసి విక్రయించినప్పటికీ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగానే ఉంది. గత ప్రభుత్వ హయాంలో ప్రస్తుత మేయర్ భర్తతో సహా చాలా మంది భవన నిర్మాణదారులు.. తమ వద్ద ఇతరుల నుంచి

మిగతా 8వ పేజీలో..

నీటి బొట్టు ఒడిసి పట్టు



- రోజుకు 2,560 మిలియన్ లీటర్ల సరఫరా
- వందల కిలోమీటర్ల దూరం వస్తున్న కృష్ణా, గోదావరి
- కిలో లీటర్‌కు రూ.45 ఖర్చు
- ఆదా చేయడం అందరి బాధ్యత

గ్రేటర్ హైదరాబాద్‌లో నీటి డిమాండ్ పెరుగుతోంది. వేసవి రాకముందే భూగర్భజలాలు పడిపోవడంతో ఇళ్లు, అపార్ట్‌మెంట్ల బోర్లు వట్టిపోయాయి. దాంతో వాటర్‌బోర్డు సరఫరా చేసే నీరే ఆధారంగా మారింది. ఎండలు ముదిరి నీటి అవసరాలు పెరిగినా.. ప్రస్తుతం వాటర్‌బోర్డు సరఫరా చేసే నీరు కంటే ఒక్క బొట్టు కూడా అధికంగా ఇచ్చే పరిస్థితి లేదు. ఈ సమయంలో ప్రతీ నీటిబొట్టును ఒడిసిపట్టాల్సిందే. నీటిని ఆదా చేయడం ప్రభుత్వాలదే కాదు.. మనందరి బాధ్యతకూడా. నేడు ప్రపంచనీటి దినోత్సవం సందర్భంగా గ్రేటర్‌లో నీటి సరఫరాపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

నేడు ప్రపంచ నీటి దినోత్సవం

నగరంలో పెరిగిన డిమాండ్

హైదరాబాద్ సిటీ, మార్చి21 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలో నివసించే కోటిన్నరకు పైగా జనాభాకు వాటర్‌బోర్డు రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తోంది. హైదరాబాద్‌కు ఒకనాడు జంటజలాశయాలైన ఉస్మాన్‌సాగర్ (గండిపేట), హిమాయత్‌సాగర్‌లు దాహార్తి తీర్చేవి. నేడు మహా నగరానికి జంట జలాశయాలు నీళ్లు సరిపోయే పరిస్థితి లేదు. దాంతో వందల కిలోమీటర్ల దూరం నుంచి కృష్ణా, గోదావరి, సింగూరు, మంజీర జలాలను నగరం నలువైపుల నుంచి తీసుకొచ్చి వాటర్ బోర్డు సరఫరా చేస్తోంది. రోజుకు 2,560 మిలియన్ లీటర్ల నీటిని తీసుకొచ్చి నగరవాసులకు అందిస్తున్నారు.

కిలో లీటర్‌కు రూ. 45 ఖర్చు

సుదూర ప్రాంతాల నుంచి భారీ మోటర్ల ద్వారా తీసుకొచ్చి, తాగేందుకు అనువుగా శుద్ధిచేసి సరఫరా చేసేందుకు కిలో లీటర్‌కు రూ. 45 వరకు ఖర్చవుతోంది. కానీ జీహెచ్ఎంసీ పరిధిలోని సుమారు ఐదు లక్షల గృహ కనెక్షన్లలో ఒక్కోదానికి నెలకు 20వేల లీటర్ల నీటిని ఉచితంగా అందిస్తోంది. మిగిలిన వారికి సబ్సిడీపై కిలో లీటర్‌కు రూ.7 (డొమెస్టిక్ కేటగిరి) మాత్రమే వసూలు చేస్తోంది. ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి వాటర్‌బోర్డు నీటిని అందిస్తుంటే, ఉచితంగా వచ్చిందే కదా అని కొందరు వృథా చేస్తున్నారు. నీటి వృథాను అరికట్టేందుకు నగరవాసులను చైతన్యం చేసే దిశగా వాటర్‌బోర్డు చర్యలు చేపట్టడం లేదు.

నీటిని ఆదా చేయండిలా..

- షవర్ కింద స్నానం చేస్తే 70 లీటర్ల నీరు వృథా అవుతుంది. అదే బకెట్ నీటితో స్నానం చేస్తే 40-50 లీటర్లు చాలు.
- పండ్లు, కూరగాయలను పాత్రలో పెట్టి నీటితో కడగాలి.
- ఇంట్లో వంటపాత్రలు, నల్లా కింద కాకుండా బకెట్‌లో నీళ్ల పట్టుకొని కడగాలి.
- బ్రష్ చేసి మొహం కడుక్కునేటప్పుడు, షేవింగ్ చేసుకునే సమయంలో ట్యాప్ విప్పి ఉంచకూడదు. ఆ ఐదు-పది నిమిషాల సమయంలో 15-17 లీటర్ల నీరు వృథాగా పోయే అవకాశం ఉంది.
- వాహనాలను పైపుతో గాకుండా బకెట్ నీళ్లతో శుభ్రపర్చాలి.
- మొక్కలకు కూడా నీళ్లను బకెట్‌తోనే పోయాలి.
- ఇంటి ప్రాంగణంలో ఇంకుడు గుంతను తవ్వి, వర్షపు నీరు వెళ్ళే విధంగా చర్యలు చేపట్టాలి.



లీకేజీలు అరికట్టే దిశగా వాటర్‌బోర్డు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

'తాగునీరు వృథా.. ఇంటింటికీ తప్పని వ్యథ!!' శీర్షికన ఈ నెల 19న 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై వాటర్‌బోర్డు స్పందించింది. ఎక్కడైనా పైపులైన్ల లీకేజీలు తలెత్తితే యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఎండీ ఆదేశించారు. మెరుగైన నీటి సరఫరాకు లీకేజీలను అరికడతామని, కాంట్రాక్టర్లను అప్రమత్తం చేస్తామని ఎండీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' కథనంలో ప్రస్తావించిన ప్రాంతాలను సందర్శించి లీకేజీలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని జీఎంలకు ఆదేశాలిచ్చారు. ప్రధానంగా మణికొండ సెక్షన్ పరిధిలో పైపులైన్ లీకేజీపై ఫిర్యాదు చేస్తే, టోకెన్ నంబర్ ఇచ్చి సమస్యను పరిష్కరించకుండా బోర్డును తప్పుదారి పట్టించడంపై సీరియస్ అయ్యారు. ఫిర్యాదుదారు నివాసాన్ని సందర్శించి నీటి లీకేజీని అరికట్టి సరఫరా చేయాలని ఆదేశాలిచ్చారు. ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద ట్యాంకర్లను నింపే సందర్భంలో నీరు వృథా పోకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

సెలవుల్లో వాటర్‌బోర్డు ఎండీ..

హైదరాబాద్ మహానగరానికి తాగునీటిని సరఫరా చేసే వాటర్‌బోర్డుకు ముఖ్యమైన అధికారిగా ఉన్న మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డి సెలవుల్లో వెళ్లారు. సోమవారం నుంచి విధులకు రావడం లేదు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు వినియోగదారులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు సైతం ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయానికి వచ్చి తిరిగి వెళ్తున్నారు. కొందరు ఎమ్మెల్యేలు, పలువురు కార్పొరేటర్లు కూడా వస్తున్నారు. ఎండీగా గతేడాది డిసెంబర్ 18న బాధ్యతలు తీసుకున్న సుదర్శన్‌రెడ్డి ఆ సందర్భంలోనే నెలరోజుల పాటు ఎన్నికల విధులపై సెలవుల్లో వెళ్లారు. అప్పట్లో ఇన్‌చార్జిగా ఎవరినీ నియమించకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. తాజాగా ఐదు రోజులకు పైగా సెలవు పెట్టారు. వేసవి నేపథ్యంలో, నీటి ఇబ్బందులు తలెత్తే సమయంలో ఎండీ సెలవుల్లో వెళ్లడం చర్చనీయాంశంగా మారింది.

జేఎన్‌టీయూలో 11మంది విద్యార్థుల సస్పెన్షన్

8

సికింద్రాబాద్ నుంచి దానం..

- మల్కాజిగిరికి సునీతా మహేందర్ రెడ్డి
- చేవెళ్లకు రంజిత్‌రెడ్డి
- ఎంపీ అభ్యర్థులను ఖరారు చేసిన కాంగ్రెస్




దానం నాగేందర్, సునీత మహేందర్ రెడ్డి, రంజిత్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలోని ఎంపీ అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. సికింద్రాబాద్ టికెట్‌ను దానం నాగేందర్‌కు, మల్కాజిగిరి సునీతామహేందర్ రెడ్డికి, చేవెళ్ల రంజిత్‌రెడ్డికి కేటాయించింది. వీరు ముగ్గురూ బీఆర్ఎస్ నుంచి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన వారే. ఇప్పటివరకూ ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన దానం.. ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ పార్టీలో కొనసాగి, తాజాగా సొంత గూటికి చేరారు.

కంటోన్మెంట్ అభ్యర్థి ఎవరు?

- ఉప ఎన్నికపై చర్చ



సికింద్రాబాద్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉపఎన్నిక అధికారపార్టీకి ప్రతిష్ఠాత్మకంగా మారింది. గ్రేటర్ హైదరాబాద్‌లో బోణీ కొట్టలేదన్న వెలితిని ఈ ఉప ఎన్నిక ద్వారా తీర్చుకోవాలని భావిస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే లాస్యనందిత మృతితో లోక్‌సభ ఎన్నికలతో పాటు మే 13వ తేదీన సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉపఎన్నిక జరగనుంది. బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాన్ని హస్తం ఖాతాలో వేసుకునేందుకు పార్టీ ఆపరేషన్ ఆకర్ష్‌కు తెర తీసింది. బీజేపీ నుంచి గత ఎన్నికల్లో పోటీచేసి రెండో స్థానంలో నిలిచిన ఎన్.శ్రీగణేష్‌ను కాంగ్రెస్‌లోకి చేర్చుకుంది.

టికెట్ కోసం గట్టి పోటీ

ఉప ఎన్నిక జరగనున్న కంటోన్మెంట్ టికెట్ కోసం కాంగ్రెస్‌లో గట్టి పోటీ నెలకొన్నది. గడిచిన ఎన్నికల్లో పోటీ చేసిన ప్రజాగాయకుడు గద్దర్ కుమార్తె వెన్నెల, కాంగ్రెస్ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, తాజాగా పార్టీలో చేరిన శ్రీగణేష్‌తోపాటు మరికొందరు రేసులో ఉన్నారు. మూడు నెలలుగా వెన్నెల ప్రజల్లో ఉన్నారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో కంటోన్మెంట్‌కు రావలసిన టీపీటీ బకాయిలు రూ.49 కోట్లకుపైగా విడుదల చేయించారని ఆమె అనుయాయులు చెబుతున్నారు. ఉప ఎన్నికలో వెన్నెలకే టికెట్ దక్కుతుందని

కండువాలు మారుతున్నాయ్..!

- ఎన్నికల వేళ పార్టీల మార్పు
- గ్రేటర్‌పై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి
- బీజేపీలోకి మాజీ మేయర్ కావ్య..?



దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్

హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల వేళ మహానగరంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. మొన్నటి వరకు కిక్కిరిసిన కారు క్రమేణా ఖాళీ అవుతోంది. ఓ ఎంపీ, ఓ ఎమ్మెల్యే, మాజీ మేయర్, పలువురు కార్పొరేటర్లు ఇప్పటికే బీఆర్ఎస్‌ను వీడగా.. తాజాగా ఓ కార్పొరేటర్ హస్తం గూటికి చేరారు.

మహానగరంపై కాంగ్రెస్ దృష్టి

గ్రేటర్‌లో వలసల రాజకీయం జోరందుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఖాతా తెరవని కాంగ్రెస్ మహానగరంపై ప్రత్యేక దృష్టి సారించింది. పార్టీ బలోపేతం లక్ష్యంగా ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులను చేర్చుకోవడంపై దృష్టి సారించింది. ఇప్పటికే పలువురు చేరగా.. ఇంకొందరితో సంప్రదింపులు జరుపుతున్నారు. బీఆర్ఎస్‌తోపాటు బీజేపీ కార్పొరేటర్లతోనూ కాంగ్రెస్ నేతలు చర్చలు జరుపుతున్నట్టు తెలిసింది. గతంలో టీడీపీలో పనిచేసిన కొందరు నాయకులు ప్రస్తుతం బీజేపీ కార్పొరేటర్లుగా ఉన్నారు. కొందరు కాంగ్రెస్ నాయకులూ ఇప్పుడు కాషాయ పార్టీలో కొనసాగుతున్నారు. వారిని తిరిగి హస్తం గూటికి తీసుకువచ్చే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఇద్దరు బీజేపీ కార్పొరేటర్లు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారు.

కౌన్సిల్‌లో పెరుగుతోన్న కాంగ్రెస్ బలం..

ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన సుజాతానాయక్ బీజేపీ నుంచి గెలుపొందారు అనంతరం ఆమె బీఆర్ఎస్‌లో చేరారు. సుజాతనాయక్ భర్త రాంచంద్ర నాయక్, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ క్లాస్‌మేట్స్ కావడంతో గతంలో సుజాత గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన అనంతరం తమను పట్టించుకోలేదన్న అసంతృప్తిని ఆమె పలుమార్లు వెల్లడించారు. అయినా తగిన గుర్తింపు దక్కకపోవడం.. స్థానిక ఎమ్మెల్యేతోనూ సత్సంబంధాలు లేని నేపథ్యంలో పార్టీ మారాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల ముందు, అనంతరం బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది కార్పొరేటర్లు హస్తం గూటికి చేరారు. సుజాత చేరికతో కౌన్సిల్‌లో కాంగ్రెస్ బలం 13కు చేరింది. త్వరలో ఇంకొందరు కార్పొరేటర్లు కారు దిగేందుకు సిద్ధంగా ఉన్నారని ఓ నాయకుడు చెబుతున్నారు.

శివార్లలోనూ అదే తీరు...

శివారు మునిసిపాల్టీలు, కార్పొరేషన్లలోనూ బీఆర్ఎస్ కార్పొరేటర్లు పార్టీ వీడుతున్నారు. జవహర్‌నగర్ మేయర్ పీఠం

మిగతా 8వ పేజీలో..

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్పొరేటర్

చంపాపేట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ (బీఆర్ఎస్) బానోతు సుజాతానాయక్ గురువారం గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీ, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు సమక్షంలో ఆమె కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం మాజీ చైర్మన్ ఈశ్వరమ్మయాదవ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, జీహెచ్ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

Shaan-e Ramazan
షాన్-ఎ రమజాన్
ఇఫ్తార్: 6:33
(శుక్రవారం సాయంత్రం)
సహర్: 4:56
(శనివారం ఉదయం)



కౌన్సెలింగ్‌లో మాట్లాడుతున్న షీ టీమ్స్ ఏసీపీ వెంకటేశం

వేధింపులకు గురయ్యే మహిళలు

నిర్భయంగా ఫిర్యాదు చేయండి

- షీటీమ్స్ డీసీపీ ఉషా విశ్వనాథ్
- 15 రోజుల్లో 121 మంది ఆకతాయిల ఆటకట్టు
- మెట్రోరైళ్లలో డెకాయ్ ఆపరేషన్స్

7

పొలిటికల్ హోలీ

- ఎన్నికల నేపథ్యంలో హంగామా
- ఈవెంట్ల ఏర్పాట్లలో మేనేజర్లు

హోలీ పండుగ సమీపిస్తోంది. నగరంలో వేడుకల హంగామా మొదలైంది. ఎప్పటిలాగానే పండుగ ఎప్పుడు అనేదానిపై సందిగ్ధత కొంతమందికి ఉన్నప్పటికీ, అధికారికంగా ఈ నెల 25న హోలీ జరుపుకొంటున్నారు. హోలీ అంటే రంగుల కేళే సంగతి ఎలాగున్నా, రెయిన్ డ్యాన్స్, డీజే, భంగ్.. సందడి వర్ణనాతీతం. అయితే ఈసారి వేడుకలలో పొలిటికల్ టచ్ కనిపించనుంది. ఎన్నికల నేపథ్యంలో హంగామా చేసేందుకు రాజకీయ నాయకులు సిద్ధం అవుతున్నారు.

హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ పండుగ రావడం, చిన్న అవకాశాన్నీ వదులుకోకూడదనే భావనలో రాజకీయ నాయకులు ఉండడంతో ఈసారి యూత్ వినూత్నమైన పండుగ అనుభూతులను పొందుతారని చెబుతున్నారు ఈవెంట్ మేనేజర్లు. అందుకే గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి హంగామా పెరిగిందంటున్నారు. కానీ ఈసారి పండుగ ఎక్స్‌టెండెడ్ వీకెండ్‌గా రావడంతో కొందరు ద్వారక సహా పలు ప్రాంతాలలో హోలీ చేసుకోవడానికి వెళ్తున్నారని వెల్లడించారు.

ఈవెంట్‌లు పెరిగాయి...

గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి హోలీ వేడుకల వేదికలు గణనీయంగానే పెరిగాయి. పలు కన్వెన్షన్ సెంటర్లలో నిర్వహించే వేడుకలతో పాటుగా రిసార్టులు, క్లబ్‌లలోనూ జరగనున్నాయి. సికింద్రాబాద్, మాదాపూర్, గండిపేట, సాగర్ రోడ్, గచ్చిబౌలి, శంషాబాద్, జూబ్లీహిల్స్ ఇలా ప్రతి చోటా ఏదో ఒక ఈవెంట్ జరుగబోతుంది. నగరంలో 50కు పైగా భారీ ఈవెంట్లు జరుగుతున్నాయని, గతంతో పోలిస్తే 30శాతం అదనమని ఓ ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ ప్రతినిధి శేఖర్ తెలిపారు. రాజకీయ పార్టీలతో సంబంధం ఉన్న వారు పలు కార్యక్రమాలను నిర్వహించనుండటం ఈసారి విశేషమన్నారు. లాఠ్ మార్ హోలీతో పాటుగా రెయిన్ డ్యాన్స్, పంజాబీ ఢోల్ వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. సెలబ్రిటీల హంగామా కూడా ఎక్కువగానే ఉండనుంది. బాలీవుడ్ సెలబ్రిటీ మెహక్ చాహల్, గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ లాంటి వారు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నారు.

ఎక్స్‌టెండెడ్ వీకెండ్‌తో టూర్లకు..

ఈసారి హోలీ పండుగ సోమవారం రావడంతో శని, ఆదివారాలు కూడా సెలవు కావడంతో ఎక్స్‌టెండెడ్ వీకెండ్ టూర్‌లకు ప్రణాళిక చేస్తున్నారు చాలామంది. మధుర, బృందావన్, ఆగ్రా, బర్సానా, జైపూర్ తదితర ప్రాంతాలకు వెళ్లడానికి ఆసక్తి చూపుతున్నారు. మరీముఖ్యంగా మధుర, బృందావన్‌లకు వెళ్లడానికి అమితాసక్తి చూపుతున్నారని, ముఖ్యంగా గుజరాతీ కమ్యూనిటీలు ఆ దిశగా చూస్తున్నాయన్నారు జైన్. ట్రెండీ పార్టీలను ఇష్టపడే వారు ఈ ప్రాంతాలతో పాటుగా గోవా, ఉదయ్‌పూర్, జైపూర్ లాంటి ప్రాంతాలకు వెళ్తున్నారు. కాగా, హోలీ నేపథ్యంలో నాంపల్లిలోని కార్మికులు చిలకల దండల (తీపి మిఠాయి) తయారీలో నిమగ్నమయ్యారు.



హోలీకి సిద్ధమవుతున్న చిలకలదండలు

బాటసింగారం రైతుసేవా సహకార సంఘం
చైర్మన్ విఠల్‌రెడ్డి ఔట్

● కోర్టు తీర్పుతో అవిశ్వాసం నెగ్గినట్టు ప్రకటించిన డీసీవో

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డిపై 9మంది సంఘం డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. దీంతో ఆయనను చైర్మన్ పదవి నుంచి తొలగిస్తూ డీసీవో ధాత్రిదేవి ఉత్తర్వులు జారీ చేశారు. నూతన చైర్మన్ ఎన్నిక జరిగే వరకు సంఘం వైస్ చైర్మన్ నార్లకొండ మల్లమ్మకు ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బాటసింగారం రైతుసేవా సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డిపై 9మంది సంఘం డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటిస్తూ ఫిబ్రవరి 8న సంతకాలతో కూడిన పత్రాన్ని డీసీవోకు అందజేసిన సంగతి తెలిసిందే. దీంతో జిల్లా సహకార అధికారి ఫిబ్రవరి 28న అవిశ్వాస బలపరీక్ష నిర్వహించారు. కాగా, చైర్మన్ విఠల్‌రెడ్డి అవిశ్వాసంపై హైకోర్టుకు వెళ్లారు. దీంతో కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ అవిశ్వాస బలపరీక్ష నిర్వహించినా ఫలితం వెల్లడించవద్దని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో అవిశ్వాసంపై చైర్మన్ విఠల్‌రెడ్డి వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేస్తూ గురువారం తీర్పునిచ్చింది. కేసు కొట్టివేసిన దృష్ట్యా తదుపరి చర్యలు తీసుకోవాలని డీసీవోకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారులు అవిశ్వాస పరీక్షలో విఠల్‌రెడ్డి ఓడిపోయినట్లు తెలిపారు.

నేడే బ్రహ్మాండమైన విడుదల



సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.15,2.30,6.15,9.30

SVC సంగీత ఎ/సి - ఆర్.సి.పురం 11.00,2.00,6.00,9.00	SVC ఈశ్వర్ ఎ/సి - అత్తాపూర్ 11.00,2.00,6.00,9.00
SVC శివశక్తి ఎ/సి - కాప్రా 11.00,2.00,6.00,9.00	SVC శ్రీలక్ష్మి/ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.00,2.00,6.00,9.00
రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00	శ్రీసాయిరాం 70ఎంఎం - మల్కాజ్‌గిరి 11.00,2.00,6.00,9.00

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 9.00,11.45,2.30,8.00,10.00	INOX జీవీకే... జీఎస్ఎమ్ - మదీనగూడ 10.20,1.30,4.40,7.50,10.50	శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 10.00,1.05,4.10,7.15,10.20
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 10.35,1.20,4.00,7.30,10.30	INOX నెక్లెస్ సత్య - కవాడిగూడ 10.00,1.10,4.20,7.30,10.40	సినిమాస్ - బాలానగర్ 10.00,1.05,4.10,7.15,10.20
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 10.20,1.30,4.40,7.50,11.00	INOX అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 10.00,1.10,4.20,7.30,10.40	సినిమాస్ - చందానగర్ 10.00,1.05,4.10,7.15,10.20
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 10.00,1.10,4.20,7.30,10.40	మంజీరామాల్ - కూకట్‌పల్లి 10.30,1.35,4.40,7.45,10.50	సినీటౌన్ - మియాపూర్ 10.20,1.25,4.30,7.35,10.40
PVR ఆర్.కె. - బంజారాహిల్స్ 10.20,1.30,4.40,7.50,11.00	సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి 10.30,1.35,4.40,7.45,10.50	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 10.20,1.25,4.30,7.35,10.40
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ 10.00,1.10,4.20,7.30,10.40	మంత్రామాల్ - అత్తాపూర్ 10.00,1.05,4.10,7.15,10.20	జీపీఆర్ మాల్ - కూకట్‌పల్లి 10.30,1.30,7.30,10.30
PVR గలేరియా - పంజాగుట్ట 10.05,1.10,4.20,7.30,10.40	సుధా - శాలిబండ 11.00,2.05,5.10,8.15,11.20	మూవీటైమ్ - అమీర్‌పేట 10.00,1.00,4.00,7.00,10.00
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ 10.20,1.30,4.40,7.50,11.00	డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ 10.00,1.05,4.10,7.15,10.20	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి 9.00,11.45,2.30,5.15,8.00,10.55
PVR పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ 10.10,1.20,4.30,7.40,10.50	ఏషియన్ సత్యం - అమీర్‌పేట 10.35,1.30,4.30,7.30,10.30	స్ప్రైమాల్ - సనత్‌నగర్ 11.00,4.00,10.00
PVR పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్ 10.00,1.10,4.20,7.30,10.40	ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం 10.50,1.45,4.40,7.35,10.30	టివోలి - సికింద్రాబాద్ 10.50,1.45,4.40,7.40,10.40
PVR ప్రెస్టేజ్‌మాల్ - గచ్చిబౌలి 10.10,1.20,4.30,7.40,10.50	సినీ ప్లానెట్ - కొంపల్లి 10.45,1.40,4.35,7.30,10.25	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ 11.00,1.50,4.45,7.30,10.35
PVR అట్రియమ్ - గచ్చిబౌలి 10.20,1.30,4.40,7.50,11.00	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 10.45,1.40,4.35,7.30,10.25	లక్ష్మీకళ - మూసాపేట్ 2.30,9.30
PVR ఎస్2 నోమ - మల్లాపూర్ 10.10,1.20,4.30,7.40,10.50	ఏషియన్ రాధిక - కాప్రా 10.45,1.40,4.35,7.30,10.25	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.15,6.00,9.15
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ 10.10,1.20,4.30,7.40,10.50	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్ 10.50,1.45,4.40,7.35,10.30	షా షహెన్‌షా - చింతల్ 11.15,2.30,6.15,9.30
INOX ఎం.పి మాల్ - కాచిగూడ 10.00,1.10,4.20,7.30,10.40	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 10.50,1.45,4.40,7.35,10.30	మూవీమ్యాక్స్ - మౌలాలి 10.30,1.30,4.30,7.30,10.30
		జె.పి.సినిమాస్ - చందానగర్ 10.45,1.40,4.35,7.30,10.25

వెంకటరమణ పద్మావతి - కాచిగూడ 11.00,6.00,9.00	గోకుల్ 70 ఎ/సి - ఎర్రగడ్డ 11.15,2.30,6.15,9.30	శ్రీ ప్రేమ 70 ఎ/సి - తుక్కుగూడ 11.00,2.00,6.00,9.00
తారకరామ 70ఎంఎం - కాచిగూడ 11.00,2.00,6.00,9.00	శ్రీదేవి 70 ఎ/సి - చిలకలగూడ 11.00,2.30,6.00,9.30	స్వప్న 70 ఎ/సి - కాటేదాన్ 11.00,2.15,6.00,9.15
భ్రమరాంబ ఎ/సి - కూకట్‌పల్లి 11.00,2.00,6.00,9.00	శ్రీ కృష్ణ 70 ఎ/సి - ఉప్పల్ 11.00,2.15,6.00,9.15	శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట 11.00,2.00,6.00,9.00
విశ్వనాథ్ ఎ/సి - కూకట్‌పల్లి 11.45,2.45,6.45,9.45	నర్తకి 70 ఎ/సి - అల్వాల్ 11.30,2.30,6.30,9.30	గణేష్ 70 ఎ/సి - శంషాబాద్ 11.15,2.15,6.15,9.15
శ్రీరాములు ఎ/సి - మూసాపేట్ 11.30,2.30,6.30,9.30	వైజయంతి 70 ఎ/సి - నాచారం 11.00,2.00,6.00,9.00	సంతోష్ 70 - ఇబ్రహీంపట్నం 11.00,2.00,6.00,9.00
తాట్కూరి కాంప్లెక్స్ - ఇ.సి.ఐ.ఎల్ 11.00,2.00,6.00,9.00	సాయిరంగ 70 ఎ/సి - మియాపూర్ 11.00,2.15,6.00,9.15	మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట 11.15,2.30,6.15,9.30
ప్రశాంత్ 70 ఎ/సి - సికింద్రాబాద్ 11.00,2.00,6.00,9.00	అలంకార్(ప్రతాప్) - లంగర్‌హౌస్ 11.00,2.00,6.00,9.00	SV సినీస్క్వేర్ 70 - పటాన్‌చెరు 11.00,2.00,6.00,9.00
రామకృష్ణ 70ఎంఎం - ఆబిడ్స్ 11.30,2.30,6.30,9.30	BR హైటెక్ - మాదాపూర్ 11.00,2.00,6.00,9.00	సాయిపూజా 70 - సూరారం 11.00,2.00,6.00,9.00
సంపూర్ణ 70 - వనస్థలిపురం 11.00,2.00,6.00,9.00	సూపర్ 70 ఎ/సి - బాలాపూర్ 11.15,2.15,6.15,9.15	ముకుంద్ 70 - మేడ్చల్ 11.00,2.00,6.00,9.00

వరంగల్
రాధిక ఎ/సి - వరంగల్
జెమిని కాంప్లెక్స్ - వరంగల్
ఎస్2 70 - వరంగల్
అమృత 70 - హన్మకొండ
శ్రీదేవి - హన్మకొండ
సూర్య క.మం. - మహబూబాబాద్

శ్రీనివాస 70 - పెద్దపల్లి
శ్రీరామ సినిమాస్ - సుల్తానాబాద్
SR శ్రీనివాస - మంథని
సాయికృష్ణ - మెట్‌పల్లి
లక్ష్మి 70 ఎ/సి - కోరుట్ల
అన్నపూర్ణ 70 - హుజూరాబాద్
మురళీ డీలక్స్ - జమ్మికుంట

తిరుమల - సూర్యాపేట
శ్రీనివాస - కోదాడ
విష్ణురాఘ సినిమాస్ - కోదాడ
మహేష్ 70 - దేవరకొండ
శ్రీనివాస 70 - చౌటుప్పల్
భద్రాద్రి 70 - భువనగిరి
వెంకటేశ్వర - నకిరేకల్

[illegible]

మన ఘన చరిత్రను ముందు తరాలకి తెలియచేద్దాం

విజయవంతమైన 2వ వారం



సంధ్య 70ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.15,6.00,9.15

రాజధాని 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
అర్జున్ 70 - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30
తారకరామ 70ఎంఎం - కాచిగూడ 11.15,2.15

లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ 11.20,6.20	రంగ 70 - జీడిమెట్ల 2.00,9.00	లక్ష్మి 70 ఎంఎం - శంషాబాద్ 11.30,2.30,6.00,9.00
మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట 2.30PM	అంజలి 70ఎంఎం - సికింద్రాబాద్ 11.00,2.15,6.00,9.15	శ్రీలక్ష్మి క.మం ఎ/సి - అల్వాల్ 11.00,2.00,6.00,9.00
తాట్కూరి కాంప్లెక్స్ - ఇ.సి.ఐ.ఎల్ 11.15,2.15,6.15,9.15	శ్రీకృష్ణ 70 ఎంఎం - అలియాబాద్ 11.00,2.00,6.00,9.00	మెట్రో 70ఎంఎం - బహదూర్‌పుర 11.00,2.00,6.00,9.00
సంపూర్ణ 70 - వనస్థలిపురం 2.15,9.15	స్వప్న 70 ఎ/సి - కాటేదాన్ 2.15,9.00	

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 3.15,8.30	ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం 10.40.4.20.7.30
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 12.20,7.15	సినీ ప్లానెట్ - కొంపల్లి 10.40,4.20,10.30
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 4.20,10.35	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 1.35,4.30,10.30
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 7.50,10.45	ఏషియన్ రాధిక - కాప్రా 1.15,10.30
PVR ఆర్.కె. - బంజారాహిల్స్ 7.00pm	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్ 1.20,7.35
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ 4.25pm	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 10.35,1.40,7.30,10.40
PVR గలేరియా - పంజాగుట్ట 4.25,10.50	శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 5.00,10.50
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ 11.00pm	సినిమాస్ - బాలానగర్ 10.50,5.00,10.50
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 1.15,7.40	సినిమాస్ - చందానగర్ 5.00,10.50
PVR పివిఆర్ - ముసారాంబాగ్ 4.25,10.50	సినీటౌన్ - మియాపూర్ 10.10pm
PVR ప్రెస్టేజ్‌మాల్ - గచ్చిబౌలి 10.40pm	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 12.30,6.45,10.00
PVR అట్రియమ్ - గచ్చిబౌలి 11.00pm	మూవీటైమ్ - అమీర్‌పేట 10.00pm
PVR ఎస్2 నోమ - మల్లాపూర్ 12.30,6.45,10.00	స్ప్రైమాల్ - సనత్‌నగర్ 10.30pm
INOX జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ 2.40pm	టివోలి - సికింద్రాబాద్ 5.00,10.30
INOX ఎం.పి మాల్ - కాచిగూడ 5.00pm	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ 4.45,10.30
INOX జీఎస్ఎమ్ - మదీనగూడ 2.15,10.00	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్ 9.15pm
INOX నెక్లెస్ సత్య - కవాడిగూడ 10.30,7.40	షా షహెన్‌షా - చింతల్ 9.30pm
INOX అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 10.40,7.10	లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ 11.15,2.45,6.15,9.45
మంజీరామాల్ - కూకట్‌పల్లి 10.20,7.30,10.30	మూవీమ్యాక్స్ - మౌలాలి 1.30,7.30
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి 4.15,10.20	జె.పి.సినిమాస్ - చందానగర్ 1.30,4.30,10.40
మంత్రామాల్ - అత్తాపూర్ 4.30,10.00	
సుధా - శాలిబండ 8.00,10.10	
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ 4.30,10.50	
ఏషియన్ సత్యం - అమీర్‌పేట 1.20,10.20	

వరంగల్
వెంకట్రామ 70 - వరంగల్
జెమిని 70 - వరంగల్
శ్రీకృష్ణ క.మం - జనగాం
ఆనంద్ - భూపాలపల్లి
కాకతీయ 70 - పరకాల
అశ్విని 70ఎంఎం - తొర్రూర్
లక్ష్మి ఎ/సి - మర్రిపెడ
లక్ష్మి ఎ/సి - మహబూబాబాద్

కిన్నెర 70 ఎ/సి - కోరుట్ల
సంగీత 70 - పెద్దపల్లి
శ్రీరాజరాజేశ్వర - వేములవాడ

నిజామాబాద్
విజయ 70 - నిజామాబాద్
వెంకటేశ్వర - బాన్సువాడ
పరమేశ్వర - బిచుకుంద
దర్శన్ 70 ఎ/సి - కామారెడ్డి

రమణ - నాగర్‌కర్నూల్
సత్యలక్ష్మి 70 - అచ్చంపేట
శ్రీమాధవ్ 70 - వనపర్తి

నల్గొండ
నటరాజ్ - నల్గొండ
రాఘవ - మిర్యాలగూడ
అలంకార్ 70 - సూర్యాపేట

తిరుమల ఎ/సి - నిర్మల్
వెంకటరమణ - కాగజ్‌నగర్
మహానంది - లక్సెట్టిపేట
కమల ఎ/సి - భైంసా
వెంకటేశ్వర - మంచిర్యాల

మెదక్
సినీమ్యాక్స్ 70 - మెదక్
శ్రీనివాస - సిద్దిపేట
నటరాజ్ - సంగారెడ్డి

[illegible]

BHUVANESHWARI PICTURES

విజయవంతమైన 3వ వారం



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00.2.15.6.00.9.15

ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.00,2.00,6.00,9.00

మల్లిఖార్జున 70ఎంఎం - కూకట్‌పల్లి 11.15,2.30,6.15,9.30	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 6.30,9.45	రంగ 70 - జీడిమెట్ల 11.00,6.00
మెగా 70ఎంఎం - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15	సినీటౌన్ - మియాపూర్ 7.50,11.00	మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట 11.00,6.00,9.00
వెంకటరమణపద్మావతి - కాచిగూడ 11.15,2.45	తాట్కూరి 70 - ఇ.సి.ఐ.ఎల్ 11.00,2.00,6.00,9.00	విజేత 70 ఎంఎం - బోరబండ 11.00,2.00,6.00,9.00
లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ 11.30,2.45,6.30,9.45	జ్యోతి 70 - ఆర్.సి.పురం 11.00,2.00,6.00,9.00	ఆరాధన 70 ఎంఎం - తార్నాక 11.00,2.00,6.00,9.00
టివోలి 70ఎంఎం - సికింద్రాబాద్ 1.50,10.30	సంపూర్ణ - వనస్థలిపురం 11.00,6.00	శివరంజని డీలక్స్ - ఇస్నాపూర్ 11.00,2.00,6.00,9.00

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 1.45,5.15,7.45,11.10	INOX ఎం.పి మాల్ - కాచిగూడ 3.40,10.40	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 10.35,1.40,4.30,7.40,10.45
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 10.00,1.00,4.05,10.15	INOX జీఎస్ఎమ్ - మదీనగూడ 10.40,7.15,10.30	శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 10.20,7.50,11.00
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 10.05,7.35,10.45	INOX నెక్లెస్ సత్య - కవాడిగూడ 12.30,7.00,10.20	సినిమాస్ - బాలానగర్ 10.20,7.50,11.00
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 10.00,1.15,4.30,7.45,11.00	INOX అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 1.25,7.35	సినిమాస్ - చందానగర్ 10.30,7.50,11.00
PVR ఆర్.కె. - బంజారాహిల్స్ 6.45,10.00	మంజీరామాల్ - కూకట్‌పల్లి 10.00,4.25,7.40	జీపీఆర్ మాల్ - కూకట్‌పల్లి 10.45,7.45,10.45
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ 10.00,7.05,10.50	సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి 11.00,5.00,11.00	మూవీటైమ్ - అమీర్‌పేట 5.00,10.30

[illegible]

విజయవంతమైన 3వ వారం



కోణార్క్ 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.15,6.00,9.15

లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ 2.45pm	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 1.40pm
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ 4.20pm	మూవీమ్యాక్స్ - మౌలాలి 3.30,9.30
ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం 10.45pm	జె.పి.సినిమాస్ - చందానగర్ 1.40pm

GLOBAL CINEMAS LLP

నేడే బ్రహ్మాండమైన విడుదల



శాంతి 70 ఎంఎం - నారాయణగూడ
11.00,2.00,6.00,9.00

లక్ష్మీకళ సినీప్రైడ్ ఎ/సి - మూసాపేట్ 11.15am

PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 10.20am	శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 11.00am
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 11.35am	సినిమాస్ - చందానగర్ 4.40pm
PVR ఎస్2 నోమ - మల్లాపూర్ 1.05pm	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 3.45pm
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 4.30pm	జె.పి.సినిమాస్ - చందానగర్ 7.15pm

శ్రీదేవి - హన్మకొండ	హరిహర 70 - జమ్మికుంట	వెంకటరమణ 70 - జడ్చర్ల
సత్య 70ఎంఎం - సూర్యాపేట	తిరుమల 70 - కరీంనగర్	పరమేశ్వరి 70 - కొత్తగూడెం
సత్యలక్ష్మి 70ఎంఎం - అచ్చంపేట	శ్రీదేవి 70ఎంఎం - కొత్తకోట	వాసవి 70ఎంఎం ఎ/సి - వైరా

కళారత్న మూవీస్ 7815971127 / 9848028739

నేడే బ్రహ్మాండమైన విడుదల



ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 10.30am	డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ 6.05pm
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 4.15pm	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ 7.15pm
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 8.00pm	సినీమార్ట్ - ఆర్.సి.పురం 1.15,10.30
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 5.30pm	సినీ ప్లానెట్ - కొంపల్లి 10.15pm
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ 3.20pm	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 10.30,7.15
PVR గలేరియా - పంజాగుట్ట 1.50pm	ఏషియన్ రాధిక - కాప్రా 4.30pm
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ 5.10pm	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 4.15pm
PVR పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ 4.50pm	శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 8.10pm
PVR పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్ 5.45pm	సినిమాస్ - బాలానగర్ 8.10pm
PVR ప్రెస్టేజ్‌మాల్ - గచ్చిబౌలి 7.40pm	సినిమాస్ - చందానగర్ 8.10pm
PVR అట్రియమ్ - గచ్చిబౌలి 4.50pm	జీపీఆర్ మాల్ - కూకట్‌పల్లి 1.15,7.15
PVR ఎస్2 నోమ - మల్లాపూర్ 7.15pm	మూవీటైమ్ - అమీర్‌పేట 8.00pm
INOX జీఎస్ఎమ్ - మదీనగూడ 4.30pm	స్ప్రైమాల్ - సనత్‌నగర్ 5.00pm
INOX నెక్లెస్ సత్య - కవాడిగూడ 10.50pm	లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ 6.15pm
INOX అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 2.00pm	జె.పి.సినిమాస్ - చందానగర్ 10.50,7.30
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి 4.55pm	

ఎస్2 - వరంగల్	శ్రీనివాస 70 - కరీంనగర్	వేణుమాల్ - నిజామాబాద్	జె.ఆర్ మాల్ - ఆర్మూర్
శ్రీదేవి మాల్ - హన్మకొండ	తిరుమల - సూర్యాపేట	గీతా - నిజామాబాద్	మురళీ సినిమాస్ - రాయచూర్

DISTRIBUTION BY PVR INOX PICTURES

రేపే బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 2.00pm
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

లక్ష్మీకళ సినీప్రైడ్ ఎ/సి - మూసాపేట్ 11.15am

PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 1.25pm	INOX జీఎస్ఎమ్ - మదీనగూడ 1.30pm
PVR ఎస్2నోమ - మల్లాపూర్ 1.15pm	INOX నెక్లెస్ సత్య - కవాడిగూడ 4.15pm

శ్రీకృష్ణ 70ఎంఎం ఎ/సి - అలియాబాద్ 11.00.2.00.6.00.9.00

ఎస్2 - వరంగల్	శివ సాయి 70ఎ/సి - విజా	నేషనల్ 70 ఎ/సి - కల్వకుర్తి	శ్రీనివాస 70 - హుజూర్‌నగర్
వెంకటేశ్వర 70 - కరీంనగర్	వేణుమాల్ - నిజామాబాద్	రామా 70ఎంఎం - వనపర్తి	వెంకటరమణ 70 - జడ్చర్ల
సాయిరాం 70 - ఖమ్మం	నటరాజ్ 70 - నిజామాబాద్	సినిమాస్ 70ఎంఎం - నల్గొండ	సాయిబాలాజీ 70 - శంకర్‌పల్లి
పరమేశ్వరి 70 - కొత్తగూడెం	వెంకటేశ్వర - మెహబూబ్‌నగర్	[illegible] 70 - గోదావరిఖని	కాకతీయ 70 - పరకాల
శ్రీనివాస 70 - నర్సాపూర్	భవాని 70 ఎ/సి - కొత్తకోట	భద్రాద్రి 70 - భువనగిరి	శ్రీనివాస 70 - జగిత్యాల
			సూర్య క.మం - నెక్కొండ

NTR CINEMAS 9030161717

విజయవంతమైన 2వ వారం



PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 5.00pm
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 11.30am
జీపీఆర్ మాల్ - కూకట్‌పల్లి 5.00pm
లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ 6.15pm
తిరందాస్ 70ఎంఎం ఎ/సి - కరీంనగర్
శ్రీరామ 70ఎంఎం ఎ/సి - జగిత్యాల
శాంతి 70ఎంఎం ఎ/సి - పాల్వంచ
స్వర్ణ క.మం 70ఎంఎం - జనగాం

NAVODAYA PICTURES 9505093322, 9848028739

నేడే చూడండి



సప్తగిరి 70 - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.00,6.00,9.00
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 1.45pm	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ 10.40am
PVR గలేరియా - పంజాగుట్ట 7.35pm	ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం 10.35,4.25
PVR పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ 1.05pm	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 10.40,4.25
PVR పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్ 1.05pm	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్ 10.50am
INOX జీఎస్ఎమ్ - మదీనగూడ 4.20pm	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 4.40pm
INOX నెక్లెస్ సత్య - కవాడిగూడ 1.00pm	మూవీటైమ్ - అమీర్‌పేట 2.00pm
మంజీరామాల్ - కూకట్‌పల్లి 12.00pm	స్ప్రైమాల్ - సనత్‌నగర్ 10.35pm
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి 1.50pm	లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ 9.50am
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ 2.50pm	జె.పి.సినిమాస్ - చందానగర్ 10.20,1.30,10.35

VAISHNAVI ARTS 8801447725

రేపే బ్రహ్మాండమైన విడుదల



ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 10.15am	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ 4.20pm
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 1.35pm	ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం 4.40pm
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 2.10pm	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 1.25pm
PVR ఆర్.కె. - బంజారాహిల్స్ 2.00pm	ఏషియన్ రాధిక - కాప్రా 7.30pm
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ 1.35pm	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 10.35pm
PVR గలేరియా - పంజాగుట్ట 4.15pm	శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 5.00pm
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ 5.05pm	సినిమాస్ - బాలానగర్ 10.40pm
PVR పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ 2.10pm	సినిమాస్ - చందానగర్ 2.15pm
PVR పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్ 8.00pm	లక్ష్మీనరసింహ - మియాపూర్ 4.50pm
PVR ప్రెస్టేజ్‌మాల్ - గచ్చిబౌలి 1.10pm	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 8.20pm
PVR అట్రియమ్ - గచ్చిబౌలి 2.05pm	జీపీఆర్ - కూకట్‌పల్లి 10.30am
PVR ఎస్2 నోమ - మల్లాపూర్ 1.25pm	జె.పి.సినిమాస్ - చందానగర్ 1.20pm

ఎస్2 - వరంగల్	వేణుమాల్ - నిజామాబాద్	సినిమాస్ - ఆర్మూర్	మురళీ ఎ/సి - రాయచూర్

నేడే చూడండి



లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ 2.45PM

మెట్రో - బహదూర్‌పుర 11.30,2.30,6.00,9.00
వెంకటేశ్వర - గుమ్మడిదల 11.00,2.00,6.00,9.00

సినీ ప్లానెట్ - కొంపల్లి 4.50PM	PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 5.05PM
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 4.40PM	PVR పివిఆర్ - ముసారాంబాగ్ 8.25PM
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 11.30AM	INOX జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ 8.00PM
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 8.05PM	INOX జీఎస్ఎమ్ - మదీనగూడ 1.45PM
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ 8.25PM	INOX నెక్లెస్ సత్య - కవాడిగూడ 10.30PM
PVR గలేరియా - పంజాగుట్ట 8.15PM	INOX అశోక - కూకట్‌పల్లి వై జంక్షన్ 4.55PM

ఎస్2 - వరంగల్	శ్రీనివాస - [illegible]	వేణుమాల్ - [illegible]	రామకృష్ణ - [illegible]	వెంకటేశ్వర - [illegible]	తనీష - కొంపల్లి
శ్రీదేవి - హన్మకొండ	తిరుమల - [illegible]	సినిమాస్ - ఆర్మూర్	శ్రీనివాస - [illegible]	వెంకటేశ్వర - [illegible]	సాయిబాలాజీ - [illegible]
శ్రీనివాస - ఖమ్మం	గీతా - నిజామాబాద్	[illegible]	శివం - [illegible]	దుర్గ - [illegible]	[illegible]

TIGER HILLS PRODUCATION 9989522999



అవిశ్వాస తీర్మానం కాపీ అందుకుంటున్న డిప్యూటీ మేయర్

నెగ్గిన అవిశ్వాస తీర్మానం

● మేయర్‌కు వ్యతిరేకంగా ఓటేసిన 16 మంది కార్పొరేటర్లు

నార్సింగ్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడ మేయర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ప్రస్తుత మేయర్‌కు వ్యతిరేకంగా 16 మంది కార్పొరేటర్లు ఓటు వేశారు. గురువారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బలపరీక్ష నిర్వహించారు. అవిశ్వాస తీర్మాన సమావేశంలో ముందుగా నాలుగో వార్డ్ కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి, 16వ వార్డు కార్పొరేటర్ పుష్పలత శ్రీనివాస్‌రెడ్డి ప్రస్తుత మేయర్‌కు అనుకూలంగా ఓటేశారు. మేయర్‌కు వ్యతిరేకంగా 14 మంది కార్పొరేటర్లు చేతులు ఎత్తి ఓటేశారు. మేయర్‌గా 17వ వార్డుకు చెందిన లతాప్రేమ్‌గౌడ్‌ను ఎన్నుకోవడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. కలెక్టర్ తేదీ ప్రకటించిన తర్వాత బండ్లగూడ జాగీర్ మున్సిపల్ మొదటి మహిళా మేయర్‌గా ఎన్నుకోనున్నట్టు తెలుస్తున్నది.



రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, ఐలయ్య

కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

అఫ్జల్‌గంజ్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న కురుమ కులస్థులకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి తమ కులాభివృద్ధికి కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కోరారు. గురువారం క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని.. ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యెగ్గె మల్లేశం మాట్లాడుతూ... ఇటీవల విడుదల చేసిన కార్పొరేషన్‌లలో గొల్ల, కురమలను కలిపి కార్పొరేషన్‌ను ప్రకటించారని.. అయితే రాష్ట్రంలో అత్యధికంగా కురుమ కులస్తులు ఉన్నారని.. తాము బీసీ-బీ సీరియల్ నంబర్-11 ఉండగా.. యాదవులు బీసీ-డీ 33లోకి వస్తారని గుర్తు చేశారు. కురుమ కులస్థులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో, అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతారని ఆయన తెలిపారు. కోకాపేటలో దొడ్డి కొమురయ్య కురుమల ఆత్మగౌరవ భవనానికి సంబంధించి ఇంకా కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి ప్రత్యేక నిధులను విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరినట్లు వారు పేర్కొన్నారు. సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు.

సీఎంకు మెమెంటో అందజేసిన పారిజాత

పహాడిషరీఫ్, మార్చి, 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డిని గురువారం ఆయన నివాసంలో బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డి దంపతులు కలిశారు. సీఎంకు శాలువా కప్పి మెమొంటో అందజేశారు.

సీఎం రేవంత్‌ను కలిసిన మెట్టు సాయికుమార్

అఫ్జల్‌గంజ్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మత్స్యకార పారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయి కుమార్ క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం సాయికుమార్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి పాటుపడిన ప్రతీ కాంగ్రెస్ కార్యకర్తకు ఎల్లప్పుడు సముచిత స్థానం లభిస్తుందనడానికి తానే ఉదాహరణ అన్నారు.



మార్కండేయనగర్‌లో కుష్టు లక్షణాలపై సర్వే చేస్తున్న డాక్టర్ అరుణ

కుష్టు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

రాజేంద్రనగర్, మార్చి21(ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధిపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని రంగారెడ్డి జిల్లా లెప్రసీ ఆఫీసర్ డాక్టర్ అరుణ చెప్పారు. రాజేంద్ర నగర్ సర్కిల్ శివరాంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఇంటింటికి తిరిగి సర్వే చేశారు. మైలార్‌దేవుపల్లి డివిజన్ మార్కండేయనగర్ బస్తీలో జరిగిన సర్వేను డాక్టర్ అరుణ పరిశీలించి మాట్లాడారు. కుష్టు వ్యాధి మైక్రోబ్యాక్టీరియా లెప్రీ అనే క్రిమి ద్వారా సంక్రమిస్తుందన్నారు. ముఖం నూనెగా ఉండటం, చెవి తమ్మెలు మందంగా మారడం, చర్మంపై స్పర్శలేని మచ్చలు, చేతులు, కాళ్లతో తిమ్మిర్లు, వేళ్లలో పట్టుకోల్పోవడం, కళ్లు సరిగా మూయకపోవడం, అరికాళ్లలో నొప్పిలేని పుండ్లు కుష్టు లక్షణాలని తెలిపారు. ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి సర్వే చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పారామెడికల్ ఆఫీసర్ సులోచన, లెప్రసీ నోడల్ పర్సన్ గౌరీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ట్రాఫిక్ పోలీసులకు వినతిపత్రం అందజేస్తున్న ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు

ప్రధాన కూడళ్లలో ఆటో కార్మికులకు అడ్డా ఏర్పాటు చేయాలి

రాజేంద్రనగర్, మార్చి21(ఆంధ్రజ్యోతి): ప్రధాన కూడళ్లలో ఆటోలు నిలబెట్టుకోవడానికి అడ్డా(పార్కింగ్ సదుపాయం) ఏర్పాటు చేయాలని రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు కోరారు. ఆరాంఘర్ చౌరస్తా నుంచి మెహిదీపట్నం వరకు రోజూ ఆటోలు నడుపుతున్నామని, ఆయా సందర్భాలలో ఆటోలు నిలబెట్టుకోవడానికి, కొంతసేపు సేదతీరడానికి ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. సీఐటీయూ అనుబంధ సంస్థ అయిన రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు గురువారం రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులను కలసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్, రంగారెడ్డి జిల్లా రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ కార్యదర్శి జె.రుద్రకుమార్, ఎండీ ఇమ్రాన్, ఎస్.రాజు, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీలో ఆధ్యాత్మిక శోభ

మారిన ముస్లింల దినచర్య

మదీన/ చాంద్రాయణగుట్ట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం ఉపవాసదీక్షలను పురస్కరించుకుని పాతబస్తీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. బార్కస్ తదితర బస్తీల్లో ముస్లింల ఆహారపు అలవాట్లు పూర్తిగా మారిపోయాయి. రంజాన్ ప్రారంభమైనప్పటి నుంచి ముస్లింల దినచర్య మారింది. తమ రోజువారీ కార్యకలాపాలకు స్వస్తి చెప్పి ఆధ్యాత్మిక చింతనలో గడుపుతున్నారు. మోడ్రన్ దుస్తులకు స్వస్తి చెప్పి సంప్రదాయ దుస్తులైన కుర్తా పైజామాలను ధరిస్తున్నారు. నెత్తిన టోపీ తెల్లటి కుర్తా పైజామా ధరించి ఆయా ప్రాంతాల్లోని మసీదులకు వచ్చి రోజూ ఐదు పూటలా నమాజు ఆచరిస్తున్నారు. తెల్లవారుజామున 3 గంటలకే నిద్రలేచి సహరీతో ఉపవాస దీక్షను ప్రారంభించి సాయంత్రం ఇఫ్తార్‌తో దీక్షను ముగిస్తున్నారు.



మక్కా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఇఫ్తార్ విందులు

ఇఫ్తార్ విందులు పెద్దఎత్తున జరుగుతున్నాయి. ఉపవాసం పాటించేవారు సాయంత్రం ఉపవాస దీక్ష విరమించి ఆహార పదార్థాలను స్వీకరించడాన్ని ఇఫ్తార్ అంటారు. మజ్లిస్ ఎమ్మెల్యేలు, ఎంపీ నిత్యం ఏదో ఒకచోట ఇఫ్తార్ విందులలో పాల్గొంటున్నారు. వారితోపాటు రాజకీయాలకు అతీతంగా నిత్యం గల్లిగల్లీలో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసి పరియస్తులను, స్నేహితులను ఆహ్వానిస్తున్నారు.

జోరుగా హలీం విక్రయాలు

రంజాన్ అనగానే ప్రతీ ఒక్కరికి గుర్తుకు వచ్చేది హలీం. రోజంతా ఉపవాస దీక్షను పాటించేవారు సాయంత్రం ఉపవాసం విరమించడం ముస్లింల ఆనవాయితీ. రోజంతా ఉపవాసం ఉండడం వలన కడుపు ఖాళీగా ఉంటుంది. సాయంత్రం దీక్ష విరమించిన అనంతరం ముస్లింలు తక్షణ శక్తిని ఇచ్చే హలీంను తీసుకుంటారు. దాంతో సాయంత్రం కాగానే మసీదుల వద్ద హలీం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ముస్లింలతోపాటు స్థానికులు హలీం కొనగోలు చేసి ఇంటికి తీసుకువెళ్తున్నారు.

పండ్ల విక్రయాలు..

ఉపవాస దీక్ష విరమించే సమయంలో తప్పనిసరిగా పండ్లు తింటుంటారు. దీంతో పండ్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సాయంత్రం 3 గంటల నుంచే రోడ్లపై పండ్ల కొనుగోలు దారులతె కిక్కిరిసి పోతున్నాయి.

దేశ ఆర్థికాభివృద్ధిలో మహిళలదే కీలక పాత్ర

చార్మినార్ మార్చి 21 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థికాభివృద్ధిలో మహిళలదే కీలకపాత్ర అని ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యా విభాగం సంచాలకులు జీవీ రెడ్డి అన్నారు. ప్రభుత్వ సిటీ కాలేజీ మహిళా సాధికార విభాగం, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో సిటీ కాలేజీలో 'సామజిక సమ్మిళత అభివృద్ధి, మహిళల పాత్ర' మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైనది. ముఖ్యఅతిథిగా హాజరైన జీవి రెడ్డి మాట్లాడుతూ స్త్రీ, పురుషుల మధ్య అసమానతలు తొలగిపోయినపుడే ఆదర్శ సమాజం ఏర్పడుతుందన్నారు. మానవ జీవితాన్ని మహోన్నతంగా నిర్మించడంలో మహిళలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారన్నారు. దేశ ఆర్థిక సాధికారత మహిళలపైనే ఆధారపడి ఉన్నదని విశ్లేషించారు. రాజకీయ రంగంలో మహిళలు రాణించేందుకు ప్రోత్సాహం అందించాలని సూచించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న వ్యవసాయ విశ్వవిద్యాలయం పూర్వ



పరిశోధనా పత్రాల సంచికను ఆవిష్కరిస్తున్న అతిథులు

ఆచార్యులు డా.విజయ ఖాదర్ మాట్లాడుతూ దేశంలో గ్రామం నుంచి జాతీయస్థాయి వరకూ విధానపరమైన నిర్ణయాలు తీసుకునే కీలక సంఘాల్లో మహిళలకు అత్యధిక ప్రాతినిధ్యం ఉండాలని సూచించారు. ప్రముఖ శాస్త్రవేత్త కైసర్ జమీల్ మాట్లాడుతూ మహిళా ప్రగతితోనే సామాజిక సమ్మిళిత ప్రగతి ఆధారపడి ఉంటుందన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యులు డా.పి.పి. రెడ్డి మాట్లాడుతూ మహిళలకు కేవలం 30 శాతం రిజర్వేషన్ సరిపోదని, వారి శక్తిసామర్థ్యాలను బట్టి ఎక్కువ అవకాశాలు, ప్రత్యేక ప్రోత్సాహకాలు సమకూర్చాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యక్ష, పరోక్ష పద్ధతుల్లో జరుగుతున్న ఈ అంతర్జాతీయ సదస్సులో కేంద్ర కుటుంబ సంక్షేమ శాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్.యం అనురాధ కీలకోపన్యాసం చేశారు. సిటీ కళాశాల ప్రిన్సిపాల్ పి.బాలభాస్కర్ మాడుతూ మహిళల వికాసానికి జాతీయ సదస్సులు సిటీ కళాశాలలో తరచూ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సదస్సు సంచాలకులు డా.వి.శ్రీదేవి అంతర్జాతీయ సదస్సు ఆవశ్యకతను వివరించారు. సభలో వివిధ కళాశాలల, విశ్వవిద్యాలయాల ఆచార్యులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. పరిశోధనా పత్రాలతో కూడిన ప్రత్యేక సంచికను ఈ సందర్భంగా ఆచార్య జీ.వి.రెడ్డి ఆవిష్కరించారు. అతిథులను ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ సత్కరించారు. డా. ఈశ్వరయ్య, డా.బెల్లి యాదయ్య, డా.లక్ష్మి తదితరులు ప్రసంగించారు.

ప్రధాని మోదీ అత్యంత శక్తివంతుడు: విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): భారతదేశ ప్రధాని నరేంద్రమోదీ అత్యంత శక్తివంతుడు అని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చెప్పారు. గురువారం శంకర్‌పల్లి మండలం, సంకేపల్లి గ్రామ మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, భద్రయ్యలతోపాటు వారి అనుచరులు, ప్రజాప్రతినిధులు విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతో అన్నివర్గాల ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అందాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగరవేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకుల మాటలను ప్రజలు నమ్మొద్దని సూచించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో చేవెళ్ల ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు.

దేశ సంక్షేమం కోసం మరోమరు ప్రజలు బీజేపీ పార్టీని ఆశీర్వాదించాలని కోరారు. బీజేపీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు ముందుకు సాగాలని పిలుపునిచారు. ప్రజాసేవ లక్ష్యంగా ప్రజల ముందుకు వస్తున్నట్లు చెప్పారు. పార్టీలో చేరిన వారికి మంచి గుర్తింపు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం, అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, సంకెపల్లి మాజీ సర్పంచ్ పరమేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు రమేశ్, ప్రభాకర్‌రెడ్డి, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు వైభవ్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అడవులను కాపాడుకోవాలి

రవీంద్రభారతి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పర్యవరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉంటుందని ప్రిన్సిపల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సీఈఓ డా. సువర్ణ అన్నారు. అంతర్జాతీయ అటవీ దినోత్సవం పురస్కరించుకొని అడవుల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ యువ క్లౌడ్ ఫొటోగ్రాఫర్ యూనుస్ ఫర్హాన్ తీసిన మేఘాల చిత్రాలతో కూడిన పోస్టర్‌ను గురువారం అటవీశాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా.సువర్ణ మాట్లాడుతూ అడవులను కాపాడుకుంటేనే పర్యావరణం రక్షించబడుతుందని అన్నారు. మేఘాల్లోని సందేశాన్ని తన కెమెరాల్లో బంధిస్తున్న యూనుస్ ఫర్హాన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

అడవులను కాపాడేందుకు అవగాహన కల్పించడం అభినందనీయమని అన్నారు. దీంతోపాటు పీసీసీఎఫ్ చీఫ్ వైల్డ్ వార్డన్ ఐఎఫ్ఎస్ మోమన్ పర్గేన్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణల చేతుల మీదుగా ఈ పోస్టర్‌ను ఆవిష్కరించినట్లు యూనుస్ ఫర్హాన్ తెలిపారు. అడవులను కాపాడడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు.

'భారత ప్రజాస్వామ్యంపై బీజేపీ దాడి'

హైదరాబాద్, మార్చి21(ఆంధ్రజ్యోతి): భారత ప్రజాస్వామ్యంపై బీజేపీ రకరకాలుగా దాడులకు పాల్పడుతోందని మహిళా కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీని ఆర్థికంగా కృంగదీయడానికి ప్రధాని మోదీ కుట్ర చేస్తున్నారని విమర్శించారు. గురువారం గాంధీ భవన్‌లో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అదితిస్వప్న, ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీకాంత్‌గౌడ్, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షురాలు పుస్తకాల కవిత తదితరులు విలేకరులతో మాట్లాడుతూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్రకు ప్రజల నుంచి వచ్చిన విశేష స్పందనను చూసి ఓర్వలేక బీజేపీ ప్రభుత్వం కుట్రలకు తెరలేపిందని మండిపడ్డారు. పార్టీకి ప్రజల నుంచి వచ్చిన విరాళాల ఖాతాను స్తంభింపచేస్తోందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు డబ్బు, వనరుల కొరతను సృష్టించి కాంగ్రెస్ ఎన్నికల్లో పోటీ చేయకుండా బీజేపీ రచ్చ చేస్తోందని ఆరోపించారు. ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయకూడదని హితవు వారు పలికారు. బీజేపీ ఎన్ని అరాచకాలు సృష్టించినా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక సీట్లతో విజయం సాధించి రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమన్నారు. గాంధీభవన్ ఎదుట మహిళా కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మట్టి కుప్పను తొలగించండి

చాంద్రాయణగుట్ట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మట్టికుప్పను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. గౌలిపురా డివిజన్, శ్రీరాంనగర్ కాలనీ వద్ద ఛత్రినాక సెక్షన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న మట్టిని తీసి అక్కడే ఓ పక్కన కుప్పగా పోసి వదిలేశారు. మట్టినే అలాగే వదిలివేస్తే రాకపోకలు ఇబ్బందులు వస్తాయని, సంబంధిత అధికారులు వెంటనే మట్టి కుప్పను తొలగించండని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మట్టికుప్ప



ఇందిర ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రవీంద్రభారతిలో పలు రంగాల ప్రతిభావంతులకు పురస్కారాలు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా కవి, గాయకుడు డా.ఆలూరి విల్సన్‌కు హరివిల్లు పురస్కారం అందజేశారు. సినీనటుడు మాణిక్, సంస్థ అధ్యక్షురాలు డా.ఇందిర, సిటీ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ అంజనీ, నటి శ్రీజ సాధినేని తదితరులు పాల్గొని డా.ఆలూరి విల్సన్‌ను సత్కరించి అభినందించారు.

- (రవీంద్రభారతి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి)

శాస్త్ర సాంకేతిక పరిశోధనల్లో ఐఐటీల ముందంజ

● ఘనంగా హైదరాబాద్ ఐఐటీ వ్యవస్థాపక దినోత్సవం

పటాన్‌చెరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర సాంకేతిక పరిశోధనా పత్రాలను ప్రచురించడంలో మన దేశం ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉనదని కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతికశాఖ సెక్రెటరీ ప్రొఫెసర్ అభయ్ కరాండికర్ చెప్పారు. హైదరాబాద్ ఐఐటీ 16వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మట్లాడారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచశ్రేణి నాణ్యమైన బోధన చేయడమే కాకుండా విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం పెంచడమే ఐఐటీల లక్ష్యమన్నారు. అద్భుతమైన సవాళ్లకు సమాధానాలు చెబుతున్న అంకుర (స్టార్టప్) పరిశోధనా సంస్థలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఐఐటీ హైదరాబాద్ బోర్డు ఛైర్మన్ బీవీ.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త తరం ఐఐటీగా ఆధునిక శాస్త్ర సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనే పరిశోధనలను చేయడంలో ముందంజలో ఉన్నామన్నారు. ఈ సందర్భంగా అకాడమిక్స్ డీన్ ప్రొఫెసర్ భరత్‌భూషన్‌పానిగ్రాహి, ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ వి.కాంచన, అడ్మిన్ డీన్ రంజిత్‌రామదురై, ఏసీఆర్ అడ్మిన్ డాక్టర్ ముద్రి కాఖండేల్వాల్, ఎస్ఆర్‌సీ డీన్ ప్రొఫెసర్ చంద్రశేఖర్‌శర్మకు ఎక్సలెన్సీ అవార్డులను అందజేశారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ అభయ్ కరాండికర్

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/FRXtRMt లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

బెల్టుషాపులపై పోలీసుల దాడులు

● 112.18 లీటర్ల మద్యం స్వాధీనం

రాజేంద్రనగర్, మార్చి21(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవుపల్లి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని పలు బెల్టు షాపులపై రాజేంద్రనగర్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి నేతృత్వంలో గురువారం దాడులు చేశారు. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 94.78 లీటర్ల మద్యం, మైలార్‌దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 17.4 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

యువకుడిపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి

● చికిత్స పొందుతూ మృతి



ఫర్రు (ఫైల్)

మదీన, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): యువకుడిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసి కొట్టారు. తీవ్రగాయాలపాలైన అతడు ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ ఘటన బహదూర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఆర్.రఘునాథ్ తెలిపిన వివరాల ప్రకారం... కిషన్‌బాగ్‌కు చెందిన మహ్మద్ ఫర్రు(23)కు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. లేబర్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బుధవారం రాత్రి మహ్మద్ ఫర్రును గుర్తుతెలియని వ్యక్తులు కొట్టి కిషన్‌బాగ్ పార్కు వద్ద పడేసి వెళ్లిపోయారని తల్లికి తెలియడంతో, ఆమె అక్కడికి అపస్మారక స్థితిలో ఉన్న ఫర్రును అంబులెన్స్‌లో ఉస్మానియా ఆస్పత్రిలో అడ్మిట్ చేసింది. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. అయితే మృతుడు కొద్ది రోజులుగా ఓ యువతితో తరుచూ ఫోన్‌లో మాట్లాతుండగా, అనుమానం వచ్చిన భార్య అతడితో గొడవపడి రెండు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. ఆ యువతి సోదరులే కొట్టి చంపారని తల్లి, భార్య, కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



పూజల్లో విక్రమ్‌గౌడ్, శేఖర్ తదితరులు

ముగిసిన గోదా మైసమ్మ ఉత్సవాలు

గోషామహల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చరిత్రాత్మక గోదామైసమ్మ అమ్మవారి ఆలయంలో మూడు రోజులపాటు జరిగిన నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు గురువారం ముగిశాయి. ముగింపు ఉత్సవాలకు మాజీ మంత్రి ముఖేశ్‌గౌడ్ తనయుడు ఎం.విక్రమ్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. విక్రమ్‌గౌడ్ మాట్లాడుతూ గోదామైసమ్మ దేవాలయంలో నూతన విగ్రహం ప్రతిష్ఠాపన తన నేతృత్వంలో జరగడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు బాబురావు, ప్రధాన కార్యదర్శి జగపతి మహేశ్ బాబు, సదానంద్, వెంకటేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులపై ఫిర్యాదు చేయండి

15 రోజుల్లో 121 మంది అకతాయిలను పట్టుకున్నాం: డీసీపీ

కొత్తపేట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వేధింపులకు గురయ్యే మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని రాచకొండ మహిళా రక్షణ విభాగం, షీటీమ్స్ డీసీపీ ఉషా విశ్వనాథ్ సూచించారు. గత నెల 16వ తేదీ నుంచి 29వ తేదీ వరకు అందిన 130 ఫిర్యాదుల ఆధారంగా రాచకొండ పరిధిలోని ఆయా షీటీమ్స్ రంగంలోకి దిగి 121 మంది ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నాయన్నారు. ఎల్‌బీనగర్ సీపీ క్యాంపు కార్యాలయం వద్ద షీటీమ్స్ కార్యాలయంలో గురువారం ఆకతాయిలకు, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో నిపుణులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏసీపీ వెంకటేశం, అడ్మిన్ ఎస్ఐ రాజు, కౌన్సెలింగ్ నిపుణులు నిందితులతో, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆకతాయిల్లో 64 మంది మేజర్లు, 57 మంది మైనర్లు ఉన్నట్లు తెలిపారు. నిందితులపై 4 క్రిమినల్ కేసులు, 63 పెట్టీ కేసులు, 55 కౌన్సెలింగ్ కేసులు నమోదయ్యాయని వివరించారు. బాధిత మహిళలకు మేమున్నామన్న భరోసానిస్తున్న షీటీమ్స్‌ను రాచకొండ సీపీ తరుణ్‌జోషి అభినందించారు.

మెట్రోరైళ్లలో డెకాయ్ ఆపరేషన్స్

రాచకొండ షీటీంలు మెట్రోరైళ్లలో డెకాయ్ ఆపరేషన్ ద్వారా ఏడుగురు ఆకతాయిలను పట్టుకుని, ఫైన్ కట్టించారు. అలాగే, యంజాల్‌లో ఉండే గృహిణితో స్నేహంగా ఉంటూ భర్త ఇంట్లో లేని సమయంలో అసభ్యకరంగా ప్రవర్తించాడో వ్యక్తి. అతడి బెదిరింపులు తట్టుకోలేక బాధితురాలు ఇబ్రహీంపట్నం షీ టీంస్‌ను ఆశ్రయించింది. షీటీమ్స్ రంగంలోకి దిగి నిందితుడిని ఆదిభట్ల పోలీసులకు అప్పగించగా జైలు శిక్ష పడింది.

ఈ నంబర్లకు కాల్ చేయండి..

బాధిత మహిళలు 87126 62111 (షీటీమ్ వాట్సాప్) నంబర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. 87126 62598 (భువనగిరి), 87126 62599 (చౌటుప్పల్), 87126 62600 (ఇబ్రహీంపట్నం), 87126 62601 (కుషాయిగుడ) 87126 62602 (ఎల్‌బీనగర్), 87126 62603 (మల్కాజిగిరి), 87126 62604 (వనస్థలిపురం) నంబర్ల ద్వారా షీటీమ్స్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

బాధ్యతలు స్వీకరించిన ఫ్లో, వైఫ్లో చైర్‌పర్సన్లు

హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఫిక్కీలేడీస్ ఆర్గనైజేషన్ (ఫ్లో), యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (వైఫ్లో)ల చైర్‌పర్సన్లు గురువారం బాధ్యతలను స్వీకరించారు. నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఫ్లో 23వ చైర్‌పర్సన్‌గా ప్రియా గజ్దార్, 19వ వైఫ్లో చైర్‌పర్సన్‌గా రిధి జైన్ బాధ్యతలను స్వీకరించారు. అనంతరం 'ఫ్యూచర్ ఆఫ్ గ్లోబల్ ఉమెన్ లీడర్స్' అంశంపై జరిగిన సదస్సులో టీసీఎస్ లీడర్‌షిప్ బోర్డ్ మెంబర్ ఫర్హానా హక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక స్వాతంత్ర్యం కోసం మహిళలు పనిచేయాల్సి ఉందన్నారు. ఇబ్బందుల్లో ఉన్న మహిళలకు సహాయం చేయాలని ఉద్బోధించారు.

వెంకయ్యనాయుడితో గవర్నర్ భేటి



రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన సీపీ రాధాకృష్ణన్ మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడిని గురువారం ఆయన నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు పలు అంశాలపై ముచ్చటించారు.

- హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి)

ఎంఎన్‌జే ఆస్పత్రిని సందర్శించిన గవర్నర్, మంత్రి



పేషెంట్‌తో మాట్లాడుతున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదరాబాద్ సిటీ/ మంగళ్‌హట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. నాంపల్లిలోని ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిని ఎంఎన్‌జే ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ అండ్ రీజినల్ కేన్సర్ సెంటర్‌ను గురువారం హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఆస్పత్రి డైరెక్టర్ ఎం.శ్రీనివాసులు తదితరులు సందర్శించారు. ఆస్పత్రిలోని పలు వార్డుల్లో ఇన్ పేషెంట్లుగా ఉన్న కేన్సర్ రోగుల వద్దకు వెళ్లి ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలు, సదుపాయాల గురించి తెలుసుకున్నారు.



అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, గుజ్జకృష్ణ, భరత్‌కుమార్ తదితరులు

బీసీలకు 10 ఎంపీ సీట్లు ఇవ్వాలి

- 23 నుంచి బీసీ జోడో సామాజిక న్యాయయాత్ర
- రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బీసీలకు 10 ఎంపీ సీట్లు కేటాయించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీల డిమాండ్లను ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి, అమలు చేయాలని ఆయన కోరారు. కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వని పార్టీలను ఎంపీ ఎన్నికల్లో చిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. 56 బీసీ కులవృత్తులకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి పాలకమండలిని నియమించాలని డిమాండ్ చేశారు. బీసీలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను పరిష్కరించాలని, బీసీ రిజర్వేషన్లను 56శాతానికి పెంచాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలని, క్రిమిలేయర్‌ను పూర్తిగా ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ డిమాండ్ల సాధనకు ఈ నెల 23న విద్యానగర్‌లోని బీసీ భవన్ నుంచి ఉదయం 10గంటలకు బీసీ జోడో యాత్ర ప్రారంభమవుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా 33జిల్లాల మీదుగా ఈ యాత్ర కొనసాగుతుందని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నేతలు నీలా వెంకటేష్, కోట్ల శ్రీనివాస్, సి.రాజేందర్, జి.అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కృషి

బర్కత్‌పుర, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేలా తనవంతు కృషి చేస్తానని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత జర్నలిస్టులతో పాటు నగరంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా ప్రభుత్వం తగు న్యాయం చేస్తుందని అన్నారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరహత్ అలీ మాట్లాడారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డిని, కె.విరహత్ అలీని జ్ఞాపికలు, శాలువా, పూలమాలతో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌యూజే అధ్యక్షుడు శిగ శంకర్‌గౌడ్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.స్వామి, హెచ్‌యూజే ఉపాధ్యక్షుడు జె.పుండరీచారి, మీడియా ప్రతినిధులు సాగర్, వెంకటేష్, రాంబాబు, గణేష్, సుభాష్, ఉపేందర్, దయాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ ఏర్పాటు



సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న చంద్రశేఖర్, డాక్టర్ నరేంద్రకుమార్

రాజేంద్రనగర్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ రంగాల అభివృద్ధిలో పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాలను చేపట్టడానికి రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్(ఎన్ఐఆర్‌డీపీఆర్)లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ ఏర్పాటు అవసరమని వివిధ రంగాల నిపుణులు గుర్తు చేశారు. రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో రెండు రోజుల పాటు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర అనే అంశంపై జరుగనున్న అంతర్జాతీయ సదస్సును గురువారం ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి.నరేంద్రకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్ కుమార్ మాట్లాడుతూ వివిధ గ్రామీణాభివృద్ధి పథకాలు సక్రమంగా ముందుకు సాగడానికి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అమెరికా సౌత్ ఫ్లోరిడా యూనివర్సిటీ నుంచి ప్రొఫెసర్ శివెందు, బెల్జియం యూనివర్సిటీ నుంచి డాక్టర్ ఇషితు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి, వాధ్వాని సెంటర్ సీఈఓ డాక్టర్ ఇ.జి రాజన్, వివిధ రంగాల ప్రముఖులు, ఎన్ఐఆర్‌డీపీఆర్ అధికారులు ప్రొఫెసర్ కేఎస్ రాజన్, ప్రొఫెసర్ రవీంద్ర ఎస్.గవాలీ, డాక్టర్ ఎంవీ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి క్లినిక్ రిజిస్ట్రేషన్ తప్పని సరి: డాక్టర్ వెంకటి

హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా పరిధిలోని ఆయుష్, అల్లోపతి, క్లినిక్‌లు, పాలిక్లినిక్‌లు, యోగ, యునాని, సిద్ధ క్లినిక్‌లు తప్పనిసరిగా ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటి తెలిపారు. ఆయుర్వేద, యోగ, యునాని, సిద్ధ, హోమియో వైద్యంలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను సికింద్రాబాద్‌లోని పాస్‌పోర్ట్ ఆఫీసు వెనక గల తెలంగాణ ప్రభుత్వ బోర్డు ఆఫ్ ఇండియన్ మెడిసిన్ కార్యాయలంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు మాత్రమే క్లినికల్ పాబ్లిష్‌మెంట్ చట్టప్రకారం అర్హులని తెలిపారు. అవసరమైన అన్ని సర్టిఫికెట్లను జతపరచ్చి దరఖాస్తులను ప్యాట్నీలోని డీఎంఅండ్‌హెచ్‌ఓలో అందజేయాలని పేర్కొన్నారు.

జేఎన్‌టీయూలో 11మంది విద్యార్థుల సస్పెన్షన్

- గౌతమి హాస్టల్ నుంచి ఆరుగురిని శాశ్వతంగా..
- మరో ఐదుగురిని వారం రోజుల పాటు..
- ఉత్తర్వులు జారీచేసిన కాలేజీ ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి

హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): 'జేఎన్‌టీయూలో సీసాల గలగల' కేసులకు సంబంధించి తొలివిడతగా 11మంది విద్యార్థులపై వేటుపడింది. ఈ వ్యవహారంపై సర్కారు సీరియస్ కావడంతో కాలేజీ ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. మద్యం తాగి మొదట ఘర్షణకు దిగిన రెండువర్గాలకు చెందిన 11మంది బీబీఏ(అనలిటిక్స్) విద్యార్థులను హాస్టళ్ల నుంచి సస్పెండ్ చేశారు. వీరిలో ఆరుగురు విద్యార్థులను శాశ్వతంగా హాస్టల్ నుంచి బహిష్కరించగా, మరో ఐదుగురు విద్యార్థులను వారం పాటు సస్పెండ్ చేశారు. ప్రొఫెసర్ల కమిటీ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రిన్సిపాల్ జి.వి.నర్సింహారెడ్డి గురువారం జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉత్తర్వులు తక్షణం అమలులోకి వస్తాయని, సస్పెండైన విద్యార్థులు హాస్టల్ గదులను ఖాళీ చేయాలని ఆదేశించారు. లేనిపక్షంలో కళాశాల నుంచే శాశ్వతంగా బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఇదిలా ఉంటే.. ఇదే యూనివర్సిటీలోని మంజీరా హాస్టల్‌లో రెండువర్గాలకు చెందిన మరో 40మంది విద్యార్థులు పరస్పరం దాడులు చేసుకున్న ఘటనపై కాలేజీ ఉన్నతాధికారులు విచారణ ముమ్మరం చేశారు. రెండు మూడు రోజుల్లో సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన వారిపైనా చర్యలు తీసుకునే అవకాశం ఉందని హాస్టల్ నిర్వాహకులు చెబుతున్నారు.



మనిషి జీవితంతో ముడిపడిన కళలు, సాహిత్యం

- తెలంగాణ రాష్ట్ర జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్ డా.మంగారి రాజేందర్
- సామాజిక, సాంస్కృతిక ప్రముఖులకు కీర్తి పురస్కారాల ప్రదానం



పురస్కారగ్రహీతలతో అతిథులు

రవీంద్రభారతి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కళలు, సాహిత్యం మనిషి జీవితంతో నిరంతరం ముడిపడి ఉంటాయని వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ రాష్ట్ర జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్ డా.మంగారి రాజేందర్ అన్నారు. తెలుగు సాంస్కృతిక, సామాజిక రంగంలోని వివిధ ప్రక్రియల్లో విశేషసేవలందించిన 23మంది ప్రముఖులకు పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2022 సంవత్సరానికి గాను కీర్తి పురస్కారాలను ప్రదానం చేసింది. గురువారం వర్సిటీలోని ఆడిటోరియంలో వీసీ ఆచార్య టి.కిషన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డా.మంగారి రాజేందర్ హాజరై పురస్కారగ్రహీతల్ని సత్కరించి ఒక్కొక్కరికి 5,116 రూపాయల నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వీసీ టి.కిషన్‌రావు మాట్లాడుతూ పురస్కారగ్రహీతలు సమాజానికి చేసిన సాహిత్య, సాంస్కృతిక, సామాజిక కృషిని కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్, రింగు రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పురస్కారగ్రహీతలు వీరే..

లలితారాజ్ (ఉత్తమ నటి), నామని సుజనాదేవి (ఉత్తమ రచయిత్రి), కొల్లాపురం విమల (మహిళాభ్యుదయం), కొడాలి వెంకటేశ్వరరావు (లలిత సంగీతం), ప్రసన్న కుమారి (శాస్త్రీయ సంగీతం), ఎస్.కె.బాబుజి (జానపద కళలు), కల్వకోట వెంకట సంతోష్‌బాబు (జీవిత చరిత్ర), డా.బుర్ర మధుసూదనరెడ్డి (పత్రికా రచన), డా.ఆర్.ఎల్.వి.రమేష్ (ఆంధ్రనాట్యం), డా.ఎస్.పి.భారతి (కూచిపూడి నాట్యం), జి.వి.ఎస్.రాజు (వ్యక్తిత్వ వికాసం), షరీఫ్ గోరా (హేతువాద ప్రచారంలో కృషి), డా.చేగొని రవి కుమార్ (గ్రంథాలయ సమాచార విజ్ఞానం), అనుమల శ్రీనివాస్ (గ్రంథాలకర్త), మడిశెట్టి గోపాల్ (సాంస్కృతిక సంస్థ నిర్వహణ), బి.వి.సత్యనగేష్ (ఇంద్రజాలం), మృత్యుంజయ (కార్టూనిస్ట్), డా.నూనె వెంకటయ్య (జ్యోతిష్యం), సి.రామనాథశర్మ (ఉత్తమ ప్రధానోపాధ్యాయుడు), గౌరి వేముల (చిత్రలేఖనం), ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు (సాహిత్య విమర్శ), మోహన్ సేనాపతి (ఉత్తమ నటుడు), గరికపాటి కాళిదాస్ (నాటక రంగంలో కృషి)కు కీర్తి పురస్కారాలు ప్రదానం చేశారు.

బీజేపీలోనే మాదిగల ఎదుగుదల, భవిష్యత్

- ఎంపీ సీట్ల కేటాయింపులో అన్యాయం చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్
- తెలంగాణలో రెడ్ల రాజ్యం, మాలల రాజ్యం నడుస్తోంది
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

పంజాగుట్ట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మాదిగల ఎదుగుదల, భవిష్యత్ బీజేపీలో కనిపిస్తోంది, ఆ పార్టీకే అండగా ఉంటామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎంపీ సీట్ల కేటాయింపు విషయంలో తీవ్ర అన్యాయం చేశాయని, ఆ పార్టీలతో భవిష్యత్ లేదని, వారికి ఓట్లు వేయడం మానుకోవాలన్నారు. మాల సామాజికవర్గానికి చెందిన జి.వెంకటస్వామి, మల్లు అనంతరాముల కుటుంబాలు మాదిగలకు న్యాయం జరుగకుండా అడ్డుపడుతున్నాయని ఆరోపించారు. ఎస్సీ రిజర్వుడ్ పెద్దపల్లి, నాగర్ కర్నూల్, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గాలలో మాదిగలకు కాంగ్రెస్ రెండు స్థానాలు కేటాయించాల్సి ఉండగా ఒక్కటీ కేటాయించలేదని అన్నారు. తెలుగు రాష్ట్రాలలో ఉపముఖ్యమంత్రులూ వారే ఉన్నారని అన్నారు. తెలంగాణలో రెడ్ల రాజ్యం, మాలల రాజ్యం నడుస్తోందని విమర్శించారు. మాదిగల తరుపున గట్టిగా మాట్లాడితే సీఎం కుర్చీకే మాలలు ఎసరు పెడతారనే భయం రేవంత్‌రెడ్డికి పట్టుకుందని ఆయన రోపించారు. మాలలను ప్రోత్సహిస్తూ మాదిగలను అణిచివేయడం, అణగదొక్కే చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందని అన్నారు. కేసీఆర్ తొమ్మిదిన్నర సంవత్సరాల పాలనలో 9 సంవత్సరాల పాటు ఒక్క మాదిగకూ మంత్రివర్గంలో చోటు కల్పించలేదని అన్నారు. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, వరంగల్ అభ్యర్థి కడియం కావ్య ఇద్దరూ మాల సామాజిక వర్గానికి చెందిన వారేనని అన్నారు. ప్రధాని మోదీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మాదిగలకు, ఎస్సీ వర్గీకరణకు అనుకూలమని, కాంగ్రెస్ వస్తే వర్గీకరణ అంశాన్ని మర్చిపోవాల్సిందేనని ఆయన అన్నారు. వర్గీకరణ అయిన తరువాతే రాజకీయాలపై నిర్ణయం తీసుకుంటానని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు గోవింద నరేష్ మాదిగ, జాతీయ అధికార ప్రతినిధి బిక్షపతి మాదిగ, ఏపీ అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ, నాయకులు సొట్ల నరేందర్ బాబు, తిప్పరపు లక్ష్మణ్ మాదిగ, చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

కండువాలు మారుతున్నాయ్..!

(5వ పేజీ తరువాయి)

ఇప్పటికే గులాబీ పార్టీ చేజారింది. మాజీ మేయర్ కావ్య ప్రస్తుతం బీఆర్ఎస్‌లోనే ఉన్నా.. ఇటీవల ఈటల రాజేందర్ ఆమెను కలిశారు. ఈ నేపథ్యంలో కావ్య బీజేపీలోకి వెళ్లే అవకాశముందని తెలుస్తోంది. బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో ఆరుగురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు. బండ్లగూడ జాగీర్‌లో మాజీ మేయర్ మహేందర్‌గౌడ్‌తోపాటు పలువురు కార్పొరేటర్లు హస్తం పార్టీలో చేరారు. గురువారం జరిగిన అవిశ్వాసం 16 మంది కార్పొరేటర్ల మద్దతుతో నెగ్గింది.

కంటోన్మెంట్ అభ్యర్థి ఎవరు?

(5వ పేజీ తరువాయి)

వారు భావిస్తున్నారు. కాగా, గత ఎన్నికల్లో టికెట్ ఆశించి భంగపడ్డ తనకు ఇప్పుడైనా న్యాయం చేయాలని అద్దంకి దయాకర్ కోరుతున్నారు. ఇదిలాఉండగా మైనంపల్లి హన్మంతరావు అండదండలతో హస్తం గూటికి చేరిన శ్రీగణేష్‌కే టికెట్ అని ఆయన అనుచరులు ప్రచారం చేస్తున్నారు.

నేడు నియోజకవర్గ సమావేశం

పీసీసీ చీఫ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యాలయంలో మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ ముఖ్య నేతలు, కార్యకర్తలతో గురువారం ప్రత్యేక సమావేశం జరిగింది. వెన్నెలతోపాటు శ్రీగణేష్ కూడా సమావేశానికి హాజరయ్యారు. మల్కాజిగిరి పార్లమెంట్ గురించి మినహా.. కంటోన్మెంట్ ప్రస్తావన సమావేశంలో రాలేదు. కాగా, శుక్రవారం సాయంత్రం సికింద్రాబాద్ కంటోన్మెంట్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం జరగనుంది. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డితోపాటు వెన్నెల, శ్రీగణేష్, స్థానిక ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారు. ఈ సమావేశంలోనైనా ఉప ఎన్నిక, అభ్యర్థిపై సంకేతాలు వస్తాయేమోనని పార్టీ శ్రేణులు ఆసక్తితో ఉన్నాయి.

ప్రభుత్వ భూమిలో ప్రైవేటు రోడ్డు

(5వ పేజీ తరువాయి)

కొనుగోలు చేసిన కాగితాలు ఉన్నాయంటూ కొన్ని నెలల క్రితం బేస్‌మెంట్లు నిర్మించారు. అప్పటి ఉమ్మడి కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు వాటిని అడ్డుకుంటూ వచ్చినప్పటికీ అక్రమ నిర్మాణాలు ఆగలేదు. అదే భూమి మధ్య నుంచి రెడ్డి ఎవెన్యూ కాలనీకి రోడ్డు వేశారు. 109 సర్వే నంబరులోని ప్రభుత్వభూమి పక్కనే ఉన్న ప్రైవేట్ సర్వే నంబరు 165, 126ల్లో ఓ బిల్డర్ జీ+4 నిర్మాణానికి అనుమతులు తెచ్చుకున్నాడు. అయితే.. కలెక్టర్ అనుమతి లేకుండానే ప్రభుత్వ భూమిలోంచి రెండు వైపులా రెండు రోడ్లను ఏర్పాటు చేసుకున్నాడు. భవన నిర్మాణానికి కావాల్సిన మెటీరియల్‌ను టిప్పర్లు, లారీల ద్వారా తరలించుకుంటూ పనులు చేపడుతున్నాడు. ప్రభుత్వభూమిలో రోడ్డు నిర్మించిన విషయం బాచుపల్లి రెవెన్యూ అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదని సమాచారం. వాస్తవంగా బిల్డర్ కడుతున్న సర్వే నంబర్ 165లోకి వెళ్లాలంటే ప్రభుత్వ సర్వే నంబరు 109లోని ప్రభుత్వ భూమి అడ్డుగా ఉంటుంది. అయితే భవన నిర్మాణ అనుమతి తీసుకునే సమయంలోనే సదరు బిల్డర్ తన ప్రాజెక్టుకు పక్కనే ఉన్న రెడ్డి ఎవెన్యూ కాలనీ గ్రామ పంచాయతీ వెంచర్లలోని సర్వే నంబరు 126లోని 41 ప్లాట్‌ను రోడ్డుగా చూపించుకుని అనుమతి పొందినట్లు తెలిసింది. ఈ విషయమై 2018లో అప్పటి బాచుపల్లి తహసీల్దార్ ఈ అక్రమ రహదారిపై సర్వే చేయించారు. ప్రభుత్వ సర్వే నంబరు 109ని చూపించి అనుమతి తెచ్చుకున్నట్లుగా ధ్రువీకరించి ఆపివేశారు. అయితే తాజాగా.. ఎలాంటి అనుమతి లేకుండానే రోడ్డును వేసుకుని సదరు ప్రాజెక్టును బాహాటంగా నిర్మిస్తున్నాడు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేసినప్పటికీ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను మేనేజ్ చేసుకుని, హెచ్ఎండీఏ అధికారులకు తప్పుడు రిపోర్టు సమర్పించి టీఎస్ బీపాస్ ద్వారా భవన నిర్మాణ అనుమతి పొందినట్లు సమాచారం. దీనిపై తగిన విచారణ జరిపి.. నిర్మాణ అనుమతుల సమయంలో ఇచ్చిన రిపోర్టులను పునఃపరిశీలించి ప్రభుత్వ భూములను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రాణభయంతో స్నేహితుడి హత్య

- నాగోల్ మూసీ ఒడ్డున హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

మన్సూరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నాగోల్ మూసీ ఒడ్డున ఇటీవల జరిగిన మల్లికార్జున్ హత్య కేసులో ముగ్గురు నిందితులను నాగోల్ పోలీసులు అరెస్టు చేశారు. ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్ శివపురి కాలనీలో ఉంటున్న డేరంగుల మల్లికార్జున్ అలియాస్ మర్డర్ మల్లి(28) ఆటో, కారు డ్రైవర్. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మల్లికార్జున్‌కు సమతాపురి కాలనీలో ఉంటున్న ఆటోడ్రైవర్ కొప్పుల అర్జున్‌యాదవ్, బోడుప్పల్‌లో ఉంటున్న ఆటోడ్రైవర్ కుంచల ఓంకార్, ఫతుల్లాగూడ హనుమాన్‌నగర్‌కు చెందిన క్యాబ్‌డ్రైవర్ మల్లెల మహేష్ స్నేహితులు. అందరూ చెడువ్యసనాలకు అలవాటుపడ్డారు. ఇతరులతో గొడవలు పడటంతో పాటు, వారిలో వారు కొట్లాడుకున్న ఘటనలతో పలు కేసులు కూడా ఉన్నాయి. అయితే హతుడు డేరంగుల మల్లికార్జున్ అందరితో మరింత దురుసుగా ప్రవర్తించేవాడు. గతంలో ఓసారి అర్జున్‌యాదవ్‌పై దాడి చేశాడు. ఇటీవల కూడా మహేశ్‌పై కత్తితో దాడి చేయగా, ఎనిమిది కుట్లు పడ్డాయి. డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తానంటూ మల్లికార్జున్ వారిని బెదిరించాడు. దీంతో మల్లికార్జున్‌తో తమకు ఎప్పుడైనా ప్రమాదమేనని భావించిన అర్జున్‌యాదవ్, ఓంకార్, మహేశ్.. అతన్ని చంపాలని నిర్ణయించుకున్నారు. మల్లికార్జున్ తరచూ నాగోల్ మూసీ సమీపంలోని లక్ష్మీనర్సింహ కాలనీలోని మర్రిచెట్టు కింద మద్యం తాగుతాడు. ఈ క్రమంలో ఈ నెల 19న ఉదయం మల్లికార్జున్‌ను అజయ్ అనే మరో స్నేహితుడు కలిసి రెండు బీర్లు కొనుక్కొని బైకుపై మూసీ ఒడ్డున ఉన్న చెట్టు వద్దకు వెళ్లి తాగారు. మళ్లీ బీర్లు తీసుకురావటానికి అజయ్ నాగోల్ వైపు వెళ్లాడు. మహేశ్, అర్జున్‌యాదవ్, ఓంకార్ కారులో అదే సమయంలో ఆ చెట్టు వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో మహేశ్ కాపలాగా ఉండగా.. తమ వెంట తెచ్చుకున్న కత్తితో ఓంకార్, అర్జున్‌లు.. మల్లికార్జున్ పొట్టలో, గొంతులో పొడిచి చంపేశారు. మల్లికార్జున్ వల్ల ప్రాణభయంతోనే తాము హత్య చేసినట్లు నిందితులు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆనంద్‌నగర్ చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తుండగా.. కారులో వెళ్తున్న ముగ్గురు నిందితులను పట్టుకున్నట్లు వారు వివరించారు. నిందితుల నుంచి స్విఫ్ట్ కారు, కత్తి, రక్తం దుస్తులు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు ముగ్గురిపై రౌడీషీట్ తెరుస్తామని ఏసీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు శ్రీనివాస్, మధు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధం.. ఆర్థిక లావాదేవీలే హత్యకు కారణం

- తల్లి, కుమారుడి అరెస్ట్

హైదరాబాద్ సిటీ/ చార్మినార్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం, ఆర్థిక లావాదేవీల కారణంగానే షేక్ వాజిద్ హత్య జరిగిందని సౌత్‌జోన్ డీసీపీ సాయి చైతన్య తెలిపారు. పురానీహవేలిలోని డీసీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మీర్‌చౌక్‌లో జరిగిన హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేశామని తెలిపారు. మేడిపల్లి పీర్జాదిగూడకు చెందిన షేక్ వాజిద్(25) మొబైల్ టెక్నీషియన్. చార్మినార్ అలీజా కోట్లకు చెందిన రియల్‌ఎస్టేట్ బ్రోకర్ షేక్ నిస్సార్ అహ్మద్ అలియాస్ బాషాతో వాజిద్‌కు 5ఏళ్ల నుంచి స్నేహం ఉంది. నిస్సార్ ఇంట్లో లేని సమయంలో ఆయన ఇంటికి వెళ్లిన వాజిద్ బెదిరింపులకు పాల్పడి నిస్సార్ తల్లితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం బయటకు చెబితే ఇద్దరినీ చంపుతానని బెదిరించాడు. అంతేకాకుండా పలుదఫాలుగా నిస్సార్, అతడి తల్లి నుంచి రూ.4 లక్షలు అప్పు తీసుకున్నాడు. అప్పు తిరిగివ్వమంటే బెదిరించేవాడు. వివాహేతర సంబంధం గురించి నిస్సార్‌కు తెలియడంతో తన ఇంటికి రావద్దని వాజిద్‌కు చెప్పాడు. దీంతో వాజిద్ నిస్సార్ తల్లికి ఫోన్‌చేసి దూషిస్తూ డబ్బులు అడిగితే ఇద్దరినీ కలిపి చంపేస్తానని బెదిరించాడు. దాంతో తల్లీ కుమారుడు కలిసి, వాజిద్‌ను చంపేందుకు పథకం వేశారు. పథకంలో భాగంగా నిస్సార్ తల్లి ఈనెల 18న వాజిద్‌ను ఇంటికి పిలిచింది. గదిలోకి రాగానే బాత్ రూమ్‌లో దాక్కున్న నిస్సార్ వాజిద్‌ను వెనక నుంచి వచ్చి కత్తితో పలుమార్లు పొడిచాడు. దీంతో వాజిద్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మీర్‌పేట పోలీసులు గురువారం ఎంజీబీఎస్ నుంచి బస్‌లో పరారయ్యేందుకు ప్రయత్నిస్తున్న నిస్సార్‌ను, అతడి తల్లిని పోలీసులు అరెస్ట్ చేశారు.

ఆధారాల్లేని రూ.48.40 లక్షలు స్వాధీనం

హైదరాబాద్ సిటీ/అఫ్జల్‌గంజ్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు జరిపిన తనిఖీల్లో రూ.48.40లక్షల సొమ్ము పట్టుబడింది. బేగంబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అలెక్సా జంక్షన్‌లో తనిఖీలు నిర్వహించగా సికింద్రాబాద్‌వైపు వాహనంలో వెళుతున్న ముగ్గురు వ్యక్తులు రూ.30లక్షల సొమ్మును రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. హీరాలాల్, హనుమాన్‌రామ్, అమ్రారామ్ అనే వ్యక్తుల వద్ద పట్టుబడిన సొమ్ముకు సరైన ఆధారాలు చూపకపోవడంతో ఆ సొమ్మును పోలీసులు సీజ్ చేశారు. అలాగే, రాజేంద్రనగర్ పరిధిలోని శాస్త్రిపురంలో గురువారం సాయంత్రం మైలార్‌దేవ్‌పల్లి సమీపంలోని బృందావన్ కాలనీకి చెందిన ఆదిత్య అనే వ్యక్తి నుంచి రూ.17లక్షల 40వేల సొమ్మును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన సొమ్ముకు సంబంధించి ఆధారాలు లేకపోవడంతో ఎలక్షన్ కోడ్ ఉల్లంఘన కింద ఆ సొమ్మును స్వాధీనపర్చుకున్నట్లు పోలీసులు తెలిపారు. స్వాధీన పరుచుకున్న డబ్బును తదుపరి చర్యల నిమిత్తం రాజేంద్రనగర్ ఆర్డీవో కార్యాలయంలోని డిప్యూటీ తహసీల్దార్‌కు అప్పగించారు.

72.88 లీటర్ల మద్యం స్వాధీనం

హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ నేపథ్యంలో నగరంలో తనిఖీలు ముమ్మరం చేశారు. గురువారం అక్రమంగా తరలిస్తోన్న 72.88 లీటర్ల మద్యాన్ని ప్రత్యేక బృందాలు స్వాధీనం చేసుకున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం రూ.47.18 లక్షల నగదు, రూ.17.87 లక్షల విలువైన వస్తువులు, 177.29 లీటర్ల మద్యం పట్టుకున్నట్టు ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ తెలిపారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట రూ. 57.38లక్షలకు కుచ్చుటోపీ

- బ్యాంకు ఖాతాలు ఇచ్చిన ఇద్దరి అరెస్ట్
- ప్రధాన నిందితుల కోసం గాలింపు

హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో నగరానికి చెందిన ఓ వ్యక్తికి సైబర్ నేరగాళ్లు రూ.57.38 లక్షలు కుచ్చుటోపీ పెట్టారు. నగరానికి చెందిన ఓ వ్యక్తి ట్రేడింగ్ ఫ్రాడ్ ద్వారా మోసపోయినట్లు గత ఫిబ్రవరిలో సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించాడు. గోల్డ్‌మాన్ (ఇండియా) అనే వాట్సాప్ గ్రూప్‌లో అతన్ని చేర్చి ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అధిక లాభాలు వస్తాయంటూ లింకులు పంపించారు. నమ్మిన బాధితుడు వారు చెప్పినట్లు లింకుల ద్వారా యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుని అందులో పెట్టుబడులు పెట్టాడు. ఇలా క్రమంగా పెంచుకుంటూ ఆన్‌లైన్‌లో ద్వారా బాధితుడు మొత్తం రూ.57.38 లక్షలు సమర్పించుకున్నాడు. తీరా మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు బాధితుడి డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయిన ఖాతాల వివరాలు సేకరించిన పోలీసులు ఉప్పల్ నివాసులైన తమనం సురేంద్ర, నరేశ్‌బాబును అరెస్టు చేశారు. వారిని విచారించగా ఢిల్లీకి చెందిన రాజ్‌ఠాకూర్‌ను కలిశామని.. అతని ఆదేశాల మేరకే.. కమీషన్ల కోసం బ్యాంకు ఖాతాలు ఇచ్చామని చెప్పారు. గత మూడు నెలల్లో 8ఖాతాల ద్వారా రూ.5కోట్ల లావాదేవీలు జరిపినట్లు ఇద్దరు నిందితుల ఖాతాల నుంచి పోలీసులు సమాచారం సేకరించారు. నిందితులిద్దరు ఇచ్చిన సమాచారం మేరకు ఢిల్లీకి చెందిన రాజ్‌ఠాకూర్, టెలిగ్రామ్, వాట్సాప్ గ్రూపుల్లో యాడ్ చేసిన నెల్లూరు వాసి భరత్ దాసినేనిల కోసం పోలీసులు గాలిస్తున్నారు. వారి వద్ద నుంచి ల్యాప్‌టాప్, మూడు ఫోన్‌లు, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు.

మరో కేసులో సంగారెడ్డికి చెందిన ఇద్దరి అరెస్ట్

స్టాక్ మార్కెట్‌లో డబ్బులు సంపాదించడానికి టిప్స్ ఇస్తామంటూ పలువురిని మోసం చేయడంలో సహకరించిన సంగారెడ్డికి చెందిన ఇద్దరు వ్యక్తులను హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీసులు అరెస్టు చేశారు. బల్కంపేటకు చెందిన బాధితుడికి ఇన్‌స్టా, టెలిగ్రామ్ ద్వారా కొందరు సైబర్ నేరస్థులు సంప్రదించారు. సీక్వోఇయా క్యాపిటల్ బిజినెస్ స్కూల్ పేరిట స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు ఎలా పెట్టాలో టిప్స్ ఇస్తామంటూ మాయమాటలు చెప్పి బురిడీ కొట్టించారు. అతని నుంచి పెట్టుబడుల రూపంలో మొత్తం రూ.58.66 లక్షలు కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సంగారెడ్డికి చెందిన గడిల సాయిగౌడ్, శీలంకోటి సాయికుమార్‌లను అరెస్టు చేశారు. వారిని విచారించగా పింకు, శరత్ అనే ఇద్దరితో కలిసి ఈ దందా సాగిస్తున్నట్లు ఒప్పుకున్నారు. స్టాక్‌మార్కెట్ పేరిట ఇన్వెస్ట్‌మెంట్ చేయిస్తే 5శాతం కమీషన్ వచ్చేదని పోలీసులకు చెప్పారు. అంతే కాకుండా బైనాన్స్ క్రిప్టో ఎక్స్ఛేంజి, యూఎస్ డాలర్ ట్రేడింగ్ పీ2 మీద అదనపు కమీషన్ ఇచ్చే వారని వెల్లడించారు. నిందితుల ద్వారా 45 కేసుల్లో రూ.13కోట్ల లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. దేశవ్యాప్తంగా 45కేసులు నమోదైనట్లు పోలీసులు వివరాలు సేకరించారు. వాటిలో 3కేసులు తెలంగాణలో నమోదయ్యాయి. వారి వద్ద నుంచి మొబైల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

క్యూఆర్ కోడ్ ద్వారా రైలు టికెట్ల కొనుగోలు

- ప్రయోగాత్మకంగా 14 స్టేషన్లలో 31 కౌంటర్ల ఏర్పాటు

హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో డిజిటల్ చెల్లింపులను పెంపొందించే చర్యల్లో భాగంగా టికెట్లను కొనుగోలు చేసేందుకు క్యూఆర్(క్విక్ రెస్పాన్స్) కోడ్ సేవల్ని దక్షిణమధ్య రైల్వే అందుబాటులోకి తెచ్చింది. దీంతో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ల వద్ద చిల్లర కోసం పడే పాట్లు తప్పనున్నాయి. మొదటి దశలో ప్రయోగాత్మకంగా సికింద్రాబాద్ డివిజన్‌లో 14 స్టేషన్లలోని 31 కౌంటర్ల ద్వారా వినియోగదారులకు ఈ నగదు రహిత లావాదేవీల సదుపాయం కల్పిస్తున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. ముఖ్యమైన సమాచారం, చార్జీలు తదితర వివరాలను సూచించే డిస్‌ప్లే బోర్డులను బుకింగ్ కౌంటర్ల వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే డిస్‌ప్లే బోర్డులో కన్పించే క్యూఆర్ కోడ్‌ను ప్రయాణికులు తమ మొబైల్ ఫోన్‌లో ఉన్న పేమెంట్ యాప్ ద్వారా స్కాన్ చేసుకుని అవసరమైన రుసుమును జమచేయాలని, తర్వాత టికెట్ జనరేట్ అవుతుందని పేర్కొన్నారు. తొలి దశలో సికింద్రాబాద్, హైదరాబాద్, కాజీపేట, బేగంపేట, వరంగల్, మంచిర్యాల్, లింగంపల్లి, హైటెక్‌సిటీ, జేమ్స్‌స్ట్రీట్, మహబూబాబాద్, బెల్లంపల్లి, ఫతేనగర్‌బ్రిడ్జ్, సిర్పూర్ కాగజ్‌నగర్, వికారాబాద్ స్టేషన్లలో క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపు సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. ఆటోమెటిక్ టికెట్ వెండింగ్ మేషిన్(ఏటీవీయం)లోని క్యూఆర్ కోడ్ ద్వారా అన్‌రిజర్వ్‌డ్, ప్లాట్‌ఫాం టికెట్ల కొనుగోలు చేసే విధానం రెండేళ్లుగా అమలులో ఉంది. తాజాగా యూటీఎస్(జనరల్ బుకింగ్) కౌంటర్లలోనూ ఈ సదుపాయం కల్పించడం విశేషం.

మహిళతో ఉబర్ రైడర్ అసభ్య ప్రవర్తన

యూసుఫ్‌గూడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఉబర్ రైడర్‌పై కేసు నమోదైంది. ఈ ఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. జవహర్‌నగర్‌కు చెందిన ఓ మహిళ ప్రెస్ రిపోర్టర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఈ నెల 20న ఆఫీస్‌కు వెళ్లేందుకు ఆమె ఉబర్ వాహనాన్ని బుక్ చేసింది. ఉబర్ డ్రైవర్ ఎం.నరేందర్ ఆమెను ఎక్కించుకుని జీటీఎస్ టెంపుల్ రాజీవన్‌నగర్ వైపు రాంగ్ రూట్‌లో వెళ్లాడు. దీంతో రాంగ్ రూట్‌లో ఎందుకు వెళ్తున్నావని ప్రశ్నించిన ఆమెను నరేందర్ దుర్భాషలాడాడు. ఆమె చెయ్యి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ ఘనటపై ఉబర్ కార్యాలయానికి ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని, దీంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశానని ఆమె తెలిపింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పర్వదినం

ప్రకృతి అంతా ప్రకాశవంతమైన రంగులతో నిండి ఉన్నట్టే... మీ మనస్సు కూడా ఆనందం, విచారం, కోపం అసూయ, కరుణ, దాతృత్వం... ఇలా అనేక భావోద్వేగాలు కలిగి ఉంటుంది. వాటికి మీరు సాక్షిగా మారినప్పుడు మాత్రమే... జీవితాన్ని ఆస్వాదించగలరు. ఆ భావోద్వేగాలే మీ స్వభావం అనుకుంటే ఇబ్బందిలో పడతారు. వాటికి దూరంగా, సాక్షిగా ఉండి, చైతన్యం వైపు పయనించడానికి మార్గం - ధ్యానం. ధ్యానంలో ఉన్నప్పుడు మీ మనసులో జరిగే అన్నిటికీ మీరు సాక్షిగా ఉంటారు. మీకు శత్రువు వేరెవరో కాదనీ, మీ మనసేననీ గమనిస్తారు.

రంగులతో నింపేద్దాం

'మీ శత్రుత్వాలను స్నేహాలుగా మార్చుకోండి. ఒక్క శత్రువు కూడా మిగలకూడదు'- ఇదే హోలీ పండుగ ఇచ్చే సందేశం. మన లోపల శత్రుత్వ భావన ఉన్నప్పుడే శత్రువు పుడతాడు. ఆ భావన మనలో లేకపోతే శత్రువులు కూడా ఉండరు. మీరు ఉద్దేశపూర్వకంగా ఎవరికీ హాని చేయనప్పుడు... ఎవరైనా మిమ్మల్ని ఏ కారణంవల్లనైనా శత్రువుగా భావించినా చింతించకండి. మీతో శత్రుత్వం వహించడం వల్ల వాళ్ళే నిద్రపట్టక, కలత చెందుతూ, ఒత్తిడికి గురవుతారు. అది వారి సమస్య. వాళ్ళకే వదిలెయ్యండి. మన వైపు నుంచి మాత్రం శత్రుత్వ భావనను పెంచుకోవద్దు.


వృత్తి, ఉద్యోగం, అంతస్తులు, కులం, లింగం లేదా వయస్సు ఆధారంగా... సమాజంలో విభజనలను కొన్నిసార్లు మనం చూస్తూ ఉంటాం. ఈ అడ్డంకులను దాటి- అందరూ దగ్గరకు చేరే వేడుక హోలీ. వేల ఏళ్ళ నుంచి విభేదాలకు అతీతంగా ప్రజలను ఏకం చేస్తున్న పండుగ ఇది. మానవులందరూ ఒక్కటే అని చాటుతూ ఈ పండుగను జరుపుకొంటారు.

ప్రహ్లాదుణ్ణి చంపడం కోసం అతని అత్త హోలిక అతణ్ణి ఒడిలో కూర్చోబెట్టుకుని మంటల్లోకి వెళ్ళడం, ఆమె కాలిపోవడం, ప్రహ్లాదుడు క్షేమంగా బయటపడడం గురించిన కథ ఒకటి ఉంది. భక్తి భావంలో మునిగి ఉండేవారికి జీవితం వర్ణరంజితంగా, ఉత్సవంగా మారుతుంది. గతాన్ని దగ్ధం చేసి, సరికొత్త ఆరంభానికి మీరు సిద్ధమవుతారు. భావోద్వేగాలు మనల్ని నిప్పులా దహిస్తూ ఉంటాయి. కానీ అవే ఒక రంగుల ఫౌంటెన్ అయినప్పుడు... జీవితానికి ఆహ్లాదాన్ని చేకూరుస్తాయి. అజ్ఞానంలో ఉన్నప్పుడు భావోద్వేగాలు ఒక సమస్య. జ్ఞానంలో ఉన్నప్పుడు అవే భావోద్వేగాలు మీ జీవితాన్ని వర్ణభరితంగా మారుస్తాయి. హోలీ రోజున అందరినీ కలుసుకోండి. తరచుగా నిస్తేజంగా కనిపించే ఈ ప్రపంచాన్ని ఆనందం, భక్తి, స్వచ్ఛత అనే రంగులతో నింపండి.

• శ్రీశ్రీ రవిశంకర్



25న హోలీ



జ్ఞాన తీర్థ సంగమం

శ్రీ రాఘవేంద్రస్వామి పూర్వావతారం... విష్ణుభక్తుడు, శ్రీ నరసింహావతార కరుణాపాత్రుడు అయిన ప్రహ్లాదుడు కాగా... ఆ తదుపరి అవతారం శ్రీవ్యాసరాజ యతివరేణ్యులు. ఆయన ఆరాధన, శ్రీ రాఘవేంద్రుల గురువు శ్రీ సుధీంద్ర తీర్థుల ఆరాధన కూడా ఫాల్గుణ మాసంలోనే జరుగుతుంది. అందులోనూ కృష్ణపక్షంలో వచ్చే తదియ నాడు... మధ్వ సంప్రదాయంలో కలికితురాయిలు అనదగిన గొప్ప యతివరేణ్యులు శ్రీ వ్యాసరాజులు, శ్రీ వాదిరాజులు, శ్రీ సుధీంద్ర తీర్థుల ఆరాధనలు జరగడం మరో విశేషం. అవి ఈ నెల 28న రాబోతున్నాయి. "అది అత్యంత పవిత్రమైన రోజు మాత్రమే కాదు... మధ్వులకు త్రివేణీ సంగమం" అని ప్రసిద్ధ ప్రవచనకారుడు శ్రీ బ్రాహ్మణాచార్యులు వర్ణించారు. గంగ, యమున, సరస్వతి నదులతో కూడినది మనకు తెలిసిన త్రివేణీ సంగమం... కాగా ఆ రోజు ముగ్గురు జ్ఞాన తీర్థుల సంగమం. నదీ తీర్థాలలో వచ్చే పుణ్యఫలం... భగవంతుడు మనకు ఇచ్చినప్పుడు లభిస్తుంది. కానీ తీర్థుల జ్ఞాన సంగమంలో... వారి స్మరణ ద్వారా, వారి బృందావనాల దర్శనం ద్వారా రావలసిన పుణ్య ఫలం తక్షణమే లభిస్తుంది. ఈ యతివరేణ్యులు ముగ్గురూ... మధ్వ సిద్ధాంత సేవ చేయడానికి అవతరించిన దేవతాస్వరూపుల్లో ప్రముఖులు. జ్ఞాన సంపాదనకు, భక్తి ప్రబోధాలకు, జీవితాలను అంకితం చేసిన మహానుభావులు.

ఉడుపికి సమీపంలో ఆనేగుడ్డే అనే ప్రసిద్ధ గణపతి క్షేత్రం ఉంది. అక్కడికి దగ్గరలోని హూవినకెరెలో సామ వేద అధ్యయనం చేసిన వంశానికి చెందిన రామాచార్యులు, గౌరి అనే దంపతులు నివసించేవారు. వారు ఉత్తమమైన పుత్ర సంతానం కోసం తమ భక్తితో, జప తపాలతో భగవంతుణ్ణి మెప్పించే ప్రయత్నం చేశారు. సోణ్డా మఠానికి చెందిన శ్రీ వాగీశ తీర్థుల దగ్గరకు వెళ్ళి... తమ కోరికను విన్నవించుకున్నారు. వారికి పుత్ర సంతానం కలుగుతుందని ఆయన దీవిస్తూ... "ఇంటి బయట బిడ్డ జన్మిస్తే మా మఠానికి ఇవ్వాలి. ఇంటి లోపల జన్మిస్తే మీరే ఉంచుకోవచ్చు" అని ఆదేశించారు. 'బిడ్డ జన్మించేది ఇంట్లోనే. ప్రసవానికి బయటకు వెళ్ళేది లేదు కదా!" అని ఆ దంపతులు భావించారు. గౌరి గర్భం దాల్చిన తరువాత అన్ని జాగ్రత్తలనూ తీసుకొనేవారు. ఉడుపి ప్రాంతంలోని వారి ఇల్లు పొలాల మధ్య ఉంది. శార్వరి నామ సంవత్సరం మాఘ శుద్ధ ద్వాదశి రోజున... ముందురోజు ఉపవాసాన్ని విరమించిన రామాచార్యులు భోజనం చేస్తూ ఉండగా... ఒక ఆవు వచ్చి పంటను మేయడం మొదలుపెట్టింది. దాన్ని అదిలించి పంపేందుకు గౌరి బయట కాలు పెట్టింది. పది అడుగులు వేయగానే ఆమెకు ప్రసవవేదన ప్రారంభమై... ఇంటి బయట పొలంలో మగబిడ్డను ప్రసవించింది. తపోజ్ఞాని అయిన శ్రీవాగీశ తీర్థులు పంపిన బంగారు పళ్ళెంలో... ఆ బిడ్డను మంత్రసానులు ఉంచారు. తమ వాగ్దానం ప్రకారం ఆ బిడ్డను మఠానికి రామాచార్యుల దంపతులు ఇచ్చేశారు. ఆ బిడ్డే మహిమాన్వితుడైన శ్రీ వాదిరాజ తీర్థులు. ఆ మఠానికి భూ వరాహ ప్రతిమను శ్రీ మధ్వాచార్యులు ఇచ్చారు. దాన్ని గుర్తు చేసేలా ఆ బిడ్డకు 'భూ వరాహ' అని శ్రీ వాగీశతీర్థులు నామకరణం చేశారు. "అయిదేళ్ళు వచ్చేవరకూ మీ దగ్గరే అతణ్ణి పెంచండి. తరువాత మఠానికి అప్పగించండి" అని రామాచార్య దంపతులకు ఆ బిడ్డను ఆయన తిరిగి ఇచ్చారు.

శ్రీ వ్యాసరాజుల జననం కూడా దాదాపు ఇదే విధంగా ఉంటుంది. కర్ణాటకలోని మైసూరుకు సమీపంలో ఉన్న అబ్బూరుకు చెందిన రామాచార్యులు, లక్ష్మీ దేవి దంపతులు... సంతానం కోసం బదరీ యాత్రకు బయలుదేరారు. మార్గమధ్యంలో రామాచార్యులు ఆరోగ్యం క్షీణించి, మంచం పట్టారు. ఆయనపై అందరూ ఆశ వదిలేసుకున్నారు. ఈలోగా... బ్రహ్మణ్య తీర్థులు అనే యతి బదరీ యాత్ర ముగించి తిరుగు ప్రయాణంలో ఉన్నారనీ, తాము ఉన్న ఊరిలోనే ఆయన బస చేస్తారనీ లక్ష్మీ దేవికి తెలిసింది. ఆయనను ఆమె దర్శించుకోగా "దీర్ఘ సుమంగళీభవ అనీ, సుపుత్ర ప్రాప్తిరస్తు" అని దీవించారు. వాగీశ తీర్థుల మాదిరిగానే... ఇంట్లో బిడ్డ జన్మిస్తే మీరే ఉంచుకోవచ్చనీ, బయట జన్మిస్తే మఠానికి అందించాలనీ ఆయన ఆదేశించారు. కేవలం ఆయన మాటతో రామాచార్యులు సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందారు. సత్యలోకంలో బ్రహ్మ దేవుని వద్ద ఉంటూ, పరమాత్ముని పూజకు రోజూ పూలను తెచ్చే శంఖుకర్ణుడు తన రెండవ జన్మగా... శ్రీ వ్యాసరాజులుగా వారి ఇంట పుట్టాడు. ఈ జననం కూడా ఇంటి బయటే జరిగింది. ఆ బిడ్డను బ్రహ్మణ్య తీర్థులే శుద్ధ జలంతో కడిగి, దేవుడికి అభిషేకించిన పాలను మొదటగా తాగించారు.

ఈ ఇద్దరు యతివరేణ్యుల జననం, ఇతర సంస్కార విషయాల్లో సారూప్యత మనకు కనిపిస్తుంది. ఇద్దరి జననం ఇంటి బయటే జరిగింది. వారి గురువులు పరమాత్మ సంకల్పాన్ని ఎరిగినవారై... వారు పుట్టగానే భూమిని స్పృశించకుండా బంగారు పళ్ళాలను పంపారు. ఇద్దరికీ ఎనిమిదేళ్ళ వయసులోనే సన్యాసాశ్రమ స్వీకారం జరిగింది. వారిద్దరూ తిరుమల శ్రీనివాసుడికి సేవలు అందిచారు. ఇరువురూ అద్వితీయమైన ఉద్గ్రంథాలను రచించారు. సుప్రసిద్ధమైన కీర్తనలు రాశారు. శ్రీ వ్యాసరాజుల వారి శిష్యులే శ్రీ వాదిరాజులు. ఇక సాక్షాత్తూ శ్రీ రాఘవేంద్రులకే గురువుగా ప్రసిద్ధికెక్కినవారు శ్రీ సుధీంద్రతీర్థులు. ఆ ముగ్గురి ఆరాధన ఒకే రోజు. ఆ మహిమాన్వితులైన చరిత్రలను సంపూర్ణంగా తెలుసుకొని, మననం చేసుకోవడం ద్వారా వారి అనుగ్రహం లభిస్తుంది. తద్వారా ఆ శ్రీహరి అనుగ్రహానికి పాత్రులం కాగలం.

• మధ్వ ప్రచార పరిషత్
9440258841





మధ్వ సంప్రదాయంలో ఉన్నవారికి ఫాల్గుణ మాసం అత్యంత విశేషమైనది. ఈ మాసంలో విష్ణుప్రీతి కోసం వ్రతాలు చేస్తారు. అంతేకాకుండా... ఈ సంప్రదాయంలోని అనేకమంది యతుల ఆరాధనోత్సవాల సమాహారం ఈ మాసం. ఉత్తరాది మఠానికి చెందిన శ్రీ సత్య బోధ తీర్థులు, శ్రీ సత్యవ్రత తీర్థులు, శ్రీ సత్య సంతుష్ట తీర్థులు, సోణ్డా మఠానికి చెందిన శ్రీ వాదిరాజ తీర్థుల ఆరాధనలు ఈ మాసంలోనే వస్తాయి. అలాగే తుంగభద్ర నదీ తీరాన వెలసిన మంత్రాలయ మహాప్రభువు శ్రీ రాఘవేంద్ర స్వామి పట్టాభిషేక, ఆరాధన ఉత్సవాలూ ఈ మాసంలోనే జరుగుతాయి.

సందేశం

జకాత్ అంటే

ఇస్లాంలోని సమస్త ఆరాధనల్లో నమాజ్‌కు ఎంత ప్రాధాన్యం ఉందో జకాత్‌కు కూడా అంతే ప్రాముఖ్యత ఉంది. ఈ రెండిటిలో ఏ ఒక్కదాన్ని నిరాకరించినా.. అది ఇస్లాం పట్ల అవిశ్వాసంగానే పరిగణన పొందుతుంది. వీటిలో ఒకటి లేకపోతే రెండోదానికి ఏమాత్రం విలువ ఉండదు. "విశ్వాసి అయిన ముస్లిం నమాజ్ చేస్తున్నప్పటికీ... ఏటా జకాత్ చెల్లించకపోతే ఆ నమాజ్ వల్ల అతనికి ఎలాంటి ప్రయోజనం చేకూరదు. అలాగే ఏటా జకాత్ చెల్లిస్తున్నా.. జీవితాంతం నమాజ్ చెయ్యకపోతే... అతను చేసిన జకాత్ బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. సత్యాన్ని విశ్వసించి, సదాచార సంపన్నులై నమాజ్ నిర్వహిస్తూ, జకాత్ నెరవేర్చేవారికి పరలోకంలో ఎలాంటి భయం, దుఃఖం ఉండదు" అని అంతిమ దివ్యగ్రంథమైన ఖుర్‌ఆన్ స్పష్టం చేస్తోంది. "విశ్వాసులు ఒకరికొకరు స్నేహితులు, శ్రేయోభిలాషులు. వారు ప్రజలకు మంచి విషయాలు బోధిస్తారు. చెడ్డ విషయాల నుంచి వారిస్తారు. నమాజ్ చేస్తారు. జకాత్ చెల్లిస్తారు. అల్లాహ్ పట్ల, ఆయన ప్రవక్త పట్ల వినయవిధేయతలతో మసలుకుంటారు. వారిపై దైవ కారుణ్యం వర్షిస్తుంది" అని చెబుతోంది.

జకాత్ అంటే 'పవిత్రత, పరిశుద్ధత' అనే అర్థాలు ఉన్నాయి. రంజాన్ మాసానికి సంబంధించిన పరిభాషలో చెప్పాలంటే.. ధనికుడైన వ్యక్తి పవిత్రుడయ్యే ఉద్దేశంతో ఏడాదికి ఒకసారి తన సంపద నుంచి రెండున్నర శాతం చొప్పున పేదల కోసం, ధర్మకార్యాల కోసం చేసే ధన, కనక, వస్తు రూప దానాలను 'జకాత్' అంటారు. "జకాత్ చెల్లింపును ముస్లింలకు అల్లాహ్ విధిగా నిర్దేశించాడు. దీన్ని ధనికుల నుంచి వసూలు చేసి, నిరుపేదలకు అందజేయడం జరుగుతుంది" అని హదీస్ గ్రంథం పేర్కొంది. దివ్య ఖుర్‌ఆన్, హదీస్ గ్రంథాల ప్రకారం... జకాత్ పేద ప్రజల హక్కు అని స్పష్టంగా తెలుస్తోంది. ఇస్లాం సౌధానికి ఉండే అయిదు మూల స్తంభాలలో.. విశ్వాస ప్రకటన, నమాజ్ తరువాత మూడో స్తంభంగా జకాత్ పరిగణన పొందుతోంది. దివ్య ఖుర్‌ఆన్‌లో కనీసం 32 చోట్ల హదీస్ ప్రస్తావన ఉంది. ఇది కూడా జకాత్‌కు ఎంత ప్రాముఖ్యత ఉందో తెలియజేస్తోంది. జకాత్ చెల్లించనివారు ఋజు మార్గాన్ని (సక్రమమైన మార్గాన్ని) పొందలేరనీ, ఒక వేళ పొందినా అందులో స్థిరంగా ఉండలేరనీ కూడా ఖుర్‌ఆన్ బోధనలు చెబుతున్నాయి. జకాత్ చెల్లించని ముస్లింలపై ఖలీఫా హజ్రత్ అబూబకర్ యుద్ధానికి సిద్ధమయ్యారు. దీన్నిబట్టి జకాత్ ఎంత ముఖ్యమైన కార్యమో తెలుస్తోంది. సంపద నుంచి జకాత్ తియ్యకుండా... అందులోనే కలిపి ఉంచితే... అది ఆ సంపదను నాశనం చేస్తుందని దైవ ప్రవక్త మహమ్మద్ హెచ్చరించారు.

• మహమ్మద్ వహీదుద్దీన్

నోరు మంచిదైతే...

సద్బోధ



లోకంలో మంచీ ఉంటుంది, చెడూ ఉంటుంది. వ్యక్తుల బుద్ధిని బట్టి, మనసును బట్టి ఈ తాతరమ్యాలు. మా అమ్మమ్మ అంటూ ఉండేది... "కొందరిని చూస్తే కొట్ట బుద్ధవుతుంది, ఇంకొందరిని చూస్తే పెట్ట బుద్ధి అవుతుంది" అని. ఎందుకంటే... కొందరు మాట్లాడితే హాయిగా ఉంటుంది. వారి మాటల్లో సౌహార్దం, సౌజన్యం, తీయదనం మనల్ని కదలనివ్వవు. ఎంతసేపైనా వినాలనిపిస్తుంది. ఇంకొందరు మాట్లాడితే నిప్పుల కొలిమి దగ్గర నిలబడ్డట్టు ఉంటుంది. సెగలూ, పొగలూ చిమ్ముతూ ఉంటాయి. మనసుకు ఖేదం కలిగిస్తాయి. వారి మాటల్లో ఆత్మస్తుతి, పరనింద తప్ప ఇంకేవీ ఉండవు. అలాంటివారికి దూరంగా ఉండాలి. 'చెడు వినకు, చెడు మాట్లాడకు, చెడు చేయకు' అన్నారు కదా పెద్దలు!

ఈ విషయంలో భారతం ఏం చెబుతోందో తెలుసా? ఎవడు మనస్సును, వాక్కును కట్టడి చేసుకుంటూ రక్షించుకుంటాడో... అతని అరచేతిలో సంతోషం, స్వర్గం ఉంటాయి. ఎదుటి వ్యక్తి మీద తిట్లతో దుమ్మెత్తి పోయగానే సంబరం కాదు. తిట్లు పడినవాడి పాపాలన్నీ తిట్టిన వాణ్ణి చేరుతాయి. కాబట్టి శత్రుత్వం సకారణమైనా, అకారణమైనా మాటల్లో విషం చిమ్మకూడదు. మాటలతో మలమల మాడ్చేయకూడదు. ఎదుటివాళ్ళు చెప్పింది మనకు నచ్చకపోవచ్చు. అందులో తప్పేం లేదు. "నువ్వు చెప్పింది సుతరామూ నాకు ఇష్టం లేదు" అనే స్వేచ్ఛ మనకు ఎప్పుడూ ఉంది. అలాకాకుండా నచ్చని మాట, గిట్టని మాట చెవిన పడగానే గంగవెర్రులెత్తుతూ, అసలు విషయం విడిచిపెట్టి... వ్యక్తిగత దూషణలకు దిగజారడం సబబు కాదు. ఒకరిని తిట్టి, తూలనాడి, నిందించి, పదిమందిలో పరిహాసం చేసి... వాళ్ళ పాపాలను మనం ఎందుకు కొనితెచ్చుకోవాలి? దుష్టుడు, దుర్మార్గుడు, కోపిష్ఠి, నోటిని అదుపులో పెట్టుకోలేనివాడు పొరపాటున ఎప్పుడైనా ఒకటి రెండు సత్కార్యాలు చేసి ఉంటే... వాటిని యముడు అపహరించుకుపోతాడట.

మనిషికి మాట గొప్ప వరం. పలుకకపోవడం కన్నా పలకడం మేలు. కానీ పలికే మాట చల్లగా, కర్పూర చందనంలా ఉండాలి. సత్యమై ఉండాలి. ధర్మం తప్పకుండా, సర్వజన ప్రియంగా మాట్లాడాలి. దాన్ని 'వాఙ్మయ తపస్సు' అంది మహా భారతం. మంచి మాట మన దగ్గర ఉంటే... మరో తోడు కోసం చూడాల్సిన పని లేదు. మన మంచి మాటే పదిమందిని మన చుట్టూ చేరుస్తుంది. అదే మాట గండ్రగొడ్డలిలా మనిషిని నిట్టనిలువుగా చీల్చేలా ఉందనుకోండి... మన బతుకు ఎడారే! ఒంటరిగా ఏడవాల్సిందే. మనసులో ముళ్ళ కంపలు పేర్చుకొని... కనబడినవాడినల్లా నిందిస్తు, నొప్పించడమే పరమావధిగా పెట్టుకున్న వాళ్ళ దగ్గరకు ఎవరు పోతారు? కొరివితో ఎవరు తల గోక్కుంటారు?

ఒక ఆసామి వేరే ఊరు పొలిమేరలో నిలబడి "ఈ ఊరు మంచిదేనా?" అని దారిన పోయే దానయ్యను అడిగాడు. దానికి సమాధానంగా "నీ నోరు మంచిదేనా?" అని దానయ్య ఎదురడిగాడు. అలాగే 'నోరా! వీపుకి తేకే' అనే సామెత కూడా ఉంది. కాబట్టి నోరుంది కదా అని ఇష్టం వచ్చినట్టు మాట్లాడకూడదని మహా భారతం హెచ్చరిస్తోంది. ఎవరైతే మాటలతో, చేతలతో ఇతరులను నొప్పించకుండా ఉంటారో... వాళ్ళు ఉత్తములు. అందరూ నోటితో మాట్లాడతారు. కొందరే మనస్సుతో మాట్లాడతారు. వాళ్ళు ఉత్తమోత్తములు. మహామనీషులు.

• ప్రయాగ రామకృష్ణ

విద్యే మహా సంపద

హర్తుర్యాతి న గోచరం కిమపి శం పుష్ణాతి యత్సర్వదా
వ్యర్థిభ్యః ప్రతిపాద్యమాన మనిశం ప్రాప్నోతి వృద్ధిం పరామ్
కల్పాంతేష్వపి న ప్రయాతి నిధనం విద్యాఖ్యమంతర్ధనం
యేషాం తాన్ప్రతిమానముజ్ఝత నృపాః కస్తైః సహ స్పర్ధతే...

అంటూ పండితుల గొప్పతనాన్ని భర్తృహరి తన 'నీతి శతకం'లో వర్ణించాడు.

దాన్ని ఏనుగు లక్ష్మణకవి...

హర్తకు గాదు గోచర మహర్నిశమున్ సుఖపుష్టి సేయు న
ర్థి ర్థిమటించు విద్యయను దివ్యధనం బఖిలార్థ కోటికిం
బూర్తిగ నిచ్చినంబెరుంగు బోదు యుగాంతపు వేళనైన భూ
భర్తలు తద్ధనాధికుల పట్టున గర్వము మాను టొప్పగున్.. అని

తెలుగులోకి అనువదించారు.

భావం: విద్య అనేది గొప్ప ధనం. అది మహా సంపద. దాన్ని దోచుకోవడం దొంగలకు సాధ్యం కాదు. విద్య వల్ల ఎల్లప్పుడూ సుఖం కలుగుతూ ఉంటుంది. దాన్ని ఇతరులకు పంచి ఇచ్చిన కొద్దీ పెరుగుతూ ఉంటుంది. ప్రళయకాలంలో కూడా అది నశించదు. అంత గొప్పదైన విద్యను కలిగి ఉన్న పండితుల పట్ల ఎంతటి సంపన్నులైనా గర్వాన్ని ప్రదర్శించకూడదు. పండితులను వినయంతో గౌరవించాలి, ఆదరించాలి.


సుభాషితం




ఉన్నది ఒక్కటే...

కర్ణుడు, అర్జునుడు... వీరిద్దరూ కుంతీదేవి కుమారులే. కానీ ప్రత్యర్థులుగా వేర్వేరు పక్షాల తరఫున పోరాడారు. కర్ణుడు శాపగ్రస్తుడు. ఆ శాపాల కారణంగా... అర్జునుడితో కీలకమైన యుద్ధం చేస్తున్న సమయంలో... కర్ణుడికి ఉన్న కౌశలం, అనుభవం అతణ్ణి కాపాడలేకపోయాయి. యుద్ధంలో ఓడిపోయాడు, మరణించాడు. ఈ పరిస్థితి మనందరికీ వర్తిస్తుంది. ఎందుకంటే మనం దరం కర్ణుడిలాంటి వాళ్ళమే. జీవితంలో మనం ఎన్నో నేర్చుకుంటాం, విజ్ఞానాన్నీ, అనుభవాన్నీ సంపాదిస్తాం. కానీ కీలకమైన సందర్భాల్లో... మన సహజ ప్రవృత్తికి అనుగుణంగా ఆలోచించి, వ్యవహరిస్తాం తప్ప, మన అవగాహనకు లేదా జ్ఞానానికి అనుగుణంగా కాదు. ఎందుకంటే, మన జ్ఞానం లోతు... మనకు అవసరమైన స్థాయి కన్నా తక్కువగా ఉంటుంది. దీన్ని సూచిస్తూ... 'భగవద్గీత'లో వాస్తవం, సత్యం గురించి అనేక కోణాల్లో శ్రీకృష్ణుడు పదేపదే వివరించాడు. మనలో అంతరాత్మ, బహిర్ ఆత్మ ఉంటాయనీ, అవి ఒకే నదికి రెండు తీరాల్లాంటివనీ భగవద్గీత చెబుతోంది. సత్యాన్ని గ్రహించి... అన్ని జీవులలోనూ ఉన్నది, శాశ్వతమైనదీ, ఎలాంటి మార్పూ లేనిదీ అయిన అంతరాత్మను నేనేనని తెలుసుకోవాలని శ్రీకృష్ణుడు తెలిపాడు. అంతరాత్మను... అంటే ఆవలి తీరాన్ని చేరిన తరువాత మాత్రమే... 'ఉన్నది ఒక్కటే తీరం' అనే జ్ఞానోదయం కలుగుతుంది. వంద పుస్తకాలు చదవడం కన్నా భగవద్గీతలోను... ముఖ్యంగా రెండో అధ్యాయాన్ని... అనేకసార్లు చదవడం ఉత్తమమంటారు పెద్దలు.. చదివిన ప్రతిసారీ భగవద్గీత ఒక భిన్నమైన అవగాహనను అందిస్తుంది. మనలో వివేచనను కలిగిస్తుంది. అప్పుడు 'నేను' అనే భావన క్రమంగా తొలగి, ఆనందం వెల్లివిరుస్తుంది.

గీతాసారం





కె. శివప్రసాద్
ఐఏఎస్

దైవాన్ని మెప్పించే గుణం

ఎవరికైనా ఆపత్కాలంలో చేసే సాయం, దానం... ఇవి మనం దాచుకొనే నిధులు. మనకు అవసరమైనప్పుడు సాయపడడానికి అవి సదా సిద్ధంగా ఉంటాయి. మనిషికి ఉండాల్సిన గొప్ప గుణం దానం. మంచి మనసుతో తలపెట్టే దానాన్ని చూసి దేవుడు తప్పకుండా దీవిస్తాడనీ, బీదల పట్ల ఎంత దయగా ప్రవర్తిస్తే... అంతటి దయ దేవుని నుంచి లభించగలదని బైబిల్ వాక్యాలు చెబుతున్నాయి. దానం అంటే కేవలం డబ్బే కానక్కరలేదు. చింతలో ఉన్న వారికి ఓదార్పు, చావు బతుకుల్లో ఉన్నవారికి రక్త దానం, ఆకలితో ఉన్నవారికి అన్నదానం... ఇవన్నీ దేవుని అనుగ్రహాన్ని కలిగించేవే. అలాగే అజ్ఞానంతో ఉన్నవారిని మంచి మార్గంలో నడిపించే మాట సాయం కూడా దేవుణ్ణి మెప్పిస్తుంది.

దానగుణం ఉన్నవారే భాగ్యవంతులని చాటిచెప్పిన కథ ఒకటి బైబిల్‌లో ఉంది. ఒక పేద వృద్ధురాలు తన చెంగు ముడికి కట్టిన కాసును విప్పి, కానుకల పెట్టెలో వేయడం ఏసు క్రీస్తు గమనించాడు. ఆమెను అభినందిస్తూ "ఇక్కడ ఉన్న ఎందరో ధనవంతుల కన్నా ఈమె మహా భాగ్యవంతురాలు. తనకు ఉన్నదాన్లోంచే దేవునికి ఇష్టపూర్వకంగా కానుక సమర్పించింది" అని అందరికీ చెబుతాడు. ఈ లోకానికి తన ఉపదేశాలతో మార్గాన్ని చూపిన ఏసు క్రీస్తు.... తన ప్రాణాలనే ఈ లోకానికి దానంగా సమర్పించాడు. భక్తిగా ఇచ్చేది ఏదైనా దేవుడు స్వీకరిస్తాడు. అయితే ఆపన్నులకు చేసే దానాన్ని అంతకన్నా ఇష్టపడతాడు. రాబోయే గుడ్‌ఫ్రైడే వరకూ.. ప్రస్తుతం క్రైస్తవులు పాటిస్తున్న శ్రమదీక్ష ఉపవాసాలతో పాటు... దానం చేయడం, సత్ప్రవర్తనతో మెలగడం దైవ కృపకు మరింతగా పాత్రుల్ని చేస్తుంది.

దైవమార్గం



• డాక్టర్ దేవదాసు బెర్నార్డ్ రాజు, 9866755024



హైదరాబాద్ షెడ్యూల్ పూర్తి

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న ఫాంటసీ అడ్వెంచర్ 'విశ్వంభర' షూటింగ్ శరవేగంతో హైదరాబాద్‌లో జరుగుతోంది. చిరంజీవి, హీరోయిన్ త్రిష తదితరులు పాల్గొనగా కొన్ని సీన్లు, ఓ పాట, యాక్షన్ బ్లాక్‌ను చిత్రీకరించారు. ఇవన్నీ సినిమాలో కీలక సన్నివేశాలు కావడం గమనార్హం. ఈ షెడ్యూల్ పూర్తయినట్లు గురువారం చిత్ర నిర్మాతలు ప్రకటించారు. అలాగే చిరంజీవి నివాసంలో సంగీత దర్శకుడు కీరవాణి, దర్శకుడు వశిష్ట, ఛాయాగ్రాహకుడు చోటా కె నాయుడు, నిర్మాతలు వంశీ, విక్రమ్ తదితరులతో కలసి ఉన్న ఫొటోలను త్రిష సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అలాగే మరో పోస్టర్‌ను నిర్మాతలు విడుదల చేశారు. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న 'విశ్వంభర' చిత్రాన్ని విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు, వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 10న ఈ సినిమా విడుదలవుతుంది.

భూకంపం చూసి భయపడ్డా

కార్తికేయ



దర్శకుడు రాజమౌళి కుటుంబంతో కలసి ప్రస్తుతం జపాన్‌లో పర్యటిస్తున్నారు. ఆ దేశం తరచూ భూకంపాల బారిన పడుతుందనే విషయం తెలిసిందే. గురువారం రాజమౌళి కుటుంబం ఉన్న స్టార్‌హోటల్ పరిసరాల్లోనూ స్వల్పంగా భూమి కంపించింది. ఎవరికీ ప్రమాదం జరగలేదు. ఈ విషయాన్ని రాజమౌళి తనయుడు కార్తికేయ గురువారం సోషల్ మీడియా ద్వారా తెలిపారు. తన స్మార్ట్ వాచ్‌కు వచ్చిన భూకంపం హెచ్చరిక సందేశాన్ని షేర్ చేస్తూ 'హోటల్ భవనం కదులుతున్నట్లనిపించింది, అది భూకంపం వల్ల అని తెలుసుకొని భయపడ్డా' అని తెలిపారు. 'మహేశ్‌బాబు-రాజమౌళి సినిమా 'ఎస్ఎస్ఎంబీ 29 (వర్కింగ్ టైటిల్) ప్రభావం జపాన్‌లో ఎలా ఉండబోతోందో రిహార్సల్స్ చేస్తున్నారా' అని కార్తికేయను ఓ నెటిజన్ సరదాగా అడిగారు. ఆ సినిమా ప్రభావం జపాన్‌కే పరిమితం కాదు, ప్రపంచమంతా ఉంటుంది అని కార్తికేయ సినిమాపై మరింత అంచనాలు పెంచేలా బదులిచ్చారు.



కశ్మీర్ యాపిల్ కాదు.. మిర్చి

అప్సరారాణి ప్రధాన పాత్ర పోషించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'తలకోన'. నగేశ్ నారదాసి దర్శకత్వంలో దేవర శ్రీధర్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 29న సినిమా విడుదల అవుతున్న సందర్భంగా బుధవారం రాత్రి ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. ఇందులో నిర్మాత మాట్లాడుతూ 'మా హీరోయిన్ అప్సరా రాణి ఇంతవరకూ చేయని సినిమా ఇది. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ థ్రిల్లర్. అడవి అనగానే కేవలం ప్రకృతి అందాలే కాకుండా ఇంకో కోణం ఉంటుదని చూపించా' అన్నారు. 'మా హీరోయిన్ అప్సరా రాణి చూడడానికి కశ్మీర్ యాపిల్‌లా కనిపిస్తుంది కానీ ఇందులో కశ్మీర్ మిర్చిలా నటించింది. చాలా వెరైటీ స్టోరీ ఇది' అని చెప్పారు దర్శకుడు నగేశ్. ఈ సినిమాలో ఫైట్స్ కూడా చేసినట్లు అప్సరా రాణి చెప్పారు. తన కెరీర్‌లో మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు.

ఆయ్.. పాట విడుదలైందండీ!



నార్నే నితిన్, నయన్ సారిక జంటగా నటిస్తున్న 'ఆయ్' చిత్రంలోని 'సూఫియానా' అంటూ సాగే మెలోడీ సాంగ్‌ను తాజాగా విడుదల చేశారు. శ్రీమణి రాసిన పాటను భరద్వాజ్, రమ్యశ్రీ పాడారు. ప్రస్తుతం సూపర్‌హిట్ సాంగ్స్‌కు కేరాఫ్‌గా మారిన రామ్ మిర్యాల ఈ చిత్రానికి సంగీత దర్శకుడు. అంజి కంచిపల్లి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. అల్లు అరవింద్ సమర్పకులు. బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మాతలు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది.

కొత్త అనుభూతిని పంచే టిల్లు స్క్వేర్

యువతలో విపరీతమైన కల్ట్ ఫాలోయింగ్ సంపాదించుకున్న సినిమాలలో 'డీజే టిల్లు' ఒకటి. టిల్లుగా సిద్ధు జొన్నలగడ్డ పంచిన వినోదాన్ని ప్రేక్షకులు అంత తేలికగా మరిచిపోలేరు. టిల్లు మాటలు, చేష్టలు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్నాయి. ఇప్పుడు 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్' ఈ నెల 29న వస్తోంది. ఈ సందర్భంగా గురువారం చిత్ర దర్శకుడు మల్లిక్ రామ్ మీడియాతో ముచ్చటించారు.



టిల్లు స్క్వేర్ ప్రాజెక్ట్ లోకి ఎలా వచ్చారు?

డీజే టిల్లు, నేను దర్శకత్వం వహించిన 'అద్భుతం' సినిమాలు ఇంచుమించు ఒకే సమయంలో వచ్చాయి. ఆ తర్వాత నేను, సిద్ధు కలసి ఒక సినిమా చేయాలి అనుకున్నాం. అదే సమయంలో నాగవంశీ గారు 'టిల్లుస్క్వేర్ చేస్తే బాగుంటుందని చెప్పడం, డీజే టిల్లు దర్శకుడు విమల్ కృష్ణ ఇతర కమిట్‌మెంట్స్‌తో బిజీగా ఉండటంతో నేను ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చాను. మొదట కాస్త సంకోచించాను కానీ కథ బాగా వచ్చేసరికి ఇక వెనకడుగు వేయలేదు.

సినిమాలో సిద్ధు ప్రమేయం ఎంతవరకు ఉంటుంది?

సిద్ధు ఒక రచయితగా, నటుడిగా ఎంతవరకు ఇన్వాల్వ్ అవ్వాలో.. అంతవరకే ఇన్వాల్వ్ అవుతాడు. డైరెక్టర్‌కు స్వేచ్ఛను ఇస్తాడు.

టిలు స్క్వేర్ ఎలా ఉండబోతుంది?

డీజే టిల్లు, టిల్లు స్క్వేర్‌కి ఎంతో వ్యత్యాసం ఉంటుంది. డీజే టిల్లు డెడ్ బాడీ నేపథ్యంలో సాగే బ్లాక్ కామెడీ. కానీ టిల్లు స్క్వేర్ ఒక కమర్షియల్ సినిమాలా ఉంటుంది. టిల్లు పాత్ర తీరు అలాగే ఉంటుంది. రాధిక పాత్ర ప్రస్తావన ఉంటుంది. మొదటి భాగాన్ని ముడిపెడుతూ కొన్ని సన్నివేశాలు ఉంటాయి. డీజే టిల్లుని గుర్తు చేస్తూనే టిల్లుస్క్వేర్ అందరికీ కొత్త అనుభూతిని ఇస్తుంది.

అనుపమానే ఎన్నుకోవడానికి కారణం?

ఈ సినిమాలో లిల్లీ పాత్ర చాలెంజింగ్ రోల్. ఆ పాత్ర కోసం ఎందరో పేర్లను పరిశీలించాం. కానీ అనుపమానే పర్ఫెక్ట్ చాయిస్ అనిపించింది. అనుపమాని బోల్డ్‌గా చూపించాలనే ఉద్దేశంతో లిల్లీ పాత్రను రాసుకోలేదు. లిల్లీ పాత్ర తీరే అలా ఉంటుంది.

రీ షూట్‌కి వెళ్ళడానికి కారణం ఏంటి?

ఇంటర్వెల్ తర్వాత ద్వితీయార్థం ప్రారంభ సన్నివేశాలు చాలా సినిమాల్లో తేలిపోతుంటాయి. ఫస్టాఫ్ బాగుంటుంది. క్లైమాక్స్ కూడా బాగుంటుంది. కానీ ఆ 15-20 నిమిషాలు ఆశించిన స్థాయిలో ఉండదు. టిల్లు స్క్వేర్ విషయంలో అలా జరగకూడదన్న ఉద్దేశంతో.. ఆ కొన్ని సన్నివేశాలు మరింత మెరుగ్గా రాసుకొని రీ షూట్ చేశాం.

విజయవంతమైన చిత్రానికి సీక్వెల్ కదా.. ఒత్తిడికి లోనయ్యారా?

ఒత్తిడి ఉండటం సహజం. కానీ కథ బాగా రాసుకోవడంతో.. చిత్రీకరణ సమయంలో పెద్దగా ఒత్తిడి అనిపించలేదు.

ప్రేమలో పడ్డా




'సీటాడెల్: హనీ బన్నీ' వెబ్‌సిరీస్‌తో అలరించడానికి సిద్ధమవుతున్నారు సమంత. ఇందులో ఆమె హనీ అనే గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు. హనీ పాత్ర గురించి సమంత మాట్లాడుతూ ఒక కల్పిత పాత్ర నిజ జీవితంలో మనకు స్ఫూర్తిగా నిలవడం గొప్ప విషయం అన్నారు. 'ఇందులో నేను ఫుల్ యాక్షన్ ప్యాక్డ్ రోల్‌లో కనిపిస్తాను. ఇలాంటి పాత్రలు నిజ జీవితంలో కనిపించడం చాలా అరుదు. ప్రేక్షకులకు వినోదం పంచడానికి అనేక పాత్రలను దర్శకులు సృష్టిస్తారు. వాటిలో కొన్ని పాత్రలు మాత్రం మన మనసుకు దగ్గరవుతాయి. షూటింగ్ మొదలుపెట్టిన తర్వాత హనీ పాత్రతో అనుబంధం పెరిగింది. ఆ పాత్ర వ్యక్తిత్వం నా మనసుపై చెరగని ముద్ర వేసింది. పరిస్థితుల ప్రభావం వల్ల దిగులుగా అనిపించినప్పుడల్లా హనీలా ధృఢంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. మనం ఎంత ప్రశాంతంగా ఉన్నా ఎన్నో సందర్భాల్లో నెగెటివ్ వాతావరణం మన మనసును కమ్మేసి అశాంతిని కలుగజేస్తుంది. అలాంటప్పుడు హనీలా ప్రవర్తించడానికి ప్రయత్నం చేస్తే నాలో కొత్త ఉత్సాహం వెల్లువెత్తుతుంది. అందుకే ఆ పాత్రతో ప్రేమలో పడ్డాను' అని సమంత పేర్కొన్నారు.

మోకాళ్లపై మెట్లెక్కిన జాన్వీ



సెలవులు చిక్కినప్పుడల్లా ప్రముఖ దేవాలయాలను సందర్శిస్తూ ఆ వీడియోలను అభిమానులతో పంచుకోవడం హీరోయిన్ జాన్వీకపూర్‌కు అలవాటు. ముఖ్యంగా కుటుంబంతో కలసి ఎన్నోసార్లు ఆమె తిరుమలను సందర్శించి, వేంకటేశ్వర స్వామిని భక్తి ప్రపత్తులతో కొలిచారు. ఇటీవలే తన పుట్టిన రోజు సందర్భంగా ఆమె



స్నేహితుడు ఓరీతో కలసి తిరుమల వచ్చారు. దానికి సంబంధించిన వీడియోను ఓరీ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. కాలి నడక దారిలో వారు కొండపైకి వెళ్లారు. మోకాళ్ల మిట్ట వద్ద జాన్వీ మోకాళ్లపై మెట్లు ఎక్కారు. తిరుమల శ్రీవారు అంటే తనకు ఎంతో భక్తి అని జాన్వీ పలు సందర్భాల్లో చెప్పారు. ఇప్పుడు ఈ వీడియో వైరల్ అయింది. ప్రస్తుతం జాన్వీ రామ్‌చరణ్ సరసన ఓ చిత్రంలో నటిస్తున్నారు. అలాగే ఎన్టీఆర్ తో 'దేవర' చిత్రం చేస్తున్నారు.



ఇది భావోద్వేగ ప్రయాణం

దాదాపు 25 ఏళ్ల తర్వాత నటి జ్యోతిక మళ్లీ బాలీవుడ్‌లో నటించిన చిత్రం 'సైతాన్'. ఇందులో అజయ్ దేవగన్‌కు భార్యగా, ఇద్దరు పిల్లలకు తల్లిగా ఆమె నటించారు. ఈ నెల 8న విడుదలైన ఈ చిత్రం సూపర్ హిట్ అయి, ఇప్పటికి రూ. 150 కోట్లు వసూలు చేసింది. 'సైతాన్' హిట్ అయిన సందర్భంగా అజయ్ దేవగణ్, మాధవన్‌తో ఉన్న వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఓ పోస్ట్ పెట్టారు జ్యోతిక. 'కొన్ని సినిమాలు గమ్యస్థానాలు మాత్రమే కానీ 'సైతాన్' సినిమా మాత్రమే కాదు. చిరకాల మిత్రులతో చేసిన ఓ భావోద్వేగ ప్రయాణం. ప్రతి తల్లి, తండ్రి చూడాల్సిన సినిమా ఇది. ముఖ్యంగా టీనేజ్ పిల్లలు ఉన్న వారు తప్పకుండా వారు ఆ పిల్లలు ఏం చేస్తున్నారో ఓ కన్నేసి ఉంచాలి. ఇంత గొప్ప చిత్రంలో నేనూ భాగం అయినందుకు చాలా ఆనందంగా ఉంది. చిత్ర బృందానికి అభినందనలు' అని పేర్కొన్నారు . గుజరాతీ చిత్రం 'వష్' ఆధారంగా 'సైతాన్' చిత్రం రూపుదిద్దుకుంది.

రిషబ్ సొంతూళ్లో భారీ సెట్



2022లో విడుదలైన 'కాంతార' చిత్రం దేశవ్యాప్తంగా బాక్సాఫీసు దగ్గర సంచలన విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. రిషబ్‌శెట్టి హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహించిన ఈ సూపర్‌హిట్‌కు కొనసాగింపు చిత్రాన్ని గతేడాదే నిర్మాణసంస్థ హోంబలే ఫిల్మ్స్ ప్రకటించింది. వచ్చే నెలలో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. అయితే అంతా అనుకుంటున్నట్లు 'కాంతార'కు సీక్వెల్ కాదు... ప్రీక్వెల్. 'కాంతార' సినిమా కథ మొదలవడానికి ముందు జరిగిన సంఘటనలతో ప్రీక్వెల్ రూపొందుతోంది. 'కాంతార: చాప్టర్ 1' అనే టైటిల్ ఖరారు చేశారు. 'ది లెజెండ్' అనేది ఉపశీర్షిక. ఇటీవలే చిత్రబృందం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయగా సోషల్ మీడియాలో వైరల్ అయింది. రిషబ్ సొంతూరు కదిరిలో ఓ భారీసెట్‌ను రూపొందించారు. అధికభాగం షూటింగ్ ఇక్కడే జరుగనుంది. విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అజనీశ్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నారు.

పలాస కన్నా పెద్ద హిట్ అవ్వాలి



'పలాస 1978' ఫేమ్ రక్షిత్ అట్లూరి, కోమలీ ప్రసాద్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'శశివదనే'. గోదావరి నేపథ్యంలో లవ్, యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాకు సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వం వహించారు. అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోడల నిర్మించారు. ఏప్రిల్ 19న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు సాయి మోహన్ ఉబ్బన మాట్లాడుతూ "ఇది హార్డ్ హిట్టింగ్ మూవీ. క్లైమాక్స్ ఈ సినిమాకు ప్రాణం. సినిమా ముగిశాక ప్రేక్షకులు ఎన్నో భావోద్వేగాలతో బయటికి వస్తారు" అని చెప్పారు. నిర్మాత అభిలాష్ రెడ్డి మాట్లాడుతూ "రక్షిత్ అట్లూరి, కోమలి వారి నటనతో ఈ సినిమాను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లారు" అని ప్రశంసించారు. హీరో రక్షిత్ అట్లూరి మాట్లాడుతూ "పలాస' కంటే 'శశివదనే' పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. అవుతుందని నమ్మకంగా ఉన్నాను" అని తెలిపారు. నిర్మాత అహితేజ మాట్లాడుతూ "ఈ సినిమాలో ప్రేక్షకులను అలరించే అన్ని అంశాలు ఉన్నాయి. కొత్త తరహా అనుభూతిని ఇచ్చే చిత్రమిది. క్లైమాక్స్ మా సినిమాకు ప్రత్యేక ఆకర్షణ" అని అన్నారు.

ధనాధన్‌కు సిద్ధమా!

నేటి నుంచే ఐపీఎల్ 17వ సీజన్

చెన్నై x బెంగళూరు మధ్య ఆరంభ పోరు

రాత్రి 8.00 నుంచి స్టార్‌స్పోర్ట్స్, జియో సినిమాలో..

మహి
ళల ప్రీమియర్ లీగ్ ముగిసిందో..
లేదో.. అంతకు మించిన వినోదం రెడీగా ఉంది.
16 ఏళ్లుగా వన్నె తరగని రీతిలో అంతకంతకూ ఆకర్షణ పెంచుకుంటూ వస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్‌కు తెర లేవనుంది. ఇక రెండు నెలల పాటు బ్యాటర్ల బాదుడు.. ఫీల్డర్ల మెరుపు విన్యాసాలు.. బౌలర్ల అబ్బురపరిచే బంతులను ఈ క్రేజీ లీగ్‌లో మైమరిచి చూసేందుకు క్రికెట్ ప్రేమికులంతా సిద్ధంగా ఉండాల్సిందే. అలాగే రానున్న టీ20 వరల్డ్‌కప్‌లో బెర్త్ దక్కించుకునేందుకు యువ ఆటగాళ్లతో పాటు వెటరన్స్‌కు కూడా ఈ లీగ్ కీలకమే. దీనికి తోడు డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్-రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మధ్య బ్లాక్‌బస్టర్ మ్యాచ్‌తో ఆరంభమే ఘనంగా ఉండబోతోంది.



మెగాలీగ్ కెప్టెన్లు

రాహుల్ (లఖ్‌నవూ)
కమిన్స్ (సన్‌రైజర్స్)
జితేశ్ (పంజాబ్ వైస్‌కెప్టెన్)
రుతురాజ్ (చెన్నై)
రిషభ్ పంత్ (ఢిల్లీ)
డుప్లెసి (బెంగళూరు)
గిల్ (గుజరాత్)
శాంసన్ (రాజస్థాన్)
హార్దిక్ (ముంబై)
శ్రేయాస్ (కోల్‌కతా)

చెన్నై: టీ20 ప్రపంచకప్‌నకు ముందే అభిమానులకు కావాల్సినంత వినోదం లభించనుంది. నేటి నుంచే ఐపీఎల్ 17వ సీజన్ ఆరంభం. అయితే ఈసారి లీగ్ సమయంలోనే దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరుగనుండడంతో ప్రస్తుతానికి 15 రోజుల షెడ్యూల్‌నే ప్రకటించారు. దీనిలో భాగంగా శుక్రవారం నుంచి ఏప్రిల్ 7 వరకు తొలి దశ మ్యాచ్‌లు జరుగబోతున్నాయి. ఈమేరకు మొత్తంగా పది జట్లు, పది వేదికల్లో 21 మ్యాచ్‌ల్లో తలపడతాయి. మిగతా షెడ్యూల్ స్వదేశంలో ఉంటుందా? తటస్థ వేదికల్లో నిర్వహిస్తారా? అనేది తేలాల్సి ఉంది. మరోవైపు జాతీయ జట్టులో సహచరులుగా ఉన్న వారే ఇక మైదానంలో ప్రత్యర్థులుగా సవాల్ విసురనున్నారు. అటు ఫ్యాన్స్ కూడా తమ ఫ్రాంచైజీల వారీగా విడిపోయి విదేశీ ఆటగాళ్లకైనా జేజేలు పలికేందుకు సిద్ధమవుతున్నారు. దాదాపుగా అన్ని జట్లలో పలువురు కీలక ఆటగాళ్లు గాయాలతో దూరమైనా.. ఏ మాత్రం కళ తప్పని ఈ లీగ్‌లో స్టార్ ప్లేయర్లతో పాటు యువ ఆటగాళ్లు కూడా ఆకట్టుకోవాలనుకుంటున్నారు. అలాగే కారు ప్రమాదం నుంచి కోలుకుని తిరిగి బ్యాట్ పట్టనున్న ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ రిషభ్ పంత్ ఎలా రాణిస్తాడనేది ఫ్రాంచైజీతో పాటు భారత టీమ్ మేనేజ్‌మెంట్ కూడా ఆత్రుతగా ఎదురుచూస్తోంది..

విరాట్‌కు కీలకం



తాజా లీగ్‌లో అందరికళ్లూ విరాట్ కోహ్లీపైనే ఉండనున్నాయి. ధనాధన్ ఫార్మాట్‌లో యువ ఆటగాళ్లు దూసుకువస్తుండడంతో టీ20 జట్టులో విరాట్ స్థానం సందేహంగా మారింది. ఈ లీగ్ ముగిశాక జూన్ 2 నుంచి టీ20 వరల్డ్‌కప్ ఉండడంతో ఆయా ఆటగాళ్ల ఫామ్‌ను సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకోనున్నారు. ఇప్పటికే విరాట్‌కు చోటు సందేహమనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. దీంతో ఈ ఐపీఎల్‌లో తనను తాను నిరూపించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. 2022 టీ20 వరల్డ్‌కప్ ముగిశాక విరాట్ ఆడింది కేవలం రెండు టీ20 మ్యాచ్‌లే కావడం గమనార్హం. వాస్తవానికి తన టీ20 ఫామ్ మరీ అంత పేలవంగా ఏమీ లేదు. 117 మ్యాచ్‌ల్లో 138.15 స్ట్రయిక్ రేట్‌తో ఈ ఫార్మాట్‌లో అత్యధికంగా 4,037 పరుగులు సాధించాడు.

ఆటలో 'విలువ' కనిపిస్తుందా?

డిసెంబరులో జరిగిన ఐపీఎల్ వేలంలో కనీవినీ ఎరుగని రీతిలో పలువురు ఆటగాళ్లను ఆయా ఫ్రాంచైజీలు కొనుగోలు చేశాయి. ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్‌ను కోల్‌కతా జట్టు ఏకంగా రూ.24 కోట్ల 75 లక్షలకు తీసుకుంది. తమ పేస్ దళానికి ప్రధాన ఆయుధంగా పనికివస్తాడనే భావనలో కేకేఆర్ ఈ రికార్డు ధరకు మొగ్గు చూపింది. ఇక ప్యాట్ కమిన్స్ కోసం సన్‌రైజర్స్ రూ.20 కోట్ల 50 లక్షలను వెచ్చించింది. ఆసీస్‌కు టీ20 ప్రపంచకప్‌ను అందించినట్టే తమకు కూడా టైటిల్‌ను అందిస్తాడనే ఆశతో కెప్టెన్‌గానూ నియమించుకుంది. ఇక కామెరూన్ గ్రీన్‌ను ముంబై నుంచి బెంగళూరు రూ.17.50 కోట్లకు తీసుకుంది. వీరే కాకుండా కొందరు అనామక ఆటగాళ్లు కూడా కోట్లు పలికారు. ఈ విలువైన క్రికెటర్లు ఫ్రాంచైజీల ఆశలను తీరుస్తారా? అనేది ఆసక్తికరంగా మారింది.

బోణీ కొట్టేదెవరో?



టోర్నీ ఆరంభానికి ఒక్క రోజు ముందు ఎంఎస్ ధోనీ నాయకత్వం నుంచి తప్పుకొన్నాడు. కొత్త కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వంలో చెన్నై సూపర్ కింగ్స్..డుప్లెసి నేతృత్వంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తాజా ఐపీఎల్ ఆరంభ మ్యాచ్‌లో తలపడనున్నాయి. దీంతో తొలి మ్యాచ్‌లోనే భారత అభిమానులకు ధోనీ వర్సెస్ కోహ్లీ పోరు చూసే అవకాశం దక్కింది. సీఎస్‌కే టైటిల్ కాపాడుకునే ప్రయత్నంలో ఉండగా.. ఆర్‌సీబీ మాత్రం తీవ్ర ఒత్తిడిలోనే బరిలోకి దిగబోతోంది. డబ్ల్యూపీఎల్‌లో తమ ఫ్రాంచైజీ విజేతగా నిలవడంతో బెంగళూరు అభిమానుల ఫోకస్ పురుషుల జట్టుపైకి మారింది. పేరుతో పాటు జెర్సీలోనూ మార్పు చేసుకున్న ఈ జట్టు 16 ఏళ్లుగా ఊరిస్తున్న ఐపీఎల్ ట్రోఫీని ఎలాగైనా అందుకోవాలనే కసితో ఉంది. కొన్నేళ్లుగా ఇదే చివరి లీగ్‌గా అందరూ భావిస్తున్నా ధోనీ మాత్రం ప్రతీ సీజన్‌లో ఫ్యాన్స్‌ను మురిపిస్తూనే ఉన్నాడు. ఇప్పుడు కూడా 42 ఏళ్ల వయస్సులో అత్యంత ఫిట్‌గా కనిపిస్తూ సీఎస్‌కే ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తున్నాడు. ఇక ఓపెనర్ కాన్వే, పేసర్ పతిరన గాయాలతో ఆరంభ మ్యాచ్‌లకు దూరం కానున్నారు. ధోనీతో పాటు రుతురాజ్, మిచెల్, జడేజా, రహానె, రచిన్, దీపక్, తుషార్ కీలక ఆటగాళ్లు. అటు ఆర్‌సీబీకి మాత్రం గాయాల బెడద లేకుండా ఆటగాళ్లంతా ఫిట్‌గా ఉన్నారు. కోహ్లీ కూడా సుదీర్ఘ విరామంతో తాజాగా కనిపిస్తున్నాడు. డుప్లెసి, మ్యాక్స్‌వెల్, దినేశ్ కార్తీక్, గ్రీన్, పటీదార్‌లతో ఆర్‌సీబీ బ్యాటింగ్ లైనప్ బలంగా కనిపిస్తోంది. పేసర్లు సిరాజ్, జోసెఫ్, ఫెర్గూసన్‌లపై జట్టు బౌలింగ్‌లో ఆధారపడి ఉంది.

చెన్నై సారథి రుతురాజ్



కెప్టెన్సీ వదిలేసిన ధోనీ
సీజన్‌లో ఆడతాడు : కోచ్ ఫ్లెమింగ్

చెన్నై: ఐపీఎల్ ఆరంభానికి ముందు చెన్నై సూపర్ కింగ్స్ సారథి ధోనీ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. 16 ఏళ్లుగా ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా పేరు తెచ్చుకున్న ఎంఎస్ ధోనీ అనూహ్యంగా నాయకత్వ బాధ్యతలనుంచి వైదొలుతున్నట్టు ప్రకటించాడు. దీంతో ఇక నుంచి యువ ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ జట్టును నడిపిస్తాడని సీఎస్‌కే వెల్లడించింది. లీగ్ ఆరంభానికి సరిగ్గా ఒకరోజు ముందు, ఎలాంటి ఊహాగానాలు లేకుండానే వెలువడిన ఈ వార్త అటు సీఎస్‌కే అభిమానులతో పాటు క్రికెట్ ప్రేమికులను కూడా షాక్‌లో ముంచింది. 'ఎంఎస్ ధోనీ తన కెప్టెన్సీని రుతురాజ్‌కు అప్పగించాడు. 2019 నుంచి గైక్వాడ్ జట్టులో భాగంగా ఉంటూ 52 మ్యాచ్‌లు ఆడాడు. అతడి నాయకత్వంలో జట్టు రాణిస్తుందని ఆశిస్తున్నాం' అని సీఎస్‌కే పేర్కొంది. శుక్రవారం జరిగే ఆరంభ మ్యాచ్‌లో సీఎస్‌కే జట్టు రుతురాజ్ నేతృత్వంలోనే రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో ఆడనుంది. అయితే 27 ఏళ్ల రుతురాజ్‌కు కెప్టెన్‌గా చేయడం ఇదేం తొలిసారి కాదు. 2023 ఆసియా గేమ్స్‌లో భారత క్రికెట్ జట్టు అతడి ఆధ్వర్యంలోనే స్వర్ణం సాధించింది. దేశవాళీల్లో మహారాష్ట్ర జట్టుకు కూడా తనే కెప్టెన్. అలాగే గతేడాది తమ ఫ్రాంచైజీని చాంపియన్‌గా నిలపడంలో బ్యాటర్‌గా రుతురాజ్ పాత్ర కీలకం. ఆడిన 16 మ్యాచ్‌ల్లో 147.50 స్ట్రయిక్ రేట్‌తో 590 పరుగులు చేశాడు. వాస్తవానికి 2019లో జట్టులోకి వచ్చిన రుతురాజ్ పూర్తిగా బెంచీకే పరిమితమయ్యాడు. ఆ తర్వాత ఏడాది ఆరు మ్యాచ్‌లు ఆడగలిగాడు. కానీ 2021లో అద్భుతంగా చెలరేగి ఆరెంజ్ క్యాప్ (635) గెలుచుకోగా.. 2022లోనూ జట్టు తరఫున అతడివే అత్యధిక పరుగులు (368). అయితే విశేష అభిమానగణం ఉన్న సీఎస్‌కే నయా కెప్టెన్‌గా ఇప్పుడు ఏమేరకు రాణించగలడనేది వేచిచూడాల్సిందే..

మహీయే వదిలేశాడు..

సీఎస్‌కే జట్టులో ధోనీ అంతర్భాగం. ఈ ఫ్రాంచైజీలో అతడేం చెబితే అదే జరుగుతుంది. ముంబై ఇండియన్స్ తరహాలో హార్దిక్‌ను కెప్టెన్‌గా చేసిన తీరును ఇక్కడ చూడలేం. అంతా ఎంఎస్ ఇష్టప్రకారమే జరిగిందని సాక్షాత్తూ సీఎస్‌కే సీఈవో కాశీ విశ్వనాథ్ తెలిపాడు. 'జట్టు ప్రయోజనాల కోసమే ధోనీ ఆలోచనలు ఉంటాయి. అతడి తాజా నిర్ణయం గురించి నాకు ఐపీఎల్ కెప్టెన్ల సమావేశానికి ముందు మాత్రమే తెలిసింది. కెప్టెన్‌గా వైదొలగడం కేవలం అతడి ఇష్టపూర్వకంగానే జరిగింది. మనం అతడి నిర్ణయాన్ని గౌరవించాల్సిందే' అని కాశీ తెలిపాడు.

ఇదే ఆఖరు!

ఐపీఎల్‌లో 2008 నుంచి సీఎస్‌కేను ఎంఎస్ అత్యద్భుత జట్టుగా మార్చాడు. అయితే జట్టు ఇప్పుడు సంధి దశలో ఉంది. బహుశా 42 ఏళ్ల ధోనీకిదే చివరి ఐపీఎల్. అందుకే జట్టులో తను కొనసాగినప్పుడే మరొకరికి పగ్గాలు అప్పజెప్పాలనుకున్నాడు. వాస్తవానికి 2022లోనే ధోనీకి ఈ ఆలోచన వచ్చి జడేజాను ముందుకు తెచ్చాడు. కానీ కేవలం 8 మ్యాచ్‌ల తర్వాత తిరిగి ధోనీయే నాయకుడయ్యాడు. అప్పుడు ఆ నిర్ణయం వర్కౌట్ కాలేదు కానీ ఈసారి అలా కాదని సీఈవో విశ్వనాథన్ చెబుతున్నాడు. అప్పట్లో తాము కూడా ఎంఎస్ నుంచి కెప్టెన్సీ మార్పునకు సిద్ధంగా లేమని, కానీ ఇప్పుడు ఆ పాత్రకు యువ ఆటగాళ్లను తయారుచేయాల్సిన అవసరం ఏర్పడిందని కోచ్ ఫ్లెమింగ్ చెప్పాడు. మరోవైపు ధోనీ బరిలోకి దిగుతాడా? లేదా? అని ఫ్యాన్స్ సందేహిస్తున్నారు. కొంతకాలం క్రితమే ధోనీ మోకాలికి సర్జరీ కూడా అయ్యింది. కానీ వీటన్నింటికి చెక్ పెడుతూ.. ఎంఎస్ సీజన్ మొత్తానికి అందుబాటులో ఉంటాడని ఫ్లెమింగ్ తేల్చాడు. గత సీజన్‌తో పోలిస్తే ఇప్పుడు తను మరింత ఫిట్‌గా ఉన్నాడని చెప్పాడు.

కెప్టెన్‌గా ఎంఎస్ కెరీర్

ఐపీఎల్ ఆరంభం నుంచి చెన్నై కెప్టెన్‌గా కొనసాగిన ధోనీ రికార్డు స్థాయిలో ఐదు టైటిళ్లు అందించాడు. 2010, 2011, 2018, 2021, 2023లో విజేతగా నిలిచిన జట్టు తాజాగా డిఫెండింగ్ చాంపియన్‌గానే బరిలోకి దిగుతోంది. అలాగే రెండుసార్లు చాంపియన్స్ లీగ్‌లోనూ విజేతగా నిలిపాడు. లీగ్‌లో అత్యధిక మ్యాచ్‌లకు కెప్టెన్సీ (226) వహించిన రికార్డు కూడా ధోనీదే. ఇందులో 133 విజయాలు, 91 ఓటములు, రెండు ఫలితం తేలనివి ఉన్నాయి. మొత్తంగా సీఎస్‌కే, రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్ తరఫున 250 మ్యాచ్‌లను ఆడిన ఎంఎస్ 5082 పరుగులు సాధించాడు.

గైక్వాడ్‌కు జై..

ముంబై కెప్టెన్‌గా హార్దిక్‌ను నియమించినప్పుడు సోషల్ మీడియాలో అభిమానుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. కానీ రుతురాజ్‌పై మాత్రం సీఎస్‌కే ఫ్యాన్స్ అభిమానం కురిపిస్తుండడం విశేషం. ఓ దేశవాళీ మ్యాచ్‌లో ఎంఎస్ నుంచి ఆటోగ్రాఫ్ తీసుకున్న రుతురాజ్.. నేడు అతడి నుంచే సారథ్యం అందుకోవడం భేష్ అంటూ కొనియాడుతున్నారు. అలాగే ఎంఎస్ 26 ఏళ్ల వయస్సులో దేశానికి టీ20 వరల్డ్‌కప్ అందించి.. 27 ఏళ్లకు సీఎస్‌కే కెప్టెన్ అయ్యాడని.. అలాగే 26 ఏళ్ల రుతురాజ్ భారత్‌కు ఆసియాకప్ స్వర్ణం అందించి.. 27 ఏళ్లప్పుడే సీఎస్‌కే సారథి అయ్యాడని ఫ్యాన్స్ గుర్తుచేసుకుంటున్నారు.

'తలా' దర్శనం లేకపాయె..

ఎంఎస్ ధోనీని విపరీతంగా ఆరాధించే అభిమానులు అతడిని నెట్స్‌లో చూసేందుకు కూడా ఎగబడుతుంటారు. ఈ క్రమంలో గతంలో చిదంబరం స్టేడియం ప్యాక్ అయిన వీడియోలు చక్కర్లు కొట్టేవి. కానీ ఈసారి ముందుగానే తమ ఆరాధ్య 'తలా' దర్శనం చేసుకునేందుకు ఫ్యాన్స్‌కు వీలు కాలేదు. ఎందుకంటే.. దేశంలో సాధారణ ఎన్నికల నేపథ్యంలో అభిమానుల కోసం స్టాండ్స్‌ను తెరిచేందుకు స్థానిక పోలీసులు అనుమతించలేదు. వేలాది ఫ్యాన్స్ తరలివస్తారు కాబట్టి భద్రత కోసం పోలీసుల అనుమతి తీసుకోవడం అవసరం. దీంతో ఏప్రిల్ 19 ఎన్నికల తర్వాత ఫ్యాన్స్‌ను నెట్స్‌లోకి అనుమతించాలని సీఎస్‌కే భావిస్తోంది.

సింధు అవుట్

క్వార్టర్స్‌లో గాయత్రి, రజావత్
స్విస్ ఓపెన్

బాసెల్ (స్విట్జర్లాండ్): స్టార్ షట్లర్ పీవీ సింధు మరో టోర్నీలో రెండో రౌండ్‌నుంచే తిరుగుముఖం పట్టింది. గతవారం ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ రెండో రౌండ్‌లో పరాజయం పాలైన రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత సింధు ఆట స్విస్ ఓపెన్‌లోనూ మెరుగుపడలేదు. గురువారం రాత్రి హోరాహోరీగా జరిగిన మహిళల సింగిల్స్ రౌండ్-16 పోరులో సింధు 21-16, 19-21, 16-21తో టొమొకా మియాజాకి (జపాన్) చేతిలో కంగుతిన్నది. ఇక యువ ఆటగాడు ప్రియాన్షు రజావత్ పురుషుల సింగిల్స్‌లో, గాయత్రీ గోపీచంద్ మహిళల డబుల్స్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరారు. రెండో రౌండ్‌లో రజావత్ 21-14, 21-13తో లీ లాన్ జీ (చైనా)ను చిత్తు చేసి తుది ఎనిమిది మందిలో ప్రవేశించాడు. మహిళల డబుల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో ఎనిమిదో సీడ్ గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ జోడీ 21-10, 21-12తో సహచర ద్వయం ప్రియ/శృతీ మిశ్రాపై సునాయాసంగా నెగ్గింది. మహిళల డబుల్స్ మరో రెండో రౌండ్ పోరులో అశ్వినీ పొన్నప్ప జంట పరాజయం పాలైంది. జపాన్‌కు చెందిన హిరోకామీ/కటోతో జరిగిన పోరులో అశ్విని/తనీషా క్రాస్టో 17-21, 16-21తో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించారు.

'ద హండ్రెడ్'లో భారత్ నుంచి ఇద్దరే!



లండన్: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్ చాంపియన్ జట్టు ఆర్సీబీ కెప్టెన్ స్మృతి మంధాన, కీపర్ రిచా ఘోష్‌కు మాత్రమే రాబోయే 'ద హండ్రెడ్' లీగ్‌లో చోటు దక్కింది. సదరన్ బ్రేవ్ జట్టు మంధానను తీసుకోగా, ఆమె ఆర్సీబీ సహచరి రిచా ఘోష్‌పట్ల బర్మింగ్‌హామ్ ఫీనిక్స్ జట్టు మొగ్గు చూపింది. ఎడమచేతి వాటం బ్యాటర్ స్మృతి తాజా డబ్ల్యూపీఎల్ 10 మ్యాచ్‌ల్లో 300 రన్స్‌తో సత్తా చాటింది. మరోవైపు ఫినిషర్‌గా అదరగొట్టిన ఘోష్ 10 మ్యాచ్‌ల్లో 142 స్ట్రయిక్ రేట్‌తో, రెండు అర్ధ శతకాలు సహా 257 పరుగులు సాధించింది. ఇన్నింగ్స్‌కు 100 బంతుల చొప్పున ఉండే ఈ లీగ్ లండన్‌లో జూలై 23 నుంచి జరగనుంది. మొత్తం ఎనిమిది జట్లు టోర్నమెంట్‌లో తలపడనున్నాయి. భారత్ నుంచి హర్మన్‌ప్రీత్, దీప్తిశర్మ, జెమీమా రోడ్రిగ్స్, శ్రేయాంక పాటిల్ సహా మొత్తం 17 మంది భారత క్రికెటర్లు హండ్రెడ్ లీగ్ డ్రాఫ్ట్‌లో పేర్లు నమోదు చేసుకున్నారు. కానీ జట్లేవీ వారిని తీసుకొనేందుకు ఆసక్తి చూపలేదు.

పారిస్ ఒలింపిక్స్
భారత పతాకధారి శరత్ కమల్

చెఫ్ డి మిషన్‌గా మేరీకోమ్




న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో భారత పతాకధారిగా వెటరన్ టీటీ ఆటగాడు శరత్ కమల్ వ్యవహరించనున్నాడు. ఈమేరకు కామన్వెల్త్ క్రీడల చాంపియన్ శరత్ పేరును భారత ఒలింపిక్ సంఘం గురువారం ప్రకటించింది. అలాగే దిగ్గజ బాక్సర్ మేరీకోమ్‌ను చెఫ్ డి మిషన్‌గా ఎంపిక చేసింది. కాగా..ర్యాంకింగ్స్ ఆధారంగా భారత పురుషులు, మహిళల టీటీ జట్లు పారిస్ ఒలింపిక్స్ టీమ్ విభాగాలకు అర్హత సాధించిన విషయం విదితమే. 'క్రీడల పట్ల అసమాన అంకితభావం, ఎందరికో స్ఫూర్తిగా నిలిచే మేరీకోమ్ చెఫ్ డి మిషన్‌గా భారత అథ్లెట్లకు మార్గదర్శనం చేయనుంది' అని ఐఓఏ తెలిపింది.

ఐపీఎల్‌కు జంపా దూరం

న్యూఢిల్లీ: ఐపీఎల్ ఆరంభానికి ముందు రాజస్థాన్ రాయల్స్‌కు గట్టిదెబ్బ తగిలింది. ఆ జట్టు ప్రధాన స్పిన్నర్లలో ఒకడైన ఆస్ట్రేలియా ఆటగాడు ఆడమ్ జంపా మెగా లీగ్ నుంచి వైదొలిగాడు. జంపాను రాజస్థాన్ రూ. 1.5 కోట్లకు రిటైన్ చేసుకొంది. అయితే, గత కొంతకాలంగా తీరికలేని క్రికెట్ ఆడుతున్న జంపా విశ్రాంతి నిమిత్తం తప్పుకొన్నట్టు తెలుస్తోంది. జంపా తప్పుకోవడంతో స్పిన్ భారం అశ్విన్, యజ్వేంద్ర చాహల్‌పైనే పడనుంది. గత సీజన్‌లో రాయల్స్ తరఫున ఆరు మ్యాచ్‌లు ఆడిన జంపా 8 వికెట్లు పడగొట్టాడు.

పీఐబీ నిజనిర్ధారణపై సుప్రీం స్టే



న్యూఢిల్లీ, మార్చి 21: ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఆధ్వర్యంలో నిజనిర్ధారణ విభాగాన్ని (ఫ్యాక్ట్ చెకింగ్ యూనిట్) ఏర్పాటు చేస్తూ కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌ను సుప్రీంకోర్టు నిలిపివేసింది. సోషల్ మీడియాలో కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి తప్పుడు వార్తల వ్యాప్తిని (ఫేక్ న్యూస్) అరికట్టే పేరుతో ఐటీ సవరణ చట్టం నిబంధనల కింద ఈ విభాగాన్ని ఏర్పాటు చేస్తూ కేంద్రం బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. సదరు నిజనిర్ధారణ విభాగం ఏర్పాటుకాకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ స్టాండప్ కమెడియన్ కునాల్ క్రమా, ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా, ఇండియన్ మ్యాగజైన్స్ అసోసియేషన్ ఇంతకుముందే బాంబే హైకోర్టులో పిటిషన్ వేశాయి. దీనికి హైకోర్టు ఈ నెల 11న నిరాకరించింది. ఈ నేపథ్యంలో కేంద్రం నోటిఫికేషన్ జారీ చేయటంతో పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీని పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం విచారణ జరిపి కేంద్రం నోటిఫికేషన్‌పై స్టే విధించింది. విచారణ సందర్భంగా.. ఈ అంశం రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1)(ఏ) కీలకమైన భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు సంబంధించినదని గుర్తు చేసింది. ఈ కేసులో బాంబే హైకోర్టు తుది తీర్పును ఇచ్చే వరకూ స్టే అమల్లో ఉంటుందని స్పష్టంచేసింది. జనవరిలో ఈ కేసుపై విచారణ జరిపిన బాంబే హైకోర్టు డివిజన్ బెంచ్‌లోని ఇద్దరు న్యాయమూర్తులు భిన్న తీర్పులను వెలువరించారు. ఒకరు ఐటీ సవరణ చట్టం నిబంధనలను సమర్థించగా మరొకరు వ్యతిరేకించారు. దీంతో కేసును సింగిల్ జడ్జి బెంచ్‌కు బదలాయించారు. ఏప్రిల్ 15న విచారణ జరగనుంది. ఈలోపే కేంద్రం నోటిఫికేషన్ జారీ చేయకుండా తాత్కాలిక ఉత్తర్వులు ఇవ్వాలని సింగిల్ జడ్జి బెంచ్ ను పిటిషనర్లు కోరినప్పటికీ.. బెంచ్ అందుకు అంగీకరించలేదు. దీంతో కేంద్రం తాజాగా నోటిఫికేషన్ వెలువరించింది.

ఐటీ చట్టానికి సవరణలు

గత ఏడాది ఏప్రిల్‌లో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ 'ఐటీ నిబంధనలు, 2021' చట్టానికి సవరణలు చేస్తూ కొత్త నిబంధనలు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన తప్పుడు, నకిలీ వార్తలను గుర్తించి ఆయా సోషల్ మీడియా వేదికలను హెచ్చరించటానికి వీలుగా ఒక నిజనిర్ధారణ విభాగాన్ని ఏర్పాటు చేస్తామని ఈ నిబంధనల్లో పేర్కొంది. సదరు విభాగం ఫేక్‌న్యూస్‌గా గుర్తించిన వాటిని సోషల్ మీడియా వేదికలు తొలగించాల్సి ఉంటుంది. లేకపోతే వాటికి ప్రస్తుతం ఉన్న న్యాయపరమైన రక్షణను వదులుకోవాల్సి ఉంటుంది. అంటే, ఆయా వార్తలకు సంబంధించి కోర్టుల్లో దాఖలయ్యే కేసులు, ప్రభుత్వం తీసుకునే చర్యలను ఆయా వేదికలు ఎదుర్కోవాల్సి ఉంటుందని కేంద్రం నిబంధనల్లో తెలిపింది. ఇది దేశంలో భావవ్యక్తీకరణ స్వేచ్ఛను హరిస్తుందని, ప్రభుత్వ పనితీరుపై విమర్శలను ఫేక్‌న్యూస్ పేరుతో తొలగించి, సదరు వ్యక్తులను అణచివేయటానికి ఆస్కారం కల్పిస్తుందని అప్పట్లో పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికలు ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా తమ పోస్టులను తొలగిస్తాయని, తద్వారా తమ అభిప్రాయాల వెల్లడికి స్వేచ్ఛలేకుండా పోతుందని కునాల్ క్రమా తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

చెన్నై సౌత్ బరిలో తమిళిసై

» 9 మందితో బీజేపీ మూడో జాబితా

న్యూఢిల్లీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికలో మిగిలిన పార్టీలతో పోలిస్తే బీజేపీ ఒకడుగు ముందే ఉంటోంది. కాంగ్రెస్ కంటే ముందే రెండు జాబితాలను ప్రకటించిన బీజేపీ, గురువారం 9 మంది అభ్యర్థులతో మూడో జాబితాను విడుదల చేసింది. ఈ తొమ్మిది స్థానాలూ తమిళనాడులోనివే. ఈనెల 19న తెలంగాణ గవర్నర్ పదవితోపాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి రాజీనామా చేసిన తమిళిసై సౌందర రాజన్‌కు చెన్నై సౌత్ లోక్‌సభ సీటును కేటాయించారు. గవర్నర్ పదవికి రాజీనామా చేసిన రెండు రోజులకే ఆమెకు లోక్‌సభ సీటును కేటాయించడం గమనార్హం. ఇక తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలైకు కోయంబత్తూర్, కేంద్ర మంత్రి ఎల్.మురుగన్‌కు నీలగిరి(ఎస్సీ), కేంద్ర మాజీ మంత్రి పోన్ రాధాకృష్ణన్‌కు కన్యాకుమారి స్థానాలు కేటాయించారు. అదేవిధంగా.. చెన్నై సెంట్రల్ నుంచి వినోజ్ పీ సెల్వమ్, వెల్లూర్ నుంచి ఏసీ షణ్ముగం, కృష్ణగిరి నుంచి సి. నరసింహన్, పెరంబలూర్ నుంచి టీఆర్ పారివేందర్, తూత్తుకుడి నుంచి నైనార్ నాగేంద్రన్ లోక్‌సభకు పోటీ చేయనున్నారు. కాగా, బీజేపీ తొలి జాబితాలో 194 మంది, రెండో జాబితాలో 72 మంది పేర్లను ప్రకటించింది. మూడు జాబితాల్లో కలిపి ఇప్పటి వరకు 275 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఆ పార్టీ ప్రకటించింది. మరో 268 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. కాగా, కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు రెండు జాబితాల్లో కలిపి 82 స్థానాలకు మాత్రమే అభ్యర్థులను ప్రకటించింది.

మా ఆదేశాలనే ధిక్కరిస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

ఆగ్రహించింది. నిత్యం రాజ్యాంగానికి వ్యతిరేకంగానే వ్యవహరిస్తున్న గవర్నర్ రవి తీరును తాము తేలిగ్గా తీసుకోబోమని, దీనిపై తగిన చర్యలకు ఆదేశిస్తామని స్పష్టం చేసింది. దీనిపై కేంద్రప్రభుత్వం కూడా రవి నుంచి వివరణ తీసుకోవాలని సూచించింది. శుక్రవారం లోగా పొన్ముడితో ప్రమాణ స్వీకారం చేయించాలని తేల్చిచెప్పింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఆదాయానికి మించిన అక్రమాస్తుల కేసులో పొన్ముడికి మద్రాసు హైకోర్టు విధించిన శిక్షను సుప్రీంకోర్టు ఇటీవల నిలుపుదల చేసిన విషయం తెలిసిందే. ఈ తీర్పు తర్వాత పొన్ముడిని మళ్లీ మంత్రివర్గంలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నిర్ణయించారు. ఆయనతో ప్రమాణస్వీకారం చేయించాలని రాజ్‌భవన్‌కు లేఖ రాశారు. అయితే, సీఎం అభ్యర్థనను గవర్నర్ తోసిపుచ్చారు. పొన్ముడిని నిర్దోషి అని సుప్రీంకోర్టు చెప్పలేదని, కేవలం ఆయన శిక్షను మాత్రమే నిలుపుదల చేసిందని, అలాంటి వ్యక్తితో మళ్లీ మంత్రిగా ప్రమాణస్వీకారం చేయించలేనని పేర్కొన్నారు. గవర్నర్ వైఖరిని సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం...సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై గురువారం ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా తమిళనాడు ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. గవర్నర్ చెప్పిన కారణాలను, గతంలో ఆయన వ్యవహరించిన తీరును కూడా వివరించారు. ఈ సందర్భంగా ధర్మాసనం....గవర్నర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. గవర్నర్ రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించింది. తమిళనాడులో జరుగుతున్న పరిణామాలను సునిశితంగా గమనిస్తున్నామని తెలిపింది. "గవర్నర్‌కు అసలు చట్టం తెలుసా? ఒక రాష్ట్ర గవర్నర్ తన అధికారాన్ని అడ్డుగా పెట్టుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి సిఫారసు చేసిన వ్యక్తితో మంత్రిగా ప్రమాణం చేయించకపోవడం ఖండించతగ్గ విషయం. రాజ్యాంగ శాసనాన్ని ముందుగా తెలుసుకోవాల్సింది గవర్నరే. ఆయన తన ఇష్టానుసారం నడచుకుంటానంటే కుదరదు. 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఒక ఎమ్మెల్యేతో మంత్రిగా ప్రమాణస్వీకారం చేయించనని గవర్నర్ చెప్పడం ఇదే ప్రథమం. ఈ వ్యవహారం సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించినట్లే. అంతేకాకుండా ఆయన...రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాలను తరచూ అడ్డుకుంటున్నారు. ఇది కూడా ప్రజాస్వామ్యానికి విరుద్ధమే' అని ధర్మాసనం ఆగ్రహించింది.

మా కళ్లకు గంతలు లేవు..

"గవర్నర్ రవి తీరు మమ్మల్ని తీవ్రంగా కలవరపెడుతోంది. మేం ఈ అంశాన్ని అంత తేలిగ్గా తీసుకోవడం లేదు. మేం కళ్లకు గంతలు కట్టుకుని కూర్చోలేదు. గవర్నర్‌పై చర్యలకు ఆదేశిస్తాం. గవర్నర్‌కు సరైన సలహాలు ఇచ్చేవారు లేనట్లుంది. గవర్నర్ రాజ్యాంగాన్ని పాటించకపోతే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తుంది? గవర్నర్ ఇకనైనా రాజ్యాంగం ప్రకారం నడచుకుంటారని భావిస్తున్నాం" అని బెంచ్ వ్యాఖ్యానించింది.

టికెట్ల కేటాయింపులో కాంగ్రెస్, బీఆర్ఎస్ నిర్లక్ష్యం

- ఆ పార్టీలను నమ్ముకున్న మాదిగ నేతలకు భవిష్యత్తు ఉండదు
- కేసీఆర్ కంటే ప్రధాని మోదీయే నయం: మందకృష్ణ



హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మాదిగలకు టికెట్లు ఇచ్చే విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆరోపించారు. ఆ రెండు పార్టీలను నమ్ముకునే మాదిగ జాతి నాయకులకు భవిష్యత్తు ఉండదన్నారు. రాష్ట్రంలో మాదిగ జనాభా నిష్పత్తి ప్రకారం సీట్లు కేటాయించడం లేదని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు మాదిగలు, మాదిగ ఉపకులాలు ఓట్లు వేయొద్దని.. ఇది తన ఆవేదన, విజ్ఞప్తి, సూచనగా భావించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలో మాల జాతికి చెందిన జి.వెంకటస్వామి, మల్లు అనంతరాములు కుటుంబాలే చక్రం తిప్పుతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా మాల జాతికి చెందిన వ్యక్తేనని చెప్పారు. మాదిగ జనాభా ఎక్కువ ఉన్న నాగర్‌కర్నూల్‌లో సంపత్‌కుమార్‌ను కాదని మాల జాతికి చెందిన మల్లు రవికి టికెట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. తమిళనాడులో మాదిగ జాతికి చెందిన మురుగన్ ఓడిపోతే ఆయన్ను తీసుకెళ్లి ఏకంగా క్యాబినెట్ మంత్రిని చేసిన ఘనత ప్రధాని మోదీదైతే.. పది మంది ఎమ్మెల్యేలు ఉన్నా ఒక్కరినీ మంత్రిని చేయని చరిత్ర కేసీఆర్‌దని ఆరోపించారు. ఆయనకంటే మోదీయే నయమన్నారు. మరో రెండు రోజుల్లో తెలంగాణలో రెడ్ల రాజకీయంపై మీడియా ముందుకు వచ్చి, వంద రోజుల రేవంత్‌రెడ్డి పాలనపై సమగ్ర వివరాలు వెల్లడిస్తానని మందకృష్ణ చెప్పారు.

భూదందాపై ప్రశ్నిస్తే కేసులు పెడతారా?: క్రిశాంక్

చిత్రపురి సొసైటీలో రూ.3వేల కోట్ల అక్రమ భూదందాపై ప్రశ్నిస్తే.. మాదాపూర్ పోలీసులు తనపై కేసులు పెట్టి.. తన మొబైల్‌ఫోన్ కూడా సీజ్ చేశారని బీఆర్ఎస్ సోషల్‌మీడియా కన్వీనర్ మన్నెక్రిశాంక్ పేర్కొన్నారు. అక్రమాలపై ప్రశ్నిస్తే కేసులు పెట్టడం సరికాదన్నారు. సీజ్ చేసిన ఫోన్‌ను కోర్టులో డిపాజిట్ చేయాలని కోరారు. ఈ భూ దందాకు సంబంధించి సోషల్ మీడియాలో పోస్టు పెట్టినందుకు తనపై కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌గౌడ్ కేసు వేశారన్నారు. ఇదంతా సీఎం రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లోనే జరుగుతోందని ఆరోపించారు. ఈ అక్రమానికి పాల్పడిన అనుముల మహానందరెడ్డికి, తనకు ఏ సంబంధం లేదని రేవంత్‌రెడ్డి చెప్పడం తగదని, వారిద్దరి మధ్య ఉన్న బంధంపై తనవద్ద ఆధారాలున్నాయని చెప్పారు. దమ్ముంటే ఇది తప్పని సీఎం రేవంత్‌రెడ్డి కోర్టుకు వచ్చి నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. కుంభకోణం జరిగిందని ఆరోపణ వస్తే.. ఆధారాలతో స్పందించాల్సిందిపోయి అక్రమ కేసుపెట్టి.. సెల్‌ఫోన్ సీజ్ చేయడమేంటి సీఎం రేవంత్‌రెడ్డి గారూ.. అంటూ బీఆర్ఎస్ నేత ఆర్.ప్రవీణ్‌కుమార్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

పోలీసు కస్టడీకి గూడెం మధుసూదన్‌రెడ్డి

సంగారెడ్డి క్రైమ్, మార్చి 21: అక్రమ మైనింగ్ కేసులో బీఆర్ఎస్‌కు చెందిన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డిని సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీసులు గురువారం తమ కస్టడీలోకి తీసుకున్నారు. ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న ఆయననుంచి ఈ కేసులో మరిన్ని విషయాలను రాబట్టేందుకు పటాన్‌చెరు పోలీసులు మూడు రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరగా గురువారం అనుమతి ఇచ్చింది.

బీఆర్ఎస్ నుంచే నామా పోటీ!



ఖమ్మం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచే ఎంపీ నామా నాగేశ్వరరావు పోటీ చేయబోతున్నారు. ఇప్పటికే ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థిగా నామా పేరును ఆ పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఇటీవల నాగేశ్వరరావు పార్టీ మారతారని, బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి నుంచి బరిలో ఉంటారని సోషల్ మీడియాలో ప్రచారం సాగింది. ఈ విషయాన్ని కొందరు ముఖ్య నేతలు నామా దృష్టికి తేగా.. తాను బీఆర్ఎస్ నుంచే ఖమ్మం ఎన్నికల్లో బరిలో దిగుతానని స్పష్టం చేశారు. కష్టకాలంలో ఉన్న పార్టీ అధినేత కేసీఆర్‌కు అండగా ఉండి ఎన్నికలను ఎదుర్కొంటామే తప్ప.. పార్టీ మారాల్సిన అవసరం లేదని నామా చెప్పినట్లు తెలుస్తోంది.

నిజామాబాద్ డీసీసీబీ కాంగ్రెస్ కైవసం

నిజామాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లాలో బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)ను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తనయుడు, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిపై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. దీంతో వైస్ చైర్మన్ రమేశ్‌రెడ్డికి ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలను అప్పగించారు. ఈనెల 4న డీసీసీబీకి చెందిన 15 మంది సభ్యులు అవిశ్వాస తీర్మానంపై సహకార శాఖల అధికారులకు నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే గురువారం నిర్వహించిన సమావేశానికి కోరానికి మించి మొత్తం 17 మంది సభ్యులు హాజరు కావడంతో సహకార శాఖ అధికారులు ఓటింగ్‌ను నిర్వహించారు. చైర్మన్‌కు వ్యతిరేకంగా 16 మంది డైరెక్టర్లు చేతులెత్తడంతో అవిశ్వాసం నెగ్గినట్లు జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్ ప్రకటించారు.

అలంపూర్ ఎమ్మెల్యేకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడుకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో శాసనసభ్యుడిగా విజయుడి ఎన్నిక చెల్లదంటూ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ప్రసన్నకుమార్ హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ఉండవల్లి మండలం పుల్లూరు పంచాయతీ పరిధిలో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుకు రాజీనామా చేయకుండానే విజయుడు ఎన్నికల్లో పోటీ చేశారని, ఆయన తన వృత్తి గురించి అఫిడవిట్‌లో ఎలాంటి వివరాలను సమర్పించలేదని ప్రసన్నకుమార్ కోర్టుకు తెలిపారు. దీనిపై వివరణ ఇవ్వాలంటూ ధర్మాసనం అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడుకు నోటీసులు జారీ చేసింది.

ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో చర్చలకు సిద్ధం

- లేఖ విడుదల చేసిన మావోయిస్టు పార్టీ

వరంగల్/చర్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో తాము శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని, కానీ రాష్ట్ర ప్రభుత్వమే ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి వికల్ప్ ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనుకూల వాతావరణం కల్పిస్తే ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో శాంతి చర్చలకు ముందుకు వస్తామని ఆయన ప్రకటించారు. ఎన్‌కౌంటర్లు, క్రాస్ ఫైరింగ్‌తో ఆదివాసీలపై జరుగుతున్న దారుణహత్యలను అరికట్టాలని, సాయుధ బలగాలన్నింటినీ ఆరు నెలల పాటు శిబిరాలకే పరిమితం చేయాలని కోరారు. ప్రభుత్వం అంగీకరిస్తే నేరుగా లేదా, వర్చువల్‌గా శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

వ్యవసాయ రంగం డిజిటలీకరణ

- వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు

మేడ్చల్ టౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని డిజిటలీకరణ చేసి రైతులకు ప్రభుత్వ సేవలు మరింత చేరువచేసేలా చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు తెలిపారు. వ్యవసాయ రంగాన్ని ఆధునిక విధానంలో అభివృద్ధి పరచాలని రెండేళ్లుగా వ్యవసాయ అనుబంధ రంగాలన్నింటినీ డిజిటలీకరణ చేస్తున్నట్టు చెప్పారు. మేడ్చల్ మండలం నూతన్‌కల్‌లో సిన్‌జెంటా విత్తన పరిశ్రమ తమ ప్లాంట్‌లో నెలకొల్పిన 'గ్లోబల్ సీడ్ హెల్త్ ల్యాబ్'ను రఘునందన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ విత్తన తయారీకి కేంద్రంగా మారిందని, ఈ క్రమంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు విత్తన పరీక్షకేంద్రాలు ఎంతో దోహదపడతాయన్నారు.

టెన్త్ పేపర్ లీకేజీ అవాస్తవం: విద్యాశాఖ కమిషనర్

హైదరాబాద్, మార్చి21(ఆంధ్రజ్యోతి): టెన్త్ పేపర్ లీక్ అయినట్లు సామాజిక మాధ్యమాల్లో జరిగిన ప్రచారం అవాస్తవమని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో 19వ తేదీన నిర్వహించిన సెకండ్ లాంగ్వేజీ పరీక్షా పత్రాలు లీక్ అయ్యాయని జరిగిన ప్రచారంలో వాస్తవం లేదని, అదేవిధంగా 20వ తేదీన ప్రశ్నాపత్రం బయటకు వచ్చిందనే ప్రచారం సైతం అవాస్తవమని కమిషనర్ పేర్కొన్నారు.

2 నెలలుగా పల్లెకు సుస్తీ

- విష జ్వరాలు, కీళ్ల నొప్పులతో అవస్థలు
- ఇందుగులలో అంతుచిక్కని వ్యాధి
- ఏమీ చెప్పలేకపోతున్న అధికారులు
- నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలో కలకలం



ఇందుగులలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మాడ్గులపల్లి, మార్చి 21: అంతుచిక్కని వ్యాధి రెండు నెలలుగా ఆ గ్రామస్థులను ముప్పు తిప్పలు పెడుతోంది. తీవ్రమైన జ్వరం, ఒళ్లు నొప్పులతో ఎవరినీ నడవనివ్వడం లేదు. వైద్యాధికారులు వచ్చి పరీక్షలు చేసినా, వ్యాధి మాత్రం అంతుచిక్కడం లేదు. ఎంతకీ తగ్గు ముఖం పట్టకపోవడంతో నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం ఇందుగుల గ్రామం మంచం పట్టింది. గ్రామంలో 2 వేలకుపైగా జనాభా ఉంది. ఇక్కడ 60 రోజులుగా విష జ్వరాలు, ఒళ్లు నొప్పులు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మొదటగా కొంతమందికి మాత్రమే జ్వరం, ఒళ్లు నొప్పులు రాగా, క్రమంగా ప్రతీ ఇంటికీ చుట్టుకుంది. గ్రామంలో ప్రతీ కుటుంబంలో ఇద్దరు చొప్పున 800 మంది జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు. రెండు నెలలుగా గ్రామంలో మూడు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి 125 మందికి రక్త పరీక్షలు నిర్వహించినా.. ఏ వ్యాధి వచ్చిందో అధికారులు చెప్పలేకపోతున్నారు. జ్వరం, కీళ్ల నొప్పులతో పాటు శరీరం నలుపు రంగులోకి మారడం, ముఖంపై మచ్చలు రాడం వంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మందులు వాడినన్ని రోజులు వ్యాధి తగ్గినప్పటికీ ఆ తర్వాత తిరిగి ప్రభావం చూపుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యులు మాత్రం దోమలతోనే వ్యాధులు ప్రబలుతున్నాయని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. గ్రామంలో ఎక్కువ మంది బాధితులు మిర్యాలగూడ, నల్లగొండ వంటి పట్టణాలకు వెళ్లి ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నారు. వైద్య పరీక్షల్లో నెగెటివ్ వచ్చినా.. వ్యాధి మాత్రం తగ్గడం లేదు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అంతుచిక్కని వ్యాధి వ్యాపిస్తుండడంతో గ్రామస్థులు అయోమయానికి గురవుతున్నారు. ఈ క్రమంలో గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని డీఎంహెచ్‌వో కొండల్‌రావు గురువారం పరిశీలించారు. ఊళ్లో తాగునీటి నమూనాలను సేకరించి పరీక్షల కోసం పంపించారు. గ్రామస్థులకు వచ్చిన వ్యాధిని వైరల్ ఆర్థ్రైటిస్‌గా గుర్తించామని డీఎంహెచ్‌వో తెలిపారు. అది చికున్‌గున్యా వ్యాధి లక్షణాలను కలిగి ఉంటుందని చెప్పారు. గ్రామంలో దోమల బెడదను అరికట్టేందుకు ఫాగింగ్ చేపడుతున్నామని, వ్యాధి తగ్గే వరకూ వైద్య శిబిరం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రైలు టికెట్లకూ డబ్బుల్లేవ్

పార్టీ బ్యాంకు ఖాతాల స్తంభనతో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించలేకపోతున్నాం

- రెండు రూపాయలూ ఇవ్వలేని పరిస్థితి
- మోదీ కుట్ర ప్రకారమే వనరులపై దాడి
- బ్యాంకుఖాతాల స్తంభనను తొలగించాలి
- మీడియాతో సోనియా, ఖర్గే, రాహుల్



న్యూఢిల్లీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ బ్యాంకు ఖాతాలను ఐటీ శాఖ స్తంభింపజేయటం వల్ల రైలు టికెట్లు కూడా కొనలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నామని కాంగ్రెస్ అగ్రనేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఓ రెండు రూపాయాలూ ఇవ్వలేని స్థితిలో ఉన్నామని తెలిపారు. ఎన్నికల వేళ ఇది అత్యంత తీవ్రమైన దాడి అని.. ప్రధాని మోదీ కుట్రపూరితంగా దీనిని అమలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల బరిలో పోటీ పడటానికి తమకూ సమాన అవకాశాలు లభించేలా రాజ్యాంగ సంస్థలు జోక్యం చేసుకోవాలని, తమ ఖాతాల స్తంభనను తక్షణం ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఇది కాంగ్రెస్‌కు మాత్రమే పరిమితమైన అంశం కాదని, దేశంలో ప్రజాస్వామ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే విషయమని చెప్పారు. పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీలతో కలిసి కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ గురువారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని ఆర్థికంగా కుప్పకూల్చేందుకు ప్రధాని మోదీ ఒక పద్ధతి ప్రకారం కుట్రను అమలు చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఎలక్టోరల్ బాండ్లతో బీజేపీ అత్యధికంగా ప్రయోజనం పొందిందని, కాంగ్రెస్‌ను మాత్రం ఆర్థికంగా అణిచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇటువంటి పరిస్థితి గతంలో ఎన్నడూ కనీవినీ ఎరగనిదన్నారు. లోక్‌సభ ఎన్నికల వేళ ప్రజలు తమకు ఇచ్చిన విరాళాలను కూడా వాడుకోకుండా తమ పార్టీ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారని తెలిపారు. పార్టీ ఖాతాల నుంచి డబ్బును బలవంతంగా లాక్కొంటున్నారన్నారు. పరిస్థితులు చాలా ఆందోళనకరంగా తయారయ్యాయని, ఇది కాంగ్రెస్‌ను మాత్రమే కాకుండా భారత ప్రజాస్వామ్యాన్ని కూడా మౌలికంగా ప్రభావితం చేసే తీవ్రమైన అంశమని సోనియా ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం తమ పార్టీ బ్యాంకు ఖాతాల స్తంభనను తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బీజేపీది డేంజరస్ గేమ్: ఖర్గే

ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ పడకూడదని, ఎన్నికలు ఏకపక్షంగా తమకు అనుకూలంగా జరగాలని బీజేపీ భావిస్తోందని ఖర్గే ఆరోపించారు. బీజేపీ ప్రమాదకరమైన ఆట ఆడుతోందని, ఇది దేశంపై దీర్ఘకాలంలో తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని హెచ్చరించారు. 'ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటే.. ఎన్నికల్లో పోటీ పడటానికి అందరికీ సమాన అవకాశాలుండాలి. దేశంలోని రాజ్యాంగబద్ధమైన సంస్థలు స్వేచ్ఛాయుత ఎన్నికలు జరగాలని కోరుకుంటే బ్యాంకు ఖాతాలను ఉపయోగించుకోవటానికి కాంగ్రెస్‌కు అనుమతించాలి' అని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు పన్నుల నుంచి మినహాయింపు ఉంటుందని, బీజేపీ కూడా ఎన్నడూ పన్ను చెల్లించలేదన్నారు. అయినప్పటికీ, తమను పన్ను చెల్లించాలని చెబుతున్నారని, దీనిపై కోర్టు తుది తీర్పు కోసం వేచి చూస్తామని ఖర్గే తెలిపారు. సుప్రీంకోర్టు చట్టవిరుద్ధం, రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్న ఎన్నికల బాండ్ల పథకం కింద బీజేపీ తన ఖాతాలో రూ.6 వేల కోట్లకు పైగా నగదు జమ చేసుకున్నదని.. ఆ పార్టీకి లభించే నగదుకు ఎలాంటి లెక్కలుండవని ఖర్గే ఆరోపించారు.

భారత్‌లో ప్రజాస్వామ్యం లేదు: రాహుల్

లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను స్తంభింపచేసి ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా నేరపూరిత చర్యలకు పాల్పడ్డారని రాహుల్ గాంధీ ఆరోపించారు. 'ఎన్నికలకు రెండు నెలల ముందు పార్టీ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయటం వల్ల మా పార్టీ అభ్యర్థులకు, కార్యకర్తలకు అండగా ఉండలేకపోతున్నాం. మా పార్టీ నేతలు విమానంలో కాదుకదా రైలులో కూడా ప్రయాణించలేకపోతున్నారు. మా పార్టీకి దేశంలోని ఓటర్లలో 20 శాతం మంది ఓటేశారు. కానీ, ఇప్పుడు ఏ అవసరానికైనా ఓ రెండు రూపాయలు చెల్లించే పరిస్థితి కూడా మాకు లేకుండా పోయింది. ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించలేకపోతున్నాం' అని రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన కోర్టులు, ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థలు ఉన్నప్పటికీ.. ఏమీ జరగటం లేదన్నారు. 'నేడు భారత దేశంలో ప్రజాస్వామ్యం లేదు. భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం అనేది శుద్ధ అబద్ధం' అని రాహుల్ పేర్కొన్నారు. కాగా, కాంగ్రెస్ నేతల ఆరోపణలపై ఐటీ శాఖ అధికారిక వర్గాలు స్పందిస్తూ.. ఆ పార్టీ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయలేదని, రూ.135 కోట్ల మొత్తాన్ని మాత్రం ఆ ఖాతాల నుంచి రికవరీ చేశామని తెలిపాయి. 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి టాక్స్ రిటర్నులకు 2018 డిసెంబరు 31వ తేదీ గడువు కాగా, కాంగ్రెస్ పార్టీ 2019 ఫిబ్రవరిలో రిటర్నులు దాఖలు చేసిందని ఆ వర్గాలు తెలిపాయి. ఒక నగదు విరాళం రూ.2 వేలకు మించొద్దనే నిబంధనను ఉల్లంఘిస్తూ ఆ పార్టీ రూ.14 లక్షల నగదు విరాళాలు సేకరించిందని పేర్కొన్నాయి. కాగా, తమ బ్యాంకు ఖాతాలను ఐటీ శాఖ స్తంభింపజేయటాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్ ఈ నెల 8న తోసిపుచ్చింది. హైకోర్టులోనూ కాంగ్రెస్‌కు ఉపశమనం లభించలేదు.

ఓటమికి సాకు: బీజేపీ

వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని అర్థమైనందునే కాంగ్రెస్ పార్టీ ఓ సాకును వెతుక్కుంటోందని బీజేపీ విమర్శించింది. తమ హయాంలో అనేక కుంభకోణాల ద్వారా పోగు చేసుకున్న సొమ్మును ఎన్నికల ప్రచారంలో ఉపయోగించుకోవాలంటూ బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేతలు తమ తప్పులను దిద్దుకోవాల్సింది పోయి దేశంలోని ప్రజాస్వామ్యంపై అడ్డగోలు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్‌గాంధీ ఎంతగా మాట్లాడితే కాంగ్రెస్ అంత నష్టపోతుందని బీజేపీ నేత, మాజీ కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు.

పీపీఏ చేసుకోకుంటే ఇతర రాష్ట్రాలకు కరెంట్!

- తెలంగాణకు తేల్చి చెప్పిన ఎన్టీపీసీ
- పీపీఏ చేసుకోవాలని ప్రభుత్వానికి మూడుసార్లు లేఖ
- ఆర్టీఐ కింద సమాచారమిచ్చిన సంస్థ

హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) సత్వరమే చేసుకోకుంటే.. రామగుండంలో రెండోదశ 2,400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం చేపట్టి ఇతర రాష్ట్రాలకు కరెంట్ సరఫరా చేయడం తప్ప మరో మార్గంలేదని ఎన్టీపీసీ తేల్చిచెప్పింది. ఈ మేరకు ఈ ఏడాది జనవరి 9న తెలంగాణ స్టేట్ పవర్ కో-ఆర్డినేషన్ (టీఎస్‌పీసీసీ) జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌కు సంస్థ లేఖ రాసింది. అయితే ప్లాంట్‌లో ఉత్పత్తయ్యే మొత్తం విద్యుత్ తమకివ్వాలని తెలంగాణ కోరగా 85శాతమే ఇస్తామని, మిగతా 15శాతాన్ని నేషనల్ పూల్‌లో పెడుతున్నట్లు ఇదివరకే ఎన్టీపీసీ స్పష్టం చేసింది. రెండో దశ నిర్మాణం చేపట్టాలంటే విధిగా పీపీఏ చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. పీపీఏ చేసుకోవాలంటూ 2023 అక్టోబరు 5న, 2024 జనవరి 9న, జనవరి 29న తెలంగాణ కు లేఖ రాసినట్లు సంస్థ తెలిపింది. ఈ మేరకు సమాచార హక్కు చట్టం కింద సమాధానం ఇచ్చింది. కరెంట్ కొనుగోలుకు తెలంగాణ మౌఖికంగా సమ్మతి తెలిపినా పీపీఏ మాత్రం చేసుకోలేదని సమాచార హక్కు కార్యకర్త ఇనగంటి రవికుమార్ ఆర్టీఐ కింద అడిగిన ప్రశ్నకు ఈ నెల 20న ఎన్టీపీసీ సమాచారం ఇచ్చింది. కాగా తెలంగాణ విద్యుత్ అవసరాలు తీర్చేందుకు రామగుండంలోని ఎన్టీపీసీ రెండో దశ(2400 మెగావాట్ల) ప్లాంట్ నిర్మాణానికి ఎన్టీపీసీ ఆమోదం తెలిపింది. ఈ దశలో 85 శాతం(2040 మెగావాట్ల) కరెంట్‌ను తెలంగాణకే ఇవ్వనుంది. ఈ ప్లాంట్‌కు అవసరమైన బొగ్గుకు సింగరేణి నుంచి కోల్ లింకేజీ ఇవ్వడానికి కేంద్రం అంగీకరించింది. ప్లాంట్‌కు అవసరమైన నీటిని ఎల్లంపల్లి బ్యారేజీ నుంచి అందించనున్నారు. ఇటీవలే ఎన్టీపీసీ రెండో దశను తెలంగాణ విద్యుత్ అవసరాల కోసం కట్టాలని కేంద్రాన్ని ప్రభుత్వం కోరింది. ఇదిలా ఉండగా..రామగుండంలో నిర్మించతలపెట్టిన తెలంగాణ థర్మల్ పవర్ ప్లాంట్ రెండో దశలో ఉత్పత్తయ్యే కరెంట్ యూనిట్‌కు రూ.4.12కే లభిస్తుందని ఎన్టీపీసీ పేర్కొంది. ఈ మేరకు తెలంగాణ ట్రాన్స్‌కో జేఎండీకి ఎన్టీపీసీ లేఖలో స్పష్టంచేసింది. తుది ధరను సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ(సీఈఆర్‌సీ) నిర్ధారిస్తుందని పేర్కొంది.

ప్రణీత్‌రావుకు చుక్కెదురు

- కస్టడీపై హైకోర్టులో వేసిన పిటిషన్ డిస్మిస్

హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌ట్యాపింగ్ కేసులో అరెస్టైన మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుకు హైకోర్టులో చుక్కెదురైంది. పోలీసు కస్టడీ విధిస్తూ నాంపల్లి ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేయాలంటూ ఆయన దాఖలు చేసిన క్రిమినల్ రివిజన్ పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. ట్రయల్ కోర్టు ఇచ్చిన కస్టడీ ఆదేశాలను సమర్థిస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు బుధవారం తీర్పు రిజర్వు చేసిన జస్టిస్ జి.రాధారాణి ధర్మాసనం గురువారం ఉత్తర్వులను వెలువరించింది. కస్టడీ సమయంలో దిగువ కోర్టు షరతులను విధించలేదని, ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకే విచారించాలనే సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పోలీసులు పట్టించుకోకుండా.. 24 గంటలూ ఇంటరాగేట్ చేస్తున్నారని ప్రణీత్ తరఫు న్యాయవాది వాదనలను వినిపించిన విషయం తెలిసిందే.! సెలెక్టివ్‌గా మీడియాకు సమాచారం అందిస్తున్నారని ఆరోపించారు. పోలీసుల తరఫున న్యాయవాది వాదనలను వినిపిస్తూ.. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారమే విచారణ జరుగుతోందని వివరించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. దిగువ కోర్టు ఇచ్చిన కస్టడీ ఆదేశాలను సమర్థించింది. ప్రణీత్‌రావు పిటిషన్‌ను కొట్టివేసింది.

రుణాల పేరిట రూ.2.37కోట్లు స్వాహా

- ఖాతాల నుంచి కాజేసిన బ్యాంక్ మేనేజర్

నూతన్‌కల్: ఖాతాదారుల పేరుతో బ్యాంకు మేనేజర్ రుణాలు తీసుకున్న ఘటన సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండలం తాళ్లసింగారంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తాళ్లసింగారం బ్రాంచ్ ఎస్‌బీఐ మేనేజర్‌గా పనిచేసిన హరిప్రసాద్ గతంలో సమభావన సంఘాలు, రైతుల పేరుతో రూ.2.37 కోట్లను జారీ చేసి, ఆ వెంటనే స్వాహా చేశారు. మూణ్నెల్ల క్రితం బ్యాంకు ఆడిట్‌లో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. టీక్యాతండా గ్రామంలో ఉన్న మల్సూర్ స్వామి సమభావన సంఘం, దండుమైసమ్మ సమభావన సంఘం, శ్రీవేంకటేశ్వర సమభావన సంఘాలకు తలా రూ.15 లక్షల చొప్పున, తాళ్లసింగారం గ్రామంలో రైతులకు రూ. లక్షలు అప్పు ఇచ్చినట్లుగా రికార్డులు చెబుతున్నాయి. అయితే.. అన్ని ఖాతాల్లోనూ రుణం డబ్బు జమవ్వగానే.. ఇతరుల ఖాతాల్లోకి బదిలీ అయినట్లు ఆడిట్ అధికారులు గుర్తించారు. ఇలా రూ.2.37 కోట్ల మేర రుణాల మంజూరు.. ఆ వెంటనే ఇతర ఖాతాల్లోకి బదిలీ జరిగినట్లు నిర్ధారించారు. ఇలా నగదు బదిలీ చేయడంలో హరిప్రసాద్‌కు బ్యాంకులోని ఆధార్ కేంద్రం నిర్వాహకుడు, ఇతర సిబ్బంది సహకరించినట్లు సమాచారం. ఆడిట్ తర్వాత ఉన్నతాధికారులు హరిప్రసాద్‌ను సస్పెండ్ చేశారు. నెల క్రితం బ్యాంకు మేనేజర్‌గా బాధ్యతలను స్వీకరించిన రవీందర్.. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన తుంగతుర్తి సీఐ శ్రీనివాస్, ఎస్సై సైదులు గురువారం దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో పలువురు బాధితుల స్టేట్‌మెంట్లను రికార్డ్ చేశారు.

కవితను కలిసిన తల్లి శోభ, కేటీఆర్

- వారి వెంట న్యాయవాది మోహిత్‌రావు
- గంట పాటు భేటీ.. నేడు సుప్రీంకోర్టులో విచారణకు రానున్న పిటిషన్‌పై చర్చ



న్యూఢిల్లీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను గురువారం ఆమె తల్లి శోభ, సోదరుడు, మాజీ మంత్రి కేటీఆర్, బంధువు సౌమ్య, న్యాయవాది మోహిత్‌రావు కలిశారు. వారు ఈడీ కార్యాలయానికి వెళ్లి రాత్రి 7 నుంచి 8 గంటల వరకు వారు కవితతో మాట్లాడారు. ఐదు రోజులుగా ఈడీ కస్టడీలోనే ఉన్న కవితను చూసి తల్లి శోభ భావోద్వేగానికి గురైనట్లు తెలిసింది. కవిత తన తల్లికి ధైర్యం చెప్పినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈడీ తనను అక్రమంగా అరెస్టు చేసిందని, తక్షణమే విడుదల చేసేలా ఆదేశించాలని కోరుతూ కవిత సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై శుక్రవారం విచారణకు జరగనుంది. దీనిపై కవితతో కేటీఆర్, మోహిత్‌రావు చర్చించినట్లు తెలిసింది. శనివారంతో ఈడీ కస్టడీ ముగియనున్న నేపథ్యంలో తర్వాత ఏం చేయాలి? ఒకవేళ సుప్రీం కోర్టు సానుకూలంగా స్పందించకుంటే ఎలా ముందుకెళ్లాలనే అంశాలపై వారి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం.

విశాఖలో కొకైన్ కలకలం

25వేల కిలోల డ్రై ఈస్ట్‌లో కలిపి రవాణా.. బ్రెజిల్ నుంచి షిప్పులో విశాఖకు రాక

- ఇంటర్‌పోల్ సమాచారం.. పట్టుకున్న సీబీఐ
- విచారణకు అడ్డుపడిన ఏపీ అధికారులు
- తెరవెనుక వైసీపీ పెద్దలున్నారనే అనుమానం



విశాఖపట్నం పోర్టు

విశాఖపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణాతో వార్తల్లో నిలుస్తున్న విశాఖలో కొకైన్ కలకలం రేగింది. బ్రెజిల్ నుంచి వచ్చిన ఓ కంటెయినర్‌లో సుమారు 25వేల కిలోల డ్రై ఈస్ట్‌లో కొకైన్ కనిపించడం తీవ్ర సంచలనంగా మారింది. 'ఆపరేషన్ గరుడ'లో భాగంగా ఇంటర్‌పోల్ ఇచ్చిన సమాచారంతో రంగంలోకి దిగిన సీబీఐ అధికారులు.. ఈ అంతర్జాతీయ డ్రగ్ రాకెట్‌ను ఛేదించారు. సుమారు 25 వేల కిలోల 'డ్రై ఈస్ట్'లో కలిపి ఉన్న కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. అయితే ఎంతమొత్తంలో కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారో తెలియాల్సి ఉంది. బ్రెజిల్‌లోని శాంటోస్ పోర్టు నుంచి షిప్ కంటైనర్‌లో భారీ పరిమాణంలో మాదక ద్రవ్యాలను విశాఖకు తరలిస్తున్నట్టు పసిగట్టిన ఇంటర్‌పోల్.. ఢిల్లీలోని సీబీఐ అధికారులను అప్రమత్తం చేసింది. అక్కడ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఇక్కడి సీబీఐ అధికారులు.. ఈ నెల 16న విశాఖ పోర్టుకు చేరుకున్న కంటైనర్‌ను కస్టమ్స్ అధికారుల సహాయంతో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అందులోని సరుకును పరిశీలించేందుకు ఈ నెల 19న ఢిల్లీ నుంచి నిపుణులు వచ్చారు. ఒక్కొక్కటి 25 కిలోలున్న వెయ్యి బ్యాగుల్లో కొన్నింటిని తెరవగా.. ఒక్కో సంచిలో 20 పెల్లెట్లు కనిపించినట్టు సమాచారం. డ్రగ్స్‌తో వచ్చిన కంటైనర్‌ను విశాఖలో ఆక్వా ఎగుమతులు, దిగుమతులు చేపట్టే సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్టర్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ పేరిట బుక్ చేసినట్టు సీబీఐ అధికారులు తేల్చారు. ఆ కంపెనీ ప్రతినిధులతోపాటు మరికొందరిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదుచేశారు. దీనిపై సంధ్య సంస్థ ప్రతినిధులను ప్రశ్నించగా, తాము తొలిసారి దీన్ని తెప్పించుకున్నామని చెప్పినట్టు తెలిసింది.

అడ్డుపడిన ఏపీ అధికారులు

పోర్టులో సీబీఐ అధికారులు తనిఖీ చేస్తున్నప్పుడు.. పోర్టు అధికారులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన మరికొందరు అధికారులు వారికి అడ్డుపడ్డారు. వైసీపీ పెద్దల సూచనతో ఆగమేఘాలపై అక్కడికి చేరుకుని.. విచారణ ముందుకు సాగకుండా ఉండేందుకు విఫలయత్నం చేశారు. సంధ్య సంస్థ ప్రతినిధులు కూడా.. వర్షం పడేలా ఉందని, బయటకు తీసిన సరుకును మళ్లీ కంటెయినర్‌లో పెట్టేయాలని, కావాలంటే తర్వాత విచారణ చేసుకోవచ్చని సీబీఐ అధికారులను ప్రాధేయపడ్డారు. అప్పటికి ఇంకా వాటిని పరీక్షించలేదు. అయితే సీబీఐ అధికారులు వారి మాటలు పట్టించుకోకుండా.. తమ వెంట తీసుకువెళ్లిన కిట్ల ద్వారా 20 పెల్లెట్లను పరీక్షించారు. వాటిలో మత్తు పదార్థం 'కొకైన్' ఉన్నట్టు పరీక్షల్లో తేలింది. దాంతో అధికారులు అదే విషయాన్ని విచారణ నివేదికలో రాసి, సంధ్య సంస్థ తరఫున వచ్చిన వారితో సంతకాలు చేయించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ గిరిధర్ మాట్లాడుతూ.. డ్రై ఈస్ట్‌ని తాము దిగుమతి చేసుకోవడం ఇదే మొదటిసారని, అందులో ఏముందో తమకు తెలీదని సీబీఐ అధికారులకు చెప్పారు. పోర్టు అధికారులు మాత్రం చాలాకాలంగా ఈ సంస్థ డ్రై ఈస్ట్‌ని తెప్పించుకుంటోందని చెప్పడం గమనార్హం. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఇలాంటి కంటెయినర్లు నెలకు 5-6 దాకా వస్తున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో.. దీనిపై పూర్తి స్థాయిలో విచారణకు సీబీఐ నడుం బిగించింది.

పోలీసుల అత్యుత్సాహం..

పోర్టులో సీబీఐ విచారణ జరుగుతోందని తెలియగానే.. ఒక ఐజీ, విశాఖపట్నం పోలీస్ కమిషనర్, ఇంటెలిజెన్స్ అధికారులు, పోర్టు అధికారులు అంతా అక్కడకు చేరుకున్నారు. ఏపీ రాష్ట్ర అధికారుల్లో కొందరు అక్కడ దొరికిన కొకైన్ శాంపిల్ కావాలని కోరారు. దానికి సీబీఐ అధికారులు నిరాకరించారు. సాధారణంగా సీబీఐ విచారణ చేస్తున్నప్పుడు రాష్ట్ర పోలీసు యంత్రాంగాన్ని అనుమతించరు. ఈ విషయం పోలీసు పెద్దలకు కూడా తెలుసు. అయినా సరే పెద్ద సంఖ్యలో పోలీసు అధికారులు అక్కడికి చేరుకొని, సంస్థ తరఫున వకాల్తా పుచ్చుకోవడాన్ని సీబీఐ తన ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావించింది. ఈ డ్రగ్స్ రాకెట్ వెనుక వైసీపీ నేతల హస్తం ఉందని, అందుకే కేసును మాఫీ చేయడానికి పోలీసు పెద్దల ద్వారా ప్రయత్నం చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కత్తులు, తుపాకీతో హడలెత్తించినా

ధైర్యంగా మడతబెట్టేసి

» ఇద్దరు ఆగంతకులపై తిరగబడ్డ తల్లి, కూతురు

» ఒక దొంగ పరార్.. దొరికిన మరొకడు



దాడి వివరాలు వెల్లడిస్తున్న తల్లి అమిత్‌మహోత్‌తో కుమార్తె ..

బేగంపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఇంట్లోకి చొరబడ్డ ఇద్దరు ఆగంతకుల్లో ఒకరు మహిళ తలపై తుపాకీ గురిపెట్టాడు. మరో ఆగంతుకుడు ఆమె కుమార్తెను కత్తితో బెదిరించాడు. 'ఇంట్లో ఉన్న బంగారం, డబ్బు, విలువైన వస్తువులివ్వండి.. లేదంటే కాల్చిపారేస్తాం.. పొడిచేస్తాం' అని గట్టిగా అరిచారు. ఆ తల్లీకూతుళ్లు బెదరలేదు సరికదా ఆ ఇద్దరిపై ఒక్కసారిగా తిరగబడ్డారు. హడలెత్తిపోయిన ఆగంతకుల్లో ఒకరు అక్కడి నుంచి పరారవ్వగా.. మరొకరిని ఆ తల్లీకూతుళ్లు స్థానికుల సాయంతో పట్టుకున్నారు. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పైగా కాలనీలో గురువారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. పైగా కాలనీలోని ప్లాట్ నంబర్ 5లో ఆర్కే జైన్ కుటుంబం నివసిస్తోంది. జీడిమెట్ల పారిశ్రామికవాడలో వీరికి రబ్బరు ఫ్యాక్టరీ ఉంది. గురువారం మధ్యాహ్నం 1.30 సమయంలో ఇంట్లోని వంట గదిలో పనిమనిషి, మరో గదిలో ఆర్కే జైన్ భార్య అమిత్ మహోత్, కుమార్తె ఉన్నారు. కొరియర్ అంటూ ఇంట్లోకి ఒక వ్యక్తి ప్రవేశించాడు. రాగానే తుపాకీని పని మనిషికి చూపిస్తూ బెదిరించాడు. పనిమనిషి పెద్దగా అరవడంతో అమిత్ మహోత్, ఆమె కుమార్తె బయటకొచ్చారు. మరో ఆగంతుకుడు కత్తి చూపిస్తూ వారిని బెదిరించాడు. ఇంట్లో ఉన్న బంగారు నగలు, డబ్బులు ఇవ్వాలని, లేదంటే చంపేస్తామని, ఆయుధాలను చూపిస్తూ భయభ్రాంతులకు గురి చేశారు. అయితే, కత్తి పట్టుకుని ఇంట్లోకి వచ్చిన ఆంగతుకుడిని జైన్ భార్య గుర్తు పట్టింది. ప్రేమ్‌చంద్ నువ్వా? ఎందుకొచ్చావు? అని పెద్దగా అరిచి అతడిపై తిరగపడింది. వంటగదిలో గన్ చేతబట్టి ఉన్న వ్యక్తిపై తల్లీ కుమార్తెలు తిరగబడటంతో అతను వారిని బెదిరిస్తూ బయటకొచ్చాడు. అయినా.. వారు అతడిని పట్టుకునేందుకు యత్నించగా పరారయ్యాడు. ఇంతలో కత్తి పట్టుకుని మరో వ్యక్తి బయటకు రావడంతో మహిళల అరుపులు విని స్థానికులు అక్కడకు చేరుకున్నారు. కత్తి చూపిస్తూ పారిపోయేందుకు యత్నించిన అతడిని స్థానికుల సాయంతో మహిళలు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అయితే ఇద్దరిలో ప్రేమ్‌చంద్ అనే వ్యక్తి గతంలో ఆర్కే జైన్ ఇంట్లోనే పని చేశాడని పోలీసులు గుర్తించారు. మరో అగంతకుడిని వరంగల్ జిల్లా కాజీపేట రైల్వే స్టేషన్‌లో పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆరేడేళ్లకోసారి కొవిడ్‌లాంటి మహమ్మారి!

» వాతావరణ మార్పులతోనే ఆరోగ్య సమస్యలు

» హుక్‌వార్మ్, చాగస్ లాంటివి ప్రమాదకరం!

» ఏఐజీలో సదస్సులో ప్రొఫెసర్ పీటర్ హోటెజ్

హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): 'కొవిడ్ లాంటి మహమ్మారి ప్రతి 6-7 ఏళ్లకోసారి వస్తూనే ఉంటుంది.. కరోనానే చివరిదని అనుకోవడానికి లేదు. వాతావరణ మార్పుల వల్ల ఈ వైరస్‌లు రూపాంతరం చెందుతూనే ఉన్నాయి. వ్యాక్సిన్లు కూడా దానికి తగినట్లుగా అభివృద్ధి చేయాలి' అని ప్రొఫెసర్ పీటర్ జె హోటెజ్ అన్నారు. అమెరికా టెక్సాస్‌లోని బేలార్ కాలేజీ ఆఫ్ మెడిసిన్‌లో నేషనల్ స్కూల్ ఆఫ్ ట్రాపికల్ మెడిసిన్ డీన్‌గా సేవలందిస్తున్న ఆయన.. నిర్లక్ష్యం చేసిన ఉష్ణమండల వ్యాధులపై విస్తృత స్థాయిలో పరిశోధనలు చేస్తున్నారు. గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పిటల్‌లో 'నిర్లక్ష్యం చేసిన జీర్ణశయాంతర వ్యాధులకు ప్రపంచ స్థాయి వ్యాక్సిన్లు' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో హోటెజ్ ప్రసంగించారు. ఉష్ణమండల దేశాల్లో వాతావరణ మార్పుల కారణంగా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. ముఖ్యంగా ఆఫ్రికా ఖండం, భారత్ వంటి దేశాల్లో చాగస్, హుక్‌వార్మ్ (కొంకిపురుగు) ఇన్‌ఫెక్షన్ లాంటివి తీవ్రమవుతున్నాయని చెప్పారు. దురదృష్టవశాత్తు వాటిని నిర్లక్ష్యం చేస్తున్నామని.. భవిష్యత్తులో అవి ఆరోగ్య రంగంపై ఒత్తిడి తెచ్చే అవకాశాలు లేకపోలేదని హెచ్చరించారు. వ్యాక్సిన్లు లేకపోతే ఆరోగ్య పరంగా ముప్పు తప్పదన్నారు. అయితే, అన్నింటికీ ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్‌లే పరిష్కారం చూపలేవని.. ఇతర మార్గాలనూ అన్వేషించాలని సూచించారు.

కురుమ కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం ఓకే

యాదగిరిగుట్ట రూరల్, మార్చి 21 : కురుమ కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి సుముఖత వ్యక్తం చేశారని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎగ్గిడి మల్లేశం తెలిపారు. గురువారం వారు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా... గొల్ల కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా కురుమ కార్పొరేషన్ ఏర్పాటుచేస్తే రాజకీయంగా, సామాజికంగా వారు అభివృద్ధి చెందుతారని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇందుకు ఆయన సుముఖత వ్యక్తం చేసినట్లు చెప్పారు.

మానవ మనుగడకు ఆధారం అడవులే

» వాటిని కాపాడేందుకు ఉద్యమిద్దాం: మంత్రి సురేఖ

హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): "ప్రకృతి మాత్రమే శాశ్వతమైంది. మానవ మనుగడకు ఆధారం అడవులే అన్న సత్యాన్ని గుర్తుంచుకోవాలి. అడవులను కాపాడేందుకు ఉద్యమిద్దాం" అని అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండా సురేఖ ఓ ప్రకటన విడుదల చేశారు. పట్టణీకరణ, పరిశ్రమల స్థాపన, పోడు వ్యవసాయం తదితర కారణాలతో అడవులు నానాటికీ అంతరించి పోతున్నాయని, దీంతో గ్లోబల్ వార్మింగ్ ప్రభావం వంటి కఠిన సమస్యలు ఎదుర్కొంటున్నామని అన్నారు. మానవ మనుగడకు జీవనాధారాలైన గాలి, ఆహారానికి ఆలవాలమైన అడవులను జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తుచేశారు.

మత్స్య విభాగం కాంగ్రెస్ కార్యదర్శిగా రాజేష్

తెలంగాణ పీసీసీ మత్స్య విభాగం కాంగ్రెస్ కార్యదర్శిగా సొప్పిరి రాజేష్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం నియామక పత్రాన్ని టీపీసీసీ (ఫిషర్‌మెన్) కాంగ్రెస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ చేతుల మీదుగా రాజేష్ అందుకున్నారు. కాంగ్రెస్ పార్టీ పటిష్ఠత కోసం కృషి చేయాలని రాజేష్‌కు సాయికుమార్ సూచించారు.

సార్.. ఇళ్ల మధ్య బార్‌ను మూయించండి

» హైకోర్టుకు ఆరో తరగతి విద్యార్థి లేఖ

» సుమోటోగా కేసు.. ప్రభుత్వానికి నోటీసులు

హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): "సార్.. మా కాలనీలో ఇళ్ల మధ్య ఉన్న బార్ అండ్ రెస్టారెంట్ వల్ల ఇబ్బందులు పడుతున్నాం. బార్ చుట్టూ ఇళ్లున్నాయి. బడులు ఉన్నాయి. దేవాలయాలున్నాయి. వృద్ధాశ్రమాలు కూడా ఉన్నాయి. గుడి, బడి దగ్గర బార్ ఉండొద్దు కదా? ఆ బార్‌ను వెంటనే తరలించేలా చూడండి సార్.." అంటూ ఆరో తరగతి బాలిక హైకోర్టుకు లేఖ రాసింది. హయాత్‌నగర్ పరిధిలోని సాహెబ్‌నగర్ కాలనీలో కొనసాగుతున్న 'సాయి యువ బార్ అండ్ రెస్టారెంట్'పై ఆ బాలిక ఫిర్యాదు చేసింది. ఆ బార్‌కు 70 మీటర్లలోపు స్కూళ్లు, కాలేజీలు, 50 మీటర్ల దూరంలో ఓ శివాలయం ఉన్నట్లు పేర్కొంది. నివాస ప్రాంతాల మధ్య బార్ ఉండడంతో ఉదయం 10.30 నుంచి అర్ధరాత్రి వరకు న్యూసెన్స్ కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేసింది. కోర్టు ఆ లేఖను సీరియస్‌గా తీసుకుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం వెంటనే స్పందించింది. ఆ లేఖను సుమోటోగా స్వీకరించింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అంతేకాదు.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్), హోం, ఎక్సైజ్ శాఖల ముఖ్య కార్యదర్శులు, జీహెచ్ఎంసీ, ఎక్సైజ్ కమిషనర్లు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, రాచకొండ పోలీసు కమిషనర్, హయాత్‌నగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోలకూ నోటీసులు ఇచ్చింది.

హోలీలోపు అభ్యర్థుల ప్రకటన

మల్కాజిగిరి గెలుపు అభ్యర్థిది కాదు.. సీఎంది.. నా బలం బలగం మీరే.. కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందే

ఇక్కడ నా గెలుపుతోనే కేసీఆర్ పతనం ప్రారంభమైంది

కష్టపడిన వారిని ప్రభుత్వంలో భాగస్వాములను చేస్తా.. నియోజకవర్గ సన్నాహక భేటీలో సీఎం రేవంత్



మల్కాజిగిరి నియోజకవర్గ సన్నాహక భేటీలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మేడ్చల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులను హోలీ పండగ (సోమవారం)లోగా పార్టీ అధిష్ఠానం ప్రకటిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. కష్టపడిన వారిని ప్రభుత్వంలో భాగస్వాములను చేసే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. మనకు బలమైన నాయకత్వం ఉందని, సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం కార్యాలయంలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "మల్కాజిగిరి లోక్‌సభ ఎన్నిక అభ్యర్థిది కాదు. ముఖ్యమంత్రిది. నా బలం.. బలగం మీరే. ఎట్టి పరిస్థితుల్లో మల్కాజిగిరిలో కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందే. ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకం. మల్కాజిగిరి ప్రచార మోడల్‌ను రాష్ట్రమంతా అనుసరించేలా నిర్వహించాలి" అని నిర్దేశించారు. గత ఎన్నికల సమయంలో నాయకులు అమ్ముడుపోయినా కార్యకర్తలు భుజాలపై మోసి తనను గెలిపించి ఢిల్లీకి పంపించారని, ఇక్కడ గెలవడం ద్వారా రాష్ట్రానికి ముఖ్యమంత్రి స్థాయికి ఎదగగలిగానని గుర్తుచేశారు. తద్వారా, ఆ ఎన్నిక నుంచే కేసీఆర్ పతనం మొదలైందని చెప్పారు. మెట్రో, ఎంఎంటీఎస్ రావాలన్నా.. జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్య తీరాలన్నా కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని తెలిపారు. రాష్ట్రమంతా తుఫాను వచ్చినట్లు గెలిచినా మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని, అందుకే, ఈసారి ఇక్కడ కాంగ్రెస్ జెండా ఎగరాలని సూచించారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికలోనూ కాంగ్రెస్ గెలవాలని నిర్దేశించారు. సమావేశానికి ఏఐసీసీ అధికార ప్రతినిధి మధు యాష్కీ గౌడ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, సునీత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల తర్వాతే ఎల్ఆర్ఎస్!

పెండింగ్‌లో 25.44 లక్షల దరఖాస్తులు.. నాలుగేళ్ల నిరీక్షణకు తెర దించుతూ నెల రోజుల క్రితం ప్రకటన

» మార్చి 31 వరకు గడువు.. విధివిధానాల రూపకల్పనలో జాప్యం

» జూన్ 4న ఎన్నికల ఫలితాలు.. ఆ తర్వాతే ఎల్ఆర్ఎస్‌పై నిర్ణయం



హైదరాబాద్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): లేఅవుట్ క్రమబద్ధీకరణ ప్రక్రియ మరో మూడు నెలలకు వాయిదా పడింది. ప్రభుత్వ నిర్ణయం కోసం దరఖాస్తుదారులు నిరీక్షిస్తున్న తరుణంలో మార్చి 31లోపు రెగ్యులరైజ్ చేస్తామని నెల క్రితం సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేశారు. అధికారులు పాత విధానాల్లో మార్పులు, చేర్పులు చేస్తూ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. ఎల్ఆర్ఎస్ కోసం ఇచ్చిన గడువుకు పది రోజులే మిగిలి ఉండటం, దీనిపై విధివిధానాలకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడకపోవడంతో ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈ లోపే ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో పూర్తిగా పక్కన పెట్టేశారు. ఎన్నికల ఫలితాలు జూన్ 4న ఉండటంతో ఆ తర్వాతే ఈ అంశంపై ప్రభుత్వం దృష్టిసారించనుందని అధికారులు తెలిపారు.

కనీసం నెల రోజుల ప్రక్రియ

ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ముందుకు సాగాలంటే మూడు దశల్లో పని చేయాల్సి ఉంటుంది. తొలుత దరఖాస్తులను పరిశీలించాలి. అనంతరం ఆ దరఖాస్తుల్లోని కొలతల పరిశీలనకు క్షేత్ర స్థాయి పర్యటన చేస్తారు. అన్నీ నిర్ధారించుకున్న తర్వాత నిబంధనల ప్రకారం దరఖాస్తుదారు చెల్లించాల్సిన ఫీజును నిర్ణయిస్తారు. ఆ మేరకు దరఖాస్తుదారులకు నోటీసులు పంపుతారు. ఈ నోటీసులను మునిసిపాలిటీలో అయితే అక్కడి అధికారులు, గ్రామ పంచాయతీల్లో అయితే పంచాయతీ కార్యదర్శులు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా నోటీసులు ఇచ్చేందుకు కనీసం 15 నుంచి 20 రోజుల సమయం పడుతుంది. అదే సమయంలో ఆ నోటీసుల ప్రకారం ఫీజు చెల్లించేందుకు దరఖాస్తుదారులకు కొంత సమయమివ్వాలి. ఇది కూడా కనీసం 15 రోజులు ఉంటుంది. అంటే నోటీసులివ్వడం, అందులో పేర్కొన్న ఫీజులు లబ్ధిదారులు చెల్లించడానికి కనీసం నెల రోజుల సమయం కావాలి. ఇది ఇంకా పెరిగే అవకాశం కూడా ఉంటుంది. ఫీజు చెల్లింపు ప్రక్రియ పూర్తయిన కొన్ని రోజుల్లో ఎల్ఆర్ఎస్ చేసుకున్నట్లుగా ధ్రువీకరణ పత్రం ఇస్తారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నేపథ్యంలో ఈ ప్రక్రియ ముందుకు వెళ్లే పరిస్థితి లేదు. అందువల్ల లోక్‌సభ ఎన్నికలు పూర్తయ్యాక ఈ ప్రక్రియను ముగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫిబ్రవరి 26న సీఎం ప్రకటన చేసినప్పటికీ.. తక్కువ వ్యవధిలో ఈ ప్రక్రియ పూర్తి చేయాలంటే వీలుకాని పరిస్థితి. దీంతో గతంలో విడుదల చేసిన మార్గదర్శకాలను మార్చాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం గత మార్గదర్శకాలను కుదిస్తూ ముసాయిదా ప్రభుత్వానికి పంపారు. దీనిపై ఉత్తర్వులు ఇవ్వడంలో జాప్యం జరిగింది. దీంతో ఈ ప్రక్రియను తొలుత ప్రకటించినట్లు మార్చి 31లోపు పూర్తి చేయడానికి వీలుకాదని ప్రభుత్వం భావించి ఎన్నికల తర్వాత ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పూర్తి చేసేలా సన్నాహాలు చేస్తోంది.

2020 నుంచి నిరీక్షణ

బీఆర్ఎస్ హయాంలో 2020లో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులను ఆహ్వానించారు. అప్పటి నుంచి నాలుగేళ్లుగా దరఖాస్తుదారులు నిరీక్షిస్తున్నారు. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి కొంత మంది సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసుల వల్ల న్యాయపరమైన చిక్కులు కూడా ఉన్నాయి. విధానాల రూపకల్పన, న్యాయపరమైన ఇబ్బందులన్నీ పరిశీలించి జూన్‌లో ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వం స్పష్టమైన వైఖరిని ప్రకటించే అవకాశం ఉందని ఓ ఉన్నతాధికారి 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. రాష్ట్రంలో లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ పథకం(లేఅవుట్ రెగ్యులైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) కింద 2020లో వచ్చిన దర ఖాస్తులపై సీఎం రేవంత్ రెడ్డి ఫిబ్రవరి 26న క్రమబద్ధీకరణకు అనుమతిస్తూ ప్రకటన చేశారు. ఈ ప్రక్రియను పూర్తి చేయాలని మున్సిపల్, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులను ఆదేశించారు. 2020 ఆగస్టు 31 నుంచి అక్టోబరు 31 వరకు రెండు నెలల పాటు గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను స్వీకరించింది. రాష్ట్రంలోని అన్నీ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల నుంచి దాదాపు 25.44 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. 13 కార్పొరేషన్ల నుంచి 4.13 లక్షలు, 129 మునిసిపాలిటీల నుంచి 10.54 లక్షలు, పంచాయతీల్లో 10.76 లక్షల దరఖాస్తులు అందాయి.

మాకు ప్రత్యేకంగా 'టెట్'

నిర్వహించండి

» ప్రభుత్వానికి ఉపాధ్యాయుల వినతి

హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కాకుండా, తమ కోసం ప్రత్యేకంగా నిర్వహించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. దీని కోసం పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు ప్రభుత్వానికి వినతి పత్రాలు సమర్పించారు. రాష్ట్రంలో పెద్దఎత్తున ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నట్టు ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ డీఎస్సీ పరీక్షకు ముందే టెట్ నిర్వహించాలని నిర్ణయించి, షెడ్యూల్ ప్రకటించింది. దాని ప్రకారం అభ్యర్థులు ఈ నెల 27 నుంచి వచ్చే నెల 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలి. టెట్‌ను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో మే 20 నుంచి జూన్ 3 వరకు నిర్వహించనున్నారు. ఫలితాలను 20లోపు ప్రకటించనున్నారు. ఈ టెట్ పూర్తిస్థాయి నోటిఫికేషన్‌ను ఈ నెల 20న జారీ చేయాల్సి ఉంది. కానీ కొన్ని సాంకేతిక కారణాల వల్ల నిలిచిపోయింది. ఒకటి రెండు రోజుల్లో విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే ఈ టెట్‌పై ఉపాధ్యాయులు కొంత అసంతృప్తితో ఉన్నారు. 2010 తర్వాత ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు కచ్చితంగా టెట్ పాసై ఉండాలనే నిబంధన తీసుకొచ్చిన విషయం తెలిసిందే. టెట్ సర్టిఫికెట్ ఉంటేనే వారికి పదోన్నతులు కల్పించనున్నారు. రాష్ట్రంలో చాలామంది ఉపాధ్యాయులకు టెట్ సర్టిఫికెట్ లేదు. దాంతో వారికి పదోన్నతులు నిలిపివేశారు. ఇలాంటి ఉపాధ్యాయులు ప్రస్తుతం ప్రకటించిన టెట్ రాసి, ఉత్తీర్ణులు కావాలని ప్రభుత్వం సూచిస్తోంది. అయితే ఈ టెట్‌లో తాము ఉత్తీర్ణత సాధించలేమని, తమ కోసం ప్రత్యేక టెట్ నిర్వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దీనికి నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) నిబంధనలు అంగీకరించవని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందనే అంశం ఆసక్తిగా మారింది.

మూడో జాబితాలో

ఐదుగురే..

» ఎంపీ అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్

» రంజిత్ రెడ్డి, సునీతా మహేందర్‌రెడ్డి..

» గడ్డం వంశీ, మల్లు రవి, దానం పేర్లు ఖరారు

» దేశవ్యాప్తంగా 57 మంది అభ్యర్థుల ప్రకటన

న్యూఢిల్లీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థుల మూడో జాబితాను కాంగ్రెస్ గురువారం రాత్రి ప్రకటించింది. ఇందులో రాష్ట్రం నుంచి ఐదుగురికి చోటు లభించింది. అందరూ భావించినట్లుగానే సికింద్రాబాద్ స్థానానికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, పెద్దపల్లి స్థానానికి చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ కుమారుడు వంశీకృష్ణ పేరును ఖరారు చేసింది. ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డికి సిటింగ్ స్థానాన్నే కేటాయించింది. మల్కాజ్‌గిరి నుంచి పట్నం సునీతామహేందర్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించింది. నాగర్‌కర్నూలు విషయంలో మల్లు రవికే అధిష్ఠానం మొగ్గు చూపింది. ఇప్పటి వరకు రాష్ట్రంలో 17 సీట్లకు గాను 9 స్థానాలకు అభ్యర్థులను కాంగ్రెస్ ఖరారు చేసింది. తొలి జాబితాలో రాష్ట్రం నుంచి నలుగురు అభ్యర్థులను ప్రకటించింది. నల్లగొండ నుంచి జానారెడ్డి కుమారుడు రఘువీర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ నుంచి చల్లా వంశీచంద్‌రెడ్డి, జహీరాబాద్ నుంచి సురేశ్ షెట్కార్, మహబూబాబాద్ నుంచి బలరాం నాయక్ పేర్లను కాంగ్రెస్ తొలి జాబితాలో ఖరారు చేసింది. ఇంకా 8 సీట్లు పెండింగ్‌లో ఉన్నాయి.

ప్రముఖుల వారసులకు టికెట్లు..

కాంగ్రెస్ 57 మంది లోక్‌సభ అభ్యర్థుల పేర్లతో మూడో జాబితా విడుదల చేసింది. ఇందులో కర్ణాటక(17), గుజరాత్(11), పశ్చిమ బెంగాల్(8), మహారాష్ట్ర(7), రాజస్థాన్(6), తెలంగాణ(5), అరుణాచల్‌ప్రదేశ్(2), పుదుచ్చేరిలో ఒక సీటుకు అభ్యర్థులను ప్రకటించింది. లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత అధిర్ రంజన్ చౌదరి బెహరాంపూర్ నుంచి పోటీ చేయనున్నారు. మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ వంశానికి చెందిన సాహు ఛత్రపతి మహారాజ్ మహారాష్ట్రలో కొల్హాపూర్ నుంచి కాంగ్రెస్ తరఫున బరిలోకి దిగనున్నారు. కాగా, గుల్బర్గా నుంచి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అల్లుడు రాధాకృష్ణ దొడ్డమణి పోటీ చేయనున్నారు.

బీజేపీ ఖమ్మం, వరంగల్.. ఎంపీ అభ్యర్థుల ఖరారు నేడు

హైదరాబాద్, మార్చి21(ఆంధ్రజ్యోతి): ఖమ్మం, వరంగల్ లోక్‌సభ స్థానాల నుంచి పోటీ చేసే తమ అభ్యర్థులను బీజేపీ శుక్రవారం ఖరారు చేసే అవకాశం ఉంది. పార్టీ కేంద్రఎన్నికల కమిటీ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన అభ్యర్థులను ప్రకటించనున్నారు. వరంగల్ నుంచి ఆరూరి రమేశ్‌నే ఖరారు చేసే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. రెండు రోజుల కిందటే ఆయన బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరారు. ఖమ్మం అభ్యర్థిపై ఉత్కంఠత కొనసాగుతోంది. ఇక్కడకూడా బీఆర్ఎస్ నుంచి ఇటీవలే పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావుకు అవకాశం ఇస్తారన్న ప్రచారం జరిగింది. అయితే, పార్టీ మలి జాబితాలో ఆయన పేరు లేకపోవడంతో సస్పెన్స్ కొనసాగుతోంది. బీఆర్ఎస్ ముఖ్యనేత ఒకరు బీజేపీలో చేరే అవకాశం ఉందని పార్టీ నేతలుపేర్కొంటున్నారు.

బీఆర్ఎస్‌కి ఒకే రోజు 268 కోట్లు


(మొదటిపేజీ తరువాయి)

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సమర్పించిన వివరాల ప్రకారం..

* 2022 ఏప్రిల్ 12న.. బీఆర్ఎస్‌కు అందిన బాండ్ల విలువ రూ.268 కోట్లు.
* 2023 జూలై 13న రూ.218 కోట్లు, 2022 ఏప్రిల్ 11న రూ.92 కోట్లు, 2021 అక్టోబరు 8న రూ.85 కోట్లు ఆ పార్టీకి విరాళాలుగా వచ్చాయి.
* ఈ నిధులన్నీ హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఐటీ, ఫార్మా, నిర్మాణ రంగం, ఆసుపత్రులు ఇచ్చినవే. ఉదాహరణకు.. ఒక్క మేఘా ఇంజనీరింగ్ సంస్థ నుంచే భారత రాష్ట్ర సమితి పార్టీకి రూ.201 కోట్ల విలువైన బాండ్లు వచ్చాయి. అలాగే ఐటీసీ, రహేజా, యశోదా ఆస్పత్రి, రాజపుష్ప ఎసెట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ వంటివి బీఆర్ఎస్‌కు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో విరాళాలు ఇచ్చిన సంస్థల జాబితాలో ఉన్నాయి.

రెండే పార్టీలకు..

క్విక్ సప్లై చైన్ ప్రైవేట్ లిమిటెడ్.. ఫ్యూచర్ గేమింగ్, మేఘా ఇంజనీరింగ్ తర్వాత దేశంలో అత్యధికంగా ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసిన సంస్థ ఇది! రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో సంబంధాలున్న ఈ కంపెనీ.. 2021-22 నుంచి 2023-24 నడుమ మొత్తం రూ.410 కోట్ల విలువైన ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసి వాటన్నింటినీ రెండంటే రెండే పార్టీలకు ఇచ్చేసింది. ఆ రెండు పార్టీల్లో ఒకటి బీజేపీ.. రెండోది శివసేన. తాను కొన్న వాటిలో రూ.385 కోట్ల విలువైన బాండ్లను బీజేపీకి.. మిగతా రూ.25 కోట్ల బాండ్లను శివసేన పార్టీకి ఇచ్చినట్టు.. గురువారం ఈసీ తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన సమాచారం ఆధారంగా వెల్లడైంది. క్విక్ సప్లై తరహాలోనే రిలయన్స్‌తో సంబంధాలున్న మరో కంపెనీ హనీవెల్ ప్రాపర్టీస్.. 2021 ఏప్రిల్ 8న మొత్తం 30కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేసి, వాటన్నింటినీ బీజేపీకి సమర్పించుకుంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో క్విక్‌సప్లై సంస్థ నికర లాభం రూ.21.7 కోట్లు కాగా.. ఆ పార్టీ ఆ ఏడాది కొన్న బాండ్ల విలువ రూ.360 కోట్లు. వాస్తవానికి ఈ కంపెనీకి, రిలయన్స్‌కు ఉన్న సంబంధాల గురించి గతవారం బయటకు వచ్చినప్పుడు.. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధికార ప్రతినిధి మీడియా ముందుకు వచ్చి, రిలయన్స్‌కు ఆ సంస్థ అనుబంధ సంస్థ కాదని, దాంతో ఎలాంటి అనుబంధమూ లేదని ప్రకటించారు. కానీ, ఆ సంస్థ రిజిస్టర్డ్ చిరునామా మాత్రం.. నవీ ముంబైలోని ధీరూభాయ్ అంబానీ నాలెడ్జ్ సిటీలో ఉంది.



హైదరాబాద్‌లో తగ్గిన వాయు కాలుష్యం

» సంగారెడ్డి, పటాన్‌చెరులో కూడా..

» ఐక్యూ ఎయిర్ అధ్యయనంలో వెల్లడి



హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అయ్యే హైదరాబాద్ వాసులకు కాస్త ఊరట. నగరంలో వాయు కాలుష్యం తగ్గుముఖం పట్టిందని ఓ అంతర్జాతీయ సంస్థ అధ్యయనంలో వెల్లడైంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం వివిధ నగరాల్లో వాయు కాలుష్యంపై స్విట్జర్లాండ్ కేంద్రంగా ఉన్న ఐక్యూ ఎయిర్ సంస్థ ఇటీవలే అధ్యయనం నిర్వహించింది. ఇందులో హైదరాబాద్‌తోపాటు సంగారెడ్డి, పారిశ్రామిక సంస్థలున్న పటాన్‌చెరులోనూ వాయు కాలుష్యం గతంతో పోలిస్తే తగ్గినట్టు నివేదికలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లో వాయు కాలుష్యం 2019-20లో పీఎం-10 101ఉండగా, 2022-23లో 87గా ఉంది. 2023-24 సంవత్సరంలో ప్రస్తుతం ఇది 83గా నమోదైందని సంస్థ వెల్లడించింది. అలాగే సంగారెడ్డి, పటాన్‌చెరులోనూ గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం వాయు కాలుష్యం తగ్గిందని తెలిపింది. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో వాయు కాలుష్యంలో రహదారి దుమ్ము 32శాతం, వాహనాల కాలుష్యం 18శాతం ఉందని నివేదిక పేర్కొంది. జీహెచ్ఎంసీ పరిధిలో టీఎస్ఆర్టీసీ డీజిల్ బస్సుల స్థానంలో విద్యుత్తు వాహనాలు ఉపయోగించడం, ప్రధాన రహదారులు దాటేందుకు పాదచారులు ఉపయోగించేందుకు ట్రాఫిక్ పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటుచేయడం, ట్రాఫిక్ రద్దీని బట్టి ఆటోమెటిక్‌గా మారే అడాప్టివ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టం (ఏటీసీఎస్) ఏర్పాటుతో కాలుష్యం తగ్గుతోందని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది.

సీఎంతో బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ భేటీ

హైదరాబాద్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ ఆర్థిక సహకార సంస్థ చైర్మన్‌గా నియమితులైన నూతి శ్రీకాంత్ గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. టీపీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్‌గా పార్టీలో చేసిన సేవలకు గుర్తింపుగా తనను రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి నూతి శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పెరిక కుల కార్పొరేషన్ సాధనా సమితి అభ్యర్థన మేరకు పెరిక(పురగిరి క్షత్రియ) కుల కార్పొరేషన్‌ను ఏర్పాటు ప్రశంసనీయమని కొనియాడారు. ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ముత్తినేని వీరయ్య ధన్యవాదాలు తెలిపారు. తనను వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పెరిక కుల సంక్షేమం కోసం, వికలాంగుల ఆర్థిక అభివృద్ధికి మరింత కృషి చేయాలని వీరయ్యకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

రిసోజెట్‌తో అంబర్ గ్రూప్ జేవీ

హైదరాబాద్: కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, హెవీఏసీ కాంట్రాక్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థ అంబర్ గ్రూప్ వాషింగ్ మెషిన్ల విభాగంలోకి ప్రవేశిస్తోంది. ఇందుకోసం హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే రేడియంట్ గ్రూప్ కంపెనీ రిసోజెట్‌తో కలిసి జాయింట్ వెంచర్ (జేవీ) కంపెనీ ఏర్పాటు చేస్తోంది. ఈ జేవీలో రెండు కంపెనీలకు సమాన వాటా ఉంటుందని అంబర్ గ్రూప్ తెలిపింది. రిసోజెట్‌లో 50 శాతం వాటా కొనుగోలుకు అంబర్ గ్రూప్ రూ.35 కోట్లు వెచ్చించనుంది. అంబర్ గ్రూప్ ఇప్పటికే హీటింగ్, వెంటిలేటర్, ఏసీల తయారీ రంగంలో ఉంది.

ఏప్రిల్ 1 నుంచి కియా కార్ల ధరలు పెంపు

న్యూఢిల్లీ: కియా ఇండియా.. తన వాహన శ్రేణిలోని అన్ని మోడళ్ల ధరలను 3 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. పెంచిన ధరలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపింది. కమోడిటీ ధరలతో పాటు సప్లయ్ చెయిన్ సంబంధిత ఇన్‌పుట్ వ్యయాలు పెరిగిపోవటంతో ధరలు పెంచాల్సి వచ్చిందని పేర్కొంది.

పసిడి పరుగులు

10 గ్రాములు రూ.67,450 స్థాయికి

రూ.81,000 దాటిన కిలో వెండి ధర

మరో ఆల్‌టైమ్ హైలో బంగారం ధర



న్యూఢిల్లీ: పసిడి ధర రేసు గుర్రంలా పరుగెత్తుతోంది. గురువారం 10 గ్రాముల మేలిమి బంగారం (24 కేరట్స్) రికార్డు స్థాయిలో రూ.67,450కి చేరింది. బుధవారం నాటి ధరతో పోలిస్తే ఇది రూ.1,130 ఎక్కువ. కిలో వెండి ధర కూడా రూ.1,100 లాభంతో రూ.77,750కి చేరింది. న్యూయార్క్‌లోని స్పాట్ గోల్డ్ మార్కెట్ 'కామెక్స్' లోనూ ఔన్స్ (31.10 గ్రాములు) పసిడి ధర ఒకే రోజు 48 డాలర్లు పెరిగి 2,202 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. త్వరలోనే ఔన్స్ బంగారం ధర 2,248 డాలర్లకు పెరుగుతుందనే అంచనాలు వినిపిస్తున్నాయి.

ధరల పెరుగుదలకు కారణాలివే...

- డిసెంబరులోగా మూడు విడతలుగా వడ్డీ రేట్లు 0.75 శాతం తగ్గిస్తామని అమెరికా కేంద్ర బ్యాంక్ 'ఫెడ్ రిజర్వ్' ప్రకటించడం.
- ఫెడ్ రిజర్వ్ ప్రకటనతో ఫ్యూచర్స్ మార్కెట్లో డాలర్ల అమ్మకం
- కొన్ని దేశాల కేంద్ర బ్యాంకులు పసిడి కొనుగోళ్లకు దిగడం
- డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ.83 మించిపోవడం
- స్టాక్ మార్కెట్లలో దిద్దుబాటు తప్పదనే భయాలు
- కొనసాగుతున్న అంతర్జాతీయ ఉద్రిక్తతలు
- ఈయూ దేశాల్లో కొనసాగుతున్న ఆర్థిక అనిశ్చితి

హైదరాబాద్‌లోనూ అదే జోరు

హైదరాబాద్ బులియన్ మార్కెట్లోనూ బంగారం, వెండి ధరలు చుక్కలంటాయి. 10 గ్రాముల మేలిమి బంగారం గురువారం రూ.1,080 లాభంతో రూ.67,420కి చేరింది. పది గ్రాముల 22 కేరట్స్ పసిడి ధర రూ.990 లాభంతో రూ.61,800కు చేరింది. కిలో వెండి ధరా రూ.1,500 పెరిగి రూ.81,500కు చేరింది.

టీ హబ్‌తో వెంచర్‌బ్లిక్ ఒప్పందం

హైదరాబాద్: ఆరోగ్య సంరక్షణ రంగానికి విప్లవాత్మకమైన సొల్యూషన్లు అందించే లక్ష్యంతో హెల్త్‌కేర్ ఇన్నోవేషన్ రంగంలోని వెంచర్‌బ్లిక్ కంపెనీ.. టెక్నాలజీ ఇంక్యుబేటర్ టీ-హబ్‌తో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఉభయ సంస్థలు ఒక ఉమ్మడి ప్రకటనలో ఈ విషయం ప్రకటించాయి. వెంచర్ బ్లిక్ దక్షిణాసియా విభాగం హెడ్ డాక్టర్ కైలాస్ జైల్‌దాసానీ, వ్యవస్థాపక సీఈఓ క్రిస్ లీ, తెలంగాణ ప్రభుత్వ ఐటీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హెల్త్‌కేర్ స్టార్టప్‌ల మధ్య ఇన్నోవేషన్, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం, వాటికి డిస్ట్రిబ్యూషన్, మార్కెటింగ్ మద్దతు అందించడం ఈ భాగస్వామ్యం లక్ష్యమని కంపెనీ పేర్కొంది.

తెలంగాణలో ష్నైడర్ ప్లాంట్

బెంగళూరు: ఎనర్జీ మేనేజ్‌మెంట్ సర్వీసుల రంగంలోని ష్నైడర్ ఎలక్ట్రిక్ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో కొత్త ప్లాంట్లు ఏర్పాటు చేసే ప్రయత్నంలో ఉంది. వాటిలో ఒక ప్లాంట్ తెలంగాణలో కూడా ఏర్పాటు కానుంది. గురువారం బెంగళూరులో డేటా సెంటర్లకు శీతలీకరణ పరికరాలను అందించే ప్లాంట్ ప్రారంభించిన సందర్భంగా కంపెనీ ఎండీ, సీఈఓ దీపక్ శర్మ ఈ విషయం ప్రకటించారు. బెంగళూరు ప్లాంట్‌పై రూ.100 కోట్లు ఇన్వెస్ట్ చేశామని, 2026 నాటికి వివిధ రాష్ట్రాల్లో ప్లాంట్ల ఏర్పాటుకు రూ.3,200 కోట్ల పెట్టుబడి ప్రణాళికలో ఇది భాగమని ఆయన చెప్పారు. ష్నైడర్ గ్రూప్‌నకు భారత్‌ను తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయడం తమ లక్ష్యమని ఆయన తెలిపారు. ప్రస్తుతం తమకు తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా 30 తయారీ ప్లాంట్లున్నాయని ఆయన చెప్పారు. 6.5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన బెంగళూరు ప్లాంట్‌లో ఉత్పత్తి అయ్యే ఉత్పత్తుల్లో 85 శాతం ఎగుమతి చేయనున్నట్టు శర్మ తెలిపారు. దేశ విదేశాల్లోని డేటా సెంటర్లు, టెలికాం, కమర్షియల్, పారిశ్రామిక విభాగాలకు అవసరమైన ప్రత్యేక అప్లికేషన్లను ఈ ఫ్యాక్టరీ అందిస్తుందని ఆయన చెప్పారు.

ఎన్ఎండీసీ ఇనుప ఖనిజం ధరలు తగ్గింపు

హైదరాబాద్: ఇనుప ఖనిజం, ఫైన్స్ ధరలు టన్నుకు రూ.200 నుంచి రూ.250 మేరకు తగ్గిస్తున్నట్టు ఎన్ఎండీసీ ప్రకటించింది. దీని ప్రకారం టన్ను ఇనుప ఖనిజం ధర రూ.5,800కి తగ్గితే ఫైన్స్ ధర టన్ను రూ.5,060కి తగ్గుతుంది. గురువారం నుంచే ఈ కొత్త ధరలు అమలులోకి వచ్చినట్టు కంపెనీ తెలిపింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	67,420 ▲	61,800 ▲	81,500 ▲
ముంబై	66,914 ▲	61,293 ▲	75,045 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ			
హైదరాబాద్	415	విజయవాడ	425
22వ తేదీ		విశాఖపట్నం	435
చిత్తూరు	478	వరంగల్	417
గోదావరి	425	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	108	గోదావరి	106
వరంగల్	108	విజయవాడ	106
కరీంనగర్	108	గుంటూరు	107
మహబూబ్‌నగర్	108	ఒంగోలు	107
కర్నూలు	108	చిత్తూరు	98
విశాఖపట్నం	100		

రీట్స్, ఇన్విట్స్‌కు మంచి భవిష్యత్

- 15 ఏళ్లలో ఈక్విటీ మార్కెట్ స్థాయికి..
- సెబీ చీఫ్ మాధవి పురి బుచ్



న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్లు (రీట్స్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్లు (ఇన్విట్స్), మున్సిపల్ బాండ్స్‌కు మంచి భవిష్యత్ ఉందని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ తెలిపారు. న్యూస్18 వార్తా సంస్థ నిర్వహించిన రైజింగ్ భారత్ సదస్సు'లో ఆమె ఈ విషయం చెప్పారు. వచ్చే 10-15 సంవత్సరాల్లో ఈ మూడు పథకాల పెట్టుబడులు.. ఈక్విటీ మార్కెట్లతో సమాన స్థాయికి చేరుకుంటాయన్నారు. ఈ మూడు పెట్టుబడుల్లో రీట్స్‌ను తాను ఎక్కువగా అభిమానిస్తానని చెప్పారు. రీట్స్ పెట్టుబడులకు మంచి భవిష్యత్ ఉందన్నారు. ఈ పెట్టుబడులపై రాబడులను ద్రవ్యోల్బణాన్ని మించి ఉండే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకునే చిన్న, మధ్య స్థాయి రియల్ ఎస్టేట్ కంపెనీల రీట్స్‌లో రిటైల్ మదుపరులు కూడా పాల్గొనేందుకు వీలుగా రీట్స్ కనిష్ఠ జారీని రూ.500 కోట్ల నుంచి రూ.50 కోట్లకు కుదించినట్టు మాధవి తెలిపారు. 'రీట్స్'తో చిన్న మదుపరులు కూడా రియల్ ఎస్టేట్ కంపెనీల యాజమాన్యంలో పాల్గొనే అవకాశం ఏర్పడిందన్నారు. అలాగే భారత రుణ పత్రాల (బాండ్స్) మార్కెట్‌కూ మంచి భవిష్యత్ ఉందని తెలిపారు.

25 కంపెనీల షేర్లకు అనుమతి

28 నుంచి టీ+0 సెటిల్‌మెంట్

దేశీయ క్యాపిటల్ మార్కెట్లలో మరో ప్రధాన మార్పునకు సెబీ శ్రీకారం చుడుతోంది. ఈ నెల 28 నుంచి 25 కంపెనీల షేర్లలో ప్రయోగాత్మకంగా బీటా వెర్షన్‌లో టీ+0 సెటిల్‌మెంట్‌ను ప్రవేశపెడుతోంది. దీంతో ఈ కంపెనీల షేర్ల కొనుగోలు, అమ్మకాలు, నగదు బదిలీ అదే రోజు పూర్తవుతుంది. అంటే టీ+0 సెటిల్‌మెంట్ జాబితాలోని కంపెనీల షేర్లు కొనుగోలు మదుపరుల ఖాతాలో అదే రోజు జమ అవుతాయి. ఆ షేర్లు అమ్మిన మదుపరుల ఖాతాలోనూ నగదు అదే రోజు జమ అవుతుంది. టీ+0 సెటిల్‌మెంట్‌ను సెబీ ఐచ్ఛికంగా (ఆప్షనల్) ప్రవేశపెడుతోంది. ఇవే కంపెనీల షేర్లు కొనుగోలు లేదా అమ్మకం చేయాలనుకునే మదుపరులు ప్రస్తుత టీ+1 ఆప్షన్‌ను కూడా ఎంచుకోవచ్చు. టీ+0 సెటిల్‌మెంట్‌ను ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారు. ఈ ప్రయోగం విజయవంతమైతే అన్ని కంపెనీల షేర్లలో టీ+0 సెటిల్‌మెంట్ ప్రవేశపెట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు.

1:2 నిష్పత్తిలో బీడీఎల్ షేర్ల విభజన

హైదరాబాద్: ప్రభుత్వ రంగంలోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) రూ.10 ముఖ విలువ ఉన్న తన షేర్లను రూ.5 ముఖ విలువ ఉండే రెండు షేర్లుగా విభజించాలని నిర్ణయించింది. గురువారం సమావేశమైన కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఇందుకు ఆమోదం తెలిపింది. పోస్టల్ బ్యాలెట్, ఎలక్ట్రానిక్ ఓటింగ్ ద్వారా వాటాదారుల ఆమోదంతో ఈ విభజన జరుగుతుందని కంపెనీ తెలిపింది. దీనికి తోడు ఒక్కో షేరుపై రూ.8.85 చొప్పున మధ్యంతర డివిడెండ్ చెల్లించేందుకూ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. 2024 ఏప్రిల్ 2 నాటికి కంపెనీ రికార్డుల్లో వాటాదారులుగా ఉన్న వారందరికి ఏప్రిల్ 18 నాటికి ఈ డివిడెండ్ అందుతుంది.

మార్కెట్‌కు ఫెడ్ కిక్

సెన్సెక్స్ 540 పాయింట్లు అప్

ముంబై: ఈ ఏడాది మూడు విడతలుగా వడ్డీ రేట్లు తగ్గించనున్నట్టు అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ప్రకటించడం భారత్ సహా పలు గ్లోబల్ మార్కెట్లలో కొత్త ఉత్తేజం నింపింది. ఫెడ్ నిర్ణయంతో గురువారం అంతర్జాతీయ మార్కెట్లతో పాటు భారత మార్కెట్లు దూకుడును ప్రదర్శించాయి. భారత ఇన్వెస్టర్లు మెటల్, పవర్, ఎనర్జీ షేర్ల కొనుగోళ్లపై మక్కువ ప్రదర్శించారు. ఫలితంగా ఈక్విటీ సూచీలు రోజంతా లాభాల్లో ట్రేడయ్యాయి. ఇంట్రాడేలో 781 పాయింట్ల మేరకు లాభపడిన సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 539.50 పాయింట్ల లాభంతో 72,641.19 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 172.85 పాయింట్ల లాభంతో 22,011.95 వద్ద ముగిసింది. ఈ ర్యాలీతో బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ రూ.5,72,752.70 కోట్లు పెరిగి రూ.3,79,85,669.12 కోట్లకు (4.57 లక్షల కోట్ల డాలర్లు) చేరింది.

- సెన్సెక్స్ షేర్లలో ఎన్‌టీపీసీ, పవర్‌గ్రిడ్, ఇండస్ ఇండ్ బ్యాంక్, టాటా స్టీల్, టాటా మోటార్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టెక్ మహీంద్రా, ఎల్ అండ్ టీ విశేషంగా లాభపడ్డాయి. ఇంత ఉత్సాహపూరిత వాతావరణంలో కూడా భారతి ఎయిర్‌టెల్, మారుతి, ఐసీఐసీఐ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ నష్టాల్లో ముగిశాయి.
- బీఎస్ఈ మిడ్‌క్యాప్ (2.36 శాతం), స్మాల్‌క్యాప్ (2.01 శాతం) సూచీలు కూడా లాభాల్లో ముగిశాయి. ఇతర సెక్టోరల్ సూచీలు కూడా లాభాల్లోనే క్లోజయ్యాయి.

నష్టాల్లో క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్: ఇటీవల ఐపీఓ ముగించుకున్న క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ షేర్లు గురువారం 11.18 శాతం ప్రీమియంతో రూ.795 వద్ద లిస్టయినా చివరికి స్వల్ప నష్టాలతో ముగిసింది. ఈ షేరు బీఎస్ఈలో 0.38 శాతం నష్టంతో రూ.712.30 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో కూడా ఈ షేరు 9.7 శాతం ప్రీమియంతో రూ.785 వద్ద లిస్టింగ్ అయినా చివరికి 0.27 శాతం నష్టంతో రూ.713 వద్ద ముగిసింది.

టీఏసీ షేరు ధర శ్రేణి రూ.100-106: రిస్క్ మేనేజ్‌మెంట్ సర్వీసుల రంగంలోని టీఏసీ ఇన్ఫోటెక్ లిమిటెడ్ ఇష్యూ ఈ నెల 27న ప్రారంభమై ఏప్రిల్ 2వ తేదీన ముగియనుంది. షేరు ధర శ్రేణిని రూ.100-106గా కంపెనీ ప్రకటించింది. ఎన్ఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్ ఎమర్జ్‌పై షేర్లు లిస్టింగ్ అవుతాయి.

ఎగవేతదారులుగా ప్రకటించే ముందు కారణాలు చెప్పాల్సిందే

బ్యాంకులకు బాంబే హైకోర్టు ఆదేశం

ముంబై: రుణాలు ఎగవేసే కంపెనీలు, వ్యక్తులను ఉద్దేశపూర్వక ఎగవేతదారులుగా ప్రకటించడంపై బాంబే హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఏదైనా కంపెనీ లేదా వ్యక్తులను ఉద్దేశపూర్వక ఎగవేతదారులుగా ప్రకటించేటప్పుడు.. ఏ కారణం చేత వారిని ఎగవేతదారులగా ప్రకటిస్తున్నారో స్పష్టం చేయాలని కోరింది. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ఫైనాన్షియల్ సర్వీసెస్ మాజీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మిలింద్ పటేల్ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు ఈ విషయం స్పష్టం చేసింది. ఈ విషయంలో బ్యాంకులు, ఆర్థిక సంస్థల ఆదేశాలు.. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) జారీ చేసిన మాస్టర్ సర్క్యులర్‌కు అనుగుణంగా ఉండాలని కోర్టు స్పష్టం చేసింది. ఒక వ్యక్తి లేదా సంస్థను ఉద్దేశపూర్వక ఎగవేతదారులగా ప్రకటించేటప్పుడు బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తమ విచక్షణాధికారాన్ని జాగ్రత్తగా ఉపయోగించాలని కోరింది. జస్టిస్ కొలబావాలా, జస్టిస్ సోమశేఖర్ సుందరేశన్‌లతో కూడిన ధర్మాసనం ఈ విషయం స్పష్టం చేసింది.

ఈ ఏడాదే భారత మార్కెట్లోకి ఫోక్స్‌వ్యాగన్ ఎలక్ట్రిక్ కారు ఐడీ.4

న్యూఢిల్లీ: విద్యుత్ కారు ఐడీ.4ను ఈ ఏడాది ద్వితీయార్ధంలో భారత మార్కెట్లో ప్రవేశపెట్టడంతో దేశంలో తన ఎలక్ట్రిక్ కార్ల ప్రయాణాన్ని ప్రారంభించనున్నట్లు ఫోక్స్‌వ్యాగన్ ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ కార్లు ప్రాచుర్యంలోకి తెచ్చే ప్రయత్నాల్లో భాగంగా ఈ అడుగేసింది. గురువారం కంపెనీ ఐడీ.4 కారును ఆవిష్కరించింది. ప్రపంచ మార్కెట్లో ఐడీ.2 నుంచి ఐడీ బజ్ వరకు వివిధ కార్లను ఫోక్స్‌వ్యాగన్ విక్రయిస్తోంది.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.*

ఏపీ కస్తూర్బా విద్యాలయాల్లో అడ్మిషన్స్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర శిక్ష పథకం కింద కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో మొత్తం 352 విద్యాలయాలు ఉన్నాయి. ఆరోతరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం(పదకొండో తరగతి)లో చేరేందుకు బాలికలకు ప్రవేశ ప్రక్రియ నిర్వహించనున్నారు. ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకోసం కూడా దరఖాస్తులు కోరుతున్నారు. అనాథలు, వీధి బాలలు, బడి మానేసిన పిల్లలు సహా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ వర్గాలకు చెందిన ఆడపిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: ఆరోతరగతిలో ప్రవేశానికి అయిదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం(పదకొండో తరగతి) ప్రవేశానికి పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల్లో ప్రవేశానికి ఆరు, ఏడు, ఎనిమిది తరగతులు పాసై ఉండాలి. ప్రస్తుతం కేజీబీవీల్లో పదోతరగతి చదివిన బాలికలు కూడా పదకొండో తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,20,000; పట్టణాల్లో రూ.1,40,000 మించకూడదు.

ఎంపిక: ఆన్‌లైన్ దరఖాస్తులు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. వీటిని పరిశీలించి లిస్టు రూపొందిస్తారు. ఎంపికైనవారికి ఫోన్ ద్వారా సమాచారమిస్తారు. సంబంధిత పాఠశాల నోటీస్ బోర్డులో కూడా చూడవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 11
- **ప్రిపరేషన్ ఆఫ్ సెలెక్షన్ లిస్ట్:** ఏప్రిల్ 15న
- **సెలెక్షన్ లిస్ట్ వెరిఫికేషన్:** ఏప్రిల్ 16 నుంచి 18 వరకు
- **సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్:** ఏప్రిల్ 19 నుంచి 24 వరకు
- **వెబ్‌సైట్:** apkgbv.apcfss.in

ఆంధ్రజ్యోతి దిక్సూచి

హైదరాబాద్ ● శుక్రవారం 22 మార్చి 2024
diksuchi@andhrajyothy.com

ఎండీఎన్ఐవైలో యోగ కోర్సులు

కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగ(ఎండీఎన్ఐవై)- స్వల్పకాలిక యోగ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తారు. ఏప్రిల్ 1 నుంచి తరగతులు ప్రారంభమౌతాయి.

ఫౌండేషన్ కోర్స్ ఇన్ యోగ సైన్స్ ఫర్ వెల్‌నెస్

ప్రోగ్రామ్ వ్యవధి ఒక నెల. న్యూఢిల్లీలోని లజపత్ భవన్‌లో ఉదయం రెండు బ్యాచ్‌లు, సాయంత్రం రెండు బ్యాచ్‌లను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. మొరార్జీ దేశాయ్ సంస్థలో సాయంత్రం బ్యాచ్ ఆఫ్‌లైన్ మోడ్‌లో ఉంటుంది. ఆన్‌లైన్‌లో ఉదయం మూడు బ్యాచ్‌లు, సాయంత్రం రెండు బ్యాచ్‌లు నిర్వహిస్తారు. బ్యాచ్‌కు 30 మంది అభ్యర్థులు ఉంటారు. ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు, తొమ్మిది గంటల నుంచి పదకొండు వరకు, పదకొండు నుంచి ఒంటిగంట వరకు; సాయంత్రం మూడు నుంచి అయిదు వరకు, అయిదు నుంచి ఏడు వరకు తరగతులు ఉంటాయి. నిర్దేశించిన మేరకు అటెండెన్స్ ఉంటేనే ప్రోగ్రామ్ పూర్తయ్యాక సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు.

అర్హత: కనీసం 15 ఏళ్లు నిండినవారందరూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉండకూడదు. దరఖాస్తుకు మెడికల్ సర్టిఫికెట్, అభ్యర్థి ఫొటో, వ్యాలిడ్ ఐడీ కార్డ్ జతచేయాలి.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.3000

సర్టిఫికెట్ కోర్స్ ఇన్ యోగ ఫర్ ప్రొటోకాల్ ఇన్‌స్ట్రక్టర్


ప్రోగ్రామ్ వ్యవధి మూడు నెలలు. మొరార్జీ దేశాయ్ సంస్థలో ఉదయం రెండు బ్యాచ్‌లను ఆన్‌లైన్ విధానంలో; సాయంత్రం రెండు బ్యాచ్‌లను ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తారు. బ్యాచ్‌కు 30 మంది అభ్యర్థులు ఉంటారు. ఉదయం ఏడు గంటల నుంచి పది గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి ఏడు గంటల వరకు తరగతులు ఉంటాయి. హిందీ/ఇంగ్లీష్ మాధ్యమంలో బోధన ఉంటుంది.

అర్హత: పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఫౌండేషన్ కోర్స్ ఇన్ యోగ సైన్స్ ఫర్ వెల్‌నెస్/ఒక నెల వ్యవధి గల తత్సమాన కోర్సు పూర్తి చేసి ఉండాలి. యోగ టీచింగ్‌లో కనీసం అయిదేళ్ల అనుభవం ఉన్న ప్రొఫెషనల్స్ కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు పూర్తిగా ఆరోగ్యవంతులై ఉండాలి. దరఖాస్తుతోపాటు అర్హతకు సంబంధించిన సర్టిఫికెట్‌లు, అభ్యర్థి ఫొటో, ఆధార్ కార్డ్ కాపీ జతచేయాలి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ విధానంలో అడ్మిషన్స్ ఇస్తారు.

ప్రోగ్రామ్ ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.9,750; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.6,000


ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 26
- **వెబ్‌సైట్:** yogamdniy.nic.in



ఐఐటీ ఢిల్లీలో పీజీ, పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఫుల్ టైమ్, పార్ట్ టైం కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లలో చేరినవారికి అసిస్టెంట్‌షిప్/ఫైనాన్షియల్ అసిస్టెన్స్/స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు.



ఎంటెక్ విభాగాలు-స్పెషలైజేషన్‌లు

- అప్లయిడ్ మెకానిక్స్: ఇంజనీరింగ్ అనాలిసిస్ అండ్ డిజైన్
- బయో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ బయో టెక్నాలజీ: బయో మాలిక్యులర్ అండ్ బయో ప్రాసెస్ ఇంజనీరింగ్
- కెమికల్ ఇంజనీరింగ్
- కెమిస్ట్రీ: మాలిక్యులర్ ఇంజనీరింగ్, కెమికల్ సింథసిస్ అండ్ అనాలిసిస్
- సివిల్ ఇంజనీరింగ్: కన్‌స్ట్రక్షన్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, రాక్ ఇంజనీరింగ్ అండ్ అండర్ గ్రౌండ్ స్ట్రక్చర్స్, జియో టెక్నికల్ అండ్ జియో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, వాటర్ రిసోర్సెస్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్
- కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్
- ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్: కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ టెక్నాలజీ, కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఎలక్ట్రో సర్క్యూట్స్, పవర్ ఎలక్ట్రో - మెషిన్ డ్రైవ్స్, పవర్ సిస్టమ్స్
- ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజనీరింగ్: ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, రెన్యూవబుల్ ఎనర్జీ టెక్నాలజీస్ అండ్ మేనేజ్‌మెంట్
- మెటీరియల్స్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్: మెటీరియల్స్ ఇంజనీరింగ్, పాలిమర్ సైన్స్ అండ్ టెక్నాలజీ
- మెకానికల్ ఇంజనీరింగ్: మెకానికల్ డిజైన్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, ప్రొడక్షన్ ఇంజనీరింగ్, థర్మల్ ఇంజనీరింగ్
- ఫిజిక్స్: అప్లయిడ్ ఆప్టిక్స్, సాలిడ్ స్టేట్ మెటీరియల్స్
- టెక్స్‌టైల్ అండ్ ఫైబర్ ఇంజనీరింగ్: ఫైబర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, టెక్స్‌టైల్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ కెమికల్ ప్రాసెసింగ్
- సీఏఆర్ఈ: రేడియో ఫ్రీక్వెన్సీ డిజైన్ అండ్ టెక్నాలజీ
- సీఏఎస్: అట్మాస్ఫిరిక్ ఓషనిక్ సైన్స్ అండ్ టెక్నాలజీ
- సీబీఎంఈ: బయో మెడికల్ ఇంజనీరింగ్
- సీఏఆర్‌టీ: ఎలక్ట్రిక్ మొబిలిటీ
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్: మెషిన్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్

ఇంటర్ డిసిప్లినరీ ఎంటెక్ స్పెషలైజేషన్‌లు

- సైబర్ సెక్యూరిటీ, ఇన్‌స్ట్రుమెంట్ టెక్నాలజీ, ఆప్టో ఎలక్ట్రానిక్స్ అండ్ ఆప్టో కమ్యూనికేషన్, వీఎల్ఎస్ఐ డిజైన్ టూల్స్ అండ్ టెక్నాలజీ, టెలి కమ్యూనికేషన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, రోబోటిక్స్

ఇతర కోర్సులు

- ఎం డిజైన్: ఇండస్ట్రియల్ డిజైన్
- ఎమ్మెస్సీ-హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్: కాగ్నిటివ్ సైన్స్, ఎకనామిక్స్
- ఎంపీపీ: మాస్టర్ ఆఫ్ పబ్లిక్ పాలసీ
- ఎంఏ-హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్: కల్చర్, సొసైటీ, థాట్

పీహెచ్‌డీ విభాగాలు

- అప్లయిడ్ మెకానిక్స్, బయో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, డిజైన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్ స్టడీస్, మేథమెటిక్స్, మెటీరియల్స్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, టెక్స్‌టైల్ అండ్ ఫైబర్ ఇంజనీరింగ్

అర్హత వివరాలు

- పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత సబ్జెక్టులతో డిగ్రీ కోర్సులు; పీహెచ్‌డీలో ప్రవేశానికి సంబంధిత స్పెషలైజేషన్‌తో పీజీ కోర్సులు పూర్తిచేసి ఉండాలి. ప్రథమశ్రేణి మార్కులు తప్పనిసరి. ఎమ్మెస్సీ, ఎంఏ ప్రోగ్రామ్‌లకు 55 శాతం మార్కులు చాలు. ఇంజనీరింగ్ విభాగాలకు గేట్, డిజైన్ విభాగాలకు సీడ్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారికి గేట్/నిర్దేశిత జాతీయ పరీక్ష స్కోర్ తప్పనిసరి కాదు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.50
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 4
- **వెబ్‌సైట్:** iitd.ac.in

పీహెచ్‌డీ సెంటర్లు

అప్లయిడ్ రీసెర్చ్ ఇన్ ఎలక్ట్రానిక్స్, అట్మాస్ఫిరిక్ సైన్సెస్, ఆటోమోటివ్ రీసెర్చ్ అండ్ ట్రైబాలజీ, బయోమెడికల్ ఇంజనీరింగ్, ఆప్టిక్స్ అండ్ ఫొటోనిక్స్, రూరల్ డెవలప్‌మెంట్ అండ్ టెక్నాలజీ, సెన్సర్స్-ఇన్‌స్ట్రుమెంటేషన్-సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ రీసెర్చ్ అండ్ ఇన్‌జ్యూరీ ప్రివెన్షన్, వాల్యూ ఎడ్యుకేషన్ ఇన్ ఇంజనీరింగ్

ఎంఎస్ రీసెర్చ్ స్పెషలైజేషన్‌లు

- అప్లయిడ్ మెకానిక్స్, ఆటోమోటివ్ రీసెర్చ్ అండ్ ట్రైబాలజీ, బయో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, సెన్సర్స్-ఇన్‌స్ట్రుమెంటేషన్-సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, మెషిన్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్, వీఎల్ఎస్ఐ డిజైన్ టూల్స్ అండ్ టెక్నాలజీ, ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ అండ్ ఇన్‌జ్యూరీ ప్రివెన్షన్

జాబ్ కార్నర్

ఎన్ఎల్‌సీలో ఇండస్ట్రియల్ ట్రెయినీలు

ఖాళీలు: 239

నైవేలీ(తమిళనాడు)లోని నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. ఇండస్ట్రియల్ ట్రెయినీ/ఎస్ఎంఈ అండ్ టెక్నికల్(ఓఅండ్ఎం): **100 పోస్టులు**
2. ఇండస్ట్రియల్ ట్రెయినీ(మైన్స్ అండ్ సపోర్ట్ సర్వీసెస్): **139 పోస్టులు**

అర్హత: పదో తరగతి, ఐటీఐ, సంబంధిత ట్రేడ్‌లో డిప్లొమా

గరిష్ఠ వయోపరిమితి: యూఆర్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 37 ఏళ్లు; ఓబీసీ అభ్యర్థులు 40 ఏళ్లు, ఎస్టీ/ఎస్సీ అభ్యర్థులు 42 సంవత్సరాలు మించకూడదు.

స్టయిపెండ్: నెలకు ఇండస్ట్రియల్ ట్రెయినీ/ఎస్ఎంఈ అండ్ టెక్నికల్(ఓఅండ్ఎం) అభ్యర్థులకు రూ.18,000 - రూ.22,000. ఇండస్ట్రియల్ ట్రెయినీ(మైన్స్ అండ్ సపోర్ట్ సర్వీసెస్) అభ్యర్థులకు రూ.14,000 - రూ.18,000.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: ఏప్రిల్ 19

వెబ్‌సైట్: https://www.nlcindia.in

సింగరేణిలో ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ఖాళీలు: 327



కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్...వివిధ విభాగాల్లో ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- ఎగ్జిక్యూటివ్ కేడర్

1. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఇ అండ్ ఎం): ఇ2 గ్రేడ్: **42 పోస్టులు**
2. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(సిస్టమ్స్): ఇ2 గ్రేడ్: **7 పోస్టులు**

- నాన్ ఎగ్జిక్యూటివ్(ఎన్‌సీడబ్ల్యూఏ) కేడర్

1. జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రెయినీ(జేఎంఈటీ), టిఅండ్ఎస్ గ్రేడ్-సి: **100 పోస్టులు**
2. అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రెయినీ(మెకానికల్), టిఅండ్ఎస్ గ్రేడ్-సి: **9 పోస్టులు**
3. అసిస్టెంట్ ఫోర్‌మన్ ట్రెయినీ(ఎలక్ట్రికల్), టిఅండ్ఎస్ గ్రేడ్-సి: **24 పోస్టులు**
4. ఫిట్టర్ ట్రెయినీ, క్యాట్-1: **47 పోస్టులు**
5. ఎలక్ట్రీషియన్ ట్రెయినీ, క్యాట్-1: 98 పోస్టులు

అర్హత: సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత

వయసు: 30 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు అయిదేళ్ల సడలింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 4

వెబ్‌సైట్: https://www.scclmines.com./

ఓరియంటల్ ఇన్సూరెన్స్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్

ఖాళీలు: 100



న్యూఢిల్లీలోని ద ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(స్కేల్-1)

విభాగాలు: అకౌంట్స్, అక్చూరియల్, ఇంజనీరింగ్, ఇంజనీరింగ్(ఐటీ), మెడికల్ ఆఫీసర్, లీగల్.

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్/బీడీఎస్, డిగ్రీ(లా), ఐసీఏఐ/ఐసీడబ్ల్యూఏఐ/బీకాం, ఎంబీఏ(ఫైనాన్స్), బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణత.

వేతనం: నెలకు రూ.50,925- రూ.96,765

వయోపరిమితి: 2023 డిసెంబరు 31 నాటికి 21 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు గరిష్ఠంగా అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం: ప్రిలిమినరీ టెస్ట్, మెయిన్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్, విజయవాడ, విశాఖపట్నం, ఒంగోలు.

దరఖాస్తు రుసుము: రూ.1000. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.250.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: మార్చి 21

దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 12

రాత పరీక్ష: మే/జూన్‌లో

వెబ్‌సైట్: https://orientalinsurance.org.in/

విద్యుత్ నియంత్రణ మండలిలో ఖాళీలు

ఖాళీలు: 28

తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(టీఎస్ఈఆర్‌సీ).... కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. జాయింట్ డైరెక్టర్/ఇంజనీరింగ్: **1 పోస్టు**
2. డిప్యూటీ డైరెక్టర్/ట్రాన్స్‌మిషన్: **1 పోస్టు**
3. డిప్యూటీ డైరెక్టర్/డిస్ట్రిబ్యూషన్: **1 పోస్టు**
4. డిప్యూటీ డైరెక్టర్/లా: **1 పోస్టు**
5. డిప్యూటీ డైరెక్టర్/లీగల్ ప్రొసీజర్: **1 పోస్టు**
6. డిప్యూటీ డైరెక్టర్/టారిఫ్(అకౌంట్స్ అండ్ ఫైనాన్షియల్ అనాలసిస్): **1 పోస్టు**
7. డిప్యూటీ డైరెక్టర్- టారిఫ్(ఎకనామిక్స్): **1 పోస్టు**
8. డిప్యూటీ డైరెక్టర్- టారిఫ్(ఇంజనీరింగ్): **1 పోస్టు**
9. డిప్యూటీ డైరెక్టర్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ: **1 పోస్టు**
10. డిప్యూటీ డైరెక్టర్/పే అండ్ అకౌంట్స్: **1 పోస్టు**
11. డిప్యూటీ డైరెక్టర్/కన్జూమర్ అసిస్టెంట్: **1 పోస్టు**
12. అకౌంట్ ఆఫీసర్: **1 పోస్టు**
13. క్యాషియర్: **1 పోస్టు**
14. లైబ్రేరియన్: **1 పోస్టు**
15. స్టెనో కమ్ కంప్యూటర్ ఆపరేటర్: **2 పోస్టులు**
16. క్లర్క్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్: **4 పోస్టులు**
17. పర్సనల్ అసిస్టెంట్: **2 పోస్టులు**
18. రిసెప్షనిస్ట్: **1 పోస్టు**
19. ఆఫీస్ సబార్డినేట్స్: **5 పోస్టులు**

అర్హత: టెన్త్, డిప్లొమా ఇంజనీరింగ్, లా, ఎలక్ట్రికల్/పవర్ ఇంజనీరింగ్, అకౌంటింగ్/కామర్స్, ఎకనామిక్స్ ఎలక్ట్రికల్/కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో డిగ్రీతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం, పని అనుభవం ఉండాలి. ఆఫీస్ సబార్డినేట్స్ పోస్టుకు లైట్ వెహికిల్ లైసెన్స్ డ్రైవింగ్ అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 46 ఏళ్లు మించరాదు

ఎంపిక: రాత పరీక్ష లేదా ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తు ఫీజు: రూ.120

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 1

వెబ్‌సైట్: https://tserc.gov.in/



బీర్బల్ చిత్రలేఖనం

అక్బర్ ఆస్థానంలో అందరూ కూర్చున్నారు. మంత్రితో అక్బర్ ఇలా అన్నారు. 'మన రాజ్యంలో మంచి చిత్రకారులు ఎవరైనా ఉన్నారా?' అనడిగారు. 'ఓ.. మేమున్నాం కదా' అని చేయి ఎత్తారు కొందరు అధికారులు. వారిలో బీర్బల్ కూడా ఉన్నారు. 'చిత్రాలు గీయటం.. రంగులు వేయటంలో మేం దిట్టలం' అంటూ అందరూ చెప్పుకొచ్చారు.

అక్బర్ వారితో ఇలా అన్నాడు. 'మీరు చిత్రాలు వేయటం కాదు. అందులో ఊహాత్మకత ఉండాలి. అలాంటి వారికే బంగారు నాణేలు ఇస్తా' అన్నాడు. ఆ తర్వాత అందరూ వారి ఊహాత్మకశక్తి ప్రాణం పోస్తున్నారు. ఓ అధికారి వచ్చి మంచి బొమ్మ గీశానని చెప్పాడు. అక్బర్ కోప్పడ్డాడు. ఇంత చెత్త చిత్రం గీస్తే చూడాలా? వారం సమయంలో వచ్చి చూపించు. చేతకాకపోతే రావద్దు అని చెప్పాడు. పక్కనే ఉన్న అక్బర్ విన్నారు. 'వారం తర్వాత తానూ ఓ బొమ్మ గీస్తాన'ని చెప్పుకొచ్చాడు. 'కవులకు.. బొమ్మలు గీయటం వచ్చా?' అన్నారు కోపంగా. రాజుగారు కోపంగా ఉన్నారని అక్కడనుంచి వెళ్లిపోయాడు బీర్బల్.

వారం రోజుల తర్వాత ఓ చిత్రాన్ని తీసుకొచ్చాడు బీర్బల్. పైగా దాని మీద నల్లటి వస్త్రంతో కప్పాడు. దీంతో ఎంత మంచి చిత్రమో అని అక్బర్ అనుకున్నాడు. ఆ వస్త్రం తీయమన్నాడు. 'ఇది ఊహాత్మకశక్తితో




గీశాను. తమరికి అర్థం అవుతుందో లేదో' అన్నాడు బీర్బల్. 'మాకే అర్థం కాదా?' అన్నాడు అక్బర్. ఆ తర్వాత వస్త్రాన్ని తీశాడు. అదో మేఘాలు ఉండే చిత్రం. 'దీనికి ఏదో ఉంది అనేట్లు చేశావు. ఇదో చిత్రం. దీనికోసం చిత్రకారుడు కావాలా?' అన్నాడు. 'ఇందులో ఊహాత్మకశక్తి ఉంది. భూమి కనపడదు' అన్నాడు. 'అవునా?' అన్నాడు. 'కింద గడ్డి తినే ఆవు ఉంది' అంటూ చెప్పాడు బీర్బల్. అక్బర్ కోప్పడ్డాడు. అదే మరి ఆవు కనపడలేదే? అన్నాడు. 'అదే జహాపనా.. ఆ ఆవు గడ్డి తిని వెళ్లిపోయింది. అందుకే ఈ చిత్రంలో కనపడలేదు' అన్నాడు బీర్బల్. నేను చెప్పిన ఊహాత్మకత ఇదేనా? బావుంది అన్నాడు ఏమీ చేయలేక. 'ఎలాగైనా మెప్పించటంలో మీరు ముందుంటారు' అంటూ బీర్బల్‌ను ప్రశంసించాడు అక్బర్.


ఏవి ఎన్ని?




సరైన నీడ ఏది?



12 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 261

				2	5	8	1	
4				1		2		
								9
2		4					3	
5	6		2		3		7	8
	7					6		5
7								
		2		7				4
	3	9	1	8				

సుడోకు - 260 సమాధానం

3	5	4	1	8	9	6	2	7
7	1	8	2	4	6	3	5	9
6	9	2	3	5	7	1	4	8
5	3	6	7	9	4	2	8	1
1	2	7	8	3	5	9	6	4
8	4	9	6	2	1	7	3	5
9	6	5	4	1	2	8	7	3
2	8	1	5	7	3	4	9	6
4	7	3	9	6	8	5	1	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.



హైదరాబాద్ షెడ్యూల్ పూర్తి

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న ఫాంటసీ అడ్వెంచర్ 'విశ్వంభర' షూటింగ్ శరవేగంతో హైదరాబాద్‌లో జరుగుతోంది. చిరంజీవి, హీరోయిన్ త్రిష తదితరులు పాల్గొనగా కొన్ని సీన్లు, ఓ పాట, యాక్షన్ బ్లాక్‌ను చిత్రీకరించారు. ఇవన్నీ సినిమాలో కీలక సన్నివేశాలు కావడం గమనార్హం. ఈ షెడ్యూల్ పూర్తయినట్లు గురువారం చిత్ర నిర్మాతలు ప్రకటించారు. అలాగే చిరంజీవి నివాసంలో సంగీత దర్శకుడు కీరవాణి, దర్శకుడు వశిష్ట, ఛాయాగ్రాహకుడు చోటా కె నాయుడు, నిర్మాతలు వంశీ, విక్రమ్ తదితరులతో కలసి ఉన్న ఫొటోలను త్రిష సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అలాగే మరో పోస్టర్‌ను నిర్మాతలు విడుదల చేశారు. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న 'విశ్వంభర' చిత్రాన్ని విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 10న ఈ సినిమా విడుదలవుతుంది.

భూకంపం చూసి భయపడ్డా

కార్తికేయ



దర్శకుడు రాజమౌళి కుటుంబంతో కలసి ప్రస్తుతం జపాన్‌లో పర్యటిస్తున్నారు. ఆ దేశం తరచూ భూకంపాల బారిన పడుతుందనే విషయం తెలిసిందే. గురువారం రాజమౌళి కుటుంబం ఉన్న స్టార్‌హోటల్ పరిసరాల్లోనూ స్వల్పంగా భూమి కంపించింది. ఎవరికీ ప్రమాదం జరగలేదు. ఈ విషయాన్ని రాజమౌళి తనయుడు కార్తికేయ గురువారం సోషల్ మీడియా ద్వారా తెలిపారు. తన స్మార్ట్ వాచ్‌కు వచ్చిన భూకంపం హెచ్చరిక సందేశాన్ని షేర్ చేస్తూ 'హోటల్ భవనం కదులుతున్నట్లనిపించింది, అది భూకంపం వల్ల అని తెలుసుకొని భయపడ్డా' అని తెలిపారు. 'మహేశ్‌బాబు-రాజమౌళి సినిమా 'ఎస్ఎస్ఎంబీ 29 (వర్కింగ్ టైటిల్) ప్రభావం జపాన్‌లో ఎలా ఉండబోతోందో రిహార్సల్స్ చేస్తున్నారా' అని కార్తికేయను ఓ నెటిజన్ సరదాగా అడిగారు. ఆ సినిమా ప్రభావం జపాన్‌కే పరిమితం కాదు, ప్రపంచమంతా ఉంటుంది అని కార్తికేయ సినిమాపై మరింత అంచనాలు పెంచేలా బదులిచ్చారు.



కశ్మీర్ యాపిల్ కాదు.. మిర్చి

అప్సరారాణి ప్రధాన పాత్ర పోషించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'తలకోన'. నగేశ్ నారదాసి దర్శకత్వంలో దేవర శ్రీధర్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 29న సినిమా విడుదల అవుతున్న సందర్భంగా బుధవారం రాత్రి ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. ఇందులో నిర్మాత మాట్లాడుతూ 'మా హీరోయిన్ అప్సరా రాణి ఇంతవరకూ చేయని సినిమా ఇది. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ థ్రిల్లర్. అడవి అనగానే కేవలం ప్రకృతి అందాలే కాకుండా ఇంకో కోణం ఉంటుదని చూపించా' అన్నారు. 'మా హీరోయిన్ అప్సరా రాణి చూడడానికి కశ్మీర్ యాపిల్‌లా కనిపిస్తుంది కానీ ఇందులో కశ్మీర్ మిర్చిలా నటించింది. చాలా వెరైటీ స్టోరీ ఇది' అని చెప్పారు దర్శకుడు నగేశ్. ఈ సినిమాలో ఫైట్స్ కూడా చేసినట్లు అప్సరా రాణి చెప్పారు. తన కెరీర్‌లో మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు.

ఆయ్.. పాట విడుదలైందండీ!



నార్నే నితిన్, నయన్ సారిక జంటగా నటిస్తున్న 'ఆయ్ చిత్రంలోని 'సూఫియానా' అంటూ సాగే మెలోడీ సాంగ్‌ను తాజాగా విడుదల చేశారు. శ్రీమణి రాసిన పాటను భరద్వాజ్, రమ్యశ్రీ పాడారు. ప్రస్తుతం సూపర్‌హిట్ సాంగ్స్‌కు కేరాఫ్‌గా మారిన రామ్ మిర్యాల ఈ చిత్రానికి సంగీత దర్శకుడు. అంజి కంచిపల్లి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. అల్లు అరవింద్ సమర్పకులు. బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మాతలు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది.

కొత్త అనుభూతిని పంచే టిల్లు స్క్వేర్

యువతలో విపరీతమైన కల్ట్ ఫాలోయింగ్ సంపాదించుకున్న సినిమాలలో 'డీజే టిల్లు' ఒకటి. టిల్లుగా సిద్ధు జొన్నలగడ్డ పంచిన వినోదాన్ని ప్రేక్షకులు అంత తేలికగా మరిచిపోలేరు. టిల్లు మాటలు, చేష్టలు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్నాయి. ఇప్పుడు 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్' ఈ నెల 29న వస్తోంది. ఈ సందర్భంగా గురువారం చిత్ర దర్శకుడు మల్లిక్ రామ్ మీడియాతో ముచ్చటించారు.



టిల్లు స్క్వేర్ ప్రాజెక్ట్ లోకి ఎలా వచ్చారు?

డీజే టిల్లు, నేను దర్శకత్వం వహించిన 'అద్భుతం' సినిమాలు ఇంచుమించు ఒకే సమయంలో వచ్చాయి. ఆ తర్వాత నేను, సిద్ధు కలసి ఒక సినిమా చేయాలి అనుకున్నాం. అదే సమయంలో నాగవంశీ గారు 'టిల్లు స్క్వేర్' చేస్తే బాగుంటుందని చెప్పడం, డీజే టిల్లు దర్శకుడు విమల్ కృష్ణ ఇతర కమిట్‌మెంట్స్‌తో బిజీగా ఉండటంతో నేను ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చాను. మొదట కాస్త సంకోచించాను కానీ కథ బాగా వచ్చేసరికి ఇక వెనకడుగు వేయలేదు.

సినిమాలో సిద్ధు ప్రమేయం ఎంతవరకు ఉంటుంది?

సిద్ధు ఒక రచయితగా, నటుడిగా ఎంతవరకు ఇన్వాల్వ్ అవ్వాలో.. అంతవరకే ఇన్వాల్వ్ అవుతాడు. డైరెక్టర్‌కు స్వేచ్ఛను ఇస్తాడు.

టిలు స్క్వేర్ ఎలా ఉండబోతుంది?

డీజే టిల్లు, టిల్లు స్క్వేర్‌కి ఎంతో వ్యత్యాసం ఉంటుంది. డీజే టిల్లు డెడ్ బాడీ నేపథ్యంలో సాగే బ్లాక్ కామెడీ. కానీ టిల్లు స్క్వేర్ ఒక కమర్షియల్ సినిమాలా ఉంటుంది. టిల్లు పాత్ర తీరు అలాగే ఉంటుంది. రాధిక పాత్ర ప్రస్తావన ఉంటుంది. మొదటి భాగాన్ని ముడిపెడుతూ కొన్ని సన్నివేశాలు ఉంటాయి. డీజే టిల్లుని గుర్తు చేస్తూనే టిల్లు స్క్వేర్ అందరికీ కొత్త అనుభూతిని ఇస్తుంది.

అనుపమానే ఎన్నుకోవడానికి కారణం?

ఈ సినిమాలో లిల్లీ పాత్ర చాలెంజింగ్ రోల్. ఆ పాత్ర కోసం ఎందరో పేర్లను పరిశీలించాం. కానీ అనుపమానే పర్ఫెక్ట్ చాయిస్ అనిపించింది. అనుపమాని బోల్డ్‌గా చూపించాలనే ఉద్దేశంతో లిల్లీ పాత్రను రాసుకోలేదు. లిల్లీ పాత్ర తీరే అలా ఉంటుంది.

రీ షూట్‌కి వెళ్ళడానికి కారణం ఏంటి?

ఇంటర్వెల్ తర్వాత ద్వితీయార్థం ప్రారంభ సన్నివేశాలు చాలా సినిమాల్లో తేలిపోతుంటాయి. ఫస్టాఫ్ బాగుంటుంది. క్లైమాక్స్ కూడా బాగుంటుంది. కానీ ఆ 15-20 నిమిషాలు ఆశించిన స్థాయిలో ఉండదు. టిల్లు స్క్వేర్ విషయంలో అలా జరగకూడదన్న ఉద్దేశంతో.. ఆ కొన్ని సన్నివేశాలు మరింత మెరుగ్గా రాసుకొని రీ షూట్ చేశాం.

విజయవంతమైన చిత్రానికి సీక్వెల్ కదా.. ఒత్తిడికి లోనయ్యారా?

ఒత్తిడి ఉండటం సహజం. కానీ కథ బాగా రాసుకోవడంతో.. చిత్రీకరణ సమయంలో పెద్దగా ఒత్తిడి అనిపించలేదు.

ప్రేమలో పడ్డా




'సిటాడెల్: హనీ బన్నీ' వెబ్‌సిరీస్‌తో అలరించడానికి సిద్ధమవుతున్నారు సమంత. ఇందులో ఆమె హనీ అనే గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు. హనీ పాత్ర గురించి సమంత మాట్లాడుతూ ఒక కల్పిత పాత్ర నిజ జీవితంలో మనకు స్ఫూర్తిగా నిలవడం గొప్ప విషయం అన్నారు. 'ఇందులో నేను ఫుల్ యాక్షన్ ప్యాక్డ్ రోల్‌లో కనిపిస్తాను. ఇలాంటి పాత్రలు నిజ జీవితంలో కనిపించడం చాలా అరుదు. ప్రేక్షకులకు వినోదం పంచడానికి అనేక పాత్రలను దర్శకులు సృష్టిస్తారు. వాటిలో కొన్ని పాత్రలు మాత్రం మన మనసుకు దగ్గరవుతాయి. షూటింగ్ మొదలుపెట్టిన తర్వాత హనీ పాత్రతో అనుబంధం పెరిగింది. ఆ పాత్ర వ్యక్తిత్వం నా మనసుపై చెరగని ముద్ర వేసింది. పరిస్థితుల ప్రభావం వల్ల దిగులుగా అనిపించినప్పుడల్లా హనీలా ధృఢంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. మనం ఎంత ప్రశాంతంగా ఉన్నా ఎన్నో సందర్భాల్లో నెగెటివ్ వాతావరణం మన మనసును కమ్మేసి అశాంతిని కలుగజేస్తుంది. అలాంటప్పుడు హనీలా ప్రవర్తించడానికి ప్రయత్నం చేస్తే నాలో కొత్త ఉత్సాహం వెల్లువెత్తుతుంది. అందుకే ఆ పాత్రతో ప్రేమలో పడ్డాను' అని సమంత పేర్కొన్నారు.

మోకాళ్లపై మెట్లెక్కిన జాన్వీ



వీలు చిక్కినప్పుడల్లా ప్రముఖ దేవాలయాలను సందర్శిస్తూ ఆ వీడియోలను అభిమానులతో పంచుకోవడం హీరోయిన్ జాన్వీకపూర్‌కు అలవాటు. ముఖ్యంగా కుటుంబంతో కలసి ఎన్నోసార్లు ఆమె తిరుమలను సందర్శించి, వేంకటేశ్వర స్వామిని భక్తి ప్రపత్తులతో కొలిచారు. ఇటీవలే తన పుట్టిన రోజు సందర్భంగా ఆమె



స్నేహితుడు ఓరీతో కలసి తిరుమల వచ్చారు. దానికి సంబంధించిన వీడియోను ఓరీ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. కాలి నడక దారిలో వారు కొండపైకి వెళ్లారు. మోకాళ్ల మిట్ట వద్ద జాన్వీ మోకాళ్లపై మెట్లు ఎక్కారు. తిరుమల శ్రీవారు అంటే తనకు ఎంతో భక్తి అని జాన్వీ పలు సందర్భాల్లో చెప్పారు. ఇప్పుడు ఈ వీడియో వైరల్ అయింది. ప్రస్తుతం జాన్వీ రామ్‌చరణ్ సరసన ఓ చిత్రంలో నటిస్తున్నారు. అలాగే ఎన్టీఆర్ తో 'దేవర' చిత్రం చేస్తున్నారు.



ఇది భావోద్వేగ ప్రయాణం

దాదాపు 25 ఏళ్ల తర్వాత నటి జ్యోతిక మళ్లీ బాలీవుడ్‌లో నటించిన చిత్రం 'సైతాన్'. ఇందులో అజయ్ దేవగన్‌కు భార్యగా, ఇద్దరు పిల్లలకు తల్లిగా ఆమె నటించారు. ఈ నెల 8న విడుదలైన ఈ చిత్రం సూపర్ హిట్ అయి, ఇప్పటికి రూ. 150 కోట్లు వసూలు చేసింది. 'సైతాన్' హిట్ అయిన సందర్భంగా అజయ్ దేవగణ్, మాధవన్‌తో ఉన్న వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఓ పోస్ట్ పెట్టారు జ్యోతిక. 'కొన్ని సినిమాలు గమ్యస్థానాలు మాత్రమే కానీ 'సైతాన్' సినిమా మాత్రమే కాదు. చిరకాల మిత్రులతో చేసిన ఓ భావోద్వేగ ప్రయాణం. ప్రతి తల్లి, తండ్రి చూడాల్సిన సినిమా ఇది. ముఖ్యంగా టీనేజ్ పిల్లలు ఉన్న వారు తప్పకుండా వారు ఆ పిల్లలు ఏం చేస్తున్నారో ఓ కన్నేసి ఉంచాలి. ఇంత గొప్ప చిత్రంలో నేనూ భాగం అయినందుకు చాలా ఆనందంగా ఉంది. చిత్ర బృందానికి అభినందనలు' అని పేర్కొన్నారు . గుజరాతీ చిత్రం 'వష్' ఆధారంగా 'సైతాన్' చిత్రం రూపుదిద్దుకుంది.

రిషబ్ సొంతూళ్లో భారీ సెట్



2022లో విడుదలైన 'కాంతార' చిత్రం దేశవ్యాప్తంగా బాక్సాపీసు దగ్గర సంచలన విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. రిషబ్‌శెట్టి హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహించిన ఈ సూపర్‌హిట్‌కు కొనసాగింపు చిత్రాన్ని గతేడాదే నిర్మాణసంస్థ హోంబలే ఫిల్మ్స్ ప్రకటించింది. వచ్చే నెలలో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. అయితే అంతా అనుకుంటున్నట్లు 'కాంతార'కు సీక్వెల్ కాదు... ప్రీక్వెల్. 'కాంతార' సినిమా కథ మొదలవడానికి ముందు జరిగిన సంఘటనలతో ప్రీక్వెల్ రూపొందుతోంది. 'కాంతార: చాప్టర్ 1' అనే టైటిల్ ఖరారు చేశారు. 'ది లెజండ్' అనేది ఉపశీర్షిక. ఇటీవలే చిత్రబృందం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయగా సోషల్ మీడియాలో వైరల్ అయింది. రిషబ్ సొంతూరు కదిరిలో ఓ భారీసెట్‌ను రూపొందించారు. అధికభాగం షూటింగ్ ఇక్కడే జరుగనుంది. విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అజనీశ్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నారు.

పలాస కన్నా పెద్ద హిట్ అవ్వాలి

'పలాస 1978' ఫేమ్ రక్షిత్ అట్లూరి, కోమలీ ప్రసాద్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'శశివదనే'. గోదావరి నేపథ్యంలో లవ్, యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాకు సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వం వహించారు. అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోడల నిర్మించారు. ఏప్రిల్ 19న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు సాయి మోహన్ ఉబ్బన మాట్లాడుతూ "ఇది హార్ట్ హిట్టింగ్ మూవీ. క్లైమాక్స్ ఈ సినిమాకు ప్రాణం. సినిమా ముగిశాక ప్రేక్షకులు ఎన్నో భావోద్వేగాలతో బయటికి వస్తారు" అని చెప్పారు. నిర్మాత అభిలాష్ రెడ్డి మాట్లాడుతూ "రక్షిత్ అట్లూరి, కోమలి వారి నటనతో ఈ సినిమాను నెక్స్ట్ లెవెల్‌కు



తీసుకెళ్లారు" అని ప్రశంసించారు. హీరో రక్షిత్ అట్లూరి మాట్లాడుతూ "పలాస' కంటే 'శశివదనే' పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. అవుతుందని నమ్మకంగా ఉన్నాను" అని తెలిపారు. నిర్మాత అహితేజ మాట్లాడుతూ "ఈ సినిమాలో ప్రేక్షకులను అలరించే అన్ని అంశాలు ఉన్నాయి. కొత్త తరహా అనుభూతిని ఇచ్చే చిత్రమిది. క్లైమాక్స్ మా సినిమాకు ప్రత్యేక ఆకర్షణ" అని అన్నారు.